సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 138
శుక్రవారం 8-8-2025
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



నోర్ముయ్.. చెప్పింది చెయ్
భారత బాక్సర్ లవ్లీనాతో బాక్సింగ్ సమాఖ్య ఈడీ దురుసు ప్రవర్తన - 13లో



సెన్సెక్స్ మైనస్ నుంచి ప్లస్‌లోకి
వెంటాడిన ట్రంప్ టారిఫ్ భయాలు.. ఆఖర్లో ఐటీ షేర్లకు డిమాండ్ - 13లో



రైతుల ప్రయోజనాలపై రాజీపడం
ట్రంప్ హెచ్చరికలను ప్రధాని మోదీ తిప్పికొట్టారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో రాజీపడేది లేదని తేల్చిచెప్పారు.
వివరాలు 6లో ▸



త్వరలో భారత్‌కు పుతిన్
రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌కు రానున్నారు. తేదీల ఖరారుపై చర్చిస్తున్నామని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ చెప్పారు.
వివరాలు 6లో ▸



ట్రంప్ టారిఫ్ దండయాత్ర ఆగదా?
'భారత్‌పై టారిఫ్‌లు పెంచి 8 గంటలే గడిచాయి. ముమ్ముందు ఏం జరగబోతోందో మీరే చూస్తారుగా' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు.
వివరాలు 6లో ▸



జస్టిస్ వర్మకు చుక్కెదురు
కరెన్సీ నోట్లపై అంతర్గత విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ జస్టిస్ వర్మ వేసిన పిటిషన్‌ను సుప్రీం కొట్టేసింది.
వివరాలు 6లో ▸

స్థానిక ఎన్నికలు

నిష్పాక్షికంగా జరిపించండి

ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టండి
ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

రాష్ట్ర అధికార యంత్రాంగానికి హైకోర్టు ఆదేశం

2లో

నిష్పాక్షికంగా నిర్వహణకు చర్యలు తీసుకోవాలని చెప్పాం.. అదనపు బలగాలను కూడా మోహరించాలని స్పష్టం చేశాం

వైఎస్సార్‌సీపీ వినతిపత్రాన్ని ఇప్పటికే డీజీపీకి పంపాం

హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ఎన్నికల సంఘం

అధికార పార్టీ కండబలం, ధనబలంతో ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తోంది

ఇంత జరుగుతున్నా.. పోలీసులు చోద్యం చూస్తున్నారు

ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

ఈ విషయంలో మేం ఇచ్చిన వినతిపై ఎన్నికల సంఘం స్పందించడం లేదు.. మా విజ్ఞప్తిపై చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించండి

హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో వైఎస్సార్‌సీపీ


టీడీపీ అరాచకాలపై గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు 11లో

తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయండి
మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ అరెస్ట్ పూర్తిగా చట్టానికి, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం.. ఇది ఫక్తు పోలీస్ స్టైల్ కేసు

రిమాండ్ విషయంలో మేజిస్ట్రేట్ మెదడు ఉపయోగించలేదు.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం 2లో



నిందితులుగా ఎవరినీ ఎందుకు చేర్చలేదు?
ప్రసన్నకుమార్‌రెడ్డి ఇచ్చిన ఫొటోల్లో దాడికి పాల్పడిన వ్యక్తులున్నారుగా? 2లో

మరి వారిని ఎందుకు నిందితులుగా చేర్చలేదు?

ప్రసన్న ఫిర్యాదుపై దర్యాప్తు ఎంతవరకు వచ్చింది?

పూర్తి వివరాలు సమర్పించండి.. దర్గామిట్ట పోలీసులకు హైకోర్టు ఆదేశం

రాక్షసకాండకు 'పచ్చ'జెండా!
2లో

- దాడులు కాదు.. ఇక హత్యకాండకు తెగబడండి!
- టీడీపీ రౌడీమూకలకు ప్రభుత్వ పెద్దల ఆదేశం.. స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో బరితెగింపు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా బీభత్సకాండ.. బందిపోటు ముఠాల తరహాలో వాహనాల్లో వచ్చి పచ్చముఠాల కిరాతకం..
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, వేల్పుల రాముపై హత్యాయత్నం.. పట్టపగలు నడిరోడ్డుపై మారణాయుధాలతో దాడి
- బాధితులు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.. అరెస్టులు అసలే లేవు
- తమ కళ్లెదుటే టీడీపీ గూండాలు స్వైర విహారం చేస్తున్నా పోలీసుల ప్రేక్షక పాత్ర

న్యూస్‌రీల్

అగ్రి ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా

ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా అగ్రి ఇంజనీరింగ్‌లో పీజీ డిప్లొమా కోర్సును ప్రవేశపెడుతోంది. ఏడాది కాలపరిమితి గల ఈ కోర్సును 30 సీట్లతో ప్రారంభిస్తోంది. ఆగస్టులో ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేయనుంది.
వివరాలు 11లో ▸

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

అప్పుల బాధ తాళలేక గుంటూరు జిల్లా కోయవారిపాలేనికి చెందిన ఓ యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గతేడాది 22 ఎకరాలు కౌలుకు తీసుకొని.. మిర్చి, పొగాకు, పత్తి సాగు చేశాడు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో భారీగా నష్టపోయాడు.
వివరాలు 5లో ▸

'వైఎస్సార్‌సీపీ అంటూ తిరిగితే.. చంపేస్తాం!'

టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు తాడిపత్రిలో మరోసారి రెచ్చిపోయారు. ముఖాలకు హెల్మెట్లు, మాస్కులు ధరించి వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులు చేసి.. వాహనాలను ధ్వంసం చేశారు. మరోసారి వైఎస్సార్‌సీపీ అంటూ తిరిగితే చంపేస్తామంటూ బెదిరించారు.
వివరాలు 10లో ▸

దిగజారిన శాంతిభద్రతలు

ఎమ్మెల్సీ ఆలపాటి చంపేస్తానంటున్నాడు

- ఫోన్‌చేసి నన్ను బెదిరిస్తున్నాడు
- కాలేజీ విషయంలో ఆయన చెప్పినట్లే వినాలంటున్నాడు
- నాకు ప్రాణహాని ఉంది.. పోలీసులే రక్షణ కల్పించాలి
- విజయవాడ శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్


3లో

టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. శాతవాహన కాలేజీ విషయంలో ఆలపాటికి ఎలాంటి సంబంధం లేదు. అయినా ఆయన చెప్పినట్లే నేను వినాలంటున్నారు. లేదంటే నా సంగతి తేలుస్తానని.. అంతుచూస్తానని బెదిరిస్తున్నారు. ఆయన అధికార పార్టీ అయినందున నన్ను ఏదైనా చేయగలనని, వదలబోనని.. ముఖ్యమంత్రికి కూడా చెప్పానంటూ హెచ్చరిస్తున్నారు. గతంలో కూడా నన్ను కిడ్నాప్ చేశారు. చివరకు పోలీసుల జోక్యంతో విడిచిపెట్టారు. నాకు ఆలపాటి నుంచి నుంచి ప్రాణహాని ఉంది. పోలీసులు రక్షణ కల్పించాలి.

\- శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్

సచివాలయ మహిళా ఉద్యోగి కిడ్నాప్


సచివాలయం ఉద్యోగిని కిడ్నాప్ చేసి కారులోకి ఎక్కిస్తున్న దుండగులు

అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో ఘటన

విధులకు హాజరైన ఉద్యోగినిని బలవంతంగా ఈడ్చుకెళ్లిన వైనం

నిందితుల కోసం నాలుగు బృందాలతో పోలీసుల గాలింపు 3లో






పాలన అలాగే కొనసాగిస్తారట!!

ప్రతి అడుగులోనూ చేనేతకు అండగా నిలిచాం

నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం

3లో

- వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.969.77 కోట్లు ఇచ్చాం
- నేతన్నల పింఛన్ కోసం రూ.1,396.45 కోట్లు
- ఆప్కోకు పాత బకాయిలు రూ.468.84 కోట్లు చెల్లించాం
- నేతన్నలకు వివిధ పథకాల కింద రూ.3,706.16 కోట్లు సాయం అందించడం ఓ రికార్డు
- ఉచిత విద్యుత్, పవర్ లూమ్స్‌కు రాయితీపై విద్యుత్ అందించాం
- చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెట్‌తో నేతన్నల ఆదాయం పెంచేందుకు ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం



- ఈ పథకాలన్నింటినీ టీడీపీ కూటమి ప్రభుత్వం ఆపేసి, ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేసిందంటూ ఆగ్రహం
- అన్ని వర్గాల మాదిరిగానే చేనేతలనూ చంద్రబాబు వంచించారు.. మోసం చేశారని ధ్వజం

రూ.పది లక్షల కోట్ల అప్పులున్నాయ్!

10లో

- చాలా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయ్!.. మళ్లీమళ్లీ డెవలప్ చేయాలంటే.. ఇంకా నాకు ఓపికలేదు
- నా మొదటి ప్రాధాన్యం వెనుకబడిన వర్గాలే
- మిగిలిన వర్గాలు వస్తుంటాయ్.. పోతుంటాయ్
- బీసీలకు చట్ట సభల్లో 33% రిజర్వేషన్ సాధిస్తాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు

'అప్పు'డే పరగడుపు

కొత్త అప్పలకు కూటమి సర్కారు రెడీ

10లో

- బడ్జెట్ బయట ఏపీఐఐసీ, విద్యుత్ డిస్కమ్స్ ద్వారా రూ.12,973.94 కోట్ల రుణాలు తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం
- ఏపీఐఐసీ ద్వారా రూ.7,500 కోట్ల అప్పు చేయాలని నిర్ణయం
- ఏపీఐఐసీ భూముల తనఖాకూ సిద్ధం.. ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా రూ.5,473.94 కోట్లు తీసుకునేందుకు ఆమోదం



- ఏపీపీడీసీఎల్ దివాళా తీయడంతో బ్యాంకుల హెచ్చరికలు
- రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ నిర్ణయం.. వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులపై ఉక్కుపాదం

5లో

సమస్యల పరిష్కారాన్ని కోరుతూ.. ఛలో విద్యుత్‌సౌధ

కార్మికులను అడ్డుకుని అరెస్ట్ చేయించిన కూటమి ప్రభుత్వం

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘాల నాయకులు

ఎవరి దయాదాక్షిణ్యాలతోనో ఉద్యోగాల్లోకి రాలేదు



11లో

- ముఖ్యమంత్రి ప్రకటించిన బకాయిలకూ మోక్షం లేదు.. కూటమి సర్కార్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదు..
- పీఆర్‌సీని ఇప్పటివరకు నియమించలేదు
- ఐఆర్ కూడా అతీగతీ లేదు
- రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాక్షసకాండకు ‘పచ్చ’జెండా!

దాడులు కాదు.. ఇక హత్యకాండకు తెగబడండి! ■ టీడీపీ రౌడీమూకలకు ప్రభుత్వ పెద్దల ఆదేశం

స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతో బరితెగింపు ■ ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా బీభత్సకాండ

ప్రజలను పట్టి పీడించే పిండారీలు, జంతువులను వేటాడే ఆది మానవ తెగలను తలదన్నే రీతిలో పచ్చ ముఠాలు అత్యంత క్రూరంగా, కిరాతకంగా వ్యవహరిస్తున్నాయి. బందిపోటు ముఠాల మాదిరిగా 10 వాహనాల్లో ప్రత్యక్షమై మెరుపు దాడులకు తెగబడుతున్నాయి. గుంపులు గుంపులుగా వాహనాల్లో సంచరిస్తూ మారణాయుధాలు చేతబూని విచక్షణా రహితంగా విరుచుకుపడుతున్నాయి. జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా పులివెందులలో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు కూటమి సర్కారు ఆటవిక పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. టీడీపీ గూండాలను ఉసిగొల్పిన ప్రభుత్వ పెద్దలు స్థానిక ఎన్నికల్లో రౌడీ రాజకీయాలకు తెర తీశారు. తమ ముందే బరి తెగించి దాడులకు దిగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేసినా అరెస్టు చేయకపోగా కనీస చర్యలు కూడా తీసుకునే పరిస్థితిలో పోలీసు శాఖ లేదు. సర్కారు అండతో నల్లగొండువారిపల్లెలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, వేముల మండల పార్టీ పరిశీలకుడు వేల్పుల రామలింగారెడ్డిపై టీడీపీ మూకలు బుధవారం నడిరోడ్డుపై పట్టపగలే హత్యాయత్నానికి పాల్పడ్డాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రయాణిస్తున్న కారును ధ్వంసం చేసి రమేశ్‌యాదవ్, రామలింగారెడ్డిలను తీవ్రంగా గాయపరిచాయి. అంతకుముందు మంగళవారం సాయంత్రం పులివెందులలో మరో ఘటనలో.. ఓ వివాహానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులపై ఫంక్షన్ హాల్‌లోనే టీడీపీ మూకలు దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో అమరేష్‌రెడ్డి, సైదాపురం సురేష్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. అడ్డుకోబోయిన పెళ్లివారిని, శ్రీకాంత్, నాగేశ్ తదితరులను దారుణంగా కొట్టారు. దాదాపు 100 మందికిపైగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను బైండోవర్ చేసిన పోలీసులు ఘటనలకు కారకులైన టీడీపీ శ్రేణుల వైపు కన్నెత్తి చూసే సాహసం చేయలేదు.


టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన వేల్పుల రామలింగారెడ్డి



టీడీపీ రౌడీల దాడిలో ధ్వంసమైన వాహనం

సాక్షి, అమరావతి: ఏడాది పాలనలోనే వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం తీవ్ర అసహనంతో హత్యా రాజకీయాలకు పురిగొల్పుతోంది. రెడ్‌బుక్ కుట్రలతో ఏడాదిగా రాష్ట్రంలో సాగిస్తున్న అధికారిక దౌర్జన్యకాండను మారణకాండగా మార్చేందుకు టీడీపీ గూండాలకు లైసెన్స్ ఇచ్చేసింది. అయితే పచ్చ ముఠాల అరాచకాలు, ఆగడాలతో సీఎం చంద్రబాబు సంతృప్తి చెందడం లేదని స్పష్టమవుతోంది. అందుకే పట్టపగలు ఆయుధాలు చేతబట్టి నడిరోడ్డుపై హత్యలకు తెగబడమని పచ్చ జెండా ఊపేశారు. పులివెందుల నియోజకవర్గంలో టీడీపీ గూండాలు పక్కా పన్నాగంతో మారణాయుధాలు, పెట్రోల్ సీసాలతో వైఎస్సార్‌సీపీ నేతలపై హత్యాయత్నానికి తెగబడటమే అందుకు తాజా నిదర్శనం. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇటీవల టీడీపీ కార్యకర్తల సమావేశాల్లో చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వెనుక ఆంతర్యం ఏమిటన్నది వైఎస్సార్‌సీపీ నేతలపై జరుగుతున్న తీవ్రమైన దాడులు, హత్యాయత్నాలు వెల్లడిస్తున్నాయి. ‘దాడులు, హత్యాయత్నాలకు పాల్పడండి..! మేం చూసుకుంటాం..!’ అన్నట్టుగానే వారిద్దరూ వ్యాఖ్యానించడం గమనార్హం. అందుకోసం టీడీపీ గూండాలతోపాటు గంజాయి గ్యాంగ్‌లను ఉసిగొల్పారు. టీడీపీ సిండికేట్ నిర్వహిస్తున్న బెల్ట్ దుకాణాలు, కల్తీ మద్యం కిక్కుతో రౌడీమూకలు, అసాంఘిక శక్తులు, ఆకతాయిలు విచ్చలవిడిగా రోడ్లపైకి వచ్చి కత్తులు, ఇతర ఆయుధాలు చేతబట్టి స్వైర విహారం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం స్పాన్సర్ చేస్తున్న ఈ అధికారిక అరాచక కాండ, హత్యా రాజకీయాలకు పోలీస్ యంత్రాంగం ఉద్దేశపూర్వకంగానే ఉదాసీన వైఖరితో వత్తాసు పలుకుతోంది.

నెల్లూరు, కృష్ణా జిల్లాల్లోనూ బరితెగింపు

చంద్రబాబు సర్కారు దారుణ వైఫల్యాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు వైఎస్సార్‌సీపీ చేపట్టిన ‘బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ’ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ గూండాలు హత్యాయత్నాలకు తెగబడుతున్నారు. ఇటీవల శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ గూండాలు వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసంపై దాడి చేసి పెను విధ్వంసం సృష్టించారు. ప్రసన్న కుమార్‌రెడ్డిని హత్య చేసేందుకు పక్కా పన్నాగంతోనే ఈ దాడికి తెగబడ్డారు. ఆ సమయంలో ఆయన లేకపోవడంతో నివాసం, ఫర్నిచర్, వాహనాలను ధ్వంసం చేశారు. కృష్ణా జిల్లాలోనూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులను అంతమొందించడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ గూండాలు విధ్వంస కాండ సృష్టించారు. గుడివాడ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ‘బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ’ కార్యక్రమం సన్నాహక సమావేశానికి వస్తున్న ఆమెను లక్ష్యంగా చేసుకుని హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె వాహనంపై దాడి చేశారు.

‘స్థానిక’ ఎన్నికల్లో అక్రమాలకే హత్యా రాజకీయాల కుట్ర..!

కూటమి సర్కారుపై తీవ్ర ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతుండటంతో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి తప్పదని టీడీపీ నేతలు బెంబేలెత్తుతున్నారు. దీంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని పన్నాగం రచించారు. దాడులు, దౌర్జన్యాలే కాదు.. హత్యలకు కూడా తెగబడాలని కూడా టీడీపీ రౌడీమూకలకు ఆ పార్టీ అధిష్టానం పచ్చ జెండా ఊపింది. ఈ హత్యా రాజకీయాలకు ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను చంద్రబాబు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా చేసుకుంది. ఏకంగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, వేముల మండల నేత వేల్పుల రామలింగారెడ్డి (రాము)లను పట్టపగలు నడిరోడ్డుపై హతమార్చేందుకు పచ్చముఠాలు యత్నించాయి. పార్టీ నేతలతో మాట్లాడేందుకు నల్లగొండువారిపల్లెకు ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, వేల్పుల రాము వెళ్లిన విషయం పసిగట్టిన టీడీపీ గూండాలు వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో హత్యాయత్నానికి తెగబడ్డారు. దీంతో అరగంట పాటు గ్రామంలో భీతావహ పరిస్థితి నెలకొంది. వైఎస్సార్ కడప జిల్లాల్లో క్రమం తప్పకుండా వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, హత్యాయత్నాలకు తెగబడతామని టీడీపీ గూండాలు ఈ ఉదంతం ద్వారా స్పష్టం చేశారు. తద్వారా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీ బహిష్కరించేలా చేయడమే చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం ఎంతకైనా తెగిస్తామని సంకేతాలిస్తూ ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్, పార్టీ నేత వేల్పుల రాములపై హత్యాయత్నానికి తెగబడింది.

వైఎస్ జగన్ పర్యటనలను అడ్డుకునే కుట్ర..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ అరాచక పర్వానికి బరి తెగిస్తుండటం కూటమి ప్రభుత్వ కుతంత్రానికి నిదర్శనం. ఆయన పర్యటనల్లో శాంతిభద్రతల సమస్యలు సృష్టించేందుకు ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని ఇటీవల పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పొగాకు రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకు వైఎస్ జగన్ ప్రకాశం జిల్లా పొదిలిలో పర్యటించినప్పుడు టీడీపీ గూండాలు దారిలో మాటు వేయడం తీవ్ర ఆందోళన కలిగించింది. అనుమతి లేకపోయినా టీడీపీ నేతలు, గూండాలను ఆ మార్గంలోకి పెద్ద ఎత్తున పోలీసులు అనుమతించడం గమనార్హం. టీడీపీ గూండాల గుంపు వైఎస్ జగన్ కాన్వాయ్‌పై దాడికి యత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వైఎస్ జగన్ పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటనలోనూ అసాంఘిక శక్తులు చొరబడటం గమనార్హం. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ముసుగులో అరాచక ముఠాలు ఏకంగా వైఎస్ జగన్ వాహనం వరకు చొచ్చుకు వస్తున్నా పోలీసులు చోద్యం చూశారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటనలో అడుగడుగునా రభస సృష్టించేందుకు టీడీపీ యత్నించింది. తద్వారా వైఎస్ జగన్ పర్యటనల్లో ఘర్షణలు సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలన్నదే ప్రభుత్వ కుట్ర అన్నది స్పష్టమవుతోంది. ఆ నెపంతో వైఎస్ జగన్ పర్యటనలకు అనుమతి ఇవ్వకూడదన్నది ప్రభుత్వ పెద్దల దురాలోచన!!

పచ్చమూకలకు మందు, గంజాయి

హత్యా రాజకీయాలతో రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకు చంద్రబాబు ప్రభుత్వం పక్కాగా పన్నాగం పన్నింది. మద్యం సిండికేట్, గంజాయి మాఫియాను అందుకు సాధనంగా చేసుకుంది. రాష్ట్రంలో మొత్తం 3,736 మద్యం దుకాణాలు, వాటికి అనుబంధంగా 75 వేల బెల్ట్ షాపులను టీడీపీ సిండికేట్ నిర్వహిస్తోంది. వాటి ద్వారా సాధారణ మద్యంతోపాటు సైకోలుగా మార్చే అత్యంత ప్రమాదకర స్పిరిట్‌తో కూడిన కల్తీ మద్యాన్ని ఏరులై పారిస్తోంది. మరోవైపు విశాఖ టీడీపీ సీనియర్ నేతల కుటుంబాల ఆధ్వర్యంలో ఆంధ్ర–ఒడిశా సరిహద్దు (ఏవోబీ) కేంద్రంగా గంజాయి మాఫియా రాష్ట్రవ్యాప్త దందా సాగిస్తోంది. మద్యం, కల్తీ మద్యం, గంజాయిలను రౌడీమూకలకు అందిస్తూ టీడీపీ సిండికేట్ వారిని పెంచి పోషిస్తోంది. తాము కనుసైగ చేసిన వెంటనే పల్లెలు, పట్టణాల్లో అలజడులు, విధ్వంసం సృష్టించేందుకు రంగంలోకి దింపుతోంది. తాము లక్ష్యంగా చేసుకున్న వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు, హత్యాయత్నాలకు వారిని వాడుకుంటోంది. నెల్లూరులో మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి నివాసంపై దాడి చేసి విధ్వంసం సృష్టించింది టీడీపీ గంజాయి గ్యాంగే. కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులపై హత్యాయత్నానికి తెగబడింది టీడీపీ నేతలు, కల్తీ మద్యం సైకో బ్యాచ్‌నే. ఇక పులివెందుల నియోజకవర్గం నల్లగొండువారిపల్లెలో ఏకంగా కత్తులు, సమ్మెట్లుతో దాడి చేయడం... ఓ ఇంటిపై ఏకంగా పెట్రోల్ పోసి మరీ నిప్పంటించి హత్య చేసేందుకు తెగబడటం సాధారణ రౌడీలు చేసే పని కాదు. గంజాయి, కల్తీ మద్యం మత్తుతో విచక్షణ కోల్పోయి సైకోలుగా మారిన రౌడీమూకలే ఈ అఘాయిత్యాలకు పాల్పడ్డాయని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. అటువంటి పాశవిక హత్యాయత్నాన్ని కూడా కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వెనుకేసుకువచ్చేట్టుగా....ఆ ఘటనను తక్కువ చేసి చూపేందుకు యత్నించడం విస్మయ పరుస్తోందని వ్యాఖ్యానిస్తున్నాయి. అధికార టీడీపీ కూటమి హత్యా రాజకీయాలకు కొమ్ముకాయడమే తన ఏకైక కర్తవ్యంగా ఆయన భావిస్తున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు సర్కారు తీరు చూస్తుంటే రానున్న రోజుల్లో దాడులు, విధ్వంస కాండ, హత్యా రాజకీయాలతో రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించేందుకు పూర్తిగా బరి తెగించినట్లు స్పష్టమవుతోందని పరిశీలకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీఎంవో డైరెక్షన్.. ‘బీటెక్’ యాక్షన్!

- వైఎస్సార్ సీపీ నేతలను హతమార్చేందుకు ప్రణాళిక
- రవి తమ్ముడు భరత్, చిన్నాన్న రఘు రంగ ప్రవేశం
- ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌కు రక్షణ కరువు..
- కుట్రలకు పక్కాగా సహకరిస్తున్న పోలీసు యంత్రాంగం

సాక్షి టాస్క్‌ఫోర్స్: ‘పులివెందుల గడ్డపై జెడ్పీటీసీ విజయం టీడీపీ సొంతం కావాలి...! ఏమి చేస్తారో... ఎలా చేస్తారో మీ ఇష్టం..! ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుంది.. మీకు నచ్చినట్లు యంత్రాంగాన్ని ఉపయోగించుకోండి...!’ ముఖ్యమంత్రి కార్యాలయం చేసిన ఈ డైరెక్షన్‌తో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి యాక్షన్‌లోకి దిగిపోయారు. జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలుపే లక్ష్యంగా అరాచకాలకు తెగబడుతున్నారు. అడ్డొచ్చిన వారిని అంతమొందించాలని పథక రచన చేస్తున్నారు. అందులో భాగంగానే వైఎస్సార్‌సీపీ నేతలపై హత్యాయత్నం ఘటనలు వరుసగా చోటు చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. పచ్చ ముఠాలు పట్టపగలు మారణాయుధాలతో దాడికి తెగబడినప్పటికీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌కు గన్‌మేన్ సిద్దయ్య కనీస ప్రొటెక్షన్ కల్పించకపోవడం గమనార్హం. గాల్లోకి కాల్పులు జరపలేదు. ఉన్నత స్థాయి ఆదేశాలతోనే గన్‌మెన్ మిన్నకుండిపోయినట్లు సమాచారం. తొలుత సైదాపురం సురేష్‌కుమార్‌రెడ్డి (చంటి), అమరేష్‌రెడ్డిని టీడీపీ గూండాలు లక్ష్యంగా చేసుకోగా తర్వాత రోజు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిపై హత్యాయత్నం జరిగింది. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ వాహనాన్ని ధ్వంసం చేసి పెట్రోల్ పోసి తగలబెట్టే యత్నం చేశారు. ఇంత జరుగుతున్నా వాహనంలో ఉన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలను కాపాడాలనే ప్రయత్నం గన్‌మెన్ సిద్దయ్య చేయకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

హత్యోదంతంలో రవి కుటుంబ సభ్యులు..

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, వేల్పుల రామలింగారెడ్డిలపై హత్యాయత్నం ఘటనలో స్వయంగా టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆయన తమ్ముడు మారెడ్డి భరత్‌రెడ్డి, చిన్నాన్న రఘునాథరెడ్డి మారణాయుధాలు వెంటబెట్టుకొని నడిచి రాగా.. పేర్ల శేషారెడ్డి, మబ్బుచింతపల్లె శ్రీనాథరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, కిరికిరి బాషా అండ్ ఎల్లో గ్యాంగ్ వేల్పుల రామును హత్య చేసేందుకు యత్నించారు. అయితే నల్లగొండువారిపల్లె గ్రామస్తులు తిరగబడడంతో అదృష్టవశాత్తు బతికి పోయారు.

కొమ్ము కాస్తున్న యంత్రాంగం...

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార యంత్రాంగం పూర్తి ఏకపక్షంగా వ్యవహరిస్తోంది. హత్యా యత్నానికి సంబంధించి రెండు ఘటనల్లోనూ తదుపరి ఎలాంటి చర్యలు లేవు. గురువారం కూడా టీడీపీ గ్యాంగ్ ఇనుప రాడ్లు వెంటబెట్టుకొని వాహనాల్లో యథేచ్ఛగా పులివెందులలో సంచరించింది. మరోవైపు బాధితులపైనే రివర్స్ కేసు నమోదు కావటాన్ని పరిశీలిస్తే పోలీస్ ఉన్నతాధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ కీలక నేతలు ఎక్కడెక్కడ పర్యటిస్తున్నారు? ఎవరెవరు ఉన్నారు? ఎంతమంది ఫాలో అవుతున్నారు. టార్గెట్ చేసుకున్న వ్యక్తి అక్కడ ఉన్నాడా? లేడా? తదితర సమాచారం అంతా స్థానిక పోలీసుల ద్వారా అధికార పార్టీ నేతలకు ఎప్పటికప్పుడు చేరుతున్నట్లు సమాచారం. ఇక బ్యాలెట్ పేపర్ ముద్రించడంలో కూడా మతలబు ఉన్నట్లు అనుమానాలు రేకెత్తుతున్నాయి. 11 మంది పోటీలో ఉన్న జెడ్పీటీసీ ఎన్నికల్లో బ్యాలెట్‌ను సింగిల్‌గా కాకుండా డబుల్ సైడ్ గుర్తులు ఇస్తూ ముద్రించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఓటర్లను గందరగోళానికి గురి చేయాలనే ఈ ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డి గుర్తు 1వ గడిలో ఉంది. డబుల్ సైడ్ బ్యాలెట్ పేపర్‌ను మడత వేయడం వల్ల ఎక్కువగా వైఎస్సార్‌సీపీ ఓట్లు చెల్లకుండా పోవాలనే కుయుక్తి దాగి ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

● స్థానిక ఎన్నికలు

నిష్పాక్షికంగా జరిపించండి

సాక్షి, అమరావతి: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, పంచాయతీ (స్థానిక) ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని సూచించింది. ఎన్నికల ప్రక్రియ మొదలైనందున ఈ వ్యవహారంలో ఇంతకుమించి జోక్యం చేసుకోలేమని పేర్కొంది. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలంటూ వైఎస్సార్‌సీపీ సమర్పించిన వినతిపత్రాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి చర్యల నిమిత్తం డీజీపీకి పంపిందని గుర్తుచేసింది. ఈ వ్యాజ్యంలో తదుపరి ఉత్తర్వులు అవసరం లేదని స్పష్టం చేసింది. ఇంతటితో పరిష్కరిస్తున్నట్లు తెలిపింది.

➡ స్థానిక ఎన్నికల ప్రక్రియలో సీసీ టీవీల ఏర్పాటు, వెబ్ క్యాస్టింగ్, స్వతంత్ర పరిశీలకులు, అభ్యర్థులకు పోలీసు రక్షణ, ఎన్నికల ప్రక్రియను వీడియో తీసే విషయంలో అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసేవారందరికీ సమాన అవకాశాలు ఉండేలా చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరారు.


ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం విచారణ జరిపి ఉత్తర్వులు జారీ చేశారు.

దాడులకు పాల్పడుతున్నా పోలీసులు పట్టించుకోవట్లే..

పిటిషనర్ తరఫు న్యాయవాది వడ్లమూడి కిరణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ... స్థానిక ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన సంగతిని వివరించారు. అధికార పార్టీ కండబలం, ధన బలంతో ప్రతిపక్ష నాయకులపై దాడులకు పాల్పడుతోందని, అయినా పోలీసులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిష్పాక్షికంగా, స్వేచ్ఛాయుతంగా జరిగే పరిస్థితుల్లేవని పేర్కొన్నారు. పారదర్శకంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. దీనిపై కమిషన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్ సమర్పించిన వినతిపై స్పందించామని తెలిపారు. వారు కోరిన అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డీజీపీకి ఎన్నికల కమిషన్ సూచించిందన్నారు. అవసరమైతే అదనపు బలగాలను మోహరించాలని కూడా చెప్పిందన్నారు.

ప్రశాంత ఎన్నికల బాధ్యత అధికారులదే!

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రామకృష్ణప్రసాద్

సాక్షి, అమరావతి: శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూసే బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. పులివెందుల జెడ్పీటీసీ పరిధిలోని పులివెందుల డీఎస్పీ, పులివెందుల గ్రామీణ సీఐ, పట్టణ సీఐలను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలంటూ పిటిషనర్ ఇచ్చిన వినతిపత్రాలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ తదుపరి చర్యల నిమిత్తం ఎన్నికల అధికారి (కలెక్టర్), జిల్లా ఎస్పీకి పంపిన విషయాన్ని రికార్డు చేసింది. తమ ముందు దాఖలైన వ్యాజ్యాలను పరిష్కరిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదులకు సెల్ ఏర్పాటు చేయాలి

ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోకుండా తటస్థంగా వ్యవహరించేలా పులివెందుల పోలీసులను ఆదేశించాలని... ఎన్నికల కమిషన్ ఆమోదం లేకుండా ప్రతిపక్ష పార్టీ నేతలను అరెస్టు చేయొద్దని ఆదేశాలివ్వాలంటూ పులివెందుల మండలం తుమ్మలపల్లికి చెందిన తుమ్మల హనుమంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఎన్నికల నిర్వహణకు తటస్థ అధికారులను వినియోగించేలా ఆదేశాలివ్వడంతో పాటు ఎన్నికల అక్రమాలపై ఫిర్యాదులకు విభాగం (సెల్) ఏర్పాటుచేసేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఎన్నికల కమిషన్‌కూ వినతిపత్రాలు ఇచ్చామని, ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. వీటిపై జస్టిస్ రామకృష్ణప్రసాద్ విచారణ జరిపారు. ఎన్నికల సంఘం తరఫు న్యాయవాదులు వివేక్ చంద్రశేఖర్, సి.విశ్వనాథ్‌లు వాదనలు వినిపిస్తూ పిటిషనర్ వినతిపత్రాలను జిల్లా కలెక్టర్, ఎస్పీకి పంపామని.. ఆ మేరకు ప్రొసీడింగ్స్ కూడా జారీ అయ్యాయని తెలిపారు. ఈ వివరాలను రికార్డ్ చేసిన న్యాయమూర్తి, ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు.

నిందితులుగా ఎవరినీ ఎందుకు చేర్చలేదు?

ప్రసన్న కుమార్‌రెడ్డి కేసులో పోలీసులకు హైకోర్టు ప్రశ్న

సాక్షి, అమరావతి: ‘‘కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి నిందితుల జాబితాలో ఎవరినీ ఎందుకు చేర్చలేదు? ప్రసన్న సమర్పించిన ఫొటోల్లో దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులు స్పష్టంగా ఉన్నారు కదా? వారిని ఎందుకు నిందితులుగా చేర్చలేదు..?’’ అని హైకోర్టు ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా దర్గామిట్ట పోలీసులను ప్రశ్నించింది. ప్రసన్న ఇచ్చిన ఫిర్యాదుపై దర్యాప్తు పురోగతి వివరాలను తమ ముందు ఉంచాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది. గురువారం ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప ఉత్తర్వులు జారీ చేశారు. తన ఇంటిపై దాడి గురించి ఫిర్యాదు ఇచ్చినా సకాలంలో కేసు నమోదు చేయలేదని, తర్వాత కేసు నమోదు చేసినా, దాడి చేసినవారిని నిందితులుగా చేర్చలేదని, ఈ విషయంలో పోలీసులపై చర్యలకు ఆదేశాలు ఇవ్వాలంటూ ప్రసన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ జ్యోతిర్మయి విచారణ జరిపారు.

ప్రశాంతిరెడ్డి ప్రోద్బలంతోనే దాడి...

పిటిషనర్ తరఫు న్యాయవాది వి.రూపేష్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. దాడికి పాల్పడినవారి ఫొటోలను, ఆ ఘటన సీసీ ఫుటేజీని పిటిషనర్ పోలీసులకు సమర్పించారని తెలిపారు. అయినా పోలీసులు కేసు నమోదులో విపరీతమైన జాప్యం చేసి, దాడి బాధ్యులను నిందితులుగా చేర్చలేదన్నారు. ఎఫ్ఐఆర్‌లో నిందితుల స్థానంలో గుర్తుతెలియని వ్యక్తులు అని పేర్కొన్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ప్రోద్బలంతో... పిటిషనర్ ఇంటిపై దాడి జరిగిందని తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై ఎలాంటి కేసు నమోదు చేయలేదన్నారు. పోలీసుల తరఫున ప్రభుత్వ న్యాయవాది (జీపీ) ఎ.జయంతి వాదిస్తూ, ఎవరిని నిందితులుగా చేర్చాలన్నది పోలీసుల విచక్షణకు సంబంధించినదని తెలిపారు. దర్యాప్తు ఎలా చేయాలి, ఎప్పుడు చేయాలన్నది పిటిషనర్ నిర్దేశించలేరన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు కేసు నమోదు చేసి, ప్రాథమిక దర్యాప్తు జరిపారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి... పిటిషనర్ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో దర్యాప్తు పురోగతి ఏమిటో చెప్పాలని పోలీసులను ఆదేశించారు. అలాగే నిందితులుగా ఎవరినీ ఎందుకు చేర్చలేదో కూడా చెప్పాలన్నారు.

తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

మా ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే సుప్రీం కోర్టుకెళ్లండి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాచర్ల మునిసిపాలిటీ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌పై కేసుల మీద కేసులు పెడుతూ రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎప్పుడో ఏడాదిన్నర క్రితం ఘటన జరిగితే ఇప్పుడు కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన వ్యవహారంలో అటు పోలీసులు, ఇటు మేజిస్ట్రేట్ తీరును హైకోర్టు తప్పుపట్టింది. కిషోర్‌ను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలిచ్చింది. ఆయన అరెస్ట్ సీఆర్‌పీసీ, బీఎన్ఎస్ఎస్ నిబంధనలతో పాటు సుప్రీంకోర్టు ఆదేశాలకు సైతం విరుద్ధమని తేల్చి చెప్పింది. ఇందులో ఎలాంటి సందేహం లేదంది. కిషోర్ రిమాండ్ విషయంలో మేజిస్ట్రేట్ మెదడు ఉపయోగించలేదని ఆక్షేపించింది. బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేయలేదు కాబట్టి, రిమాండ్ విధిస్తున్నట్లు పేర్కొన్న మేజిస్ట్రేట్, ఈ విషయంలో తన సంతృప్తిని ఎక్కడా రికార్డ్ చేయలేదని పేర్కొంది. కిషోర్ విడుదల ఈ వ్యాజ్యంలో తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటుందని స్పష్టం చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ తూటా చంద్ర ధనశేఖర్‌తో కూడిన ధర్మాసనం విష్ణుతేజ అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. కిషోర్ విడుదలకు తాము ఉత్తర్వులిస్తామని, వాటిపై అభ్యంతరం ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లొచ్చునని తేల్చి చెప్పింది. పిటిషనర్ తరఫు న్యాయవాది సానేపల్లి రామలక్ష్మణరెడ్డి స్పందిస్తూ, ఈ కేసులో పోలీసులు ప్రతి దశలో కోర్టును తప్పుదోవ పట్టించారని ప్రస్తావించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం... తురకా కిషోర్‌ను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించింది. గురువారం సంచలన ఉత్తర్వులు జారీ చేసింది.

అక్రమ నిర్బంధంపై హైకోర్టును ఆశ్రయించిన తురకా సురేఖ

గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన తన భర్త కిషోర్‌ను పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపరిచేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ ఆయన భార్య సురేఖ గత వారం హైకోర్టులో అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం మరోసారి విచారణ జరిపిన జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం కిషోర్ రిమాండ్‌ను సవాలు చేస్తూ అనుబంధ పిటిషన్ దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు వెసులుబాటు ఇచ్చింది. గురువారం ఈ వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా, కిషోర్ రిమాండ్‌ను సవాలు చేస్తూ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. రెంటచింతల పోలీసుల తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది తిరుమాను విష్ణుతేజ వాదనలు వినిపిస్తూ... రిమాండ్ ఏ విధంగా తప్పో ఎక్కడా చెప్పలేదన్నారు. కిషోర్‌కు రిమాండ్ రిపోర్ట్, ఇతర డాక్యుమెంట్లను ఇచ్చినా తీసుకునేందుకు నిరాకరించారని చెప్పారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ, కోర్టు జారీ చేసిన రిమాండ్ ఉత్తర్వుల్లో వీటి ప్రస్తావన లేదని గుర్తుచేసింది. అరెస్టు కారణాలను సైతం మౌఖికంగానే చెప్పారని, ఇది చెల్లదని తెలిపింది. అరెస్ట్ కారణాలను చెప్పి, వాటిని చదువుకునేందుకు సమయం ఇవ్వాలని, అలా ఇవ్వకుంటే నిర్బంధంలో ఉన్న వ్యక్తి తనను తాను రక్షించుకునేందుకు న్యాయవాదిని నియమించుకోవాలిగా? అని ప్రశ్నించింది. మీరు చెబుతున్న దాన్నిబట్టి చూస్తుంటే అరెస్ట్‌కు ముందే రిమాండ్ రిపోర్ట్ సిద్ధం చేసినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఇది ఫక్తు పోలీసు తరహా కేసు అని మండిపడింది. విష్ణుతేజ స్పందిస్తూ, అనుబంధ పిటిషన్‌పై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు.

క్లుప్తంగా...

'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' విజయవంతం

డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా



సాక్షి, అమరావతి: విద్యా సంస్థలకు 100 మీటర్ల పరిధిలో నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలను అరికట్టేందుకు ఉద్దేశించిన 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్' విజయవంతమైందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈగల్ విభాగం రాష్ట్రవ్యాప్తంగా నాలుగురోజులపాటు నిర్వహించిన ఈ కార్యాచరణ ద్వారా 16,806 దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి 25,807 కేసులను నమోదు చేశామని పేర్కొన్నారు. రూ.40.62 లక్షలు జరిమానా విధించామని వివరించారు. కేసుల నమోదు పరంగా విశాఖపట్నం జిల్లా మొదటి స్థానంలో ఉండగా కాకినాడ, ప్రకాశం జిల్లాలు రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయని వెల్లడించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్‌ను నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.

జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యునిగా వేమిరెడ్డి నియామకం



సాక్షి, అమరావతి: గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్టీఏటీ) జ్యుడిషియల్ సభ్యునిగా విజయవాడకు చెందిన సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి భాస్కర్ రెడ్డిని కేంద్ర ప్రభుత్వం నియమించింది. జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను దేశవ్యాప్తంగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంలో భాగంగా మొత్తం 53 మంది జ్యుడిషియల్ సభ్యులను ప్రభుత్వం నియమించింది. సమర్థవంతమైన జీఎస్టీ అప్పిలేట్ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా వివాదాల పరిష్కారానికి పట్టే సమయాన్ని తగ్గించడంతో పాటు, పరోక్ష పన్నుల వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచాలన్నది లక్ష్యం.

మద్యం అక్రమ కేసులో విచారణ వాయిదా

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసుకు సంబంధించి విజయవాడ జిల్లా జైలులో ఉన్న శ్రీధర్‌రెడ్డి తరఫున న్యాయవాది విష్ణువర్ధన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై ప్రాసిక్యూషన్ తరఫున కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఏసీబీ కోర్టు విచారణను ఈనెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఇదే కేసులో బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ తరఫున దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను కూడా అదే రోజుకు వాయిదా వేశారు. చాణక్య బెయిల్ పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తరఫున హైకోర్టు న్యాయవాది వాణిరెడ్డి ఏసీబీ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.

జలరవాణాలో ప్రైవేటు పెట్టుబడులు

బిడ్లను ఆహ్వానించిన ఏపీ ఇన్‌ల్యాండ్ బోర్డు

సాక్షి, అమరావతి: నదులు, కాల్వల్లో జలరవాణాలో ప్రైవేటు పెట్టుబడులను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా సరుకు, ప్రయాణికుల రవాణాకు అవకాశమున్న ప్రాంతాలను ఎంపిక చేసి వాటికి సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ల (ఈవోఐ)ను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు 8 చోట్ల సరుకు రవాణాకు, 17 చోట్ల ప్రయాణికుల రవాణాకు వేరు వేరుగా ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బిడ్లను ఆహ్వానించింది. కృష్ణా నదిలో ముక్త్యాల-విజయవాడ, వెంకటపాలెం-ఇబ్రహీంపట్నం, కాకినాడ-రాజమండ్రి, రాజమండ్రి-విజయవాడ, రాజమండ్రి-భద్రాచలం, విజయవాడ-పెదగంజాం, పెదగంజాం-తడల వద్ద సరుకు రవాణాను స్థానిక కంపెనీల సహకారంతో అభివృద్ధి చేయడానికి బిడ్లను ఆహ్వానించింది. పురుషోత్తమపట్నం-భద్రాచలం, పురుషోత్తమపట్నం-పోలవరం, పట్టిసీమ- పట్టిసీమ గుడి, నర్సాపురం-అంతర్వేది, కోటపల్లి-ముక్తేశ్వరం, ముక్త్యాల-విజయవాడ, కాకినాడ-విజయవాడ, నాగాయలంక-కృష్ణ సంగమం, కృష్ణా జిల్లా ఏటిమొగ నుంచి ఎదురుమొండి, ఏసుపురం-లక్ష్మీపురం, ఉల్లిపాలెం-హంసలదీవి, వెంకటపాలెం-ఇబ్రహీంపట్నం, రాయపూడి-ఇబ్రహీంపట్నం, మైలవరం డ్యాం-పెన్నాసంగమం, మంత్రాలయం-కృష్ణ తుంగభద్ర సంగమం ప్రయాణికుల రవాణామార్గాలకు ఈవోఐ బిడ్లను ఆహ్వానించింది.

ప్రతి అడుగులోనూ చేనేతకు అండగా నిలిచాం

నేతన్నలందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం

సాక్షి, అమరావతి: నేతన్నల జీవితాలు బాగుపడాలన్న ఆకాంక్షతో వైఎస్సార్‌సీపీ హయాంలో మేనిఫెస్టోలో చెప్పినట్టుగా అన్ని హామీలను అమలు చేసి ప్రతి అడుగులోనూ వారికి అండగా నిలిచామని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలందరికీ గురువారం ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తమ హయాంలో అమలు చేసిన పథకాలన్నింటినీ టీడీపీ కూటమి ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేస్తూ అన్ని వర్గాల మాదిరిగానే చేనేతలను సైతం చంద్రబాబు మోసం చేసిన వైనాన్ని ఎండగడుతూ తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఏమన్నారంటే..



నేతన్నలకు రూ.3,706.16 కోట్ల సాయం చేశాం..

ఈ రోజు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలందరికీ శుభాకాంక్షలు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ''సంత్ కబీర్' అవార్డు అందుకుంటున్న లక్క శ్రీనివాసులు (తిరుపతి), నేషనల్ హ్యాండ్‌లూమ్ అవార్డులు అందుకుంటున్న కర్నాటి మురళి (చీరాల), జుజరె నాగరాజు (పొందూరు)లకు అభినందనలు. మా ప్రభుత్వ హయాంలో ప్రతి అడుగులోనూ నేతన్నలకు అండగా నిలిచాం. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా 'వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం' ద్వారా ఏటా రూ.24,000 చొప్పున నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో క్రమం తప్పకుండా జమ చేశాం. వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.969.77 కోట్లు, నేతన్నల పింఛన్ కోసం రూ.1,396.45 కోట్లు, ఆప్కోకు పాత బకాయిలు రూ.468.84 కోట్లు చెల్లించాం. అంతేకాదు.. వివిధ పథకాల ద్వారా నేతన్నలకు రూ.3,706.16 కోట్లు మేర సాయం చేశాం. ఇది ఒక రికార్డు. నేతన్నలకు ఉచిత విద్యుత్, పవర్ లూమ్స్‌కు రాయితీపై విద్యుత్ అందించాం. చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించి నేతన్నల ఆదాయం పెంచేందుకు ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. ఇలా ప్రతి అడుగులోనూ చేనేతలకు అండగా నిలిచాం.

ఏ రకంగా ఆదుకున్నట్లు..?

ఈ ప్రభుత్వం చేనేతలకు నడుస్తున్న పథకాలను ఆపివేయడంతోపాటు ఇచ్చిన హామీలను పూర్తిగా గాలికి వదిలేసింది. జీఎస్టీ రీయింబర్స్ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదు. దీన్ని అమలు చేయాలంటే దాదాపు రూ.250 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని నేతన్నలు చెబుతున్నారు. కానీ రెండు బడ్జెట్‌లలో ఈ ప్రభుత్వం పెట్టింది సున్నా. పవర్‌లూమ్‌లకు 500 యూనిట్లు, హ్యాండ్‌లూమ్‌లకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అన్నారు. కానీ 14 నెలలు గడిచినా అమలు చేయలేదు. కరెంటు సబ్సిడీ ఇవ్వలేదు గానీ విద్యుత్తు చార్జీలు అమాంతం పెంచారు. ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు రూ.19 వేల కోట్ల మేర కరెంటు షాక్ ఇచ్చారు. మరి ఈ ప్రభుత్వం చేనేతలను ఏ రకంగా ఆదుకున్నట్లు? పత్రికల్లో ప్రకటనలు మినహా ఏమీ కనిపించడం లేదు. అన్ని వర్గాల మాదిరిగానే చంద్రబాబు చేనేతలను వంచించారు, మోసం చేశారు.



గుంటూరులో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



అనంతపురం జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలోని జ్యోతి రావ్ పూలే విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



విశాఖలో జ్యోతిరావ్ పూలే విగ్రహానికి నివాళులర్పించి నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టీడీపీ గూండాల దాడిపై రాష్ట్రవ్యాప్తంగా పెల్లుబికిన నిరసన

- బీసీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడికి ఖండన
- అంబేడ్కర్, పూలే విగ్రహాలకు వినతిపత్రాలు
- నల్ల రిబ్బన్లు ధరించి ప్రదర్శనలు
- పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే టీడీపీ దాష్టీకం
- ఇలా దాడులకు తెగబడితే సహించం
- హెచ్చరించిన వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, బీసీ సంఘాలు

సాక్షి నెట్‌వర్క్: వైఎస్సార్ జిల్లా పులివెందులలో టీడీపీ గూండాలు ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్ మీద దాడిచేయడాన్ని ఖండిస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసనలు పెల్లుబికాయి. జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాల్లో వేలాదిగా వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రదర్శనలు చేశారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి వినతిపత్రాలిచ్చారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీసీ నాయకుడు రమేష్‌యాదవ్‌పై దాడిచేసిన వారిని అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే తెలుగుదేశం వర్గీయులు ఈ దాడులకు తెగబడ్డారని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల్లో గెలవలేమని అడ్డదారుల్లో దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఏడాదన్నరగా కూటమి పాలనలో బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతూ, అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతోందని మండిపడ్డారు. రెడ్‌బుక్ పాలన అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను అణచివేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. కూటమి పాలనలో బలహీనవర్గాలపై జరుగుతున్న దాడులు చూసి జ్యోతిరావ్ పూలే ఆత్మ క్షోభిస్తోందన్నారు. అధికారం ఉంది కదా అని బీసీలపై దౌర్జన్యానికి, దాడులకు పూనుకుంటే చూస్తూ సహించబోమన్నారు. చంద్రబాబు మోచేతి నీళ్లు తాగుతూ లోకేశ్ చెప్పినట్లు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు బనాయిస్తున్న ఐపీఎస్ అధికారులతో సహా ఎవరూ చట్టానికి అతీతులు కారన్న విషయం మర్చిపోవద్దని హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్పందించి పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కోరారు.

శాంతియుతంగా నిరసన

గుంటూరు హిందూ కాలేజీ కూడలి, తిరుపతి బాలాజీ కాలనీ, అనంతపురం జెడ్పీ కార్యాలయం, నెల్లూరు మినీ బైపాస్‌రోడ్డు, కర్నూలులోని బిర్లా సర్కిల్, నంద్యాలలోని పద్మావతినగర్ ఆర్చి, కాకినాడ, ఏలూరు, అనకాపల్లిల్లో జ్యోతిరావ్ పూలే విగ్రహాల వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల జ్యోతిరావ్ పూలే విగ్రహానికి, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాలు ఇచ్చి నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ప్రకాశం చౌక్ సెంటర్‌లో జ్యోతిరావ్ పూలే చిత్రపటంతో ధర్నా చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి, కాకినాడ జిల్లా ఏలేశ్వరం, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో నిరసన ప్రదర్శనలు చేశారు.

మాజీ సైనికుడి భూవివాదంపై విచారణ జరిపించండి

సీఎంకు బొత్స లేఖ



సాక్షి, విశాఖపట్నం: మాజీ సైనికుడి భూవివాదం, విశాఖలో ల్యాండ్ గ్రాబింగ్, రెవెన్యూ సంబంధిత భూములపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపించాలని కోరుతూ సీఎం చంద్రబాబుకు శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ గురువారం లేఖ రాశారు. ఎండాడలో మాజీ సైనికుడి భూవివాదంపై విచారణ కోరుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రెవెన్యూ మంత్రికి సైతం ఆయన లేఖ రాశారు. 'ఫ్రీహోల్డ్ భూముల స్వాధీనం వంటి వివాదాస్పద ఘటనల పట్ల తీవ్ర ఆందోళన చెందిన విషయాన్ని లేఖలో రాశాను. మీడియా ద్వారా ఈ వ్యవహారాలు ప్రస్తుతం మీ దృష్టికీ వచ్చాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన ఆధారాలనూ ఈ లేఖకు జత చేశాను. ఆయా భూములు స్వాధీనపరచడం, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, సీనియర్ అధికారులు, రాజకీయ నేతల ప్రమేయం వంటి అంశాల్లో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. రెవెన్యూ శాఖలో ముఖ్య కార్యదర్శి స్థాయిలోనూ ఇందులో ప్రమేయం ఉందన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా ఈ విషయంపై న్యాయ విచారణ అవసరమని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై తక్షణ చర్యలు తీసుకుని, నిష్పక్షపాతమైన విచారణ ద్వారా వాస్తవాలను వెలికి తీయాలి. ప్రజల్లో పరిపాలనపై విశ్వాసం పునరుద్ధరించడానికి కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. భూకబ్జాదారులు, తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి' అని ఆ లేఖలో బొత్స కోరారు.

ఎమ్మెల్సీ ఆలపాటి చంపేస్తానంటున్నాడు

- పోలీసులే రక్షణ కల్పించాలి
- విజయవాడ శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్

లబ్బీపేట (విజయవాడ తూర్పు): చెప్పినట్లు వినకుంటే మా కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ వారం కిందట ఫోన్‌చేసి బెదిరించాడని విజయవాడలోని శాతవాహన కళాశాల ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాస్ గురువారం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని డీసీపీకి ఫిర్యాదు చేశారు. తనకు ఆలపాటి నుంచి ప్రాణహాని ఉందని.. రక్షణ కల్పించాలని వేడుకున్నారు. ఆలపాటి ఫోన్‌చేసి బెదిరించిన వాయిస్ రికార్డులను పోలీసులకు అందచేయడంతోపాటు, మీడియాకు శ్రీనివాస్ విడుదల చేశారు.

నా అంతు చూస్తానంటున్నాడు..

ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఫోన్‌చేసి శాతవాహన కళాశాల విషయంలో ఆయన చెప్పినట్లే తాను వినాలని.. లేదంటే నా సంగతి తేలుస్తానంటున్నాడని, ఫోన్ ట్యాపింగ్‌లో ఉందని, అంతుచూస్తానంటున్నాడని మీడియా ముందు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన అధికార పార్టీ అయినందున నన్ను ఏదైనా చేయగలనని, వదలబోనని.. ముఖ్యమంత్రికి కూడా చెప్పానంటూ హెచ్చరిస్తున్నట్లు వాపోయారు. తనకు ఏదైనా జరిగితే ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదే కారణమని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ స్పష్టంచేశారు. గతంలో కూడా తనను కిడ్నాప్ చేశారని.. అయితే, పోలీసుల జోక్యంతో విడిచిపెట్టారన్నారు. శాతవాహన కళాశాల విషయంలో ఆలపాటికి ఎలాంటి సంబంధం లేకపోయినా ఆయన చెప్పినట్లు వినాలని బెదిరిస్తున్నారని.. దీంతో డీసీపీని కలిసి రక్షించాలని కోరానని చెప్పారు. ఆలపాటిపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశానన్నారు. మరోవైపు.. శాతవాహన కళాశాల ప్రాంగణంలో గురువారం ఎమ్మెల్సీ ఆలపాటి మీడియాతో మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీనివాసరావును 'పద్ధతి మార్చుకో తప్పుచేయకు' అని చెబితే దానిని బెదిరింపులు అంటారా అని ప్రశ్నించారు.

వీఐపీ హెలికాప్టర్ బిడ్డింగ్‌కు కమిటీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముఖ్యమంత్రితో పాటు వీఐపీల పర్యటనల కోసం కొనుగోలు చేయనున్న హెలికాప్టర్ బిడ్డింగ్ పరిశీలన కోసం అయిదుగురు సభ్యులతో కూడిన ఎవాల్యుయేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి నూరల్ కమర్, ఎస్ఎస్‌జీ డైరెక్టర్ ఎస్ఎన్ విశ్వనాథ్, డీజీసీఏ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ఎల్ నాయక్, ఏపీఏసీఎల్ ఎండీ టాటా మోహనరావుతోపాటు ఏపీయూఐఏఎంఎల్ ప్రతినిధి ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

సచివాలయ మహిళా ఉద్యోగి కిడ్నాప్

అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో ఘటన




కారులో ఎక్కించుకుని వెళ్తున్న దుండగులు

రంపచోడవరం: సచివాలయ మహిళా ఉద్యోగిని అపహరించుకెళ్లిన ఘటన అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం శరభవరంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. శరభవరంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సోయం శ్రీసౌమ్య ఉదయం 10.30 గంటలకు రోజూమాదిరిగా విధులకు హాజరయ్యారు. వేటుకూరుకి చెందిన కె.అనిల్‌కుమార్ మరికొందరి సహాయంతో AP31TJ1462 నంబరు గల ఇన్నోవా కారులో ఆమె కార్యాలయానికి వెళ్లి బెదిరించి, బలవంతంగా ఈడ్చుకుంటూ ఎక్కించుకుని పారిపోయాడు. తోటి సిబ్బంది అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిని కత్తులతో బెదిరించారు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించగా.. పోలీసులు నాలుగు బృందాలతో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, నిందితుడు నాలుగు రోజులుగా సచివాలయ పరిసరాల్లో రెక్కీ నిర్వహించినట్లు స్థానికులు చెబుతున్నారు. మళ్లీ ఇప్పుడు నిందితుడు పట్టపగలే అందరి ముందూ కిడ్నాప్ చేయడం కలకలం రేపుతోంది.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

V. V. INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES
Seshadri Rao Knowledge Village, Gudlavalleru-521356, Krishna District, A.P. Ph: 08674-274649, 9542894455.
(Approved by PCI, New Delhi and Affiliated to JNTUK, Kakinada)
STAFF RECRUITMENT
Associate Professors and Assistant Professors in Pharmacy Specialization. Lab Technician: D.Pharm./B.Pharm., Physical Director: M.P.Ed., Junior Assistant : Any PG Degree with Computer Knowledge. Eligible candidates send their resumes to E-mail: venkatadripharmacy@gmail.com on or before 17-08-2025. Eligibility: As per PCI norms. Salary is not a constraint for deserving candidates.
VVIPS/ADVT/2025, Dt: 08-08-2025. Secretary & Correspondent





నీవు నీ బంధువుకు అతని హక్కు ఇవ్వు; యాచించని పేదవానికి, బాటసారికి (కూడా). ఇది అల్లాహ్ ప్రసన్నతను కోరేవారికి ఎంతో ఉత్తమమైనది. ఇలాంటివారే సాఫల్యము పొందేవారు.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 8 ఆగస్టు 2025

విచక్షణ మరిచిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తన మాట వినని దేశాలపై తోచిన మోతాదులో సుంకాలు వేయటం నిత్యకృత్యమైంది. ఈ క్రమంలో న్యాయం, ధర్మం, విచక్షణ, హేతుబద్ధత వగైరాలు లేవు. రెండోసారి దేశాధ్యక్షుడైనా తమ దేశం ఎవరెవరితో ఏ స్థాయి వాణిజ్యం నెరపుతున్నదో తెలియని ట్రంప్... వేరే దేశాలు ఎవరితో ఎలాంటి సంబంధాలు నెలకొల్పుకోవాలో, వద్దో నిర్ణయించటానికి తగుదునమ్మా అంటూ తయారయ్యారు. ఈనెల 1 నుంచి మన దేశంపై 25 శాతం సుంకాలు విధిస్తున్నట్టు లోగడ ప్రకటించిన ట్రంప్, వారం తిరగకుండానే మరో 25 శాతం మేర సుంకాలుంటాయని తాజాగా నిర్ణయించారు. ఇవిగాక పరోక్ష సుంకాలు మొదలవుతాయట. ఇవన్నీ 250 శాతం దాటినా దాటొచ్చని లోగడే ఆయన సెలవిచ్చారు. తన మాట నెగ్గటానికి కనిపించిందల్లా విసిరికొట్టే అల్లరిపిల్లల మొండిధోరణికీ, ట్రంప్ చేష్టలకూ తేడా ఉందా? తనకు రష్యా నచ్చలేదు గనుక ఆ దేశం నుంచి ముడి చమురు కొనరాదని ఆయన శాసిస్తున్నారు. ఉక్రెయిన్‌తో జగడం ఆపేయాలని పదే పదే కోరుతున్నా వినని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అక్కసుతో ఇవన్నీ చేస్తున్నట్టు అందరికీ కనబడుతోంది. కానీ అసలు కారణాలు వేరు. నిజానికి రష్యా చమురు కొని ప్రపంచమార్కెట్లు స్థిరంగా ఉండేలా చూడమని గతంలో చెప్పింది అమెరికాయే!

ప్రేమాభిమానాలను అపాత్రదానం చేయకూడదు. ట్రంప్ వ్యవహారశైలి చూచాయగా తెలుస్తున్నా, తొలి దఫాలో ప్రధాని నరేంద్ర మోదీ ఆయన పట్ల సానుకూలంగా ఉన్నారు. దేశాల మధ్య సుహృద్భావ సంబంధాలకు సానుకూలత అవసరమే. కానీ దానికి కూడా అవధులుంటాయి. 2019 సెప్టెంబర్‌లో అమెరికాలోని టెక్సాస్‌లో 'హౌడీ మోదీ' కార్యక్రమమైనా, ఆ మరుసటేడాది ట్రంప్ భారత్ సందర్శించినప్పుడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన 'నమస్తే ట్రంప్' అయినా దౌత్య పరిమితులు దాటాయన్న విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం సంగతి సరే... పౌరులు కూడా ఆ మాదిరే ఉన్నారు. అమెరికాలోని కొందరు ఎన్నారైలు ఆయన దేశాధ్యక్షుడు కావాలని యజ్ఞయాగాదులు చేశారు. అంతేకాదు... ప్యూ రీసెర్చ్ సంస్థ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక ప్రపంచ వ్యవహారాల్లో ట్రంప్ వ్యవహారశైలిపై 24 దేశాల్లో 28,333 మందిని సర్వే చేస్తే సగం మంది భారతీయులు ఆయనపై విశ్వాసం వ్యక్తపరిచారట. ఆ సంగతి అప్పట్లో ఆ సంస్థ ప్రకటించింది. టర్కీ, జర్మనీ, మెక్సికో లాంటి దేశాల్లో మాత్రం అత్యధికులు (80 శాతం పైగా) ట్రంప్‌పై నమ్మకం లేదని తెలిపారు. ఈ ఫలితాల్లో మనం హంగేరి, ఇజ్రాయెల్, నైజీరియా, కెన్యాల సరసన చేరాం.

అయితే ట్రంప్ వికృత విన్యాసాలు గమనించాక మోదీ ఆయన విషయంలో దృఢవైఖరి ప్రదర్శిస్తున్నారు. అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గి అన్నదాతల, మత్స్యకారుల ప్రయోజనాలను విస్మరించే ప్రశ్నే లేదని గురువారం ఆయన మరోసారి కుండబద్దలు కొట్టారు. ఇందుకు వ్యక్తిగతంగా మూల్యం చెల్లించాల్సి వచ్చినా సిద్ధమేనన్నారు. మోదీ, ట్రంప్‌ల మైత్రి గురించి ఉన్న అభిప్రాయంతో సుంకాల ఒప్పందంలో అమెరికాదే పైచేయి అవుతుందనుకున్న మన విపక్షాలకు ఇది నిరాశ కలిగించే పరిణామమే. దేశంలో 70 కోట్లమంది ప్రజానీకం ఆధారపడి బతికే రంగాలను విదేశాలకు గంపగుత్తగా అప్పగించే దుస్సాహసం ఎవరైనా చేయగలుగుతారా? పైగా అవి జన్యుమార్పిడి చేసినవి. ఆ చెత్త మన మార్కెట్లను ముంచెత్తితే కలిగే దుష్పరిణామాల గురించి చాన్నాళ్లుగా పర్యావరణవాదులు చెబుతూ వచ్చారు. తమ సాగు, పాడి ఉత్పత్తులపై అసలు సుంకాలే విధించరాదన్నది ట్రంప్ ఆంతర్యం. ఆశపడటం సహజం... కానీ అది దురాశగా మారరాదని ఆయన గారికి చెప్పేదెవరు? 'జీరో' సుంకాల సంగతి బహిరంగంగా చెబితే నలుగురూ నోళ్లు నొక్కుకుంటారని ట్రంప్ భయపడి రష్యా–ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపుతూ, రష్యా నుంచి ముడిచమురు కొనుగోళ్లు ఆపాలన్న రాగం అందుకున్నారు. ఏ సరుకు ధరైనా మార్కెట్ శక్తులు నిర్ణయించే వర్తమానంలో రష్యా నుంచి చవగ్గా కొనరాదని, దాన్ని హెచ్చు ధరకు అమ్మరాదని ఆంక్షలు విధించాలని చూడటం ట్రంప్ తెలివితక్కువతనం. అమెరికా ఇన్నాళ్లూ ప్రవచించిన ప్రపంచీకరణకు వ్యతిరేకం. పైగా చైనాతో పోలిస్తే మన ముడిచమురు కొనుగోళ్లు తక్కువ. అయినా ఆ దేశంపై ట్రంప్ సానుకూలంగా ఉన్నారు.

ట్రంప్ పాత, కొత్త సుంకాలు అమలైతే భారత్ జీడీపీపై 0.6 శాతం ప్రభావం పడుతుందని ప్రముఖ మదుపు సంస్థ గోల్డ్‌మాన్ శాక్స్ ప్రకటించింది. ఇదిగాక వాణిజ్య అనిశ్చితి వల్ల పరోక్ష ప్రభావం ఉండొచ్చని ఆ సంస్థ చెబుతోంది. మొత్తానికి ట్రంప్ ఇదే మంకుపట్టుతో ఉంటే మనకు ఏదోమేర సమస్యలుండక తప్పదు. ఈ వైరం మనం కోరుకున్నది కాదు. అయినా వచ్చిపడింది. కనుక కలిసికట్టుగా ఉండి ఎదుర్కొనటమే ఏకైక మార్గం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి: శు.చతుర్దశి ప.1.45 వరకు, తదుపరి పౌర్ణమి. నక్షత్రం: ఉత్తరాషాఢ ప.3.07 వరకు, తదుపరి శ్రవణం. వర్జ్యం: రా.7.12 నుండి 8.50 వరకు. దుర్ముహూర్తం: ఉ.8.17 నుండి 9.07 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.20 వరకు. అమృత ఘడియలు: ఉ.8.24 నుండి 10.03 వరకు, తదుపరి తె.4.55 నుండి 6.33 (తెల్లవారితే శనివారం). వరలక్ష్మీ వ్రతం.

సూర్యోదయం: 5.44
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు

ఈ అణు దూకుడుతో మళ్లీ అనర్థం

విశ్లేషణ



టంకశాల అశోక్

హిరోషిమా, నాగసాకీలపై అణ్వస్త్ర ప్రయోగాలు జరిగిన 80 సంవత్సరాలకు తిరిగి అణ్వస్త్రాల ప్రస్తావనలు వస్తుండటం ప్రపంచాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నది. కాకతాళీయంగా ఈసారి కూడా ఆ ప్రస్తావనలు చేస్తున్న అమెరికా... రష్యా సమీపంలోని పసిఫిక్ మహాసముద్ర జలాలలోకి రెండు అణ్వస్త్ర జలాంతర్గాములను తరలించింది. ఈ విషయం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొద్ది రోజుల క్రితం స్వయంగా ప్రకటించారు. అక్కడి నుంచి దక్షిణాన అవే సముద్ర జలాలలో జపాన్ ఎంతో దూరంలో లేదు. ట్రంప్ చర్యలకు ప్రతిగా రష్యన్లు తమవద్ద గల 'డెడ్ హ్యాండ్' అణ్వస్త్ర వ్యవస్థ గురించి గుర్తు చేశారు. 1987 నుంచి గల అణ్వాయుధ క్షిపణుల నిరోధక ఒప్పందం నుంచి ఉపసంహరించుకున్నారు. ఇది ఈ 5వ తేదీ నాటి పరిణామం. ఇవన్నీ వెంటవెంటనే వారం రోజులలోపే జరిగిపోయాయి.

ఏమిటీ 'డెడ్ హ్యాండ్' వ్యవస్థ?

అమెరికా, రష్యాల మధ్య అణు యుద్ధం రాగల అవకాశం సాధారణ దృష్టికైతే కనిపించటం లేదు. ట్రంప్ ఒకవైపు అణు జలాంతర్గాముల మోహరింపునకు ఆదేశాలిస్తూనే, 'డెడ్ హ్యాండ్' ప్రస్తావనలు చేస్తున్న రష్యా అటువంటి చర్యలకు పాల్పడగలదని భావించటం లేదనీ, అయినా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామనీ అన్నారు. మరొకవైపు రష్యా అధ్యక్షుడు పుతిన్, ఈ తరహాలో అణు ప్రస్తావనలు ఎవరికీ మంచిది కాదన్నారు. ఆ విధంగా చూసినపుడు ఎవరికి వారు ఎంతో కొంత జాగ్రత్తలలోనే ఉన్నట్లు భావించాలి. అసలు విషయం ఇంత దూరం ఎందుకు వచ్చింది?

చర్చను ఒక తక్షణ విషయంతో ఆరంభిద్దాము. రష్యా తన ఉక్రెయిన్ యుద్ధాన్ని 10 రోజులలో ఆపివేసి శాంతి ఒప్పందంపై సంతకాలు చేసి తీరాలని అమెరికా అధ్యక్షుడు తనంతట తానే ఒక గడువు విధించారు. ఆ గడువు ఈనెల 9వ తేదీతో ముగుస్తుంది. కొన్ని రోజుల క్రితం ఇలాగే 50 రోజుల గడువు ప్రకటించారు.

బ్రెజిల్ అధ్యక్షుడు లూలా అన్నట్లు ప్రపంచానికి అన్ని విధాలా ఒక చక్రవర్తి వలె వ్యవహరిస్తున్న ట్రంప్, అందరికీ ఆదేశాలు, హెచ్చరికలను ఎడాపెడా జారీ చేస్తున్న తీరును చూస్తూనే ఉన్నాము. ట్రంప్ నుంచి ఇటువంటి ధోరణిని సహించలేని రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు, మాజీ దేశాధ్యక్షుడు అయిన మెద్వెదేవ్ ఆయనకు తమ అణ్వస్త్ర శక్తిని, 'డెడ్ హ్యాండ్' పేరుతో గల అణు వ్యవస్థను గుర్తు చేశారు. సాధారణ ప్రచారంలో లేని 'డెడ్ హ్యాండ్' వ్యవస్థ ఏమంటే, ఒకవేళ అమెరికా మొదటగా అణ్వస్త్రాలు ప్రయోగించి రష్యా రాజకీయ నాయకత్వాన్ని, సైనిక నాయకత్వాన్ని పూర్తిగా తుడిచి పెట్టినట్లయితే, తదనంతర చర్యలకు వారి నుంచి ఆదేశాలు అందని స్థితిలో, మొదటినుంచే మోహరించి ఉన్న అణ్వస్త్రాలు అన్నీ వెంటనే తమంతట తాము అమెరికా, యూరప్‌లలోని



తమ లక్ష్యాల వైపు క్షణాలలో దూసుకుపోతాయి. నాయకత్వాల నుంచి ఆదేశాలు ఆగిపోయాయనే సంగతి అల్ట్రా లో ఫ్రీక్వెన్సీ రేడియో తరంగాల ద్వారా తెలుస్తుంది. ఆ తరంగాలను అమెరికా సహా ఎవరూ పసిగట్టలేరు, విశ్లేషించలేరు, హైజాక్ చేయలేరు, నిరోధించలేరు. ట్రంప్‌కు మెద్వెదేవ్ ఇచ్చిన సందేశమది. అంతిమార్థం ఏమంటే, ట్రంప్ చర్యలు వినాశనానికి దారితీయవచ్చునని.

ప్రపంచం మొత్తానికీ యుద్ధమే!

అణుయుద్ధం అమెరికా, రష్యాల మధ్య అయితే తక్కిన ప్రపంచానికి సమస్య ఏమిటనే సందేహం కలగవచ్చు. 1945కూ, ఇప్పటికీ తేడాలున్నాయి. అపుడు అమెరికా ఏకైక అణుశక్తి. తర్వాత నాలుగేళ్లకు 1949లో రష్యా అణుశక్తి పరీక్షతో పరిస్థితులు మారసాగాయి. అమెరికా, రష్యాలు పరస్పరం పోటీపడి అణ్వస్త్రాల సంఖ్యను వేలకు వేలుగా పెంచటంతో పాటు అందులో కొత్త రకాలపై పరిశోధనలు నేటికీ జరుపుతున్నాయి. అందులో, మొదటి విడత విధ్వంసం, దానిని తట్టుకుని రెండవ విడత విధ్వంసం, పరస్పర విధ్వంస శక్తి, యుద్ధ విమానాలు, సముద్ర జలాల నుంచి ప్రయోగాలు (ట్రయాడ్ వ్యవస్థ) అంటూ రెచ్చి పోయారు. ఈమధ్యలో మరొక అర డజన్ అణ్వస్త్ర దేశాలు తయారయ్యాయి. అటువంటి ఆయుధాలు అర డజను ఉన్నా చాలు విధ్వంసానికి అనే వివేకం కలగటంతో అణ్వస్త్ర పరిమితి ఒప్పందాలు, వాటి మోహరింపుల పరిమితిపై ఒప్పందాలు దశలు దశలుగా జరిగాయి.

వాటిలోని లోపాలను అట్లుంచితే, ప్రపంచం కొన్ని దశాబ్దాలుగా ఇతర యుద్ధాలు ఎట్లున్నా అణ్వస్త్ర ప్రయోగాలు లేక ప్రశాంతంగా ఉంది. అందుకు కారణం పరస్పర విధ్వంస శక్తి (మ్యూచువల్లీ అష్యూర్డ్ డిస్ట్రక్షన్, లేదా మ్యాడ్) అని, ఆ విధంగా 'బ్యాలెన్స్ ఆఫ్ టెర్రర్' అనే స్థితి ఏర్పడిందని అంతా భావించారు. ఆ పరిస్థితులలోనూ గమనించదగ్గవి కొన్ని జరిగాయి. ఎవరిపైనా అణ్వస్త్ర ప్రయోగపు ఆలోచనలు రష్యా చేయలేదు గానీ, వియత్నాం, ఉత్తర కొరియా, అఫ్గానిస్తాన్‌లు కొరకరాని కొయ్యలుగా మారటంతో అమెరికా అందుకు ఏర్పాట్లు కూడా సిద్ధం చేసి మళ్లీ వెనుకకు తగ్గింది.

◆ రష్యా 'డెడ్ హ్యాండ్' వ్యవస్థ ఏమంటే, అమెరికా మొదటగా అణ్వస్త్రాలు ప్రయోగించి రష్యా నాయకత్వాన్ని తుడిచి పెడితే, రష్యా అణ్వస్త్రాలు తమంతట తాము అమెరికా, యూరప్‌లలోని లక్ష్యాల వైపు దూసుకు పోతాయి.

◆ అణుధార్మిక శక్తి వాతావరణాన్ని ఎంతకాలం కలుషితం చేస్తుందో బహుశా నిపుణులు కూడా అంచనా వేయలేరు. 80 ఏళ్ల నాటి హిరోషిమా ప్రభావాలు జపాన్‌లో నేటికీ ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

అప్రమత్తత కలిగేనా?

ఇటువంటి చరిత్ర ఉన్నందువల్లనే ఇపుడు తిరిగి అమెరికా, అందులోనూ ట్రంప్ వంటి అనాలోచితుడు, చంచలచిత్తుడు, విపరీతమైన అహంభావి ఆదేశాలతో అణుజలాంతర్గాములను ఇప్పటికే రష్యా సమీపానికి తరలించిందంటే, ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు కలగటం సహజం. అణుయుద్ధం జరిగితే అది అమెరికా, రష్యాలకు పరిమితం కాదు. అమెరికా మిత్ర దేశాలను, రష్యా మిత్ర దేశాలను అనివార్యంగా అందులోకి లాగుతాయి. భయంకరమైన స్థాయిలో వెలువడే అణుధార్మిక శక్తి ఇండియా సహా అన్ని దేశాలకూ వ్యాపిస్తుంది. దాని ప్రభావం అన్ని సముద్ర జలాలతో పాటు మొత్తం వాతావరణాన్ని ఎంతకాలంపాటు కలుషితం చేస్తుందో బహుశా నిపుణులు కూడా అంచనా వేయలేరు. 80 ఏళ్ల క్రితం నాటి హిరో షిమా ప్రభావాలు జపాన్‌లో నేటికీ ఉన్నాయి.


ఈ ప్రమాదకర పరిస్థితికి మూల కారణం, అమెరికా నాయకత్వాన 'నాటో' దేశాలు ప్రత్యక్షంగా రష్యాను, పరోక్షంగా చైనాను లొంగదీసుకోవాలని భావించటంలో ఉంది. అందుకోసం చేస్తున్న రకరకాల ప్రయత్నాలలో భాగంగా ఉక్రెయిన్‌ను ఒక పావుగా ఉపయోగించుకుంటున్నారు. అది ఒక తప్పు కాగా, ఆ యుద్ధ సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించలేకపోవటం ఒక వైఫల్యం. రష్యాను ఎన్ని ఆంక్షలు విధించినా బలహీనపరచలేకపోవటం ఇంకొక వైఫల్యం అవుతుండగా, ట్యారిఫ్‌ల పేరిట రష్యా, ఇండియా, చైనా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా వగైరాలను బెదిరించజూడటం అసమర్థ దుర్జనత్వమవుతున్నది. చివరకు అంతిమ ఆయుధంగా 50 రోజులు, 10 రోజుల గడువులు, అణు జలాంతర్గాముల స్థాయికి పతనమవుతూ యావత్ ప్రపంచాన్నే ప్రమాదంలోకి నెడుతున్నారు.

విచారకరం ఏమంటే, మన దేశంలో ఒకప్పుడు ఉన్నత స్థాయిలో ఉండిన ఈ అప్రమత్తత ఇటీవలి కాలంలో క్రమంగా తగ్గుతున్నది. వారు మళ్లీ అప్రమత్తులు కావటం 80 ఏళ్ల హిరోషిమా విషాదానికి తగిన నివాళి అవుతుంది.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

'గ్లోబల్' వ్యూహంలో భాగమైన కోస్తాంధ్ర

అభిప్రాయం



జాన్‌సన్ చోరగుడి

ప్రపంచీకరణ ప్రభావాన్ని సకాలంలో అంచనావేసి, ఆసియాలో ముందుగా దాన్ని అందిపుచ్చుకున్న చైనా... తన తదుపరి ఆర్థిక విస్తరణకు 'వన్ బెల్ట్ – వన్ రోడ్' ('ఓబీఓఆర్') విధానాన్ని చేపట్టింది. 2017 మేలో జరిగిన ఆ అధికారిక ప్రకటనకు 28 దేశాల అధిపతులు, వంద దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఆ రోజు 50కి పైగా వాణిజ్య ఒప్పందాలు అక్కడ జరిగాయి. అయితే భారత్ దీనికి హాజరు కాలేదు. మధ్య ఆసియా, యూరప్, ఇండో–పసిఫిక్ దేశాలతో–'బెల్ట్' ద్వారా, అలాగే 'రోడ్'– ద్వారా ఆగ్నేయ ఆసియా దేశాల్లోకి సముద్ర జలాల ద్వారా, రైలు మార్గాల ద్వారా చైనా ప్రవేశించింది. అయితే 'ఈ గైర్హాజరీ వల్ల మనం ఒంటరి కావడం అనే రిస్క్ (ఇదే పదం వాడారు)ను కూడా కాదనలేము' అని మన విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారి ఒకరు అన్నట్టు 'ది హిందూ' అప్పట్లో రాసింది. ఇంతకూ దీనిపై మోదీ ప్రభుత్వం అభ్యంతరం ఏమిటి?

'బెల్ట్'లో భాగంగా పాకిస్తాన్ పశ్చిమ తీరాన అరేబియా సముద్రంలో ఉన్న గ్వాదర్ పోర్టుకు 'చైనా–పాకిస్తాన్ ఎకనమిక్ కారిడార్' పేరుతో చైనా తన నిధులతో ఒక ప్రత్యేక రోడ్డును 3,217 కి.మీ. మేర నిర్మించింది. అది పాకిస్తాన్ భూభాగాన్ని తూర్పు నుంచి పడమరకు ఆసాంతం దాటి గ్వాదర్ పోర్ట్ చేరుతుంది. పాక్ దాన్ని అనుమతించింది. కానీ దానిలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ఉండడం మోదీ ప్రభుత్వం అభ్యంతరంగా భావించింది. నిజానికి అప్పుడే ఇండియా దాన్ని అవకాశంగా తీసుకుని 'రికార్డు'లో అది 'పాక్ ఆక్రమిత కశ్మీర్' అనే 'క్లాజ్'తో చైనా ప్రతిపాదనను అంగీకరించి ఉంటే ఎలా ఉండేదో! కానీ అది జరగలేదు. మన అభ్యంతరం గురించి అప్పట్లోనే – 'విస్తరిస్తున్న ఆసియా మార్కెట్‌తో కలిసి, దాని సప్లై, తయారీ, మార్కెట్ అవసరాలతో అనుసంధానం అయితేనే 2032 నాటికి ఇండియా 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యానికి చేరగలదు' అని యూఎన్‌ఓ మాజీ డైరెక్టర్ ముకుల్ సన్వల్ అన్నారు.

విశాఖ సముద్ర జలాల్లో ఏటా అక్టోబర్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌ల నౌకాదళాలతో కలిసి విన్యాసాలు చేసే స్థాయికి భారత్ చేరింది. కాకినాడ పోర్టు వద్ద అమెరికా నౌకా దళాలు మన త్రివిధ దళాలతో కలిసి విపత్తు నివారణ చర్యల రిహార్సల్ చేశాయి.

మరిప్పుడు 'గ్లోబల్ సౌత్' భావన ముందుకొచ్చి ఈ దేశాలు తమ మధ్య ఉండాల్సింది 'సౌత్–సౌత్ కో–ఆపరేషన్' అంటుంటే, మన పొరుగున ఉన్న చైనా, పాక్‌లతో ఇన్నాళ్లుగా 'ఎన్డీఏ' ప్రభుత్వం అనుసరించిన దౌత్య విధానం మాటేమిటి? ప్రస్తుతం జీ–7 దేశాల మధ్య కంటే 'బ్రిక్స్' దేశాల మధ్య వాణిజ్యం శరవేగంగా సాగుతోంది. గత 20 ఏళ్లలో బ్రెజిల్–చైనా మధ్య అది యాభై రెట్లు పెరిగితే, చైనా–ఇండియాల మధ్య కేవలం 28 రెట్లు మాత్రమే పెరిగింది. అంతే కాదు ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని నిలువరించడం లక్ష్యంగా 2007లో ఆస్ట్రేలియా, జపాన్, అమెరికా 'క్వాడ్' కూటమిగా ఏర్పడితే... అందులో ఇండియా కలిసింది.

కానీ 'ఎన్డీఏ' పాలనలో మన వేగం పెరిగి అదిప్పుడు 'మలబార్' పేరుతో విశాఖపట్టణం కేంద్రంగా మన సముద్ర జలాల్లో ఏటా అక్టోబర్‌లో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌ల నౌకాదళాలతో కలిసి విన్యాసాలు చేసే స్థాయికి చేరింది. కాకినాడ పోర్టు వద్ద ఈ ఏప్రిల్‌లో అమెరికా నౌకా దళాలు మన త్రివిధ దళాలతో కలిసి విపత్తు నివారణ చర్యల రిహార్సల్ చేశాయి. ఇవికాక ఈశాన్య రాష్ట్రాలలోని మణిపూర్ జాతుల సమస్య, వెస్ట్ బెంగాల్లోకి వలస వస్తున్న బంగ్లా దేశ్ పౌరుల ఓటర్ల సమస్య వంటివాటికి వ్యూహాత్మకంగా జాతీయ వార్తల స్థాయిలో ఏళ్ల తరబడి ఇస్తున్న ప్రచారాన్ని బట్టి, సరిహద్దు దేశాలతో మన దౌత్య సంబంధాలు ఎలా ఉండాలి అని మనం అను కుంటున్నదీ చెప్పక చెప్పే అంశాలు.

వ్యాసకర్త అభివృద్ధి– సామాజిక అంశాల వ్యాఖ్యాత

సోషల్ టాక్

మాట–మౌనం



ఎప్పుడు మాట్లాడాలి, ఎప్పుడు మౌనంగా ఉండాలి; ఎప్పుడు బలంగా నిలబడాలి, ఎప్పుడు వెనక్కి జరగాలి... జ్ఞానం అంటే ఇదే! వివేచన లోంచి జ్ఞానం ఉదయిస్తుంది.

– గౌర్ గోపాల్ దాస్, పర్సనాలిటీ కోచ్

ముందే జాగ్రత్త



మందుల వరకూ వెళ్లకూడదనుకుంటే ఆహారం పట్ల శ్రద్ధ వహించాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకోవాలి. ఔషధాలకు ఉన్నట్లే... మన అలవాట్లకూ, ఆలోచనలకూ దుష్ప్రభావాలు ఉంటాయి.

– దీపికా రాథోడ్, లైఫ్ స్టైయిల్ న్యూట్రిషనిస్ట్

స్వాగతించాలి



మహిళలు స్వతహాగా మనస్సాక్షికి కట్టుబడి ఉంటారు. అధికార, ఉద్యోగ విధుల్లోకి వారి రాకను అడ్డుకుంటే దేశానికే నష్టం.

– మీరాబాయి చాను, వెయిట్‌లిఫ్టర్

పొరపడకండి



గుండెపోటుకు గురైన వారిలో దాదాపు సగం మందికి చాలా ముందుగానే ఆ లక్షణాలు కనిపిస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. తరచూ వాటిని మనం ఎసిడిటీ, మానసిక ఒత్తిడి, లేదా అలసటగా పొరపడి నిర్లక్ష్యం చేస్తుంటాం. అది తప్పు. దేహం పంపే సంకేతాలను గమనించి అప్రమత్తం అవ్వండి.

– డా॥ రాహుల్ గుప్తా, కార్డియాలజిస్టు

కూర్చున్న కొమ్మ



అభివృద్ధి కోసం అడవుల్ని నరికేస్తున్నాం. పర్యవసానంగా ప్రతి వర్షాకాలంలో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు విలయానికి, విధ్వంసానికి గురవుతున్నాయి. అక్కడి వాళ్లను తలచుకుంటే నా గుండె బద్దలవుతోంది. ప్రకృతి ఆగ్రహిస్తే మనమెంత?

– భూమీ పెడ్నేకర్, నటి – పర్యావరణవాది

కాలానికి దీటుగా..!



కెరీర్‌లో పైపైకి ఎదగాలనుకునే వారికి నిరంతర అభ్యాసం అవసరం. నైపుణ్యాలను ఎప్పటికప్పుడు సాన పెట్టుకుంటూ ఉండాలి. కంపెనీలు ఏఐకి ప్రాధాన్యమిస్తున్న ప్రస్తుత తరుణంలో ముఖ్యంగా ఎంట్రీ లెవల్ ఉద్యోగులు పరుగులు తీసే కాలానికి సమాంతరంగా దీటైన ప్రతిభను కలిగి ఉండాలి.

– సౌందర్యా రాజేశ్, 'అవ్‌తార్' గ్రూప్ ఫౌండర్

తులనాత్మక విమర్శకుడు

ఇన్ బాక్స్

పరిశోధకుడు, విమర్శకుడు, ద్రావిడ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ కంపేరిటివ్ స్టడీస్'లో డైరెక్టర్‌గా పనిచేసిన ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ భారత కాలమానం ప్రకారం ఆగస్టు 1వ తేదీ శుక్రవారం ఉదయం క్యాలిఫోర్నియాలో ఆకస్మిక గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. ఆయన అనంతపురం జిల్లాలో 1947వ సంవత్సరంలో జన్మించారు. 'విమర్శయనగా ఒక కావ్యాన్ని విషయీకరించుకొని రాయు మరొక కావ్యమ'ను రాళ్ళపల్లి గారి నిర్వచనాన్ని ఆదర్శంగా తీసుకుని 'సమగ్ర సాహిత్య అధ్యయన విధానానికి మరో పేరే విమర్శ' అని గట్టిగా నమ్మే వారిలో గంగిశెట్టి లక్ష్మీ నారాయణ ఒకరు. అన్వయ విమర్శ కంటే, సైద్ధాంతిక విమర్శను బాగా అభిమానిస్తారు. భాషా శాస్త్రంలో లాగే వర్ణనాత్మక, చారిత్రక, తులనాత్మక విమర్శ మార్గాలను నిరూపించుకొని, నిర్దిష్ట మార్గంలో వివేచన చేయడం వల్ల, విమర్శ ఎక్కువ శాస్త్రీయ స్థాయిని పొందుతుందని వారు పేర్కొన్నారు. తెలుగు, కన్నడ సాహిత్యాలతో మొదలైన అధ్యయనం, క్రమంగా వీరిని తులనాత్మక భారతీయ సాహిత్య అధ్యయనం వైపు నడిపించింది.



ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ

తులనాత్మక సాహిత్యమంటే తులనాత్మక భారతీయ సాహిత్యమేననీ, భాషా సారస్వతాల సమన్వయమే దాని స్వరూపమనీ అందులో ఏ భాషా సాహిత్యాన్ని సరిగ్గా ఆకళింపు చేసుకోవాలనుకొన్నా తులనాత్మక భారతీయ నేపథ్యం నుంచి అధ్యయనం చేసినప్పుడే సమగ్రత సిద్ధిస్తుందనీ గట్టిగా విశ్వసిస్తూ తమ వ్యాసాలను రచించారు. జానపదీయత భారతీయ కళాధర్మాలను ఎలా బలంగా శాసిస్తున్నదో, దానిని ఆధునికతకు అనుగుణంగా పునర్నవీకరించుకోవలసిన విధానమూ, దాని ఆవశ్యకం గురించి అనేక వ్యాసాల్లో ప్రస్తావించారు. అంతటి గొప్ప సాహితీవేత్త, విమర్శకుణ్ణి తెలుగునేల కోల్పోవడం విచారకరం

– డా॥ టేకుమళ్ళ వెంకటప్పయ్య, నెల్లూరు

(ఇటీవల మరణించిన ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణకు నివాళిగా...)

డేటా పాయింట్

మహిళలే మహారాణులు

ప్రముఖ ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీ 'హిందుస్తాన్ యూనీలీవర్'కు తొలి మహిళా సీఈఓగా ప్రియా నాయర్ బాధ్యతలు చేపట్టారు. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్టయిన కంపెనీలకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా మహిళలు ఎంపిక కావడం ఇటీవలి సంవత్సరాల్లో పెరిగింది.



'గ్రాంట్ థార్న్‌టన్' విడుదల చేసిన 'ఉమన్ ఇన్ బిజినెస్– 2025' నివేదిక ప్రకారం...

సంవత్సరాల వారీగా మహిళల శాతం

సంవత్సరం	శాతం
2019-20	8.2
2020-21	8.6
2021-22	9.5
2022-23	10.1
2023-24	10.7
2024-25	11.2

భక్తుని బాధ భగవంతునిదే...

జ్యోతిర్మయం

ఒక రామ భక్తుడు తన పేదరికం పోవాలని నిరంతరం రామ నామ జపం చేశాడు. మరు జన్మలో అతడు ధనవంతుడైన గొప్ప వ్యాపారి అవుతాడు. ధనార్జనలో పడి, రామ నామ స్మరణ వదిలి పెట్టాడు. కాని, పూర్వ జన్మ పుణ్య ఫలంగా ఒక యోగి కనపడి రామ నామ జపం చేయమని చెబుతాడు. అప్పుడు ధనవంతుడు, తనకు వ్యాపారంలో క్షణం తీరిక దొరకడం లేదని అంటాడు. అప్పుడు యోగి 'నిద్ర లేచిన వెంటనే లెక్కల పుస్తకాలు చూడవు కదా! అప్పుడు రామ మంత్రాన్ని జపించు. నీకు ఎప్పుడు వీలుంటే అప్పుడే జపించు' అన్నాడు.

అప్పటి నుంచి వ్యాపారి తెల్లవారు జామున నిద్ర లేచిన వెంటనే రామ నామం భక్తితో జపించటం మొదలుపెట్టాడు. ఒకరోజు అదే సమయంలో ఆంజనేయుడు శ్రీరామునికి అభ్యంగన స్నానం చేయించటానికి ఆకాశంలో ఎగురుతూ వెళుతున్నాడు. రామ నామం వినిపిస్తుంటే పరిశీలనగా చూశాడు. స్నానం లేకుండా అపవిత్రంగా రామ నామాన్ని ఉచ్చరిస్తున్నాడని గాలిలో అతని వీపు మీద చరిచాడు. కానీ ఆ దెబ్బ వ్యాపారికి తగల్లేదు.

రాముని తలకు నూనె రాసి, వీపు మీద రాయబోతుంటే ఎర్రగా కంది ఉండటం చూసిన ఆంజనేయుడు ఏం జరిగిందని అడుగుతాడు. అందుకు రాముడు తెల్లవారుజామున తన భక్తుడు తన స్మరణ చేస్తుంటే ఎవరో అతని వీపు మీద కొట్టారనీ, తన భక్తుని బాధ తనదే కాబట్టి ఆ దెబ్బను తాను స్వీకరించానని అంటాడు. అంతేకాదు, 'అన్నివేళలా, అన్ని ప్రదేశాలలో చేయదగ్గది రామజపం. దీనికి ఎటువంటి నియమాలు, కాల పరిమితులు లేవు. వ్యక్తి అపవిత్రంగా ఉన్నా దైవ స్మరణతో పవిత్రుడవుతాడు' అన్నాడు. అంటే పూజాదికాలకు స్నాన విధులు అవసరం అవుతాయి కాని దైవ స్మరణ ఏ సమయం లోనైనా చేయవచ్చని సారాంశం. రాముని మాటలకు ఆంజనేయుడు 'ఈ క్షణం నుంచి తనకు సర్వ కాలాలు, సర్వ ప్రదేశాలు అంతా రామ మయమే' అంటాడు.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రూ.కోటి విరాళం



తిరుమల: శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు సీకేపీసీ ప్రాపర్టీస్ ఎండీ చిరాగ్ పురుషోత్తం రూ.కోటి విరాళమిచ్చారు. గురువారం రాష్ట్ర మంత్రి అనగానితో కలిసి ఆయన విరాళం డీడీని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు తిరుమలలో అందజేశారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి @SCRailwayIndia
దయచేసి రైల్వే టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడవచ్చును

ఓపెన్ ఇ-టెండరు ప్రకటన నం. B-E29-TRD-TNDR-20-2025-26, తేది: 01.08.2025 PUB/0948

దిగువ పనుల కొరకు దిగువ సంతకందారు ద్వారా IREPS లో టెండర్లు కోరబడుతున్నవి.

టెండరు నం.: B-E29-TRD-TNDR-20-2025-26. **పని వివరణ:** BZA డివిజన్‌లో OHE/PSI ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొరకు రిలయబిలిటీని పెంపొందించుట. **పూర్తిచేయు కాలము:** 12 నెలలు, **సుమారు విలువ:** రూ.2,13,50,929.40, **బయానా:** రూ.2,56,800.00, **టెండరు ఫారం ధర:** లేదు, **ముగింపు తేది:** 26.08.2025న 15.00 గం.వరకు.

NB: ఒకవేళ తెరుచు తేది సెలవు రోజు అయినచో, తదుపరి పనిరోజున టెండరు తెరువబడును. సవివర నిబంధనల కొరకు **"మా సైట్ www.ireps.gov.in దర్శించండి".**

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ TRD/ విజయవాడ

ఇ-టెండరు ప్రకటన నం.GNT/SG/ 36/343, తేది : 04.08.2025 PUB/0950

దిగువ సంతకందారు దిగువ తెలిపిన పనుల కొరకు **26.08.2025న 16.00 గం.** వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

ఐడి నం.: 344, **పనిపేరు:** గుంటూరు డివిజన్‌లో NRDP-VLG మధ్య కి.మీ. 27/3-4 వద్ద LC No.13 వద్ద మిడ్ - సెక్షన్ LC గేట్ ప్రతిపాదిత ఇంటర్‌లాకింగ్‌కు సంబంధించి సిగ్నలింగ్ ఏర్పాట్లు. **ప్రకటిత టెండరు విలువ:** రూ.63,57,588.60, **బయానా / బిడ్ సెక్యూరిటీ:** రూ.1,27,200.00, **టెండరు డాక్యుమెంట్ ధర:** లేదు.

1. ఒకవేళ టెండర్లు తెరుచు తేది సెలవు రోజుగా ప్రకటించబడితే, తదుపరి తేదీన అనగా తర్వాత పని రోజున నిర్దేశిత సమయానికి టెండర్లు తెరువబడును.

2. ఇ-బిడ్లు ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది **26.08.2025న 16.00 గం.** వరకు. సవివర సమాచారం కొరకు మా వెబ్‌సైట్ **www.ireps.gov.in** కు లాగాన్ అవ్వండి.

3. ఏదైనా తదుపరి సమాచారం/ సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా మాత్రమే తెలియజేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజినీర్/ గుంటూరు

ఇ-టెండరు ప్రకటన నం. 470/DRM/W/GNT PUB/0951

దిగువ సంతకందారు దిగువ తెలిపిన పనుల కొరకు **04.09.2025న 15.30 గం.**వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం. 1, టెండరు ఐడి: 2804, **Sr.DEM/ DEM:** Co-ord, **పని వివరణ:** గుంటూరు డివిజన్ - 5 సంవత్సరాల కాలానికి ఏజెన్సీ (RDSO ఆమోదిత సంస్థ మాత్రమే) ద్వారా కర్వ్‌లు-164 నం.లు (ఎలక్ట్రానిక్ టైప్) పై ట్రాక్ మౌంటెడ్ ఆటోమేటిక్ గేజ్ ఫేస్ లూబ్రికేటర్స్ సరఫరా, స్థాపన, పనిచేయించుట మరియు నిర్వహణ. **సుమారు విలువ :** రూ.22,41,85,442.00, **బిడ్ సెక్యూరిటీ :** రూ.12,70,900.00

1. ఇ-బిడ్లు ఆన్‌లైన్ దాఖలుకు చివరి తేది : **04.09.2025న 15.30 గం.వరకు.** సవివర సమాచారం కొరకు వెబ్‌సైట్ : **www.ireps.gov.in** కు లాగాన్ కావలెను.

2. ఏదైనా తదుపరి సమాచారం/సవరణ ఇ-పోర్టల్ **www.ireps.gov.in** ద్వారా తెలియజేయబడుతుంది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్)/ గుంటూరు

టెండరు ప్రకటన నం. 09-CWMLGDS-ET-2025-26, తేది: 05.08.2025 PUB/0955

భారత రాష్ట్రపతి తరఫున వ్యవహరిస్తున్న **CWM/LGDS** వారు టెండరు నం. **09-CWMLGDS-ET-2025-26** నిమిత్తం ఇ-టెండర్లు కోరుచున్నారు. **ముగింపు తేది 28.08.2025న 11.00 గం.వరకు.** బిడ్డర్లు తమ ఒరిజినల్/ రివైజ్డ్ బిడ్లను ముగింపు తేది మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలరు. ఈ టెండరు నిమిత్తం మాన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అలా అందిన ఏదైనా మాన్యువల్ ఆఫరు తిరస్కరించబడుతుంది. కాంట్రాక్టర్లు ఈ టెండరుపై టెండరు డాక్యుమెంటు ధర మరియు బయానా నిమిత్తం చేసే చెల్లింపులు నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొ.గు వంటి IREPS పోర్టల్‌లో లభించే **ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే** చేసేందుకు అనుమతించబడినారు. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, డిపాజిట్ రిసీట్స్, FDR మొ.వాటి ద్వారా చేసే మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

క్ర.సం.1, టెండరు నం. 09-CWMLGDS-ET-2025-26, **తేది:** 05.08.2025, **పని వివరణ:** క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్ వద్ద స్క్రాపింగ్, క్లీనింగ్ మరియు అండర్‌ఫ్రేమ్ పెయింటింగ్ మరియు కోచ్‌ల ఇంటీరియర్ పెయింటింగ్ **సుమారు వ్యయం:** రూ.1,79,65,465.73 (ఒక కోటి డెబ్బై తొమ్మిది లక్షల అరవై ఐదు వేల నాలుగు వందల అరవై ఐదు రూపాయల డెబ్బై మూడు పైసలు మాత్రమే), **బయానా:** రూ.2,39,800.00 (రెండు లక్షల ముప్పై తొమ్మిది వేల ఎనిమిది వందల రూపాయలు మాత్రమే), **పూర్తిచేయు కాలం:** 24 నెలలు, **ముగింపు తేది:** 28.08.2025న 11.00 గం. వరకు.

టెండరు పూర్తి వివరాలు చూసేందుకు నోటీస్ బోర్డ్ ఉన్న ప్రదేశం: **చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్ కార్యాలయం, క్యారేజ్ వర్క్‌షాప్, లాలాగూడ, సికింద్రాబాద్ -500017.**

తదుపరి వివరాలు కొరకు మా వెబ్‌సైట్ **www.ireps.gov.in** దర్శించండి.

చీఫ్ వర్క్‌షాప్ మేనేజర్/ CWS/ LGD/ సికింద్రాబాద్
A1171

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం దర్శించండి వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులపై ఉక్కుపాదం

సమస్యల పరిష్కారాన్ని కోరుతూ.. ఛలో విద్యుత్‌సౌధ

అడ్డుకుని అరెస్ట్ చేయించిన కూటమి ప్రభుత్వం

విజయవాడలో ఉద్రిక్తత



విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను అరెస్ట్ చేసి పోలీస్ వాహనంలో తీసుకువెళుతున్న దృశ్యం

సాక్షి, అమరావతి/గుణదల (విజయవాడ తూర్పు): విద్యుత్ కాంట్రాక్టు కార్మికులపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ జెన్‌కో ప్రధాన కార్యాలయాల ముట్టడికి ఛలో విద్యుత్‌సౌధ కార్యక్రమాన్ని చేపట్టిన కార్మికుల్ని నిరంకుశంగా అడ్డుకుని అణచివేసింది. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (యూఈసీడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో శాంతియుతంగా చేపట్టిన ఈ ఆందోళనలో పాల్గొనేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి కార్మికులు, నాయకులు గురువారం విజయవాడ తరలివచ్చారు. కార్మికుల ఆందోళనను అడ్డుకునేందుకు పోలీసులు ఉదయం 8 గంటల నుంచే అత్యుత్సాహంగా వ్యవహరించారు. రామవరప్పాడు రింగ్, విద్యుత్‌సౌధ, గుణదల వంతెన, గుణదల సెంటర్ నుంచి పడవలరేవు వరకు తనిఖీలు చేపట్టారు. కార్మికులను, నాయకులను మార్గంమధ్యలోనే అడ్డుకుని అక్రమంగా అరెస్టు చేసి సమీపంలోని పోలీస్ స్టేషన్లకు తరలించారు. 200 మందికిపైగా కార్మికులను అరెస్టు చేసి బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి తీసుకెళ్లి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. ఈ నేపథ్యంలో విజయవాడ గుణదలలోని విద్యుత్‌సౌధ వద్ద ఉద్రిక్తత నెలకొంది.

ప్రభుత్వాలు మారుతున్నా మా గతి మారదా?

విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, పంపిణీ సంస్థ (డిస్కం)ల్లో సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల్ని క్రమబద్ధీకరించాలని (రెగ్యులరైజ్), తెలంగాణ తరహాలో సంస్థలో విలీనం చేసి వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, వేతన వ్యత్యాసాలు లేకుండా సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని అడుగుతున్నారు. రూ.కోటి బీమా సౌకర్యం కల్పించాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, పీస్ రేట్ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని అభ్యర్థిస్తున్నారు. చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ రూ.10 లక్షలు చెల్లించాలని.. తదితర సమస్యలపై తరబడి వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నారు. తమ సమస్యల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఛలో విద్యుత్‌సౌధకు కార్మిక, ఉద్యోగసంఘాలు పిలుపునిచ్చాయి. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అక్రమంగా కార్మికుల్ని, నాయకుల్ని అరెస్టు చేసి, నిర్బంధించటం, ఉక్కుపాదం మోపడం అన్యాయమని యూఈసీడబ్ల్యూయూ రాష్ట్ర అధ్యక్షుడు జల్లెడ రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు విద్యుత్‌సౌధ ఆవరణలోని ఏపీ ట్రాన్స్‌కో అడిషనల్ సెక్రెటరీ పెద్ది రోజాకు తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. తక్షణమే కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, లేదంటే ఈ పోరాటం మరింత తీవ్రతరమవుతుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ నాయకులు డి.సూరిబాబు, బి.సుమన్, ఎస్.విజయరావు, ఎ.వి.నాగేశ్వరరావు, ముజఫర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ విద్యుత్ సౌధ వద్ద గురువారం ఆందోళన చేపట్టిన కార్మికులు, నాయకులను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ఖండించారు.

జస్టిస్ రమణకు తెలుగు వైభవ పురస్కారం



మాట్లాడుతున్న బుద్ధప్రసాద్

అవనిగడ్డ: సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారాన్ని ఈ నెల 9న ప్రదానం చేయనున్నట్లు అవనిగడ్డ జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. గురువారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఆయన మీడియాతో మాట్లాడారు. వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ కార్యక్రమంలో జస్టిస్ ఎన్వీ రమణకు అవార్డు ప్రదానం చేసి బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

క్యూలో వేచి ఉండకుండా శ్రీవాణి టోకెన్ల జారీ



తిరుమల: తిరుమల శ్రీవారిని శ్రీవాణి పథకం ద్వారా దర్శించుకునే భక్తులకు సీరియల్ విధానంలో టీటీడీ గురువారం టోకెన్లను నూతనంగా జారీ చేసింది. ఇకపై తెల్లవారుజాము నుంచి క్యూలైన్లో వచ్చిన ప్రతి భక్తుడి ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని దానిపై సీరియల్ నంబర్ స్టాంప్ వేసి..అదే నంబర్‌తో కూడిన ప్లాస్టిక్ టోకెన్‌ను అధికారులు ఇస్తారు. భక్తుడు ఉదయం 10 తర్వాత క్యూలైన్ వద్దకు వచ్చి తనకు ఇచ్చిన టోకెన్ సంఖ్య ఆధారంగా శ్రీవాణి టికెట్లను పొందవచ్చు. అందరూ ఒకే పర్యాయం రావాల్సిన అవసరం లేదు. ఎందుకంటే..తెల్లవారుజామున ముందు వచ్చిన వారికే ప్లాస్టిక్ టోకెన్లు జారీ చేయడంతో భక్తులు దర్శనానికి వెళ్లే లోపు శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రానికి వచ్చి టోకెన్ నంబర్ ఆధారంగా టికెట్లను కొనుగోలు చేసి నేరుగా దర్శనానికి వెళ్లవచ్చు. దీంతో క్యూలైన్లో వేచి ఉండే భక్తుల సంఖ్య తగ్గుతుంది. దీంతో టికెట్ల జారీ కేంద్రంలో కొద్దిమందే ఉంటారు.

ICAR-NATIONAL INSTITUTE FOR RESEARCH ON COMMERCIAL AGRICULTURE
(Formerly ICAR-CENTRAL TOBACCO RESEARCH INSTITUTE)
RAJAHMUNDRY - 533 105, A.P., INDIA
ISO 9001: 2015 CERTIFIED INSTITUTE
website: https://nirca.org.in

No.F.1(1)(SRF/YP-II&I/PA) (AINPT/AKMU/Audit/KVK)/2025-26/Adm.I Date: 07.08.2025

WALK-IN-INTERVIEW

Applications are invited for the positions of **'Senior Research Fellow'**, **'Young Professionals-II & I'** and **'Project Assistant'** at ICAR-NIRCA (CTRI), Rajahmundry, its Research Station-Guntur & KVK-Kalavacharla on contractual & co-terminus basis. For detailed notification please visit our ICAR-NIRCA website **https://nirca.org.in.**
The Last Date for receiving of applications is 18th August, 2025.

- KULDEEP PATIDAR, ADMINISTRATIVE OFFICER

జస్టిస్ (రిటైర్డ్) R.M. లోధా కమిటీ
(PACL లిమిటెడ్ విషయంలో)

బహిరంగ ప్రకటన

హర్యానా(పానిపట్, పంచకుల), ఆంధ్రప్రదేశ్ (గుంటూరు, కడప మరియు కృష్ణా), కర్ణాటక (చామరాజ్‌నగర్ మరియు దక్షిణ కన్నడ), కేరళ (ఎర్నాకులం)లోని PACL లిమిటెడ్ యొక్క ఆస్తుల ఇ-వేలం

1) PACL లిమిటెడ్ ద్వారా కొనుగోలు చేయబడిన భూమిని విక్రయించుట కొరకు, సంబంధిత విషయాలతో సుబ్రత భట్టాచార్య Vs.SEBI మరియు ఇతరులు అనే టైటిల్ కలిగిన సివిల్ అప్పీల్ నం. 13301/2015లో గౌరవనీయ భారత సర్వోన్నత న్యాయస్థానం ద్వారా జారీ చేయబడిన తేది: 02 ఫిబ్రవరి 2016 గల ఉత్తర్వు క్రింద మరియు ద్వారా జస్టిస్ (రిటైర్డ్) R.M. లోధా కమిటీ (PACL లిమిటెడ్ విషయంలో) ఏర్పాటు చేయబడినది. తద్వారా అమ్మకం మొత్తాలను దాని ఇన్వెస్టర్లకు చెల్లించేందుకు, పైన తెలిపిన విషయంలో గౌరవనీయ భారత సర్వోన్నత న్యాయస్థానం ద్వారా జారీ చేయబడిన తేది 08 ఆగస్టు, 2024 గల ఉత్తర్వును పాటిస్తూ 4 రాష్ట్రాలలోని 8 జిల్లా(ల)లో గల ఆస్తుల ఇ-వేలం నిర్వహించుటకు నిర్ణయించినది మరియు తదుపరిగా ప్రతిపాదనల కొరకు అభ్యర్థన (RFP) జారీ చేసినది. వాటిని https://www.sebi.gov.in/notice-for-eoi-proposals.html, https://www.bankeauctions.com, www.bankeauctionwizard.com లో చూడవచ్చును.

2) ఆస్తి డాక్యుమెంట్లను https://sebipaclproperties.com, https://www.bankeauctions.com, www.bankeauctionwizard.com లో చూడవచ్చును.

3) ఇ-వేలంలో పాల్గొనుట కొరకు వివరాలు RFPలో లభించును. RFP యొక్క ముఖ్యమైన తేదీలు దిగువ విధంగా ఉన్నాయి :

- **RFP ప్రచురణ తేది** - **8 ఆగస్టు, 2025**
- **బిడ్ల దాఖలు ప్రారంభ తేది** - **8 ఆగస్టు, 2025**
- **విచారణల దాఖలుకు చివరి తేది** - **22 ఆగస్టు, 2025**
- **బిడ్ గడువు తేది మరియు సమయం** - **12 సెప్టెంబర్, 2025, సా.4.00గం.**
- **ఇ-వేలం ప్రారంభ తేది** - **29 సెప్టెంబర్, 2025, ఉ.11.00గం.కు.**

వర్తించే నిబంధనలు :

➢ అన్ని ఆస్తులు "ఎక్కడ ఎలా ఉన్నవి అక్కడ అలా, అక్కడ ఏమున్నదో అదే" ప్రాతిపదికన విక్రయించబడతాయి మరియు కొనుగోలుదారు వాటికి సంబంధించిన అన్ని క్లెయిమ్‌లు, రుణాలు మరియు/లేదా తాకట్టు రుణభారాలకు బాధ్యత వహించాలి.

➢ ఈ నోటీసులో మరియు ఈ టెండరు డాక్యుమెంట్ క్రింద RFPలో పేర్కొన్న విధంగా ఆస్తుల వివరాలు విక్రయదారుకు లభించిన వివరాల ప్రకారం ఉన్నాయి. ఏ కారణంగానైనా ఆస్తుల విస్తీర్ణంలో ఏవైనా తేడాల కొరకు విక్రయదారు లేదా ఏజెన్సీ ఏ విధంగాను బాధ్యత వహించరు.

➢ ఆస్తులు/వాటి టైటిల్ డీడ్స్‌లో ఏదైనా వ్యత్యాసం కొరకు కమిటీ ఏవిధంగాను బాధ్యత వహించదు మరియు ఆస్తుల టైటిల్‌కు సంబంధించి తమ స్వంత స్వతంత్ర తగిన జాగ్రత వహించిన తరువాత మాత్రమే తమ బిడ్లను దాఖలు చేయవలసిందిగా బిడ్డర్లను కోరడమైనది.

CBC - 15204/11/0144/2526

అప్పుల బాధతో యువ కౌలు రైతు ఆత్మహత్య



మృతుడు నాగార్జున

ప్రత్తిపాడు: అప్పుల బాధ తాళలేక ఓ యువ కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులు తెలిపిన వివరాలు.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం కోయవారిపాలేనికి చెందిన ముప్పాళ్ల నాగార్జున (38) కౌలు రైతు. ఏటా పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తుంటాడు. గతేడాది 22 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. మిర్చి 10 ఎకరాల్లో, పొగాకు 4 ఎకరాల్లో, పత్తి పంట 8 ఎకరాల్లో సాగు చేశాడు. దిగుబడులు సరిగా రాకపోవడం, వచ్చిన దిగుబడులకు సైతం గిట్టుబాటు ధర లేకపోవడంతో రూ.పాతిక లక్షల వరకూ అప్పులపాలయ్యాడు. అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపానికి లోనై గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ నరహరి కేసు నమోదు చేశారు.

పేదల ఇళ్లు కూల్చివేత




జేసీబీలతో ఇళ్లను కూల్చివేయిస్తున్న దృశ్యం

రేణిగుంట: తిరుపతి జిల్లా, రేణిగుంట మండలం, జీపాళెం పంచాయతీలోని పద్మానగర్‌లో గత ప్రభుత్వంలో నిర్మించుకున్న 77 ఇళ్లను గురువారం రేణిగుంట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా కూలగొట్టారు. నివాసం లేని తమకు గత ప్రభుత్వం ఇంటి స్థలాలను కేటాయించిందని, అప్పు చేసి రేకుల ఇళ్లు నిర్మించుకున్నామని బాధితులు తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కక్ష గట్టి ఇళ్లను కూల్చివేసినట్టు ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడి

కలసపాడు: వైఎస్సార్ కడప జిల్లా కలసపాడు మండలంలోని గంగాయపల్లె గ్రామానికి చెందిన చిన్నారి (4)పై అదే గ్రామానికి చెందిన బాలుడు(17) లైంగిక దాడి చేశాడు. గురువారం అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఇంటికి వెళుతున్న చిన్నారిని బాలుడు తన ఇంటికి పిలుచుకెళ్లాడు. చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఏడుచుకుంటూ తల్లిదండ్రులకు జరిగిన విషయం తెలిపింది. వెంటనే తల్లిదండ్రులు ఈ ఘటనపై కలసపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. చిన్నారి పోరుమామిళ్ల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.





రైతుల ప్రయోజనాలపై రాజీపడం

సాగు, మత్స్య, పాడి పరిశ్రమలను కాపాడుకుంటాం

- అవసరమైతే భారీ మూల్యం చెల్లించడానికైనా సిద్ధం
- తేల్చిచెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ
- డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను పరోక్షంగా తిప్పికొట్టిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గట్టిగా తిప్పికొట్టారు. తమ రైతన్నల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. మత్స్య, పాడి పరిశ్రమలను ఎట్టిపరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని ఉద్ఘాటించారు. దేశీయంగా వ్యవసాయ, పాడి రంగాలకు నష్టం చేకూర్చే నిర్ణయాలేవీ తీసుకోవడం లేదని స్పష్టంచేశారు. ఇతర దేశాల ఒత్తిళ్లకు తలొగ్గబోమని, తమపై టారిఫ్ బెదిరింపులు పనిచేయబోవని పరోక్షంగా వెల్లడించారు. అవసరమైతే వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్ శత జయంతి సందర్భంగా గురువారం ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. అన్నదాతలతోపాటు మత్స్యకారులు, పాడి రైతులు, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు, సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. వారికి మేలు చేసే విషయంలో వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని తనకు తెలుసని, అందుకు సిద్ధంగానే ఉన్నానని వివరించారు. మన వాళ్ల బాగుకోసం ఎంత దూరమైనా వెళ్లడానికి దేశం సర్వసన్నద్ధంగా ఉందన్నారు. ఎం.ఎస్.స్వామినాథన్ స్మారక నాణెం, తపాలా బిళ్లను ప్రధాని మోదీ విడుదల చేశారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే...

పౌష్టికాహార భద్రత సాధించాలి

''దేశంలో వ్యవసాయ రంగ పురోభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. పౌష్టికాహార భద్రత సాధించడం అత్యవసరం. ఆధునిక అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యంపై దృష్టి పెట్టాలి. వాతావరణ మార్పులను తట్టుకొనే వంగడాలను అభివృద్ధి చేయాలి. సాగులో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంచాలి. కరువులు, అధిక ఉష్ణోగ్రతలు, వరదలను తట్టుకొని అధిక ఉత్పాదకత ఇచ్చే వంగడాలను కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లెర్నింగ్‌తో రూపొందించాలి. పంటల ఉత్పత్తిని ముందుగానే అంచనా వేయడానికి, తెగుళ్లను గుర్తించడానికి, రైతులకు సలహాలు సూచనలు ఇవ్వడానికి రియల్-టైమ్ వ్యవస్థలను ప్రతి జిల్లాలో అందుబాటులోకి తీసుకురావాలి. పంటల మార్పిడిపై పరిశోధనలు మరింత ఊపందుకోవాలి. ఏ నేలలో ఎలాంటి పంటలు సాగు చేయాలో గుర్తించాలి. మట్టి పరీక్షల కోసం చౌక ధరల్లో దొరికే పరికరాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది'' అని మోదీ అన్నారు.

ప్రధాని మోదీ



పథకాలతో అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం

''దేశ ప్రగతికి పునాది రైతుల ప్రగతే. రైతన్నల కోసం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నాం. పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, పీఎం కృషి సించాయ్ యోజన, పీఎం కిసాన్ సంపద యోజన, పీఎం ధన్ ధాన్య యోజన వంటివాటిని వ్యవసాయం, అనుబంధాల రంగాల సమగ్రాభివృద్ధి కోసమే తీసుకొచ్చాం. 10 వేల రైతు ఉత్పత్తి సంస్థలు ఏర్పాటు చేశాం. ఆయా పథకాలతో కేవలం ఆర్థిక తోడ్పాటే కాకుండా, రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. పంటల ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి, రైతుల ఆదాయం పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. వారి కోసం నూతన ఆదాయ మార్గాలు సృష్టిస్తున్నాం. సహకార సంఘాలకు, స్వయం సహాయక గ్రూప్‌లకు ఆర్థిక మద్దతు లభిస్తోంది. దాంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలం పుంజుకుంటోంది. పంటల ఉత్పత్తిని పెంచుకోవడంతోపాటు అదే సమయంలో పర్యావరణాన్ని, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎం.ఎస్.స్వామినాథన్ పదేపదే సూచించారు. ఆయన నిర్దేశించిన బాటలో మనం నడవాలి'' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, నీతి ఆయోగ్ సభ్యుడు రమేశ్ చంద్, ఎం.ఎస్.స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ సౌమ్య స్వామినాథన్ పాల్గొన్నారు.

మోదీ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. దేశంలో చేనేత రంగం ప్రగతి పథంలో సాగుతోందని పేర్కొన్నారు. 2,600 ఎగ్జిబిషన్ల ద్వారా 43 లక్షల మంది చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులకు నేరుగా మార్కెట్ సౌలభ్యం లభించిందని, రూ.1,700 కోట్లకుపైగా అమ్మకాలు జరిగాయని వెల్లడించారు. 20కిపైగా దేశాలకు మన చేనేత ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని, వాటి విలువ రూ.21,000 కోట్లకు చేరిందని హర్షం వ్యక్తంచేశారు. మన సంప్రదాయ చేనేత కళ, వైభవం అంతర్జాతీయ స్థాయికి చేరిందన్నారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక బాధ్యత ప్రధాని మోదీదే

- ఎన్డీఏ పక్షాల సమావేశం ఏకగ్రీవ నిర్ణయం
- 12న అభ్యర్థిత్వంపై స్పష్టత వచ్చే అవకాశం

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక బాధ్యతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ చీఫ్ జేపీ నడ్డాలకు అప్పగిస్తూ ఎన్డీఏ కూటమి నిర్ణయం తీసుకుంది. గురువారం పార్లమెంట్ భవన సముదాయంలో జరిగిన బీజేపీ, మిత్ర పక్షాల నేతల భేటీలో ఈ మేరకు ఏకగ్రీవంగా నిర్ణయించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అమిత్ షా, జేపీ నడ్డాలతోపాటు జేడీయూ నుంచి లలన్ సింగ్, శివసేన నుంచి శ్రీకాంత్ షిండే, టీడీపీ నుంచి ఎల్. దేవరాయలు, ఎల్‌జేపీ నుంచి చిరాగ్ పాశ్వాన్, ఇంకా అనుప్రియా పటేల్, ఉపేంద్ర కుష్వాహా, ఏఐఏడీఎంకే తదితర ఇతర చిన్న పార్టీల నేతలు సైతం పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎవరిని బలపర్చాలనే అంశంపై ఎలాంటి చర్చా జరగలేదని తెలిపారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిత్వంపై ఈ నెల 12వ తేదీన స్పష్టత వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఎన్డీఏ పక్షాల మధ్య సమన్వయం కొనసాగింపుపై ఈ సమావేశం చర్చించిందన్నారు.

విచ్చలవిడిగా ఓట్ల చౌర్యం

- బీజేపీతో చేతులు కలిపిన ఎన్నికల సంఘం
- లోక్‌సభ ఎన్నికల్లో నేరపూరిత మోసానికి పాల్పడ్డారు
- రాహుల్ గాంధీ ధ్వజం

సాక్షి న్యూఢిల్లీ/బెంగళూరు: ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు. ఎన్నికల సంఘం బీజేపీతో చేతులు కలిపి, దేశంలో ఎన్నికలను ప్రభావితం చేస్తోందని మండిపడ్డారు. ఓటర్ల జాబితాల్లో విచ్చలవిడిగా నకిలీ ఓటర్లను చేరుస్తోందని ఆరోపించారు. బీజేపీకి మేలు చేయడమే లక్ష్యంగా ఎన్నికల సంఘం పని చేస్తోందని విమర్శించారు. రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలో ఇందిరా భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని పునరుద్ఘాటించారు. దీనిపై తమ సొంత పరిశోధన వివరాలను బయటపెట్టారు. కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల్లో తమకు 16 సీట్లు వస్తాయని సొంత సర్వేలో తేలిందని, చివరకు 9 సీట్లే వచ్చాయన్నారు. అనూహ్యంగా ఓటమి పాలైన బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామన్నారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని మహాదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో అంతర్గత పరిశోధన నిర్వహించినట్లు తెలిపారు. మహాదేవపురలో 6.5 లక్షల ఓట్లు ఉండగా, ఇందులో లక్షకుపైగా ఓట్లు దొంగ ఓట్లేనని తేలినట్లు రాహుల్ స్పష్టంచేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బెంగళూరు సెంట్రల్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ అలీఖాన్‌పై బీజేపీ అభ్యర్థి 32,707 ఓట్ల మెజార్టీతో గెలిచారు. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, అందులో ఆరింటిలో కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చిందని, మహాదేవపురలో మాత్రం రాలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు 1,15,586 ఓట్లు, బీజేపీకి 2,29,632 ఓట్లు వచ్చాయని చెప్పారు. ఇక్కడొచ్చిన 1,14,046 ఓట్ల మెజార్టీ బెంగళూరు సెంట్రల్ స్థానంలో బీజేపీ విజయానికి దోహదపడిందన్నారు. వాస్తవానికి మహాదేవపురలో 1,00,250 నకిలీ ఓటర్లను ఓటర్ల జాబితాలో చేర్చారని చెప్పారు. ఇందులో 11,965 మంది డూప్లికేట్ ఓటర్లు, ఫేక్ లేదా చెల్లుబాటుకాని చిరునామాతో 40,009 మంది ఓటర్లు, బల్క్ లేదా ఒకే చిరునామా కలిగిన ఓటర్లు 10,452 మంది, నకిలీ ఫొటోతో 4,132 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. మరో 33,692 మంది ఫామ్-6ని దుర్వినియోగం చేసి తొలిసారిగా ఓటర్లయ్యారు.

నా మాటలే ప్రమాణంగా తీసుకోండి

''లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఎన్నికల సంఘాన్ని అడ్డంపెట్టుకొని నేరపూరిత మోసానికి పాల్పడింది. ఇది భారత రాజ్యాంగానికి, జాతీయ జెండాకు వ్యతిరేకంగా జరిగిన నేరమే. ఈ విషయంలో న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోవాలి. నేను చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని ఎన్నికల సంఘం అడుగుతోంది. సంతకం చేసిన డిక్లరేషన్ ఇవ్వాలంటోంది. ఒక రాజకీయ నాయకుడిగా ప్రజల సమక్షంలో బహిరంగంగానే మాట్లాడుతున్నా. నా మాటల్నే ప్రమాణంగా తీసుకోండి.

అక్రమాలకు పాల్పడినవారిపై చర్యలు

కేవలం ఒక అసెంబ్లీ స్థానంలో లక్షకు పైగా నకిలీ ఓటర్లను చేర్చారంటే దేశవ్యాప్తంగా పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఎన్నికల వ్యవస్థనే చోరీ చేస్తున్నారు. ఈ నేరంలో సీసీటీవీ ఫుటేజీ, ఓటర్ల జాబితాలే సాక్ష్యాలు. కానీ, వాటిని ఎన్నికల సంఘం నాశనం చేస్తోంది. ఎన్నికల నేరాల్లో భాగస్వాములైన ప్రతి ఒక్క అధికారి తదుపరి పరిణామాలు ఎదుర్కోక తప్పదు. ఇప్పుడున్న ప్రతిపక్షం ఏదో ఒక రోజు అధికారంలోకి వస్తుంది. అప్పుడే మేము ఏం చేస్తామో మీరే చూస్తారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగింది. నరేంద్ర మోదీ 25 లోక్‌సభ సీట్లు చోరీ చేసి మళ్లీ ప్రధానమంత్రి అయ్యారు. గత ఎన్నికల్లో బీజేపీ 25 స్థానాల్లో 33 వేల కంటే తక్కువ మెజార్టీతోనే గెలిచింది. మన ఎన్నికలపై ప్రజల్లో ఎన్నో సందేహాలు ఉన్నాయి. ప్రజా వ్యతిరేకత అనేది ప్రతి రాజకీయ పార్టీ ఎదుర్కొనే సవాలే. కానీ, బీజేపీకి ఈ సవాలు ఎదురుకావడం లేదు. ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్ కంటే భిన్నమైన ఫలితాలు వస్తుండడం చూస్తున్నాం. అంచనాలు తప్పుతున్నాయి. దీనివెనుక ఉన్న మర్మం ఏమిటి? ఎన్నికల్లో ఇప్పుడు 'కొరియోగ్రఫీ' జరుగుతోంది అని రాహుల్ గాంధీ విమర్శించారు.



రాహుల్ గాంధీ

ప్రమాణం చేయగలరా?

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు • రాహుల్ గాంధీకి ఎన్నికల సంఘం హితవు

న్యూఢిల్లీ: దేశంలో ఎన్నికల చౌర్యం జరుగుతోందంటూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని, నకిలీ ఓటర్లను చేర్చారంటూ చేసిన విమర్శలను ఖండించింది. 'మీరు చెప్పింది నిజమని ప్రమాణం చేయగలరా?' అని రాహుల్‌కు సవాల్ విసిరింది. నిజమే అయితే రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్‌లోని రూల్ 20(3)(బి) ప్రకారం ప్రమాణంపై సంతకం చేయాలని పేర్కొంది. నిజం కాదని భావిస్తే తప్పుడు ఆరోపణలు చేయడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. ఈ మేరకు ఎన్నికల సంఘం గురువారం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఎన్నికల్లో నిజంగా అక్రమాలు జరిగితే.. సంబంధిత సాక్ష్యాధారాలపై సంతకం చేసి తమకు సమర్పించాలని ఎన్నికల సంఘం వర్గాలు రాహుల్‌కు సూచించాయి. లేకపోతే ఆధారాల్లేని ఆరోపణలకు దూరంగా ఉండాలని పేర్కొన్నాయి.

రాజ్యాంగంపై కాంగ్రెస్ దాడి

ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలను బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ గురువారం ఖండించారు. భారత ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అతిపెద్ద కుట్రకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల సంఘంపై దాడి చేస్తోందని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో బీజేపీ విజయం ఒక మోసం అని రాహుల్ చెప్పడం ప్రజాతీర్పును అవహేళన చేయడమే అవుతుందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించిన ప్రజలపై కక్ష తీర్చుకోవాలన్నదే రాహుల్ లక్ష్యంగా కనిపిస్తోందని ఆక్షేపించారు. ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న వ్యక్తి బాధ్యతారహితంగా, నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని రాహుల్‌పై రవిశంకర్ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్నికల సంఘంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుపట్టారు.

ప్రధాని మోదీకి బ్రెజిల్ అధ్యక్షుడి ఫోన్

న్యూఢిల్లీ: ట్రంప్ దురహంకారాగ్రహానికి గురై 50 శాతం టారిఫ్ భారాన్ని మోస్తున్న భారత్, బ్రెజిల్ దేశాల అగ్రనేతలు గురువారం ఫోన్‌లో సంభాషించుకున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ లూలా డసిల్వా భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఫోన్‌చేసి పలుఅంశాలపై చర్చించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చిన గురువారం రోజే ఇరు దేశాధినేతలు మాట్లాడుకోవడం గమనార్హం. వాణిజ్యం, సాంకేతికత, ఇంధనం, రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, సాంస్కృతిక సంబంధాల అంశాలపై ఇరు దేశాధినేతలు చర్చించుకున్నారని ప్రధాని కార్యాలయం తర్వాత ఒక ప్రకటనలో పేర్కొంది. అయితే అమెరికా విధించిన 50 శాతం టారిఫ్ మీదనే ప్రధానంగా ఇరునేతలు చర్చించుకున్నారని తెలుస్తోంది. ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలూ చర్చకు వచ్చాయి.

సాక్షిప్లస్ జాతీయం పేజీలో..

- ఉపరాష్ట్రపతి ఎన్నిక నోటిఫికేషన్ విడుదల
- వచ్చే వారంలో ట్రంప్‌తో పుతిన్ భేటీ
- ఎస్ఐఆర్‌పై ఆగని ఆందోళన

మూడు దేశాలు ఒక్కటైతే..!

- ట్రంప్ టారిఫ్ వార్‌ను ఎదుర్కొనేందుకు జట్టు కట్టనున్న రష్యా, భారత్, చైనా ?
- అందుకు అనుగుణంగా మారుతున్న పరిణామాలు
- ఇప్పటికే రష్యాలో పర్యటిస్తున్న భారత జాతీయ భద్రతా సలహాదారు
- త్వరలో విదేశాంగ మంత్రి జైశంకర్ రష్యా పర్యటన
- వచ్చే నెలలో చైనాలో మోదీ పర్యటన

అగ్రరాజ్యమన్న దురహంకారం, ఆధిపత్యధోరణితో ట్రంప్ టారిఫ్‌ల బాంబులు విసిరితే బాధిత దేశాలు జట్టుకట్టి పోరుసల్పే ప్రయత్నాలు మొదలెట్టాయా? అంటే తాజా అంతర్జాతీయ పరిణామాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. వినిమయ ప్రపంచంగా పేరొందిన అమెరికాకు అన్ని దేశాల వస్తూత్పత్తులు పోటెత్తుతాయి. చాలా దేశాల ఖజానా నిండటానికి అమెరికా కొనుగోళ్లే కారణం. దీనిని అలుసుగా తీసుకుని, ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని కారణంగా చూపి తమతో వాణిజ్యంచేసే దేశాలపై ట్రంప్ టారిఫ్‌ల గుదిబండలు పడేస్తుండటంతో ఆయా దేశాల్లో ఆగ్రహజ్వాలలు పెల్లుబికాయి. భారత్, చైనా వంటి దేశాలు అంతటితో ఆగకుండా రష్యాతో జట్టుకట్టి అగ్రరాజ్య దుందుడుకు చర్యలకు ముకుతాడు వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తాజా పరిణామాలు ఈ వాదనలకు బలం చేకూరుస్తున్నాయి. ఇప్పటికే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ రష్యాలో పర్యటిస్తున్నారు. రష్యా జాతీయ భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగుతో గురువారం ఎన్ఎస్ఏ దోవల్ సమావేశమయ్యారు. ఇంధన, రక్షణ రంగంలో ద్వైపాక్షిక సహకారంపై చర్చలు జరిపానని దోవల్ చెబుతున్నప్పటికీ వాస్తవానికి ట్రంప్‌ను ఎలా నిలువరించాలనే దానిపైనే ప్రధానంగా చర్చ జరిగిందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ట్రంప్ దూకుడుకు ఎలా కళ్లెం వేయాలని అంశంపై చర్చించేందుకు త్వరలో భారతవిదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ సైతం రష్యాకు వెళ్లి పుతిన్ ప్రభుత్వ పెద్దలతో మాట్లాడనున్నారు. గల్వాన్ లోయలో ఇరుదేశాల జవాన్ల ముష్టిఘాతం, ఘర్షణలు, 20కిపైగా భారత జవాన్ల వీరమరణంతో ఎగసిపడిన కోపాన్ని సైతం కాసేపు పక్కనబెట్టి ప్రధాని మోదీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. చైనాకు బద్ధశత్రువైన అమెరికాను ఆర్థికాంశాల్లో ఎలా ఎదుర్కోవాలనే దానిపై చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ చర్చించనున్నట్లు వార్తలొచ్చాయి.

మారుతున్న భారత్ వ్యూహం

చైనాతో మైత్రీ విషయంలో ఇన్నాళ్లూ సమదూరం పాటించిన భారత్ ఇకపై అమెరికా కారణంగా స్నేహబంధాన్ని బలపర్చుకునే అవకాశముంది. చైనా, భారత్, రష్యా కూటమిలో తానూ చేరతానని ఇప్పటికే బ్రెజిల్ సూచనప్రాయంగా తెలిపింది. వ్యవసాయం, డైయిరీ రంగంలో అమెరికన్ కంపెనీల రాకను భారత్ అడ్డుకుంటుండటంతో ఒక దెబ్బకు రెండు పిట్టలు తరహాలో అటు సుంకాలతో, ఇటు వాణిజ్య ఒప్పందంలో తనకు అనుకూల షరతులతో భారత్ మెడలు వంచాలని ట్రంప్ చూస్తున్నారు. ఇందుకు భారత్ ససేమిరా అనడంతో ఆగ్రహంతో ట్రంప్ మోపిన టారిఫ్ ఇప్పుడు భారత్‌ను చైనాకు దగ్గరచేస్తోందని తెలుస్తోంది. ఏడేళ్ల తర్వాత మోదీ చైనా పర్యటన ఖరారుకావడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనాను నిలువరించేందుకు ఇన్నాళ్లూ భారత్‌ను మచ్చికచేసుకునేందుకు గత అమెరికా ప్రభుత్వాలు చేసిన సఫలయత్నాలను ట్రంప్ ఒక్క టారిఫ్ దెబ్బతో నాశనంచేస్తున్నారు. 25 శాతం టారిఫ్ అమల్లోకి వచ్చినరోజు మాస్కోలో దోవల్ పర్యటించడం యాదృచ్ఛికం కాదని తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం చేసుకోవాలంటూ ట్రంప్ పంపిన దూత, అమెరికా ఉన్నతాధికారి స్టీవ్ విట్కాఫ్.. వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీ అయిన కొద్దిగంటల తేడాతోనే దోవల్ సైతం మాస్కోలో కీలక చర్చలు జరపడం గమనార్హం.

షాంఘై శిఖరాగ్ర సదస్సు వేదికగా..

త్వరలో చైనాలో జరగబోయే షాంఘై సహకార సంఘం శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు మోదీ చైనాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిసి ట్రంప్ ప్రభుత్వ వ్యతిరేక వ్యూహాలను రచించనున్నట్లు వార్తలొచ్చాయి. ఇటీవలికాలంలో చైనా, భారత్ మధ్య సారూప్యతలు కనిపిస్తున్నాయి. రష్యా ముడిచమురును చైనా, భారత్‌లు అత్యధికంగా కొనుగోలుచేస్తున్నాయి. ట్రంప్ బెదిరింపులను భారత్, చైనా రెండూ చవిచూశాయి. దేశ స్వప్రయోజనాలు, జాతీయ భద్రతకే తాము పెద్దపీట వేస్తామని చైనా, భారత్ ఒకే తరహాలో తమ వాణిని గట్టిగా వినిపించాయి. యురేనియం, ఎరువులు, ఇతర కీలక మిశ్రమ ధాతువులను రష్యా నుంచి కొంటూ మాకు సుద్దులు నేర్పుతావా? అని రెండు దేశాలు అమెరికాపై ఆగ్రహం వ్యక్తంచేశాయి. శత్రువుకు శత్రువు మిత్రువు అన్న సూత్రాన్ని భారత్, చైనాలు తూ.చ. తప్పకుండా పాటిస్తాయని తెలుస్తోంది.

కలిసి నడుస్తానన్న బ్రెజిల్

తమపై ఏకంగా 50 శాతం టారిఫ్ విధించడంపై అమెరికాపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డసిల్వా గుర్రుగా ఉన్నారు. ''ఇంతటి భారం మోపిన ట్రంప్‌కు అస్సలు ఫోన్ చేయను. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని మోదీకి ఫోన్‌చేస్తా. ప్రపంచ వాణిజ్య సంస్థలో ఈ టారిఫ్‌లపై తేల్చుకుంటాం. ఈ దేశాలతో కలిసి నడుస్తా'' అని డసిల్వా అన్నారు. రష్యా, ఇండియా, చైనా త్రయం మళ్లీ క్రియాశీలకం కావాల్సిన తరుణం వచ్చిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ అన్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

త్వరలో భారత్‌కు పుతిన్ రాక

తేదీల ఖరారు తుదిదశలో ఉందని దోవల్ వెల్లడి


పుతిన్

న్యూఢిల్లీ: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. పర్యటన తేదీలను ఖరారు చేసేందుకు జరుగుతున్న చర్చలు తుది దశలో ఉన్నాయని జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ గురువారం తెలిపారు. పుతిన్ ఆగస్టు ఆఖర్లో పర్యటించే అవకాశముందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆయన వెల్లడించారు. పర్యటన తేదీలు, సమయంపై మరింత స్పష్టత రావాల్సి ఉందన్నారు. పర్యటన ఈ ఏడాది చివర్లో ఉంటుందని స్పష్టం చేశారు. అమెరికాతో వాణిజ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు నెలకొన్న వేళ పుతిన్ పర్యటన అంశం తెరపైకి రావడం గమనార్హం. పుతిన్ పర్యటన భారత్ ప్రపంచ దేశాలతో నెరుపుతున్న రాజకీయ వ్యూహంలో కీలక పరిణామం కానుంది. సరిగ్గా, ట్రంప్ బెదిరింపుల వేళ పుతిన్ పర్యటన వార్త భారత్-రష్యాల మైత్రీ బంధం ఎంత బలమైందో చెప్పకనే చెబుతోంది. రష్యా నుంచి చమురును పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం ద్వారా ఉక్రెయిన్‌పై యుద్ధానికి భారత్ ఆజ్యం పోస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా నిందించడం, టారిఫ్ పెంచుతూ బుధవారం హెచ్చరికలు చేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే ఎన్ఎస్ఏ దోవల్ మాస్కో వెళ్లడం గమనార్హం. క్రెమ్లిన్‌లో గురువారం ఆయన అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారు. అనంతరం మాస్కోలో దోవల్ స్పుత్నిక్ న్యూస్‌తో మాట్లాడారు. భారత్-రష్యా బంధం ఎంతో ప్రత్యేకమైందని పేర్కొన్నారు. 'భారత్-రష్యాలది చాలా ప్రత్యేకమైన, సుదీర్ఘ సంబంధం. రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మేం ఎంతో విలువైందిగా భావిస్తున్నాం. మా మధ్య కొనసాగుతున్న ఉన్నత స్థాయి సంబంధాలు, బంధాన్ని బలీయంగా మార్చడంలో ఎంతో సాయపడ్డాయి' అని దోవల్ పేర్కొన్నారు. 'రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్‌లో చేపట్టే పర్యటనపై మేం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. పర్యటన తేదీలు దాదాపుగా ఖరారయ్యాయి. ఇరు దేశాల నేతల మధ్య జరిగే శిఖరాగ్రం ఎంతో కీలకం కానుంది' అని దోవల్ వివరించారు. 'ఈ శిఖరాగ్రం ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కొత్త దిశానిర్దేశం చేయనుంది. వీరి మధ్య జరిగే చర్చలు స్పష్టమైన, గణనీయమైన ఫలితాలను అందివ్వనున్నాయి' అని దోవల్ ఆశాభావం వ్యక్తం చేసినట్లు టాస్ వార్తా సంస్థ పేర్కొంది. ఇలా ఉండగా, ముడి చమురు దిగుమతులపై పశ్చిమ దేశాలు విధించిన ఆంక్షల ప్రభావంపైనా దోవల్ రష్యా ఉన్నతాధికారులతో చర్చించారు. ఒప్పందం ప్రకారం మిగతా రెండు ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థలను సాధ్యమైనంత త్వరగా అందజేయాలని కోరారు.

ట్రంప్ టారిఫ్ దండయాత్ర ఆగదా?

- 8 గంటలే గడిచాయి
- ముున్ముందు ఎన్నో ఆంక్షలుంటాయి
- చైనా పైనా మరో దఫా టారిఫ్ బండ?
- సూచనప్రాయంగా చెప్పిన ట్రంప్

వాషింగ్టన్/న్యూఢిల్లీ: రష్యాతో వాణిజ్య మైత్రి కొనసాగిస్తున్న దేశాలపై టారిఫ్ క్షిపణుల్ని ప్రయోగిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అమ్ముల పొదిని మరింతగా వాడబోతున్నారా?. గురువారం అధ్యక్షభవనం శ్వేతసౌధంలో మీడియా అడిగిన ప్రశ్నలకు ట్రంప్ ఇచ్చిన సమాధానాలను చూస్తే అమెరికా టారిఫ్‌ల మోత ఇప్పట్లో ఆగేలా లేదని స్పష్టమవుతోంది. మీడియా సమావేశంలో ప్రసంగిస్తున్న ట్రంప్‌ను విలేఖరులు భారత్ సంబంధిత ప్రశ్న సంధించారు. ''రష్యాతో ఎన్నో దేశాలు ముడిచమురు వాణిజ్యం చేస్తోంటే కేవలం భారత్‌ను మీరు లక్ష్యంగా చేసుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. 50 శాతం టారిఫ్ మోపారు. రష్యాతో చైనా సైతం ఇదే తరహా వాణిజ్యంచేస్తోంది. మరి చైనాపైనా టారిఫ్ మరోసారి పెంచుతారా?'' అని ప్రశ్నించగా ట్రంప్ సంచలన విషయం చెప్పారు. ''భారత్‌పై రెండో దఫా టారిఫ్‌లు పెంచి కేవలం 8 గంటలే గడిచాయి. అప్పుడే ఏం అయిపోయింది? ముున్ముందు ఏం జరగబోతోందో మీరే చూస్తారుగా. పరోక్ష ఆంక్షలపర్వంలో భాగంగా రెండో దఫాలో మరింతగా టారిఫ్‌ను పెంచబోతున్నాం'' అంటూ చైనాకు టారిఫ్ వేడి తప్పదని ట్రంప్ పరోక్షంగా చెప్పారు. గత కొన్నేళ్లుగా చైనాతో వైరం ముదరడంతో భారత్‌తో అమెరికా సత్సంబంధాలను పటిష్ఠంచేసుకోగా ఉక్రెయిన్ యుద్ధంలో ఈ మైత్రీబంధం కీలకమలుపు తీసుకుంది. రష్యాకు భారత్ వంటి దేశాలు కీలక వాణిజ్యభాగస్వాములుగా కొనసాగుతున్న తరుణంలో ఈ దేశాలపై సుంకాల కత్తి వేలాడదీసి రష్యాను ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందానికి బలవంతంగా ఒప్పించాలని అమెరికా యత్నిస్తోంది. ఇందులోభాగంగా భారత్‌పై మరో పాతిక శాతం టారిఫ్‌ను విధించడం తెల్సిందే.



అమల్లోకి నూతన టారిఫ్

60కిపైగా దేశాలపై ట్రంప్ మోపిన కొత్త టారిఫ్‌లు గురువారం అమల్లోకి వచ్చాయి. గరిష్టంగా బ్రెజిల్, భారత్‌పై ఏకంగా 50 శాతం సుంకాలు విధించారు. సిరియా(41 శాతం), లావోస్(40), మయన్మార్(40), స్విట్జర్లాండ్(39), ఇరాక్(35), కెనడా(35), సెర్బియా(35), బోస్నియా హెర్జ్‌గోవినా(30), లిబియా(30), దక్షిణాఫ్రికా(30), మెక్సికో(25), బంగ్లాదేశ్(20), శ్రీలంక(20), తైవాన్(20), వియత్నాం(20), కాంబోడియా(19), పాకిస్తాన్(19శాతం)పై విధించిన అదనపు సుంకాలు గురువారం అమల్లోకి వచ్చాయి. తమకు మిత్రులుగా ఉన్న జపాన్, దక్షిణకొరియా, యూరోపియన్ యూనియన్ దేశాలపై కేవలం 15 శాతం సుంకాలు ట్రంప్ విధించారు. బ్రిటన్‌పై కేవలం 10 శాతం టారిఫ్‌లు విధించారు.

జస్టిస్ వర్మకు సుప్రీంలో చుక్కెదురు


న్యూఢిల్లీ: తన అధికారిక నివాసంలో పెద్ద సంఖ్యలో కరెన్సీ నోట్లు లభ్యమైన ఉదంతంలో అప్రతిష్ట మూటగట్టుకున్న అలహాబాద్ హైకోర్టు జడ్జి యశ్వంత్ వర్మకు సర్వోన్నత న్యాయస్థానంలో చుక్కెదురైంది. కాలిన కరెన్సీ నోట్ల అంశంపై నిజానిజాలు నిగ్గుతేల్చి అంతర్గత విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను సవాల్ చేస్తూ జడ్జి వర్మ వేసిన పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం గురువారం కొట్టేసింది. చట్టాలకు లోబడే విచారణ కమిటీ దర్యాప్తు చేసిందని, ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు జరగలేదని, అందుకే జడ్జి వర్మ తరఫు వాదనలను పట్టించుకోవట్లేదని ధర్మాసనం స్పష్టంచేసింది. ఘటనాస్థలిలో తీసిన ఫొటోలు, వీడియోలు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్‌చేసినప్పుడు, విచారణ కమిటీ ఎదుట నిరభ్యంతరంగా హాజరైనప్పుడు చెప్పని అభ్యంతరాలను తర్వాత లేవనెత్తడం ఏమాత్రం నమ్మశక్యంగా లేవని ధర్మాసనం మరోమారు వ్యాఖ్యానించింది. విచారణ కమిటీ నివేదిక పారదర్శకంగా లేదన్న వాదనల్లో పస లేదని కోర్టు అభిప్రాయపడింది. తనను అభిశంసించాలంటూ నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పార్లమెంట్‌కు మే 8వ తేదీన చేసిన సిఫార్సులను రద్దుచేయాలంటూ జడ్జి వర్మ తరఫున న్యాయవాది కపిల్ సిబల్ చేసిన అభ్యర్థననూ ధర్మాసనం తిరస్కరించింది. ''రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారమే అంతర్గత విచారణ జరిగింది. కరెన్సీ నోట్లు బయటపడ్డాక సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వెంటనే హైకోర్టు న్యాయమూర్తులతో విచారణ కమిటీ ఏర్పాటు మొదలు దర్యాప్తు దాకా ఎలాంటి చట్ట అతిక్రమణ ఘటనలు చోటుచేసుకోలేదు. ఈ కమిటీ నివేదికలో తప్పు ఉందనడంలో ఎలాంటి చట్టబద్ధత కనిపించట్లేదు. జడ్జీని పదవి నుంచి తొలగించాలన్న దురుద్దేశం కమిటీ నివేదికలో లేదు. వీడియో ఫుటేజీ, ఫొటోలను అప్‌లోడ్ చేయడం మినహా మొత్తం ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోలేదు'' అని కోర్టు తన 57 పేజీల తీర్పులో వ్యాఖ్యానించింది. దీంతో ఆయనను పార్లమెంట్ అభిశంసించేందుకు మార్గం సుగమమైంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



హాకీ జట్ల ఎంపిక
గూడూరు: అండర్-22 బాలుర, బాలికల విభాగాల్లో కృష్ణా జిల్లా హాకీ జట్ల ఎంపిక గురువారం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది.



సాగర్ నీటిమట్టం
విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 588.50 అడుగులకు చేరింది. ఇది 307.5790 టీఎంసీలకు సమానం.



కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన
గుణదల: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు వారి సమస్యల పరిష్కారానికి గురువారం విద్యుత్ సౌధను ముట్టడించి ఆందోళన చేశారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు నిరసన గళం వినిపించారు.

న్యూస్‌రీల్

దుర్గమ్మకు కానుకగా బంగారు ముక్కుపుడక, బొట్టు, నత్తు





ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మకు విజయవాడకు చెందిన భక్తులు గురువారం బంగారు ముక్కుపుడక, బొట్టు, నత్తును కానుకగా సమర్పించారు. బెంజ్‌సర్కిల్‌లోని ఆచార్యరంగ నగర్‌కు చెందిన పోసాని బసవయ్య, మనోహరమ్మ దంపతులు, వారి కుమారుడు ప్రసాదరావు సుమారు 24.7 గ్రాముల బంగారం, నవరత్నాలతో తయారు చేయించిన ముక్కుపుడక, బొట్టు, నత్తును ఆలయ అధికారులకు అందచేశారు. సుమారు రూ. 3.05 లక్షలతో బంగారు ఆభరణాలను తయారు చేయించినట్లు దాతలు పేర్కొన్నారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

నానో ఎరువులతో బహుళ ప్రయోజనాలు

విజయవాడ రూరల్: నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. విజయవాడ రూరల్ మండలం నున్న పీఏసీఎస్‌ను గురువారం ఆయన సందర్శించారు. రైతులకు ఎరువుల సరఫరా స్థితిగతులను పరిశీలించారు. ఈ పోస్ మెషిన్ పనితీరు పరిశీలించి, అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను తెలుసుకున్నారు. ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణం, గోదాము తనిఖీ చేశారు. ఫిజికల్, ఆన్‌లైన్ రికార్డుల లావాదేవీలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సాగుకు సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. 5,403 మెట్రిక్ టన్నుల యూరియా, 2,251 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,052 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 2,310 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 12,292 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎరువులు, పురుగు మందులపై ఫిర్యాదులకు కలెక్టరేట్‌లో 91549 70454 నంబర్ అందుబాటులో ఉందని చెప్పారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నాగమల్లిక ఉన్నారు.

ముగిసిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు



గన్నవరం: కేవీఆర్ ఇండోర్ స్టేడియంలో గురువారం కృష్ణాజిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-19 బాల, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు జరిగాయి. సెలక్షన్స్‌కు జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో బాలిబాలికలు హాజరయ్యారు. తొలుత పోటీలను జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె.ఝాన్సీలక్ష్మి ప్రారంభించారు. అనంతరం బాల, బాలికల విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించి క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేశారు. వీరు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఝాన్సీలక్ష్మి తెలిపారు. పోటీలను కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఆర్ కిషోర్ పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామారావు, బాలకృష్ణ, చంద్రశేఖర్, నాగరాజు, శాంతికిరణ్, రాంబాబు ఎంపికలు చేశారు.

ఓటమి భయంతోనే కూటమి దాడులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు మేలు చేసి ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో దిగజారుడు రాజకీయాలకు పాల్పడాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి రాదని, కేవలం ఓటమి భయంతోనే దాడులకు తెగబడుతోందని వైఎస్సార్ సీపీ నాయీ బ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తొండమల్ల పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ రౌడీ మూకల దాడిని ఖండించారు. ఇది అమానుష చర్య అని, రాజకీయం అంటే ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాబలంతో గెలవాలి తప్ప దాడులు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి, తద్వారా ఎన్నికల్లో గెలవాలనుకోవడం దుర్మార్గ చర్యే అవుతుందని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి వ్యతిరేకతను మూటకట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రమేష్ యాదవ్‌పై జరిగిన దాడి బీసీ వ్యవస్థపై జరిగిన దాడిగా అభివర్ణించారు.

చౌకబారు మాఫియా..

- వ్యవస్థీకృతమైన రేషన్ బియ్యం మాఫియా
- ప్రతి నెల 26న డీలర్లకు బియ్యం సరఫరా
- పావులుగా మారిన అధికారులు!
- ప్రతి నియోజకవర్గం నుంచి 500 టన్నులు.. బియ్యం మాఫియా చేతిలో
- కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో బియ్యం మాఫియా రెచ్చిపోతోంది. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని అధికార పార్టీ నేతలే పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో పార్లమెంట్ ముఖ్యనేత డైరెక్షన్‌లో అధికారుల కనుసన్నల్లో బియ్యం పక్కదారి పడుతోందని తెలుస్తోంది. పేదలకు దక్కాల్సిన బియ్యాన్ని పార్లమెంటు ముఖ్యనేత, ప్రజాప్రతినిధులు మెక్కేస్తున్నారు. పౌర సరఫరాల అధికారులు, విజిలెన్స్ అధికారులను పావులుగా మార్చుకొని రేషన్ డీలర్లపై ప్రయోగిస్తున్నారు. పార్లమెంటు ముఖ్యనేత డైరెక్షన్ మేరకు వారు చెప్పిన వ్యక్తికే, బియ్యం ఇవ్వాలని అధికారులు హుకుం జారీ చేస్తున్నారు. దాంతో ప్రతి నెలా ఒకటో తేదీనే చాలా రేషన్ దుకాణాల్లో బియ్యం సంచులు ఖాళీ అయి పోతున్నాయి.

నియోజకవర్గానికి సగటున 500 టన్నులకు పైగా బియ్యం మాఫియా చేతుల్లోకి

జిల్లాలో ప్రతి నియోజక వర్గంలో సగటున 500 టన్నులకు పైగా రేషన్ బియ్యం మాఫియా చేతుల్లోకి పోతున్నాయి. రైస్ మిల్లుల్లో ఈ బియ్యాన్ని పాలిష్ చేసి, నేరుగా కాకినాడ పోర్టు మీదుగా విదేశాలకు తరలిస్తున్నారు. ప్రతి నెలా బియ్యం మాఫియా నుంచి పార్లమెంటు ముఖ్యనేతకు కోటి రూపాయలు, నియోజక వర్గాల ప్రజాప్రతినిధులు రూ.25 లక్షల చొప్పున దండుకున్నారు. వ్యవస్థీకృతంగా సాగుతున్న బియ్యం లీలలు ఇవి.

విష ప్రచారం చేసి..

గత ప్రభుత్వం మొబైల్ వాహనాల్లో ఇంటింటికీ రేషన్ ఇచ్చింది. వీటితో అక్రమాలు పెరిగిపోతున్నాయంటూ నాడు కూటమి విష ప్రచారం చేసింది. ఈ వాహనాలను తొలగించి పాత పద్ధతిలోనే డీలర్లకు బాధ్యతలు అప్పగించారు. రేషన్ దుకాణాలకు ప్రతి నెలా 26వ తేదీ బియ్యం సరఫరా చేస్తారు. 1వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. అయితే పార్లమెంటు ముఖ్యనేత, నియోజక వర్గ ప్రజాప్రతినిధులు పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారులతో రేషన్ డీలర్లపై ఒత్తిడి తెచ్చి, వారు సూచించిన రేషన్ మాఫియా సభ్యులకే బియ్యం ఇచ్చేలా హుకుం జారీ చేస్తున్నారు. రేషన్ మాఫియా.. రేషన్ డీలర్లకు ముందే అడ్వాన్స్‌లు ఇస్తున్నారు. దందాకు సహకరించని డీలర్లపై రేషన్ షాపులు తనిఖీ చేసి, సీజ్ చేస్తున్నారు. పోలీసులు సైతం మామూళ్లు తీసుకుని దందాకు సహకరిస్తున్నారని తెలుస్తోంది.

పార్లమెంటు ముఖ్యనేత డైరెక్షన్...అధికారుల యాక్షన్...!



కొండపల్లిలో పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)



ఇబ్రహీంపట్నంలో రేషన్ మాఫియాకు అండగా వచ్చిన కారును స్వాధీనం చేసుకున్న పోలీసులు(ఫైల్)

సూరంపల్లిలో డంప్!

పార్లమెంటు ముఖ్యనేత కనుసన్నల్లో తిరువూరు, మైలవరం, విజయవాడ తూర్పు, పశ్చిమ నియోజక వర్గాల్లో రేషన్ దందా జరుగుతోంది. ఈ దందా అంతా రామచంద్రరావు అనే వ్యక్తి నడిపిస్తున్నారు. ఇతను పార్లమెంటు ముఖ్యనేతకు నెలవారీగా దాదాపు కోటి రూపాయలకుపైగా ముడుపులు ఇస్తూ దర్జాగా దందా చేస్తున్నారు. జగ్గయ్యపేటలో నియోజక వర్గ ప్రజాప్రతినిధి, నందిగామలో కంచికచర్లకు చెందిన టీడీపీ నేత, విజయవాడ సెంట్రల్ నియోజక వర్గ ప్రజాప్రతినిధి అనుచరులు, పెనమలూరులో క్రాంతి కిరణ్, గుడివాడలో నియోజక వర్గ ప్రజాప్రతినిధి పేరుతో గిరి అనే వ్యక్తి రేషన్ బియ్యం అక్రమ దందాలో పలు పంచుకొంటున్నారు. ఈ బియ్యాన్ని పామర్రుకు చెందిన మాఫియా డాన్ గొట్టపు రమేష్ సేకరిస్తున్నారు. ఆయన గన్నవరం సమీపంలోని సూరంపల్లి వద్ద డంపు చేసి, అక్కడ నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. ఇటీవల ఈ డంపుపై అధికారులకు ఫిర్యాదులు వెళ్లినా జిల్లా పౌర సరఫరాల ఉన్నతాధికారికి, ప్రజాప్రతినిధి నుంచి ఒత్తిడి రావడంతో ఆయన చేతులెత్తేసినట్లు చర్చ సాగుతోంది. కొంత బియ్యం ఇబ్రహీంపట్నం పంట పొలాల్లో లోడ్ చేసి, పోర్టుకు పంపుతున్నారు. రేషన్ మాఫియా దందాకు పాల్పడుతున్న ఈ గ్యాంగ్‌పై పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయి.

పోలీస్‌లపై దాడికి యత్నించిన రేషన్ మాఫియా

- రేషన్ బియ్యం అక్రమ లోడింగ్‌ను అడ్డుకున్న పోలీస్ కానిస్టేబుల్‌పై రేషన్ మాఫియా ముఠా దాడికి యత్నించింది. ఘటన ఇబ్రహీంపట్నంలో ఈ నెల 2వ తేదీ అర్ధరాత్రి చేపల మార్కెట్ ఎదురు రోడ్డులో జరిగింది. రేషన్ బియ్యం అక్రమ లోడింగ్ జరుగుతోందనే సమాచారంతో కానిస్టేబుల్ ఆ ప్రదేశానికి వెళ్లాడు. అప్పటికే బొలేరో వాహనంలో బియ్యం లోడింగ్ పూర్తవడంతో ఎస్కార్ట్‌గా ఉన్న ఏపీ 39యూటీ 1267 కారు డ్రైవర్, కిరాయి రౌడీలు దిగివచ్చి కానిస్టేబుల్‌ను బంధించారు. బియ్యం వాహనంతో పరారయ్యారు. విషయం తెలుసుకున్న మూలపాడు సెక్టార్ ఎస్సై ఫణేంద్ర అక్కడకు చేరుకుని ఎస్కార్ట్‌గా ఉన్న కారును వెంబడించి స్వాధీనం చేసుకున్నారు. కారు డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు.

-కొండపల్లిలో ఈ నెల 2న తెల్లవారుజామున వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులకు రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రక్కు వాహనాలు పట్టుబడ్డాయి. వీటిలో నాలుగు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొన్ని బస్తాలైతే నేరుగా ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం బస్తాలను యథాతథం అక్రమ రవాణాకు పాల్పడటం గమనార్హం.

దసరా ఏర్పాట్ల పరిశీలన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడిలో సెప్టెంబర్ 22 నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కనకదుర్గనగర్, మహా మండపం, దుర్గాఘాట్ పరిసరాల్లో పర్యటించి దసరా ఉత్సవాల పనులపై ఆలయ అధికారులతో మాట్లాడారు. దసరాపై గత నెల తొలి సమీక్ష సమావేశం నిర్వహించగా, అధికారులు పలు సూచనలు చేశారు. దీంతో గురువారం కలెక్టర్ ఆలయానికి విచ్చేసి కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు నిర్మాణంలో ఉన్న ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్ పనులపై అడిగారు. గోశాల వద్ద లడ్డూ పోటు, మహా మండపం వద్ద నిర్మిస్తున్న అన్నదాన భవనం పనులపై ఆరా తీశారు. దసరా నాటికి పనులు ఏ మేరకు జరుగుతాయి, ఉత్సవాల నేపథ్యంలో ఆయా భవనాల వినియోగంపై ఈవో శీనానాయక్, ఈఈ రాంబాబులను అడిగారు. మహా మండపం దిగువన ప్రసాదాల కౌంటర్లను పరిశీలించే క్రమంలో అక్కడ విక్రయిస్తున్న కవర్లను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. కనకదుర్గనగర్, చైనావాల్, రథం సెంటర్ల మధ్య ఆక్రమణలు తొలగించిన తర్వాత చేసిన పనులను కలెక్టర్ పరిశీలించారు.

సకాలంలో వైదిక క్రతువులు

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి జరిగే వైదిక క్రతువులు సకాలంలో జరిగేలా చూడాలని దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ దుర్గగుడి అధికారులను ఆదేశించారు. దుర్గగుడి మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో గురువారం దసరా ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రామచంద్రమోహన్, ఫెస్టివల్ ఆఫీసర్ భ్రమరాంబ, దుర్గగుడి ఈవో శీనానాయక్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆర్జిత సేవలపై భక్తులలో అనేక గందరగోళాలు ఉన్నాయని, సేవలకు తగిన ప్రణాళిక ఉండాలని సూచించారు.

ప్రజారోగ్యానికి విఘాతం!

- విభాగాల మధ్య విభేదాలు
- ప్రజారోగ్యశాఖలో సమన్వయ లోపం
- పడకేసిన ఆరోగ్య కార్యక్రమాలు
- ఇంటింటి సర్వే అంతంత మాత్రమే
- లార్వా నిర్మూలన ఆపరేషన్ లేదు
- గ్రామాల్లో ఏఎన్ఎం, సీహెచ్ఓల ఆధిపత్య పోరు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విభాగాల మధ్య విభేదాలతో ప్రజారోగ్యానికి విఘాతం కలుగుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రజారోగ్య శాఖలో సమన్వయ లోపంతో ఆరోగ్య కార్యక్రమాలు పడకేశాయి. ఆ శాఖలో అధికారుల హడావుడి మినహా క్షేత్రస్థాయిలో ఏమీ అమలు కావడం లేదు. ఇంటింటి సర్వే ఎప్పుడో మర్చిపోయారు. గర్భిణుల ట్రాకింగ్ సరిగా జరగడం లేదు. కేంద్రం అమలు చేస్తున్న అనేక పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే మానేశారు. దీంతో అవి లబ్ధిదారుల దరి చేరడం లేదు. వీటన్నింటికీ కారణం సిబ్బంది మధ్య సమన్వయం లేక పోవడమేననే విమర్శలు వస్తున్నాయి. మరోవైపు సీహెచ్ఓ, ఏఎన్ఎంల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఆ ప్రభావం వైద్య సేవలపై పడుతోందని వైద్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

పట్టించుకోవడమే మానేశారు

ఉమ్మడి కృష్ణా జిల్లాలో పలు ఆరోగ్య కార్యక్రమాలు వ్యాధిగ్రస్తుల దరి చేరడం లేదు. ముఖ్యంగా కృష్ణా జిల్లాలో గర్భిణుల ట్రాకింగ్ సరిగా జరగడం లేదు. రిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న వారిని వైద్య సిబ్బంది ఫాలో అప్ చేయడం మానేశారు. దీంతో వాళ్లు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన తర్వాత సమాచారం తెలుసుకుని అక్కడకు పరుగులు పెడుతున్నారు. అంతేకాదు గర్భిణులకు ప్రసవం తర్వాత అందాల్సిన పీఎం జేఎస్‌వై సగం మందికి అందడం లేదు. దీనికి ఆ పథకంపై వైద్య సిబ్బంది అవగాహన కలిగించక పోవడమే కారణంగా చెబుతున్నారు. గర్భిణులకు స్త్రీ శిశు సంక్షేమశాఖ నుంచి అందాల్సిన పోషకాహారం అంతం మాత్రంగానే ఉంది. అందుకు సిబ్బంది సమన్వయమే లోపం అంటున్నారు.

ఇంటింటి సర్వే ఏదీ

మలేరియా విభాగంలో పనిచేసే హెల్త్ అసిస్టెంట్‌లు నెలలో రెండుసార్లు, కనీసం ఒకసారైనా తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించాల్సి ఉంది. వాళ్లు సందర్శించిన తేదీలను ఆ ఇంటి గోడపై నమోదు చేయాలి. ఇంటింటినీ సందర్శించి జ్వరాలపై సర్వే చేసే కార్యక్రమాన్ని ఎప్పుడో వదిలేశారు. వారిపైన ఉన్న హెల్త్ సూపర్‌వైజర్స్ పర్యవేక్షణను కూడా పూర్తిగా వదిలేశారు. వారానికి ఒకసారి నిర్వహించే డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో రెండిళ్లు సందర్శించి ఫొటోలు తీసి, యాప్‌లో, గ్రూప్‌లో అప్‌లోడ్ చేసి మమ అనిపిస్తున్నారు. అంతేకానీ ఏ ఒక్క ఇంట్లో వ్యాధి కారక లార్వాను గుర్తించిన సందర్భాలు లేవు. అంతేకాదు నగరంలో యాంటీ లార్వా ఆపరేషన్ కూడా సరిగా జరగడం లేదు. అధికారుల బంగళా చుట్టూ ఫాగింగ్ చేయడం మినహా నగరంలో ఎక్కడా చేయడం లేదు.

పీహెచ్‌సీలు	
ఎన్టీఆర్	23
కృష్ణా	50
యూపీహెచ్‌సీలు	
ఎన్టీఆర్	50
కృష్ణా	12
వెల్నెస్ సెంటర్‌లు	
ఎన్టీఆర్	257
కృష్ణా	357

లక్ష్యానికి తూట్లు

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్(సీహెచ్ఓ), ఏఎన్ఎంల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంది. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శన విషయంలో వీరి మధ్య ఎప్పటి నుంచో వివాదాలు సాగుతున్నారు. ఒకదశలో ఏఎన్ఎంలకు ఏ..బీ..సీ..డీలు కూడా రావంటూ సీహెచ్ఓలు వ్యక్తిగత విమర్శలు చేశారు.

ఇలా వీరి మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతూనే ఉంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్స్(వెల్నెస్ సెంటర్స్)లో సేవల లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. దీంతో ఏడాదిగా సేవలు మరుగున పడ్డాయి. ఆ వివాదాలను పరిష్కరించడాన్ని అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.



గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది(ఫైల్)

వైద్య రంగాన్ని విస్మరిస్తున్నారు



రాష్ట్రంలో వైద్య రంగం పూర్తిగా నిర్వీర్యంగా మారింది. ప్రభుత్వాస్పత్రిల్లో సేవలు దిగజారాయి. ప్రజారోగ్యం పడకేసింది. ఉద్యోగులు, అధికారుల మధ్య సమన్వయం లోపించినా పాలకులకు పట్టడం లేదు. కార్పొరేట్‌లకు ఆస్పత్రిలు అప్పగించి పర్సంటేజీలు దోచుకోవడం మినహా, ఆస్పత్రిలను బలోపేతం చేసి, రోగులకు నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశమే ప్రభుత్వానికి లేదు. దీంతో ఉద్యోగులు సైతం ఎవరి దారిలో వారు నడుస్తున్నారు.

–డాక్టర్ మెహబూబ్ షేక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం

నేడు వరలక్ష్మీదేవిగా దుర్గమ్మ

- ఇంద్రకీలాద్రిపై మూడు రోజులు పవిత్రోత్సవాలు
- ఉదయం 9.30 గంటల తర్వాతే అమ్మవారి దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, వరలక్ష్మీదేవి అలంకారం, విశేష పూజలు, బాలభోగ నివేదన అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. పవిత్రోత్సవాల నేపథ్యంలో ఆది దంపతులతో పాటు ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో దేవతామూర్తులకు పవిత్రాలధారణ జరుగుతుంది. అనంతరం ప్రధాన ఆలయంలో మూలవిరాట్ వద్ద అర్చకులు వరలక్ష్మీ వ్రతాన్ని ఏకాంత సేవగా చేస్తారు.



నేటి నుంచి పవిత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రిపై శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వరలక్ష్మీదేవిగా అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఆలయాన్ని వివిధ పుష్పాలతో అలంకరించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు.

యూరియా దొరక్క ఇక్కట్లు!

- గద్దల్లా తన్నుకుపోతున్న టీడీపీ నాయకులు
- రుణాలు తీసుకున్న వారికే కట్టాలంటూ మెలిక
- బయట మార్కెట్‌లో గుళికలతో లింకు
- నో స్టాక్ అంటున్న ఎరువుల దుకాణాలు



చేవేంద్ర పీఏసీఎస్ వద్ద పేర్లను నమోదు చేయించుకునేందుకు రైతుల అగచాట్లు

పెడన: పీఏసీఎస్‌ల పరిధిలోని కూటమి నాయకులు వచ్చిన యూరియా కట్టలను గద్దల్లా తన్నుకుపోతున్నారు. పీఏసీఎస్‌ల సిబ్బంది చేసేదేమీ లేక చూస్తూ మిన్నకుండిపోతున్నారు. కనీసం విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకురాకపోవడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పెడన మండలంలో యూరియా దొరక్క రైతులు రోజు రోజుకు ఆందోళన చెందుతున్నారు. పీఏసీఎస్‌లు ద్వారా ఇప్పటికే ముందుగా బుక్ చేసుకున్న వారికి కూడా దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. చేవేంద్ర పీఏసీస్ పరిధిలో యూరియా కట్టలు రావడంతో ఆ ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడొకరు సుమారు 70 యూరియా కట్టలను ట్రాక్టరులో వేసుకుపోయినట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. ఇది గ్రామంలో తీవ్రస్థాయిలో చర్చనీయాంశమైంది. ఇలా చేయడం చాలా దారుణమని వాపోతున్నారు. అధికారులు సైతం చూసీచూడనట్లుగా వ్యవహరించడం చాలా అన్యాయమని, రైతులందరికి సమన్యాయంగా యూరియా అందించాల్సిన బాధ్యత లేకుండా నడుచుకోవడం పట్ల పరిస్థితి మరింత చేయిదాటే ప్రమాదం ఉందన్నారు.

బయట మార్కెట్‌లో గుళికలతో....

బయట మార్కెట్‌లో గుళికలు కూడా కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామనే వాదనను ఎరువుల దుకాణాల వారు స్పష్టం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. దీంతో రూ.200 పెట్టి యూరియా కొంటే రూ.600 పెట్టి గుళికలు కొనుగోలు చేయాల్సి వస్తుందని, ప్రస్తుతం గుళికలతో పని లేదని, అయినా అంటగడుతుండటంతో బయట యూరియా కొనుగోలు చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఎరువుల దుకాణంలో ఆ పరిస్థితి ఉంటే పీఏసీఎస్‌లలో మరింత దారుణంగా ఉందని పేర్కొంటున్నారు. పీఏసీఎస్‌లలో రుణం తీసుకున్న వారికి మాత్రమే యూరియా ఇస్తామని పేర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుణాలు పొందిన వారికి యూరియా కట్టలు దొరకడం లేదని, రెండు దఫాలుగా చేవేంద్ర పీఏసీఎస్‌కు 800 కట్టలు వచ్చినా ఇవ్వలేదంటూ పలువురు రైతులు వాపోతున్నారు.


పక్కాగా పంపిణీ చేస్తున్నాం



చేవేంద్ర పీఏసీఎస్ పరిధిలో 70 కట్టలు ఒకరే తీసుకుపోయారనే విషయం వాస్తవం కాదు. విచారణ చేశాం. చేవేంద్ర పీఏసీఎస్‌కు యూరియా కట్టలు రావడంతో రైతులు అధిక సంఖ్యలో వచ్చారు. రాత్రి కావడంతో తాళాలు వేసేందుకు సిద్ధం అవ్వగా ఆ వ్యక్తి వచ్చి రైతుల పేర్లు నమోదు చేసుకుని అందజేశారు. దానిని కావాలని కొందరు వక్రీకరించారు. అంతా పక్కాగా పంపిణీ చేస్తున్నారు. అయితే తీసుకువెళ్లిన వారే మళ్లీ మళ్లీ వచ్చి తీసుకుపోతున్నారు.

– ఎస్.జెన్నీ, ఏవో, పెడన మండలం


ఒక్క కట్ట కూడా ఇవ్వలేదు



చేవేంద్ర పీఏసీఎస్‌లో రూ.16 లక్షలు రుణం తీసుకున్నా. రుణం తీసుకున్న వారికే యూరియా కట్టలు ఇస్తామన్నారు. ఉదయమే వచ్చా. అయినా ఒక కట్ట కూడా ఇవ్వలేదు. ఇంత దారుణమైన పరిస్థితి ఎక్కడా చూడలేదు. నాకు, నా కుటుంబసభ్యులందరికీ కలిపి 15 ఎకరాలున్నాయి. యూరియా కొట్టకపోతే పంటకు బలం రాదు. బయట కొందామంటే గుళికలకు లింకు పెడుతున్నారు. ప్రస్తుతం గుళికలతో పని లేదు. యూరియా మాత్రమే కొట్టాలి కాబట్టి పీఏసీఎస్‌లో తీసుకువెళ్లడానికి వచ్చా.

-గంగుమోలు వెంకటేశ్వరరావు, రైతు, మర్రిగుంట, చేవేంద్ర పంచాయతీ

గతంలో ఎన్నడూ ఈ పరిస్థితి లేదు



నాకు, నా కుటుంబసభ్యులకు కలిపి సుమారు 30 ఎకరాలు వరకు ఉంది. ఇప్పటికే ఒకసారి పంట ఎండిపోయింది. ప్రస్తుతం నీరు వస్తుంది. ఈ సమయంలో యూరియా వేయాలి. కనీసం ఒక్క కట్ట కూడా ఇవ్వలేదు. ఇప్పటికే రెండు దఫాలుగా యూరియా వచ్చిందన్నారు. ముందుగా బుక్ చేసుకున్నా కూడా ఇవ్వని పరిస్థితి. ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ చూడలేదు. అధికారులు స్పందించి యూరియా అందించేలా చూడాలి.

-పుట్టి వెంకమ్మ, మాజీ సర్పంచు, రైతు, మర్రిగుంట, చేవేంద్ర పంచాయతీ

క్లుప్తంగా

ఇతర రాష్ట్రాలకు ధీటుగా రాజధాని నిర్మాణం



గుణదల(విజయవాడ తూర్పు): దేశానికి తలమానికంగా ఉండేలా ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం చేపట్టామని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి నారాయణ అన్నారు. విజయవాడ భారతీనగర్ నోవోటెల్ హోటల్లో గురువారం గ్రీన్ ఆంధ్రప్రదేశ్ సమ్మిట్ – 2025 నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణం ఇతర రాష్ట్రాలకు ధీటుగా ఉంటుందని చెప్పారు. విజయవాడ నగర ప్రతిష్టతను ఇనుమడింప చేసే విధంగా పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. అధునాతన నిర్మాణ శైలిని అనుసరిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో పర్యాటక రంగంలో రాజధాని గుర్తింపు సాధిస్తుందని వెల్లడించారు. అనంతరం గ్రీన్ ఆంధ్రప్రదేశ్ బ్రోచర్‌ను విడుదల చేశారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

పెనమలూరు:పూర్వార్జిత ఇంటి స్థలాన్ని కొందరు వ్యక్తులు కాజేయటానికి ఏకంగా తహసీల్దార్ గోపాలకృష్ణ సంతకాన్ని ఫోర్జరీ చేయటంతో పోలీసులు 11 మందిపై గురువారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం..... కానూరు గ్రామంలో ఆర్ఎస్ నెంబర్లు 249/3,4,5ఎలో 300 చదరపు గజాల ఇంటి స్థలం ఉంది. తహసీల్దార్ గోపాలకృష్ణ ఎండార్స్ చేసినట్లుగా నకిలీ ధ్రువీకరణ పత్రాన్ని కొందరు వ్యక్తులు సృష్టించారు. దీంతో పోలుకొండ వెంకటాచలం అనే మహిళ తన మనవడు కౌశిక్‌కు అనుకూలంగా కంకిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ (16032/2024) ఇచ్చింది. దీనికి పలువురు వ్యక్తులు సహకరించి ఇంటి స్థలాన్ని అమ్మే యత్నం చేశారు. ఈ ఘటన వెలుగులోకి రావటంతో తహసీల్దార్ గోపాలకృష్ణ తన సంతకం ఫోర్జరీ జరిగిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కామోదుల సూరిబాబు, (ఎర్రసూరిబాబు), షేక్.వలి, బోరుగడ్డకుమార్, పోలుకొండ వెంకటాచలం, పోలుకొండ కౌశిక్, బి. వెంకటేశ్వరరావు, వి.లక్ష్మణరావు, వేములపల్లి శ్రీనివాసరావు, రాఘవమ్మ, అవనిగడ్డ స్వాతీ, సూరిబాబులని నిందితులుగా గుర్తించారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):జిల్లాలో మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యంగా ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో, క్రమశిక్షణతో సేవలందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో మాతా శిశు మరణాల నివారణకు పర్యవేక్షణ, ప్రతిస్పందన కమిటీ సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం మొదలు నమోదైన రెండు మాతృ, ఐదు శిశు మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ, వైద్యాధికారులు, స్పెషలిస్ట్ వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షించారు. మరణాలకు కారణాలను విశ్లేషించడంతో పాటు కుటుంబ సభ్యుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి ప్రాణమూ అత్యంత విలువైనదని చెప్పారు. తీసుకున్న చిన్నచిన్న జాగ్రత్తలే మాతాశిశు ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. శిశువులకు టీకాలు కూడా సరైన విధంగా వేసేలా మార్గదర్శనం చేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.ఇందుమతీదేవి, జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం పాల్గొన్నారు.

సాగు నీటి యాజమాన్యం ప్రధానం....

వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో సాగునీటి యాజమాన్యం చాలా ప్రధానమైనదని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏపీ మైక్రో ఇరిగేషన్ పథకం (ఎంఐపీ) కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటుచేసిన ఇన్నోటెసెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. సాగునీటి వనరుల సద్వినియోగంలో భాగంగా బిందు, తుంపర సేద్యంపై రైతులకు అవగాహన పెంచాలని సూచించారు. జిల్లాలో 2024–25 వరకు 23,937 హెక్టార్లు సూక్ష్మ సేద్యం కింద ఉందని, 2025–26లో కొత్తగా 2,200 హెక్టార్లను ఈ విధానంలోకి తీసుకొచ్చేలా అధికారులు కృషిచేయాలని ఆదేశించారు. సూక్ష్మ సేద్యంపై అవగాహన పెంచేందుకు రూపొందించిన కరపత్రాలను, డ్రిప్, స్ప్రింకర్, రైన్ గన్‌లకు సంబంధించిన పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాగునీరు, కరెంటు వినియోగంలో 50 శాతం పొదుపు సూక్ష్మ సేద్యంతో సాధ్యమవుతుందని వెల్లడించారు. పీడీ పి.ఎం.సుభాని, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

వయోవృద్ధుల సంరక్షణ విస్మరిస్తే చర్యలు

వయోవృద్ధుల సంరక్షణ బాధ్యతల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం విభిన్న ప్రతిభావంతుల హిజ్రాల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం- 2007, వారి పోషణ, సంరక్షణ నియమావళి- 2011 పై జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు సంరక్షణ, పోషణ చూడాల్సిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. వయోవృద్ధులు ఎవరైనా కార్యాలయాలకు వస్తే వారికి సరైన మార్గదర్శనం చేయాలన్నారు. కార్యక్రమంలో ముందుగా హెరిటేజ్ ఫౌండేషన్ ప్రాజెక్టు హెడ్ టి.రవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చట్టం పై అధికారులకు అవగాహన కల్పించారు. ఏడీ వి. కామరాజు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రమేష్ యాదవ్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి వినతి పత్రం

భవానీపురం(విజయవాడపశ్చిమ):వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో జరుగనున్న జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు చేసిన దాడిని ఖండిస్తూ ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆదేశాల మేరకు తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. టీడీపీ గూండాల దాడిలో గాయపడ్డ రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డి చిత్రాలను పట్టుకుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటమి భయంతోనే టీడీపీ గూండాలు వైఎస్సార్ సీపీ నేతలపై దాడి చేసి మట్టుపెట్టటానికి కుట్రపూరితంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉంది కదా అని దౌర్జన్యం, దాడులకు పూనుకుంటే చూస్తూ సహించేది లేదని హెచ్చరించారు.



జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు

ఎన్నికల కమిషన్ స్పందించి పులివెందులలో స్థానిక సంస్థల ఎన్నికలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సంపతి విజిత మాట్లాడుతూ హోం మంత్రి ఒక రబ్బర్ స్టాంప్‌గా వ్యవహరిస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బొడ్డు అప్పలనాయుడు, బొందిలి నరేంద్ర సింగ్, బత్తుల రామారావు, కె నాగేశ్వరరావు, కొరివి చైతన్య, షేక్ మస్తాన్, దుక్కా హరి భాస్కర్, జవ్వాది నరసింహారావు, కలపాల అజయ్, వేదాంతం చైతన్య, బూదాల సౌమ్య, పార్టీ నాయకులు విశ్వనాథ రవి, టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఐటీ చెల్లింపుదారుల సేవలు మెరుగుపర్చాలి

ఆదాయపు పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ అనిల్‌కుమార్

లబ్బీపేట(విజయవాడతూర్పు):ఆంధ్రప్రదేశ్– తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఆదాయపు పన్నుశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఎం. అనిల్‌కుమార్ గురువారం విజయవాడలో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆదాయపు పన్నుశాఖ అధికారులతో చేపట్టిన సమీక్షలో ఆయన పలు సూచనలు చేశారు. పన్ను చెల్లింపుదారుల సేవలను మెరుగుపరచడం, సమ్మతి విధానాలు బలోపేతం చేయడం, విభాగ పనితీరును క్రమబద్ధీకరించడంపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ కీలక పనితీరు సూచికలు, ఆదాయ సేకరణ లక్ష్యాలు, పన్ను చెల్లింపుదారులను చేరుకునే ప్రయత్నాలు, విధాన సంస్కరణల అమలు గురించి చర్చించారు. ఈ విభాగం పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం, సామర్థ్యం ప్రాముఖ్యతపై సమీక్షించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ చీఫ్ కమిషనర్ సురేష్ బత్తిని, విజయవాడ ప్రధాన కమిషనర్ జయరామ్ రాయ్‌పుర, ప్రిన్సిపల్ కమిషనర్ సునీతా బిల్లా, వి.జనార్ధనన్‌లతో పాటు, ట్యాక్స్ బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తికి జైలు, జరిమానా

విజయవాడలీగల్: దాడి చేసి చంపుతానని బెదిరించిన కేసులో నిందితుడికి 6 నెలల సాధారణ జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ ఒకటో అడిషనల్ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం.ఎస్.కరీముల్లా తీర్పునిచ్చారు. మాచవరం పోలీసు స్టేషన్ పరిధిలోని గిరిపురం ఏరియాలో ఫిర్యాదుదారు తన కుటుంబంతో కలిసి జీవిస్తున్నారు. 11 సంవత్సరాల క్రితం తన పెద్ద కుమార్తెను వుడ్‌పేట శిఖామణి సెంటర్‌కు చెందిన కొండపల్లి లక్ష్మణరావుకు ఇచ్చి వివాహం చేశారు. కుమార్తెకు, అల్లుడికి మధ్య మనస్పర్థలు రావడంతో సంవత్సరం క్రితం కుమార్తె తండ్రి వద్దకు వచ్చి ఉంటున్నది. ఆమె పిల్లలు తండ్రి కొట్టు వద్దకు వెళ్లారని, ఎందుకు వచ్చారు, ఇంకోసారి వస్తే చంపుతానని లక్ష్మణరావు బెదిరించి, పిల్లలతో ఆమె ఇంటికి వెళ్లి భార్యను కొట్టారు. తన కుమార్తెను ఎందుకు కొడుతున్నావని అడిగిన అత్తను పక్కన ఉన్న సిమెంట్ రేకుతో కొట్టగా, రక్తగాయం అవ్వడంతో వెంటనే చికిత్స నిమిత్తం హాస్పిటల్ తరలించి, చికిత్స చేయించారు. అత్తను కొట్టి చంపుతానని బెదిరించిన లక్ష్మణరావుపై ఇచ్చిన ఫిర్యాదుపై మాచవరం సబ్ ఇన్‌స్పెక్టర్ బి.నాగమణి కేసుగా నమోదు చేశారు. 2023 ఫిబ్రవరి 17వ తేదీన అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎన్.ఉమావతి, సి.యమ్.ఎస్. ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, మాచవరం సబ్ ఇన్‌స్పెక్టర్ బి.నాగమణి, సి.యమ్.ఎస్. సిబ్బంది పర్యవేక్షణలో 8 మంది సాక్షులను విచారించారు. నేరం రుజువైనందున పై విధంగా తీర్పు ఇచ్చారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



తేలప్రోలు(గన్నవరం): ఇంజినీర్లు తమ శ్రమ, పట్టుదల, మేధస్సుతో దేశాభివృద్ధికి దోహదపడే మంచి ఫలితాలు సాధించాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలం తేలప్రోలు పరిధిలోని ఉషారామ కళాశాలలో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకయ్యనాయుడు చేతుల మీదుగా బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో నేడు భారతదేశం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. భారత్‌లో ఉన్న యువత ప్రపంచంలోని మరే దేశంలోను లేదన్నారు. అటువంటి యువత దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిగ్రీ పట్టాలు అందుకున్న విద్యార్థుల భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, కార్యదర్శి, కరస్పాండెంట్ సుంకర అనిల్, ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ. ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ లంక అరుణ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగ ప్రచార ర్యాలీ



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ వ్యాప్తంగా హర్ ఘర్ తిరంగ ప్రచార ర్యాలీ గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఆర్ఎం మోహిత్ సోనాకియా జాతీయ జెండాను చేత పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వే నిర్మాణంలో సిబ్బంది కృషి ఎనలేనిదని ప్రశంసించారు. విజయవాడ రైల్వేస్టేషన్, డీఆర్ఎం కార్యాలయాలలో సెల్ఫీ బూత్‌లను సృజనాత్మకంగా ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది, స్కూల్ విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో ర్యాలీ చేశారు. అనంతరం డివిజన్ ఆడిటోరియంలో జరిగిన పేట్రియాటిక్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 300 మంది జాక్ అండ్ జిల్, కేంద్రీయ విద్యాలయం, ఐకాన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్ (విజయవాడ సెంట్రల్):నారాయణ కళాశాల యాజమాన్యం తీరుతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేదారేశ్వరపేట 8వ లైన్‌లో నివసిస్తున్న మల్లవరపు పద్మప్రసన్న, దుర్గాప్రసాద్ దంపతుల కుమారుడు మనుచక్రవర్తి (15) బందరు రోడ్డులో పీవీపీ మాల్ వెనుక ఉన్న నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. ఇటీవల ఆ కళాశాలలో జరిగిన పరీక్షల్లో మనుచక్రవర్తికి మార్కులు తగ్గాయి. దీంతో కళాశాల యాజమాన్యం ఈ నెల 6న అతన్ని వేరే సెక్షన్‌కు మార్చారు. బాగా చదివే తనను తక్కువ మార్కులు సాధించే సెక్షన్‌లో వేయడంతో చక్రవర్తి జీర్ణించుకోలేకపోయాడు. కళాశాల యాజమాన్యం తీరుతో అవమానకరంగా అనిపించి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. కళాశాల నుంచి ఇంటికి వచ్చి ఫ్యానుకు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

పెనమలూరు: తాడిగడప గ్రామంలోని ఓ కుటుంబంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం... ఎస్.భానుప్రకాష్ గత 9 సంవత్సరాల క్రితం శివరంజని (30)ని వివాహం చేసుకున్నాడు. కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. వీరికి రెండేళ్ల కుమార్తె ఉంది. శివరంజనికి గత 8 నెలల క్రితం గర్భస్రావం జరిగింది. అలాగే గత 7 నెలల క్రితం ఆమె తండ్రి అనారోగ్యం కారణాలతో మృతి చెందాడు. ఈ ఘటనలతో ఆమె తీవ్ర మనస్థాపానికి గురైంది. కాగా శివరంజని ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుంది. నిద్రపోయిన భర్త లేచి చూసేసరికి భార్య ఉరేసుకొని వేలాడుతూ కనబడటంతో కానూరులో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరీక్షించిన వైద్యులు ఆమె మరణించినట్లు ధ్రువీకరించారు.

- **బావిలో గుర్తు తెలియని మృతదేహం**

పెనమలూరు:పెనమలూరు గ్రామంలోని ఓ బావిలో గుర్తు తెలియని మృతదేహాన్ని గ్రామస్తులు చూసి గురువారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం... పెనమలూరు వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న 15 అడుగుల బావిలో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

COACHING

■ KR's Academy (Estd.1999): JEE Mains, EAMCET, NEET Longterm Coaching & Inter Mat, Phy, Che. Tutions @ Mogalrajpuram, VJA ✆ 9848558159, 7093357265

Real Estate

LAND FOR SALE

■ 'మెగా అవకాశం' ఫామ్‌ల్యాండ్ '11 సెంట్లు 5 లక్షలు మాత్రమే. 5 నుండి 60 సంవత్సరముల వరకు ఏటా 2 నుండి 5 లక్షల ఆదాయం పొందవచ్చు. ఫోన్: 9133574455

PLOT FOR SALE

■ ఇంటి స్థలం అతితక్కువ ధరలో అమరావతి ORRకి వేదాద్రి ఇండస్ట్రియల్ జోన్ కు నందిగామ దగ్గర, బండిపాలెంలో 60 అ॥ల రోడ్డు కు, ఇళ్ళ మధ్యలో ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్లు కలవు. ✆ 88018 03689

Services

GOLD FINANCE

■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 81422 37635

Wanted

■ మచిలీపట్నం బైపాస్ రోడ్‌లోని కృష్ణవేణి ఐటీఐ కాలేజీలో పని చేయుటకు B.Tech ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ /మెకానికల్ /కంప్యూటర్ సైన్స్ చదివినవారు కావలెను. కాలేజ్ ఆవరణలో ఉచిత వసతి కలదు సంప్రదించండి: 98486 79360

■ Tally, MS OFFICE & తెలుగు టైపింగ్ అనుభవం కలిగి సీతారామపురములో సా॥ 5 to 8 పని చేయుటకు మహిళా అభ్యర్థి కావలెను సంప్ర ✆ 93482 88381

■ ANMలు, ల్యాబ్ టెక్నీషియన్ మరియు స్వీపర్ నర్సింగ్ హోమ్ నందు కానూరు, VJA లో పనిచేయుటకు కావలెను. సంప్ర ఫోన్: 96667 08089

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ సూరంపల్లి ఏరియా లో కావలెను అర్హత 10th పాస్ & ఫెయిల్డ్ సంప్రదించండి. ఫోన్: ✆ 9573419669, 8639680526

■ VJA, గన్నవరం పరిసర ప్రాంతాలలో ANM స్టాఫ్, సెక్యూరిటీ గార్డ్స్, అనుభవము గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ✆ 78427 60504

■ సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, పిక్కర్స్ VJA, బంటుమిల్లిలలో కావలెను. వ: 50 లోపు, Q: టెన్త్. ✆ 9490248039, 9490380213

■ స్వామి వివేకానంద గ్రూపు (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9502501122, 9573691122

■ పోరంకి లోని ప్రముఖ పబ్లికేషన్స్‌కు డిగ్రీ (Bsc) ఉత్తీర్ణులై డీటీపీ నందు ఆసక్తి కలిగిన 30 సం లోపు యువతీ యువకులకు శిక్షణ ఇవ్వబడును. శిక్షణ కాలంలో నెలకు 10,000/- శిక్షణ అనంతరం వారి యొక్క అర్హతను బట్టి నెలకు 14000/- నుండి 16000/- వరకు జీతం ఇవ్వబడును. సంప్రదించండి ✆ 7730035678

■ డైరెక్ట్ జాయినింగ్ మా కంపెనీ కాలేజీల యందు సూపర్ వైజర్స్, స్టోర్ ఇంచార్జి, డ్రైవర్స్ Ex.ఆర్మీ కా. (రూమ్, భో) PF ESI సా. జీ. 18 టు 32K సెల్: 85209 21079

■ కష్టపడేపని కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. Ph: 9666253675

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు చెప్పే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

9010210386 | 9010201611 | 9505507329 | 9010577706 | 9010210382

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा / Bank of Baroda)

గాంధీ నగర్ బ్రాంచ్, 26-16-04, ఉయ్యూరు జమిందారు వీధి, గాంధీనగర్, విజయవాడ-520003, కృష్ణా జిల్లా. ఫోన్: 0866-2577101, 102, E mail:ganvij@bankofbaroda.com

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(APPENDIX IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

[illegible]

సమనిక : ఈ స్వాధీనత నోటీసు తేది.24.07.2025 నాటి మా మునుపటి స్వాధీనత నోటీసును రద్దు చేసి భర్తీ చేస్తుంది.

తేది : 05-08-2025 | సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ | బ్యాంక్ ఆఫ్ బరోడా

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SHRIRAM Finance)

సమోదిత కార్యాలయం: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 కార్యాలయ చిరునామా:- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నెం.14-1-1/2బి, 2వ అంతస్తు, ... ఎదురుగా, జోనల్ కార్యాలయం, మహారాణిపేట, విశాఖపట్నం-530002.

స్వాధీనతా ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, ఎన్‌సీఎల్‌టీ బ్రాంచ్-II చెన్నై, తేది 9-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీనాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వశాఖ లేఖ) ద్వారా శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ గా తిరిగి పేరు పెట్టబడిన ... కంపెనీల చట్టం, 2013 క్రింద ... శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 ... సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ... సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ... సెక్షన్ 13(12) ... [illegible] ... తేది 04 ఆగస్టు 2025 న ...

[illegible]

డిమాండ్ నోటీసు తేది: 19.12.2024

ప్రదేశం : విశాఖపట్నం, తేది: 04.08.2025 | సం/- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

కెనరా బ్యాంక్ Canara Bank

ఎ ఆర్ ఎమ్ బ్రాంచ్, సర్కిల్ ఆఫీసు, డి.నెం. 54-15-4బి, గ్రౌండ్ అంతస్తు, లక్ష్మి అవెన్యూ, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ, లింగ్ రోడ్డు, విజయవాడ ఏపీ-520008. ఫోన్: 8331011695, ఇ-మెయిల్: armvij@canarabank.com

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) ... [illegible] ... తేది 25.08.2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అదే" ... [illegible]

ఇ-వేలం తేది & సమయం: 25.08.2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 4.00 గం.ల వరకు (అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిముషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో) | ధరావత్తు సమర్పించుటకు ఆఖరి తేది: 25.08.2025, సా॥ 4.00 గం.ల లోపు

రిజర్వ్ ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 25.08.2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరచి జమచేయాలి.

క్ర. సం	ఋణగ్రహీత /హామీదారులు & బ్రాంచి వివరములు (అన్ని ఖాతాలు ఎ.ఆర్.ఎం బ్రాంచ్ విజయవాడకు బదిలీ చేయబడినవి)	బకాయి మొత్తం	తనఖాలో ఉన్న ఆస్తి వివరములు	రిజర్వ్ ధర (రూ.లో)	ఇ.ఎం.డి (రిజర్వు ధరలో 10%)
1	లబ్బీపేట బ్రాంచ్ [illegible]	రూ. 53.07 లక్షలు	[illegible]	రూ. 16.50 లక్షలు	రూ. 1.65 లక్షలు
2	[illegible]	రూ. 30.06 లక్షలు	[illegible]	రూ. 18.00 లక్షలు	రూ. 1.80 లక్షలు
3	[illegible]	రూ. 28.91 లక్షలు	[illegible]	రూ. 22.20 లక్షలు	రూ. 2.22 లక్షలు
4	[illegible]	రూ. 35.40 లక్షలు	[illegible]	రూ. 10.50 లక్షలు	రూ. 1.05 లక్షలు

ఆస్తి తనిఖీ తేది & సమయం: 21.08.2025, ఉ॥ 11.00 గంటల నుండి సా॥ 4.00 గంటల వరకు.

అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు దయచేసి కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి ... ఫోన్: 8331011695

[illegible]

ఇ-వేలం ... https://baanknet.com/eauction-psb ... హెల్ప్‌డెస్క్: 7046612345/6354910172/8291220220/9892219848 / 8160205051, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 05.08.2025, ప్రదేశం: విజయవాడ | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

రవీంద్రనాథ్ ఠాగూర్‌కు నివాళి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో గురువారం రవీంద్రనాథ్ ఠాగూర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ అధికారి కేవీఆర్ఎస్ ప్రసాద్ పాఠకులు, విద్యార్థులతో కలసి రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్ర, రచనలను పాఠకులు, విద్యార్థులకు వివరించారు. అనంతరం గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన రవీంద్రనాథ్ ఠాగూర్ జీవిత చరిత్రను తెలిపే పుస్తకాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను విద్యార్థులు, పాఠకులు సందర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కె.కృష్ణ ప్రణీత, మానస తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీలో మహిళలకు ఉపాధి అవకాశాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆర్మీ రంగంలో మహిళలకు అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఆర్మీ కెప్టెన్, మోటివేషనల్ స్పీకర్ యాషిక త్యాగి అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళాభివృద్దే దేశాభివృద్ధి అని ఆమె సూచించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో ఫిక్కీ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో గురువారం మహిళా శక్తి, ఎదుగుదల, దేశాభివృద్ధిలో పాత్ర అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో మహిళలతో పాటు, పలు కళాశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న కెప్టెన్, మోటివేషనల్ స్పీకర్ యాషిక త్యాగి మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళల్లో అంతర్లీనంగా ఎంతో శక్తి ఉంటుందని, ఆ శక్తిని వెలికి తీస్తే అద్భుతాలు సృష్టించగలరని తెలిపారు. ఆర్మీ ద్వారా దేశాన్ని సంరక్షించే బాధ్యత నేటి పౌరులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్‌పర్సన్ అమ్రిత కుమారి, సీనియర్ వైస్ చైర్‌పర్సన్ సుప్రియ మలినేని, దీప్తి చలసాని, తులజా దేవినేని తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ సబ్సిడీ బాధితులను ఆదుకోవాలి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంఎస్ఎంఈ స్కీంలో కొనుగోలు చేసిన వాహనాలకు ప్రభుత్వం తక్షణమే సబ్సిడీ విడుదల చేసి ఆదుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ అద్దె బస్సుల యజమానుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈరి రాజశేఖర్ మాట్లాడుతూ ఈ స్కీమ్ ద్వారా కొనుగోలు చేసిన వివిధ వాహనాలకు ప్రభుత్వం వెంటనే సబ్ ప్లాన్ నిధులు విడుదల చేసి ఆదుకోవాలని కోరారు. ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సామాజిక వర్గాలకు చెందిన లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీకి అద్దె బస్సులు ఏర్పాటు చేసే క్రమంలో మైలేజ్ రాని రూట్లను కేటాయించారని, దీంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. డ్రైవర్ల కొరత కారణంగా బస్సులు నిలిచిపోయాయన్నారు. ప్రభుత్వం కనీసం సబ్సిడీలు రిలీజ్ చేస్తే కొంత ఊరట లభిస్తుందన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి మేళం భాగ్యరావు మాట్లాడుతూ న్యాయమైన సమస్యపై ముఖ్యమంత్రి స్పందించి ఆదుకోవాలని కోరారు. సమావేశంలో షెడ్యూలు క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మేడిద బాబురావు, లీగల్ ఎడ్వయిజర్ గంగోలు శామ్యూల్, కమిటీ సభ్యులు మహేష్, జి. విజయ్‌కుమార్, కె. వర్ధనరావు, శామ్యూల్ రత్నకుమార్, మొగలి అద్దెయ్య, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో స్టెల్లా విద్యార్థినుల పర్యటన



పటమట(విజయవాడతూర్పు): నేషనల్ హ్యాండ్లూమ్ డే సందర్భంగా పటమటలోని స్టెల్లా కళాశాల హిస్టరీ – టూరిజం విభాగం ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థినులు చేనేత కార్మికులు సమస్యలు, ఇతర అంశాలు పరిశీలించటానికి చీరాల పర్యటన చేశారని కళాశాల చరిత్ర విభాగాధినేత డాక్టర్ బ్యూలా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పర్యటనలో విద్యార్థినులు చేనేత కార్మికులతో వారి సమస్యలు, సవాళ్లను, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలపై వారికి అవగాహన కల్పించామని, మన ప్రాంతీయ చేనేత పరిశ్రమ అందాన్ని అభినందించడానికి చరిత్ర, పర్యాటకం – పబ్లిక్ పాలసీపై ఈ క్షేత్రస్థాయి పర్యటన సాగిందన్నారు. విద్యార్థినులకు ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందేందుకు, స్వాభావిక సవాళ్లను లేదా సమస్యలను అంచనా వేయడానికి, చేనేత కళాకారుల కృషిని విద్యార్థులు అవగాహన కల్పించామని చెప్పారు. ఈ పర్యటనలో అధ్యాపకులు కెప్టెన్ శైలజ అంజనీ సింహా, విద్యార్థినులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు శ్రావణ శోభ

- వరలక్ష్మి వ్రతానికి పూజ సామగ్రి కొనుగోలుతో సందడిగా మారిన మార్కెట్లు
- కొండెక్కిన పూలు, పూజా సామగ్రి ధరలు



హోల్‌సేల్ పూల మార్కెట్‌లో కొనుగోలుదారుల రద్దీ



పూలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని నగరంలోని పూల మార్కెట్ వినియోగదారులతో పోటెత్తాయి. కొన్ని పూల ధరలు అందుబాటులో ఉన్నా మరికొన్ని ధరలు అమాంతం పెరిగిపోవడంతో నగరవాసులు బెంబేలెత్తారు. శ్రావణ శుక్రవారం అందులోనూ వరలక్ష్మి వ్రతం కావడంతో ఇళ్లలో ప్రత్యేక పూజలు, ఇతర వ్రతాలను నిర్వహించుకోవడం ఆనవాయితీ. ఆ క్రమంలో గురువారం మార్కెట్‌కు నగర వాసులు బారులు తీరారు. ముఖ్యంగా నగరంలోని రాజీవ్ గాంధీ హోల్‌సేల్ పూల మార్కెట్‌లో కిలో కనకాంబరాలు రూ.1500లు పలకగా రెండు రోజుల క్రితం అవే పువ్వులు నాలుగు వందలు మాత్రమే పలికింది. అదే క్రమంలో మల్లెపూలు మంగళవారం రెండు నుంచి మూడు వందలు పలకగా గురువారం వెయ్యి నుంచి 1200లకు పెరిగింది. సన్నజాజులు కూడా నాలుగు నుంచి రూ.1500కు చేరింది. అలాగే చామంతి, గులాబీ గురువారం ఆరు నుంచి ఎనిమిది వందలకు విక్రయించారు. బంతిపువ్వులు రూ.200లు, హైబ్రీడ్ గులాబీ వంద, రెండు వందల చొప్పున విక్రయించారు. వాటితో పాటుగా బెంగళూరు నుంచి వచ్చే గులాబీ 20 పూల కట్ట రూ.200లకు విక్రయించారు. అదేవిధంగా పూల దండల ధరలు సైతం అమాంతం కొండెక్కాయి.

పండ్ల ధరలకు రెక్కలు

పండ్ల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. వరలక్ష్మి వ్రతం రోజున మహిళలు వాయినాలు ఇవ్వడం పరిపాటి. అందులో ఒకటి, రెండు పండ్లను జతచేసి వాయినాలు ఇవ్వడం ఆనవాయితీ. అందులో భాగంగా వాటిని కొనుగోలు చేయడానికి వచ్చిన మహిళలు వాటి ధరలు చూసి అవాక్కయ్యారు. బుధవారం సాధారణ అరటిపండ్లు డజను రూ.50లకు విక్రయించగా వాటిని గురువారం రూ.100లకు తక్కువ లేదంటూ వ్యాపారులు గట్టిగా చెప్పి మరీ విక్రయాలు చేశారు. అలాగే ద్రాక్ష సాధారణ రోజుల్లో రూ.100లు పలికే ధర గురువారం రూ.200 పలికింది. అదేవిధంగా బత్తాయి ధరలు కొంచెం అందుబాటులో ఉండగా, దానిమ్మ, జామ ధరలు కూడా సామాన్యులకు అందుబాటులో లేవు.

అందుబాటులో యాపిల్

సాధారణంగా ఆపిల్ ధర ప్రతిసారీ అధికంగా ఉంటుంది. కానీ ఈ ఏడాది శ్రావణంలో మాత్రం ఆపిల్ ధర అందుబాటులోకి వచ్చింది. ఒక మోస్తరు కాయ 15 నుంచి రూ.20 రూపాయాలు పలకడంతో ఆపిల్‌ను తీసుకోవడానికి వినియోగదారులు ఆసక్తి చూపారు. దీంతో కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఆపిల్ అమ్మకాలు జోరుగా సాగాయి.

మూర పువ్వులు రూ.80

వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని వన్‌టౌన్ మార్కెట్లు కళకళలాడాయి. బంతిపువ్వులు మూర రూ.80లకు విక్రయిస్తున్నారంటే వాటి ధరలు ఎంతగా పెరిగాయో అర్థం చేసుకోవచ్చు. వ్రతాలను నోచుకునే కుటుంబాలు వారికి కావాల్సిన పూజ సామగ్రి ఇతర వస్తువుల కోసం మార్కెట్లకు తరలిరావడంతో వన్‌టౌన్‌లోని ప్రధాన వ్యాపార కూడళ్లన్ని బిజీబిజీగా దర్శనమిచ్చాయి. ప్రధానంగా కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో మామిడి ఆకులు, ఇతర పూలు, పండ్లు, కొబ్బరికాయలు కొనుగోళ్లతో వన్‌టౌన్‌వాసులు బిజిబిజీగా దర్శనమిచ్చారు. వాటి అమ్మకాలతో మార్కెట్ సెంటర్ సందడిగా మారింది. అలాగే పచారి సరుకుల కొనుగోళ్లతో శివాలయంవీధి, మొయిన్‌బజార్‌లు రద్దీగా మారాయి. అంతేకాకుండా లక్ష్మి రూపుల కొనుగోళ్ల కోసం శివాలయంవీధిలోని బంగారు దుకాణాలన్ని కళకళలాడాయి. వరలక్ష్మి వ్రతం రోజున లక్ష్మి రూపును పూజలో ఉంచి ధరించటం ఆనవాయితీ కావడంతో తప్పనిసరిగా వారివారి స్థాయిల్లో మహిళలు లక్ష్మి రూపులను కొనుగోలు చేస్తుంటారు. దీంతో వన్‌టౌన్‌లోని దుకాణాలన్ని రద్దీగా దర్శనమిచ్చాయి. వాటితో పాటుగా వస్త్రలత కూడా వినియోగదారులతో హడావుడిగా కనిపించింది. వస్త్రలతలోని పెద్ద దుకాణాలు, మ్యాచింగ్ సెంటర్లు వినియోగదారులతో కళకళలాడాయి. అలాగే కాళేశ్వరరావు మార్కెట్‌లోని కూరగాయాల విభాగం కూడా వినియోగదారులతో రద్దీగా దర్శనమిచ్చింది. కేజీ మార్కెట్ సెంటర్‌లో పదంటే పది బంతిపూల కవరు పది రూపాయలు, పది చామంతి పూల కవరు రూ.20ల చొప్పున విక్రయించారు.

కిటకిటలాడిన మార్కెట్లు

నగరంలోని పండ్లు, పూలు, ఇతర పూజా సామగ్రిని విక్రయించే మార్కెట్లు కిటకిటలాడాయి. కనీసం అడుగుతీసి అడుగు వేయడానికి కూడా ఖాళీ లేకుండా వినియోగదారులు ఆయా మార్కెట్లకు పోటెత్తారు. ముఖ్యంగా వన్‌టౌన్‌లోని రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ మార్కెట్‌లో లోపలకు వెళ్లేందుకు ఒక్కొక్కరికి కనీసం పావుగంటకు పైగా సమయం పట్టిందంటే రద్దీ ఎంతగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అలాగే కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్, బీసెంట్‌రోడ్డు తదితరప్రాంతాల్లో సైతం పండ్ల, పూల మార్కెట్లకు నగరవాసులు పోటెత్తారు. మార్కెట్ల రద్దీ కారణంగా ఆయా ప్రాంతాల్లో పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అంతేకాకుండా పలు మార్లు ట్రాఫిక్ స్తంభించింది.

సిఫార్సులేఖ ఉంటేనే వీఐపీ దర్శనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):వీఐపీ దర్శనాలు దుర్వినియోగం అవుతున్న నేపథ్యంలో దుర్గగుడి అధికారులు గురువారం కీలక నిర్ణయం తీసుకున్నారు. గత నెల రోజులుగా సిఫార్సులపై వచ్చే వారితో అనేక ఇబ్బందులు ఎదురవడమే కాకుండా ప్రోటోకాల్ దర్శనాలకు ఇబ్బంది కలుగుతుంది. గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ వ్యవస్థలకు చెందిన ప్రముఖులు దర్శనానికి వచ్చేసే తరుణంలో ముందుగా సమాచార కేంద్రానికి తెలియజేసేవారు. అయితే వారి బంధువులు, స్నేహితులకు సిఫార్సు చేసినా వారికి కూడా వీఐపీ దర్శనాలను దేవస్థానం కల్పించేంది. ఇకపై ప్రముఖులు, వారి కుటుంబ సభ్యులు దర్శనానికి విచ్చేసే ముందుగానే సమాచార కేంద్రంలో దర్శనానికి విచ్చేసే వారి సంఖ్య, వాహనం నెంబర్ ఇతర వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రముఖులు, ప్రజాప్రతినిధులు తాము స్వయంగా రాకుండా తెలిసిన వారికి, బంధువులకు అమ్మవారి దర్శనం కల్పించాలంటే తప్పని సరిగా లెటర్ హెడ్, లేఖను దేవస్థానానికి పంపాల్సి ఉంటుందన్నారు.

12 మందికి ఏఎస్ఐలుగా పదోన్నతి



లబ్బీపేట(విజయవాడతూర్పు):ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్స్‌గా పనిచేస్తున్న 12 మంది ఏఎస్ఐలుగా పదోన్నతి పొందారు. వారంతా గురువారం పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీ కేజీవీ సరితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతులు పొందిన వారికి సీపీ రాజశేఖరబాబు అభినందనలు తెలిపారు. విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు.

కొత్త పార్కులకు ప్రణాళికలు సిద్ధం చేయండి



అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త పార్కులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని విజయవాడ నగర పాలకసంస్థ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ప్రకాశం బ్యారేజ్, కృష్ణలంక, పటమట, పోలీస్ కంట్రోల్ రూం(పీసీఆర్) జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్క్రాప్ పార్క్‌ను సందర్శించి, పార్కులను అభివృద్ధి చేయాలని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు విభిన్న మొక్కలను నాటాలని, థీమ్ పార్కుల నిర్మాణం కోసం ప్రణాళికను రూపొందించాలని డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. నగర పరిధిలోని రోడ్లలో గుంతలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్యాచ్ వర్కులు ఎప్పటికప్పుడు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కమిషనర్ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అర్జునరావు, పర్యవేక్షణ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీధర్, బయాలజిస్ట్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు పాల్గొన్నారు.

స్వామినాథన్ సిఫార్సుల అమలుతో మనుగడ



స్వామినాథన్ శత జయంతి సభలో పుస్తకం ఆవిష్కరించిన రైతు సంఘాల నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవసాయ రంగం మనుగడ సాగించాలంటే డాక్టర్ స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాల్సిందేనని వక్తలు పేర్కొన్నారు. విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఏపీ రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యాన గురువారం హరిత విప్లవ పితామహుడు డాక్టర్.ఎం.ఎస్. స్వామినాథన్ శతజయంతి సభ జరిగింది. తొలుత ఆయా సంఘాల ప్రతినిధులు స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సీనియర్ సైంటిస్ట్ జీఎంవి ప్రసాదరావు మాట్లాడుతూ స్వామినాథన్ చెప్పిన విధంగా సేంద్రియ ఎరువులను తగ్గించి పచ్చి రొట్ట ఎరువులను పెంచి భూమిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు తక్షణం అమలు చేయాలన్నారు. విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణు గోపాలరావు మాట్లాడుతూ స్వామినాథన్‌ను అనేక అవార్డులతో సత్కరించిన ప్రభుత్వాలు ఆయన సిఫార్సులు అమలు చేయకపోవడం అన్యాయమని చెప్పారు. రైతు సంఘాల నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, కేవీవీ ప్రసాద్, వి.కృష్ణయ్య, ఎం.హరిబాబు మాట్లాడుతూ స్వామినాథన్ సహకార వ్యవసాయాన్ని పెంపొందించాలని ప్రతిపాదించారని, కానీ పాలకవర్గాలు కార్పొరేట్ వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నాయన్నారు. అనంతరం కమిషన్ సిఫార్సుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో వివిధ సంఘాల నాయకులు వీపీ ఆంజనేయులు, పంచకర్ల రంగారావు గొరిశెట్టి నాగేశ్వరరావు, శివనాగేంద్ర, ఎం.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

గుణదల(విజయవాడతూర్పు): విద్యుత్ కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను అమర్చి ప్రజా ధనాన్ని దోపిడీ చేస్తుందని సీపీఎం రాష్ట్ర నాయకుడు సీహెచ్ బాబురావు విమర్శించారు. గుణదల విద్యుత్‌సౌధ వద్ద జరిగిన కార్మికుల అరెస్టును ఖండిస్తూ, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదానీ గ్రూప్‌తో కుమ్మక్కై న రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను ప్రవేశ పెడుతోందన్నారు. ప్రీ పెయిడ్ పద్ధతిలో స్మార్ట్ మీటర్లను అమర్చడం ద్వారా కోట్లాది రూపాయల ప్రజా ధనం దోపిడీకి గురవుతోందని చెప్పారు. ఒకప్పుడు ఈ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన ప్రభుత్వమే ఇప్పుడు ఆదానీ గ్రూపుతో లాలూచీ పడి స్మార్ట్ మీటర్లను ప్రోత్సహిస్తోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వ విధానాలు మార్చుకోపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.

33 మంది మందుబాబులకు జరిమానా

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మందుబాబులకు న్యాయస్థానం జరిమానా విధించింది. వివరాల ప్రకారం నాలుగో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో 33 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసి 6వ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లెనిన్‌బాబు ముందు హాజరు పర్చగా ఆయన జరిమానా విధించారు. వారిలో నలుగురికి ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున, మరో 29 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

దాడి ఘటనలో నిందితుడికి జైలు

గుణదల(విజయవాడతూర్పు): భార్య తరపు బంధువులతో జరిగిన గొడవలో చంపుతానని బెదిరించి, దాడికి పాల్పడిన ఘటనలో నేరం రుజువు కావడంతో ఓ వ్యక్తికి ఆరు నెలలు జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానాను విధిస్తూ 1వ అడిషినల్ చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఎంఎస్ కరీముల్లా గురువారం తీర్పు వెల్లడించారు. మాచవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉడ్‌పేట శిఖామణి సెంటర్‌కు చెందిన కొండపల్లి లక్ష్మణరావు(36) కూలి పనులు చేస్తుంటాడు. మద్యం మత్తులో రోజూ భార్యతో, పుట్టింటి బంధువులతో గొడవలు పడుతుంటాడు. ఈ క్రమంలో భార్య తరపున బంధువు ఇంటికి వెళ్లి ఉద్దేశపూర్వకంగా గొడవ పడి చేతికందిన ఇనుప రేకుతో దాడి చేశాడు. దీంతో బాధితులు మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపారు.

మధురానగర్ - వాంబేకాలనీ ఆర్‌యూబీ నిర్మాణానికి వినతి

సాక్షి, న్యూఢిల్లీ: విజయవాడలోని మధురానగర్–వాంబే కాలనీ మధ్య ఆర్‌యూబీ నిర్మాణాన్ని పూర్తిగా రైల్వే శాఖ నిధులతో నిర్మించాలని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఢిల్లీలో గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన నిధులను త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. వాంబే కాలనీ, అజిత్ సింగ్ నగర్ ప్రాంతాల్లో ఒక లక్షకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని, దినసరి వేతనాలపై జీవించే వీరు ఉపాధి, వైద్యం, విద్య కోసం విజయవాడ నగరానికి వచ్చేందుకు 10 కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. వీరు దగ్గర మార్గంలో విజయవాడ వచ్చేందుకు ప్రధాన రైల్వే లైన్ అయిన చెన్నై–హౌరా హైస్పీడ్ లైన్ దాటుతుండగా, చాలా మంది మృతి చెందుతున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ఎంపీ తీసుకువచ్చారు.

గాయనీ గాయకులు సాంస్కృతిక వారధులు



సినీ, లలిత సంగీత కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

విజయవాడకల్చరల్: గాయనీ గాయకులు సాంస్కృతిక వారధులని, వారికి దేశ వ్యాప్తంగా గుర్తింపు ఉంటుందని అనిత ఆర్ట్స్ వ్యవస్థాపకుడు గొర్రెపాటి పవన్‌కుమార్ పేర్కొన్నారు. అనిత ఆర్ట్స్ సినీ, లలిత సంగీత ఆవిర్భావ కార్యక్రమాన్ని గాంధీనగర్‌లోని ఆశీష్ స్టూడియోలో గురువారం ప్రారంభించారు. పవన్ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. అనిత ఆర్ట్స్ ద్వారా నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తామని చెప్పారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ తెలుగు చిత్ర సీమలో తమ పేర్లు చిరస్థాయిగా నిలుపుకొన్న గాయనీ గాయకులను నిత్యం స్మరించుకోవాలని సూచించారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి నిర్వాహకుడు గోళ్ల నారాయణరావు, వివిధ రంగాలకు చెందిన ప్రదీప్‌కుమార్, వేమూరి వెంకటేశ్వరరావులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. గాయనీ గాయకులు మీనాకుమారి, గాయత్రి, ఉమా బలరాం, విజయ్‌కుమార్ తదితరులు పాట పాడుదాం పేరుతో పలు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు.

స్టెల్లా ఆధ్వర్యంలో ఫ్లాష్‌మాబ్



పీవీపీలో ఫ్లాష్‌మాబ్ చేస్తున్న విద్యార్థినులు

పటమట(విజయవాడతూర్పు): ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జరుగుతున్న సంస్కృతిక భాషా వారోత్సవాల సందర్భంగా స్టెల్లా కళాశాల విద్యార్థినులు నగరంలోని లబ్బీపేటలో ఉన్న పీవీపీ మాల్‌లో కళాశాల సంస్కృత విభాగానికి పలువురు విద్యార్థినులు సంస్కృత గీతాలను ఆలపిస్తూ ఫ్లాష్‌మాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంస్కృతం అధ్యాపకులు డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ భాషా సాహిత్యంలో సంస్కృతానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రపంచంలోని మొదటి జ్యోతిష్య గ్రంథం, మొదటి నాట్య శాస్త్ర గ్రంథం, మొదటి వ్యాకరణ గ్రంథం సంస్కృత భాషలోనే ఉద్భవించాయన్నారు. ప్రపంచ విజ్ఞాన చరిత్రలో సంస్కృత భాషకు విశిష్టమైన స్థానం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్ మాల్‌లో అందరినీ ఆకట్టుకుంది.

భానుమతి శత జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి



భానుమతి శతజయంతి సభలో విజయలక్ష్మి తదితరులు

విజయవాడకల్చరల్: సినీనటి, దర్శకురాలు, నిర్మాత, సంగీత దర్శకురాలు భానుమతి శత జయంతి ఉత్సవాలను ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ద్వారా నిర్వహించాలని మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం ఆధ్వర్యంలో భానుమతి శత జయంతి వేడుకలను గాంధీనగర్‌లోని కొౌతా పూర్ణానందం కళావేదికపై గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో స్వర్ణయుగం అని పిలుచుకునే కాలం భానుమతిదని పేర్కొన్నారు. దర్శకురాలుగా ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. తెలుగు సినిమా దిగ్గజాల శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తే సాంస్కృతిక కళాసంస్థలు సహకరిస్తాయన్నారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, కే డేవిడ్‌రాజు, డీ చంద్రశేఖర్, ప్రభల శ్రీనివాస్, శ్యాం ప్రసాద్, చిట్టబ్బాయి పాల్గొన్నారు.

• నగరంలో రాఖీ సందడి



హోల్‌సేల్ మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన రాఖీలు



మిక్కీమౌస్, బ్యాట్స్‌మ్యాన్ రూపాలతో ఉన్న రాఖీలు

రాఖీ పర్వదినం సందర్భంగా నగరంలో రాఖీల వ్యాపారం జోరుగా సాగుతోంది. అన్నా చెల్లెళ్లు.... అక్కా, తమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా నిర్వహించుకునే పండుగ రక్షాబంధన్. శ్రావణ మాసంలో పౌర్ణమి శనివారం రాఖీ పండుగ జరుపుకుంటారు. పాతబస్తీతో పాటు బీసెంట్ రోడ్డులో రాఖీల విక్రయాల సందడి నెలకొంది. విభిన్న ఆకృతులు, ఆకర్షణీయమైన రంగులు, వివిధ మోడల్స్‌లో యువతకు కనువిందు చేస్తున్నాయి. పాతబస్తీలోని బంగారు దుకాణాల్లో వెండితో తయారు చేసిన రాఖీలు విక్రయిస్తున్నారు.

– వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

సెలవు రోజుల్లో అద్దె చెల్లింపునకు వీఎంసీ అవకాశం

పటమట(విజయవాడ తూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న వివిధ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని షాపుల అద్దెలను సెలవు రోజుల్లో కూడా చెల్లించవచ్చని వీఎంసీ ఎస్టేట్స్ అధికారి డాక్టర్ ఏ.శ్రీధర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణపురంలోని సర్కిల్-2 కార్యాలయంలో, కాళేశ్వరరావు మార్కెట్‌లోని క్యాష్ కౌంటర్‌లో శుక్రవారం, శనివారం, ఆదివారాల్లో అద్దె చెల్లింపులు చేయవచ్చన్నారు. అద్దె చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
విజయవాడ ఈస్ట్ : 99122 20539
Office mail : sakshiads@gmail.com

క్లుప్తంగా...

కొండపి సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అరాచకం

సాక్షి, అమరావతి: కొండపి సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అరాచకాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కొండపి సర్పంచ్ అభ్యర్థి మేరి తదితరులతో ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నిని కలిసి వినతిపత్రం సమర్పించారు. 14 ఏళ్ల న్యాయ పోరాటం తర్వాత కొండపి సర్పంచ్ ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ నెల 10న పోలింగ్ జరగాల్సి ఉండగా బెదిరించి, భయపెట్టి కుట్రలతో ఏకగ్రీవం చేసుకున్నారని తెలిపారు. అభ్యర్థి మేరి సంతకాన్ని ఫోర్జరీ చేసి నామినేషన్ ఉపసంహరించారని వివరించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. నామినేషన్ల తర్వాత సర్పంచ్ అభ్యర్థి మేరి ఊరు వదిలి వేరే చోట తలదాచుకోవాల్సి వచ్చిందన్నారు. అన్ని సాక్ష్యాలను ఎన్నికల కమిషనర్‌కు అందించామన్నారు. నోటిఫికేషన్ ప్రకారం ఈ నెల 10వ తేదీన పోలింగ్ జరపాలని, లేదంటే న్యాయపోరాటం చేస్తామని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎలా జరుగుతున్నాయి అనేదానికి కొండపి ఓ ఉదాహరణ అని వెలంపల్లి పేర్కొన్నారు. పులివెందులలో బీసీ నేత, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేశారని, కొండపిలో దుర్మార్గంగా వ్యవహరించారని అన్నారు.

కరువు తాండవిస్తున్నా చలనం లేని సర్కారు

ఎంవీఎస్ నాగిరెడ్డి మండిపాటు



సాక్షి,అమరావతి: రాష్ట్రంలో వర్షాభావంతో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొని రైతులు విలవిల్లాడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని, తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు, ఏపీ అగ్రికల్చర్ మిషన్ మాజీ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ''ప్రస్తుత ఖరీఫ్‌లో జూన్ 1 నుంచి ఆగస్టు 7 వరకు.. రాష్ట్రంలో కురవాల్సిన సరాసరి సాధారణ వర్షపాతం 287.03 మి.మీ. కాగా గురువారం వరకు కురిసిన సరాసరి వర్షం 209.84 మి.మీ. అంటే లోటు వర్షం 26.89 శాతం. రాష్ట్రం మొత్తం మీద ఈ ఖరీఫ్‌లో మొత్తం సాగు అంచనా 31.15 లక్షల హెక్టార్లు కాగా, బుధవారం (ఆగస్టు 6వ తేదీ) వరకు 16.18 లక్షల హెకార్లు.. అంటే 52 శాతం మాత్రమే సాగు జరిగింది. వర్షాభావం పంటలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత ప్రభుత్వం రైతులకు ఎంతో ప్రయోజనం కల్పిస్తూ, అమలు చేసిన ఉచిత పంటల బీమాను కూటమి ప్రభుత్వం ఎత్తేసింది. ఇది దారుణం. పంటల బీమా అమలు చేయాల్సిందే'' అని నాగిరెడ్డి పేర్కొన్నారు.

చేనేత రంగానికి చీకటి రోజులు

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం




చేనేత దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న అప్పిరెడ్డి

సాక్షి, అమరావతి: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు వివిధ కార్యక్రమాల రూపంలో దాదాపు రూ.3,706 కోట్ల మేర చేనేత కార్మికులకు మేలు జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చేనేత రంగానికి చీకటి రోజులు వచ్చాయని చెప్పారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లేళ్ళ అప్పిరెడ్డి, దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సురేంద్రబాబు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహన్‌రావు మాట్లాడారు. చేనేత కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు.

దాడి జరిగింది దళితులపై కాదు

పాములపర్రు ఘటనపై డిప్యూటీ స్పీకర్ రఘురామ వింత భాష్యం



ఉండి: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం పాములపర్రులో చోటు చేసుకున్న ఘటనపై బుధవారం 'సాక్షి'దినపత్రికలో వెలువడిన కథనానికి స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు గురువారం వివరణ ఇస్తూ వింత భాష్యం చెప్పారు. అది క్రైస్తవులకు సంబంధించిన శ్మశానం అని చెప్పారు. అందుకే జరిగిన దాడి దళితులపై కాదని తనదైన భాష్యం చెప్పారు. ''పాములపర్రులో 82 సెంట్ల పుంత ఉండేది. దానిలో 42 సెంట్ల భూమిని క్రైస్తవుల శ్మశానవాటికకు ఇచ్చారు. దీనిని మినహాయించి మిగిలిన భూమిలో రోడ్డు వేయాలని అధికారులకు చెప్పాను. అధికారులపై క్రైస్తవులు దాడి చేయడంతోనే పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సాక్షి పేపర్‌లో రాయాలనే క్రైస్తవులు సొమ్మసిల్లి పడిపోయారు తప్ప పోలీసులు కొట్టినందుకు కాదు.'' అని రఘురామకృష్ణరాజు ఎద్దేవా చేశారు. క్రైస్తవుల శవాలు సాక్షి కార్యాలయంలో పాతిపెడితే మీరు ఒప్పుకుంటారా అని వ్యాఖ్యానించారు.

'అప్పు'డే పరగడుపు

కొత్త అప్పులకు కూటమి సర్కారు రెడీ

బడ్జెట్ బయట ఏపీఐఐసీ, విద్యుత్ డిస్కమ్స్ ద్వారా

రూ.12,973.94 కోట్ల రుణాలు తీసుకునేందుకు కేబినెట్ ఆమోదం



సాక్షి, అమరావతి: బడ్జెట్ బయట ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ సమావేశం అలా ఆమోదం తెలిపిందో లేదో.. అందుకు సంబంధించి గురువారం వెనువెంటనే వేర్వేరుగా ఉత్తర్వులు జారీ అయిపోయాయి. బడ్జెట్ బయట ఏపీఐఐసీ, డిస్కమ్స్ ద్వారా ఏకంగా రూ.12,973. 94 కోట్ల అప్పునకు ఇంధన శాఖ, పరిశ్రమల శాఖ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశాయి. ఇందులో ఏపీఐఐసీ ద్వారా రూ.7,500 కోట్ల అప్పును వచ్చే 12 నెలల్లోగా బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయం వేదికగా కోటి రూపాయలు అధీకృత షేర్ కేపిటల్, రూ. లక్ష పెయిడ్-అప్ షేర్ కేపిటలతో స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేశారు. ఎస్‌పీవీ బోర్డు అవసరాల ఆధారంగా ఎప్పటికప్పుడు అధీకృత పెయిడ్-అప్ కేపిటల్, షేర్ కేపిటల్‌ను పెంచవచ్చునని తెలిపారు. ప్రస్తుతం ఏపీఐఐసీ దగ్గర ఉన్న భూములను ఎస్‌పీవీకి బదిలీ చేస్తారు. ఆ బదిలీ చేసిన భూములను బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు తనఖా పెట్టి 9-12 నెలల కాలవ్యవధిలోనే రూ.7,500 కోట్లు రుణాన్ని సమీకరించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఏపీఐఐసీ దగ్గర 13,000 ఎకరాలకుపైగా భూములున్నాయని, కొత్తగా మరో 30 వేల ఎకరాలను సేకరించడంతోపాటు ఆ భూములను పరిశ్రమల అవసరాలకు అభివృద్ధి చేసేందుకు రూ.7,500 కోట్లు అప్పు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

విద్యుత్ డిస్కమ్స్ ద్వారా ఇలా..

ఇదిలా ఉంటే ప్రస్తుతం స్మార్ట్ మీటరింగ్‌తోపాటు రేవ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టర్ స్కీమును అమలు కొనసాగింపునకు ఏపీఎస్‌పీడీసీఎల్ ద్వారా రూ.3544.57 కోట్లు, ఏపీసీపీడీసీఎల్ ద్వారా రూ.1029.37 కోట్లు అప్పు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తూ ఇంధన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మరో పక్క ఇప్పటికే ఏపీపీడీసీఎల్ ఎస్‌బీఐ, యుబిఐ బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు చెల్లించేందుకు ఆ సంస్థ ఖాతాల్లో నిధుల్లేక దివాళా తీసింది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ, యూబీఐ బ్యాంకులు ఆర్‌బీఐకి, సిబిల్, క్రిసిల్ సంస్థలకు రిపోర్ట్ చేస్తామని హెచ్చరించాయి. ఏపీపీడీసీఎల్ ఆర్థిక పరిస్థితి దిగజారడంతో చెల్లింపులు ఆలస్యం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆ బ్యాంకులు దగ్గర ఏపీపీడీసీఎల్ తీసుకున్న రూ.900 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

పింఛన్ కోసం కాళ్లరిగేలా తిరిగినా ప్రభుత్వం కరుణించ లేదు..

బిడ్డకు 100 శాతం వైకల్యం ఉన్నా అధికారులు దయచూప లేదు

పింఛన్ రాకుండానే ప్రాణాలు కోల్పోయిన తొమ్మిదేళ్ల చిన్నారి



తల్లిదండ్రులతో చిన్నారి అగ్గాల సందీప్



100 శాతం వికలాంగుడిగా ప్రభుత్వ వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్

మెళియాపుట్టి : ఆ బాలుడికి కాళ్లు, చేతులు పనిచేయవు. వినిపించదు కూడా. 2024లో శ్రీకాకుళం రిమ్స్ ప్రభుత్వ వైద్యులు అతడికి వందశాతం వైకల్యం ఉందని నిర్ధారించారు. కానీ ప్రభుత్వం అతడికి పింఛన్ మంజూరు చేయలేదు. కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు పింఛన్ ఇచ్చినా తీసుకునేందుకు ఆ బాలుడు లేడు. మెళియాపుట్టి మండలం బాణాపురం గ్రామానికి చెందిన అగ్గాల పార్వతి, సునీల్ కుమార్‌ల ఒక్కగానొక్క కుమారుడు సందీప్(9) పూర్తిగా దివ్యాంగుడు. బాణాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు దివ్యాంగ సర్టిఫికెట్ తీసుకుని పలుమార్లు మండల పరిషత్, సచివాలయాలకు తిరిగినా పింఛన్ మాత్రం రాలేదు. మూడు రోజుల కిందట విద్యార్థి తీవ్రమైన జ్వరంతో పలాసలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ప్రాణాలు విడిచాడు. దీంతో బిడ్డ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

రూ.పది లక్షల కోట్ల అప్పులున్నాయ్..!

జాతీయ చేనేత దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



సాక్షి, అమరావతి/మంగళగిరి: చాలా ఆర్థిక ఇబ్బందులున్నాయ్.. రూ.పదిలక్షల కోట్లు అప్పులున్నాయ్.. వాటికి వడ్డీలు, అసలు కట్టడానికే ఇబ్బందిపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఆటోనగర్ వీవర్స్ కాలనీలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. సభలో సీఎం మాట్లాడుతూ.. మీ (బీసీలు) వల్లే అధికారంలోకి వచ్చానని, నా మొదటి ప్రాధాన్యం వెనుకబడిన వర్గాలేనని, కొన్ని వర్గాలు వస్తుంటాయి.. పోతుంటాయని పేర్కొన్నారు. ఇంకా వైకుంఠపాళీ ఆడొద్దని, మళ్లీ మళ్లీ డెవలప్ చేయాలంటే ఇంకా నాకు ఓపిక లేదన్నారు. రాష్ట్రంలో బీసీల కోసం ఆదరణ-3 తెస్తామని, స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు సాధిస్తామని అన్నారు. నేతన్న భరోసా కింద ఏడాదికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రకటించారు. ఈ నెల నుంచే చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తామని సీఎం చెప్పారు.

అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం

చేనేత ఉత్పత్తులపై విధించే 5 శాతం జీఎస్టీని మొత్తం రూ.15కోట్లను ప్రభుత్వమే రీయింబర్స్ చేస్తుందని సీఎం పేర్కొన్నారు. చేనేతలో 5,386 మందికి లబ్ధి కలిగేలా రూ.5 కోట్లతో పొదుపు నిధి (థ్రిఫ్ట్ ఫండ్) ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమరావతిలో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. చేనేత సూర్యుడు ప్రగడ కోటయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని, మంగళగిరిలో పార్కుకు ఆయన పేరుపెట్టి, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు.

బ్రాహ్మణి కట్టిన చీరనే 98 మంది కొన్నారు : లోకేశ్

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు నడుస్తుంటే.. మంగళగిరిలో మాత్రం మోదీ, బాబు, లోకేశ్‌తో కూడిన ట్రిపుల్ ఇంజిన్ సర్కారు నడుస్తోందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. 'బ్రాహ్మణి మంగళగిరి చేనేత చీర కట్టిన తర్వాత ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అలాంటి చీరనే 98 మంది కొనుగోలు చేశారు' అని లోకేశ్ పేర్కొన్నారు.

పేదరిక నిర్మూలన కోసమే పీ-4

సాయం చేస్తే సంతృప్తి కలుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. విజయవాడలోని ఓ హోటల్లో గురువారం పీ-4పై పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు సమావేశమయ్యారు. పేదరిక నిర్మూలన కోసమే పీ-4 అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లాకు చెందిన మోహన్ రెడ్డి ఓ మండలంలో 729 కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చారు.

నవ్వులపాలైన నారా లోకేశ్..

టాస్క్‌ఫోర్స్ : ఎప్పటిలాగే మంత్రి నారా లోకేశ్ మరోసారి తప్పులో కాలేశారు. మంగళగిరిలో గురువారం చేనేత దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఎక్కడలేని ఉత్సాహం ప్రదర్శించారు. ఆ మాటల ప్రవాహంలో పాపం నవ్వులపాలయ్యారు. '2019 ఎన్నికల్లో.. నేను మంగళగిరిలో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయానని, అయితే, నన్ను 2024 ఎన్నికల్లో 53 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించి శాసనసభకు పంపించమని కోరాను. కానీ, ఏకంగా 91 వేల నాలుగు వందల 13 వేల మెజారిటీతో గెలిపించార'ని నోరుజారి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. 91 వేల నాలుగు వందల 13 వేలు ఏంట్రా బాబూ అంటూ సభకు వచ్చిన వారు తలపట్టుకుని నవ్వుకున్నారు.

బాబు వల్లే మగ్గం'... ఛిద్రం!

సాక్షి, అమరావతి: చేనేతకారులకు వైఎస్ జగన్ ఇచ్చిన ''నేతన్న నేస్తం'' పథకాన్ని కక్షపూరితంగా నిలిపివేసిన సీఎం చంద్రబాబు వారి బతుకులను దుర్లభం చేశారు. వైఎస్ జగన్ హయాంలో ఇచ్చిన పథకాలను అందకుండా చేశారు. మగ్గంపై ఆధారపడ్డ కార్మికుల జీవితాలను ఛిద్రం చేశారు. వారి ఆత్మహత్యలకు కారకుడయ్యారు. 50 ఏళ్లకే పెన్షన్ హామీని తుంగలో తొక్కారు. గత ప్రభుత్వం నేతన్నలకు వివిధ పథకాల కింద రికార్డు స్థాయిలో రూ.3,700 కోట్లకుపైగా సాయాన్ని అందించి అండగా నిలిస్తే చంద్రబాబు చేసింది శూన్యమని చేనేతకారులు మండిపడుతున్నారు. లబ్ధిదారుల సంఖ్యపైనా పొంతన లేని లెక్కలు చెబుతూ తాజాగా మరోసారి మోసగించిన చంద్రబాబు చేనేత చాంపియన్ మాదిరిగా పోజు కొట్టడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం నేతకారులకు ఉచిత విద్యుత్తు, పవర్ లూమ్స్‌కు రాయితీపై కరెంట్ అందించడంతో పాటు చేనేత వస్త్రాలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించిందని గుర్తు చేసుకుంటున్నారు.

మహిళలకు అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): మహిళలకు అన్ని బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి డిమాండ్ చేశారు. కాకినాడలో గురువారం మీడియాతో ఆమె మాట్లాడుతూ.. ఎటువంటి షరతులూ లేకుండా రాష్ట్రంలో అన్నిరకాల బస్సుల్లోనూ మహిళలను ఉచిత ప్రయాణానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో, ఎక్స్‌ప్రెస్ వంటి ఐదు రకాల బస్సులకు మాత్రమే వర్తింపజేయడం మోసమన్నారు. ఈ బస్సులు సగటున 40-50 కిలోమీటర్లకు మించి ప్రయాణించవన్నారు. సిటీ ఆర్డినరీ బస్సులు కూడా 30 కిలోమీటర్లు దాటి వెళ్లవన్నారు. ఎక్స్‌ప్రెస్ సర్వీసులు గరిష్టంగా ఒక రూటులో 150 కిలోమీటర్లకు మించి వెళ్లవని, పైగా వీటి సంఖ్య చాలా తక్కువని చెప్పారు. 'రూ.5 లక్షలు చెల్లించిన మద్యం దుకాణాలకు పర్మిట్ రూములు అనుమతించడాన్ని వైఎస్సార్‌సీపీ వ్యతిరేకిస్తోందని కల్యాణి స్పష్టం చేశారు.

నేతన్నలను నమ్మించి మోసం చేసిన చంద్రబాబు

- ఉచిత విద్యుత్ ఎప్పటినుంచి ఇస్తారో చెప్పండి
- మాజీ ఎంపీ బుట్టా రేణుక



కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల తరువాత చేనేత దినోత్సవం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు చేనేతలు గుర్తొచ్చారని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మాత్రం చంద్రబాబు నేతన్నలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కర్నూలులో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2014-19 లోను, 2024లో ఎన్నికల సమయంలోను చేనేతలను ఆదుకుంటామని కూటమి 25 హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. మగ్గాలకు ప్రకటించిన ఉచిత విద్యుత్ ఎప్పటినుంచి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలప్పుడు హామీలివ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత మరచిపోవడం చంద్రబాబు నైజమన్నారు. చేనేతలకు రుణమాఫీ, షెడ్లు, ఇళ్ల నిర్మించి ఇస్తామని, వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచిపోవడం వల్ల పనులు చేసుకోలేని నేతన్నలకు నెలకు రూ.2 వేలు చొప్పున రెండునెలలు ఇస్తామని, రూ.వెయ్యికోట్లతో నిధి ఏర్పాటుచేసి చేనేతలకు అండగా ఉంటామని చెప్పారని గుర్తుచేశారు. మరమగ్గాలకు 500 యూనిట్లు, హ్యాండ్‌లూమ్ మగ్గాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామంటూ ఇప్పుడు మాట్లాడటం వింతగా ఉందన్నారు. గతంలో రుణమాఫీ, హెల్త్‌కార్డులు, ఒక్కొక్కరికి రూ.1.50 లక్షలు సాయం చేస్తామని చెప్పిన వాటిలో ఒక్కటైనా అమలు చేశారా అని నిలదీశారు. యువగళం పాదయాత్రలో నేతన్నలకు ఇచ్చిన హామీలు అమలు చేశామని లోకేశ్ చెప్పడం వారిని మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో లబ్ధి రూ.3,706 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న నేతన్నల కోసం ఐదేళ్లలో రూ.3,706 కోట్లు ఖర్చుచేశారని చెప్పారు. నేతన్నకు ఏడాదికి రూ.24 వేల చొప్పున ఆ కుటుంబాలకు ఐదేళ్లలో రూ.1.20 లక్షల ఆర్థికభరోసా కల్పించారన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో నేతన్నల కోసం రూ.442 కోట్లు మాత్రమే ఖర్చుచేశారన్నారు. చంద్రబాబు పెట్టిన బకాయిలను కూడా జగనన్న మంజూరు చేశారని తెలిపారు. జగనన్న హయాంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి సబ్సిడీకి లూమ్స్ షెడ్లు, పరికరాలకు ఆర్థికచేయూత అందించారని చెప్పారు. వస్త్రాలను మంచి ధరకు మార్కెట్ చేసుకునేందుకు ఈ-కామర్స్ సంస్థలతో భాగస్వామ్యం కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన ప్రోత్సాహం వల్ల నేతన్నల సగటు వార్షికాదాయం రూ.15 వేలకు పెరిగిందని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బుట్టా నీలకంఠం, షరీఫ్, కంటూ, శ్రీకాంత్, పూర్ణచంద్ర పాల్గొన్నారు.

కర్నూలు డీఐజీకి రాష్ట్రపతి అవార్డులు ఇవ్వొచ్చు

- తాము లేకపోతే వైఎస్సార్‌సీపీ నాయకుల తలలు తెగేవని డీఐజీ చెప్పడం విడ్డూరంగా ఉంది
- శరీరంపై రక్తం మరకలు ఉన్నాయని, గాయాలు లేవని చెప్పడం ఆశ్చర్యంగా ఉంది
- రాజకీయ శక్తులు వచ్చిన అధికారులకు నిజాలు కనపడవు
- పథకం ప్రకారమే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రామును చంపేందుకు కుట్ర
- కర్నూలు డీఐజీ వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ మంత్రి పేర్ని నాని



చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఉప ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింసను అరికడుతున్నామని, తాము లేకపోతే వైఎస్సార్‌సీపీ నాయకుల తలలు తెగిపడేవని చెప్పిన కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్‌కి రాష్ట్రపతి పోలీస్ అత్యున్నత సేవల అవార్డు, రాష్ట్రపతి పోలీస్ అమోఘమైన అవార్డులను అందజేయవచ్చని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) అన్నారు. గురువారం మచిలీపట్నంలో పేర్ని నాని విలేకరులతో మాట్లాడుతూ 'మేం లేకపోతే వైఎస్సార్‌సీపీ నాయకుల తలలు తెగేవని డీఐజీ వ్యాఖ్యలు చేయటం దారుణం. అంటే పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాములను చంపాలని అనుకున్నారా?' అని ఆయన ప్రశ్నించారు. అదే విధంగా వైఎస్సార్‌సీపీ నాయకులు పత్తి యాపారం చేస్తున్నారని డీఐజీ వ్యాఖ్యానించటం కూడా విడ్డూరంగా ఉందన్నారు. 'వైఎస్సార్ కడప జిల్లాలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు వారు నిర్వర్తించాల్సిన బాధ్యతలను గాలికొదిలి పత్తి యాపారం చేయటం వల్ల హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయి. స్థానిక సంస్థల ఉప ఎన్నికల సందర్భంగా నామినేషన్ల ఘట్టం నుంచి ప్రచారం వరకు హింస, దౌర్జన్యాలు, దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడులకు పాల్పడ్డవారు ప్రతిరోజు అరాచకాన్ని కొనసాగిస్తున్నారంటే అధికార పార్టీకి పోలీసులు ఏ విధంగా కొమ్ముకాస్తున్నారో అర్థమవుతోంది. పథకం ప్రకారమే ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాములను చంపాలని కుట్ర పన్నారు' అని పేర్ని నాని ఆగ్రహం వ్యక్తంచేశారు.

'టీడీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేల్పుల రాము ధరించిన దుస్తులపై మాత్రమే రక్తం మరకలు కనిపిస్తున్నాయని, వారి ఒంటిపై దెబ్బలు ఏమీ లేవని డీఐజీ వ్యాఖ్యానించటం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీకి కొమ్ము కాసే అధికారులకు తాత్కాలికంగా రాజకీయ శక్తులు వచ్చాయి. వారికి ఇప్పుడు నిజాలు కనిపించవు. ఆ పార్టీ అధికారానికి దూరం కాగానే ఆ శక్తులు తొలగిపోతాయి.' అని పేర్ని నాని చెప్పారు.

రూ.25 లక్షలు లంచం తీసుకుంటుండగా...

ఏసీబీకి చిక్కిన గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్

ఎంవీపీ కాలనీ (విశాఖ జిల్లా): లంచం తీసుకుంటూ గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ సబ్బవరపు శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడ్డాడు. శ్రీ సత్యసాయి కన్‌స్ట్రక్షన్స్ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ చేకూరి కృష్ణంరాజు విశాఖ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని గిరిజన సంక్షేమ శాఖ నిర్మాణాల కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. పనులకు సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం నుంచి ఆయనకు భారీగా బిల్లులు మంజూరు చేయాల్సి ఉంది. ఆ నిధులు మంజూరు కోసం తనకు రూ.5 కోట్లు లంచం ఇవ్వాలని కృష్ణంరాజును శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అయితే, తాను అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో తొలుత రూ.25 లక్షలు ఇవ్వాలని సూచించాడు. దీంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని కృష్ణంరాజు..విజయవాడలోని ఏసీబీ కార్యాలయాన్ని సంప్రదించాడు. ఏసీబీ అధికారుల సూచనతో రూ.25 లక్షలను తీసుకుని శ్రీనివాస్ దగ్గరకు కృష్ణంరాజు గురువారం వెళ్లాడు. ఈ సొమ్మును శ్రీనివాస్ లంచం తీసుకుంటుండగా అతడిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అతడిపై కేసు నమోదు చేసి విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. కాగా, 2001, 2014ల్లో సైతం లంచం డిమాండ్ నేపథ్యంలో శ్రీనివాస్‌పై ఏసీబీ కేసులు నమోదైనట్లు ఆ శాఖ వెల్లడించింది. ఆయా కేసుల్లో శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నట్లు తెలిపింది.

'వైఎస్సార్‌సీపీ అంటూ తిరిగితే.. చంపేస్తాం!'

తాడిపత్రిలో జేసీ అనుచరుల రౌడీయిజం

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులు
- హెల్మెట్లు, మాస్కులు ధరించి అర్ధరాత్రి వేళ వీరంగం
- ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ దాడులు



పచ్చమూకలు దాడికి పాల్పడిన చేనేత కాలనీలోని వైఎస్సార్‌సీపీ నాయకుడు గద్దం పరమేష్ ఇల్లు

తాడిపత్రి టౌన్: టీడీపీ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు తాడిపత్రిలో మరోసారి రెచ్చిపోయారు. రౌడీల్లా మారి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డారు. తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి పెద్దారెడ్డి పేరుతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తే దాడులు చేస్తామని, అక్రమ కేసులు బనాయిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి బుధవారం సాయంత్రం ప్రెస్‌మీట్‌లో బహిరంగంగా హెచ్చరికలు జారీ చేయడం.. రాత్రికే వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లపై దాడులు జరగడం చూస్తే జేసీ అనుచరులే దాడులకు పాల్పడినట్టు స్పష్టంగా తెలుస్తోంది.

అర్ధరాత్రి వీరంగం

బుధవారం అర్ధరాత్రి 8 మంది వ్యక్తులు ముఖాలకు మాస్కులు, హెల్మెట్లు ధరించి పట్టణంలో ద్విచక్ర వాహనాలపై వీరంగం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెచ్చిపోయారు. పట్టణంలోని చేనేత కాలనీలో ఉంటున్న గద్దం పరమేశ్, చిన్నబజార్‌లో ఉన్న షబ్బీర్, రజక వీధిలో ఉన్న డీవీ కుమార్, లక్ష్మీరంగయ్య ఇళ్లపై రాళ్లు, బీరు సీసాలు, రాడ్లతో దాడులు చేశారు. గద్దం పరమేష్ ఇంటి తలుపులు ధ్వంసం చేసి పరమేష్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో పరమేష్‌కు మెడ, చేతులకు గాయాలయ్యాయి. షబ్బీర్ ఇంటిముందు ఉన్న ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేశారు. ఆ సమయంలో పచ్చమూకలు 'మరోసారి వైఎస్సార్‌సీపీఎ అంటూ కార్యక్రమాలు చేస్తే చంపేస్తాం' అని గట్టిగా కేకలు వేస్తూ బెదిరింపులకు దిగినట్టు బాధితులు వాపోయారు.

హెచ్ఆర్‌సీకి ఫిర్యాదు

తాడిపత్రిలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి అధికార పార్టీ నాయకుల దౌర్జన్యాలు మితిమీరిపోయాయని, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, వారి అనుచరులు ఇష్టారీతిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు తెగబడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం మానవ హక్కుల సంఘానికి (హెచ్ఆర్‌సీ) ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్షావలి బుధవారం మీడియా సమావేశం నిర్వహించి 'ఎవరైనా సరే మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని పెళ్లిళ్లకు, శుభకార్యాలకు తాడిపత్రి ఆహ్వానించినా, ఆయన పేరుమీద వైఎస్సార్‌సీపీ కార్యక్రమాలు నిర్వహించినా దాడులు చేస్తామని హెచ్చరికలు చేశారు. అదేరోజు రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు గద్దం పరమేష్, లక్ష్మీరంగయ్య, షబ్బీర్ ఇళ్లపై దాడులు జరిగాయి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాలన్నీ పోలీసులకు తెలిసినా కనీం ప్రాథమిక విచారణ కూడా చేయలేదన్నారు. కాగా.. పచ్చమూకల దాడిలో గాయపడిన, భయాందోళనతో ఇంటికే పరిమితమైన బాధిత కుటుంబాలను గురువారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

ఓటమి భయంతోనే పులివెందులలో టీడీపీ అరాచకం

- రోజురోజుకు పతనమవుతున్న చంద్రబాబు గ్రాఫ్..
- మాజీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ కడప జిల్లా స్థానికసంస్థల ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ అరాచకాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం 14 నెలల పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు పతనం కనిపిస్తోందన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల విశ్వాసానికి దూరం అవ్వడం వల్లే పోలీసుల సాయంతో ఉప ఎన్నికల్లో గెలిచి పరువు కాపాడుకునేందుకు చంద్రబాబు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గూండాలను ఉసిగొల్పి, పోలీసులతో తప్పుడు కేసులు పెట్టించి వైఎస్సార్‌సీపీని నిలువరించాలని కలలు కంటున్నాడని చెప్పారు.

విశాఖలో గెలుపే ప్రజాభీష్టానికి ప్రతీక

'విశాఖపట్నం గ్రేటర్ మున్సిపాల్టీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గరిష్టంగా 50 ఓట్లతో వైఎస్సార్‌సీపీ ఒక స్థానాన్ని గెల్చుకుంది. గతంలో వైఎస్సార్సీపీకి వైజాగ్ కార్పొరేషన్‌లో 59 మంది సభ్యులుంటే కూటమి ప్రభుత్వం వారిలో 27 మందిని కొనుగోలు చేయగా.. వైఎస్సార్‌సీపీ బలం 32కు చేరింది. అయినా స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మా అభ్యర్థి గెలిచారు. చంద్రబాబును నమ్మి వెళితే ఆయన దగ్గర ఏం లేదని తెలుసుకుని తిరిగి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్న ఉద్దేశంతో ప్రజలున్నారని చెప్పడానికి ఈ గెలుపు ఓ సంకేతం. పులివెందులలో ఇప్పుడు ఎన్నిక జరుగుతున్న జెడ్పీటీసీ స్థానం వైఎస్సార్‌సీపీదే. దురదృష్టవశాత్తు ప్రమాదంలో ఆ జెడ్పీటీసీ సభ్యుడు మరణిస్తే ఇప్పుడు ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఏదో ఒకరకంగా గెలవాలని చంద్రబాబు పోలీస్ యంత్రాంగం సహకారంతో దిగజారి ప్రవర్తిస్తున్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, మా పార్టీ నాయకుడు వేల్పుల రాముపై దాడిచేసి హత్యచేయడానికి ప్రయత్నించారు. దాడి తర్వాత గాయపడిన వాళ్ల మీదే కేసులు పెట్టారు. కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ మరీ విడ్డూరంగా మాట్లాడుతున్నారు. లిక్కర్ కేసులో అరెస్టయిన వెంకటేష్ నాయుడు.. చంద్రబాబు, లోకేశ్, పెమ్మసానితో కూడా సెల్ఫీలు దిగాడు. ఫొటోలే ఆధారాలైతే ఆయన దగ్గర దొరికిన డబ్బు వాళ్లదే. చంద్రబాబు చెప్పిందే చేస్తున్న సిట్ అధికారులు.. విచారణ సక్రమంగా చేయకపోతే జైల్లో సిట్టింగ్ వేయాల్సి ఉంటుందని గుర్తుపెట్టుకోవాలి..' అని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

క్లుప్తంగా...

తమిళనాడులో ఇంటి వద్దకే రేషన్..

వైఎస్ జగన్ ప్రభుత్వం నుంచి స్ఫూర్తి

సాక్షి, చెన్నై: నిత్యావసరాలను ఇంటి వద్దకు తీసుకువచ్చి అందించే బృహత్తర పథకానికి తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 12వ తేదీన శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే చెన్నైలో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం కావడంతో తమిళనాడు ప్రభుత్వం దీనిని పూర్తి స్థాయిలో అమల్లోకి తీసుకురానుంది. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం ఇంటి వద్దే రేషన్ వస్తువుల పంపిణీ పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. దీన్ని తమిళనాడు ప్రభుత్వం పరిశీలించింది. దీంతో ఈ విధానం అమలు చేయడానికి తమిళనాడు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 34,809 రేషన్ దుకాణాల పరిధిలో రాష్ట్రంలో ప్రతి నెల రెండవ శనివారం, ఆదివారం ఇళ్ల వద్దకే తీసుకెళ్లి రేషన్ వస్తువులను అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈనెల 12న సీఎం స్టాలిన్ చెన్నైలో, మంత్రులు ఇతర జిల్లాల్లో ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు.

డీఎస్సీ క్రీడా కోటా జాబితా విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని డీఎస్సీ క్రీడా కోటాలో 421 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ప్రాథమిక జాబితాను విడుదల చేసినట్లు శాప్ గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. అభ్యర్థుల వివరాలను https://sportsdsc.apcfss.in/ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది.

11 నుంచి 'డీఈఈసెట్' సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ)సెట్-2025లో అర్హత సాధించి రెండో రౌండ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అభ్యర్థులకు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు సర్టిఫికెట్లు పరిశీలించనున్నట్టు సెట్ డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు సీట్లు కేటాయించిన ప్రభుత్వ డైట్ కాలేజీల్లో ఈ ప్రక్రియ ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన

- ఈ నెల12 నుంచి 18 వరకూ యాంటీ ర్యాగింగ్ వీక్
- అన్ని వైద్య కళాశాలలకు మార్గనిర్దేశం చేసిన ఎన్ఎంసీ

సాక్షి, అమరావతి: వైద్య కళాశాలల్లో ర్యాగింగ్ నివారణపై నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థుల్లో యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన పెంచాలని దేశంలోని అన్ని వైద్య కళాశాల ప్రిన్సిపల్స్/డీన్స్‌ను ఆదేశించింది. ఈ నెల 12న యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా 12 నుంచి 18వ తేదీ వరకూ యాంటీ ర్యాగింగ్ వీక్ చేపట్టాలని స్పష్టం చేసింది. ర్యాగింగ్‌కి వ్యతిరేకంగా నినాదాలు, వ్యాస రచన, పోస్టర్స్, లోగోల తయారీ, నాటక ప్రదర్శనలు, సెమినార్స్, వర్క్‌షాప్స్ వంటి కార్యక్రమాలు వారం పొడవునా నిర్వహించాలని పేర్కొంది.

ఎంబీబీఎస్ యాజమాన్య కోటాకు 4,931 దరఖాస్తులు

సాక్షి, అమరావతి: 2025-26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ యాజమాన్య కోటా ప్రవేశాల కోసం 4,931 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. కన్వీనర్ కోటా దరఖాస్తులను ఆరోగ్య విశ్వవిద్యాలయం రెండో విడత పరిశీలిస్తున్నట్టు తెలిసింది. ఈ కోటాలో దివ్యాంగ, స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీ విద్యార్థుల దరఖాస్తులను ప్రత్యేకంగా పరిశీలించారు. వచ్చే వారంలో ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదలయ్యే అవకాశం ఉంది. నీట్ యూజీ ఆలిండియా కోటా తొలి దశ కౌన్సెలింగ్‌లో భాగంగా శనివారం మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) సీట్లు కేటాయించనుంది. ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఈ నెల 18లోపు కళాశాలల్లో రిపోర్ట్ చేయాలి.

గ్రీన్ బిల్డింగ్స్‌కు రాయితీలు మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: పర్యావరణహితంగా ఉండే గ్రీన్ బిల్డింగ్స్‌కు రాష్ట్రంలో ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలో నిర్మాణాలన్నీ గ్రీన్‌హౌస్‌లుగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. గురువారం విజయవాడలో ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఆంధ్రా సమ్మిట్‌లో మంత్రి నారాయణ మాట్లాడారు. ఐజీబీసీ సర్టిఫికేషన్ ఉన్న భవనాలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రీన్ బిల్డింగ్స్‌కు పర్మిట్ ఫీజులో 20%రాయితీతో పాటు డెవలప్‌మెంట్ చార్జీలు 4 వాయిదాల్లో చెల్లించేలా అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు. సర్టిఫికేషన్ ఆధారంగా సిల్వర్ బిల్డింగ్‌కు 10%,గోల్డ్ బిల్డింగ్ కు 15%,ప్లాటినం బిల్డింగ్ కు 20% ఇంపాక్ట్ ఫీజులో డిస్కౌంట్ ఇస్తామన్నారు.

ఒబెరాయ్ హోటల్స్‌కు భూ కేటాయింపులు రద్దు

సాక్షి, అమరావతి : తిరుపతి రూరల్ మండలం పేరూరులో రిసార్ట్స్ నిర్మాణానికి ఒబెరాయ్ గ్రూప్‌నకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. సర్వే నంబర్ 604లో 50 ఎకరాల్లోని భూమిలో 20 ఎకరాలను 2022లో ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపును రద్దు చేయాలని కూటమి సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వులిచ్చారు.

ఎవరి దయాదాక్షిణ్యాలతోనో ఉద్యోగాల్లోకి రాలేదు

- సీఎం ప్రకటించిన బకాయిలకూ మోక్షం లేదు
- కూటమి ప్రభుత్వం వల్ల ఇప్పటివరకు ఎలాంటి ఉపయోగం లేదు
- పీఆర్‌సీని నియమించలేదు.. ఐఆర్ అతీగతీ లేదు
- ఆంధ్రా ఉద్యోగుల కంటే తెలంగాణ ఉద్యోగులకు లక్షన్నర అదనపు వేతనం
- రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

ఏలూరు (మెట్రో): ఎవరి దయాదాక్షిణ్యాలతోనో తాము ఉద్యోగాల్లోకి రాలేదని రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు, అమరావతి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు చెప్పారు. ఏలూరులో గురువారం రెవెన్యూ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇప్పటివరకు ఉద్యోగులకు ఏ రూపంలోనూ ఉపయోగం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు ఉద్యోగులు అందరూ ఎదురు చూసే పీఆర్‌సీని నేటికీ నియమించలేదన్నారు. ఐఆర్ సంగతి అతీగతీ లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగి ఆంధ్ర ఉద్యోగి కంటే అదనంగా ఐఆర్ తీసుకుంటున్నారని చెప్పారు. తెలంగాణ ఉద్యోగులు ఆంధ్ర ఉద్యోగులకంటే లక్షన్నర వేతనం అదనంగా అందుకుంటున్నారన్నారు.

ఉద్యోగుల బకాయిల చెల్లింపుకు చర్యలేవి?

ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి అసెంబ్లీ సాక్షిగా రూ.25 వేల కోట్లు వివిధ బకాయిల రూపంలో ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్నాయని ప్రకటించినా నేటికీ ఒక్క రూపాయి అందించడానికి కూడా చర్యలు తీసుకోలేదని బొప్పరాజు చెప్పారు. డీఏ బకాయిలు, సరెండర్ లీవులు, గ్రాట్యుటీ చెల్లింపులు, నాలుగు డీఏలకు మోక్షం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన కూలి డబ్బులనే అడుగుతున్నామన్నారు.

23, 24 తేదీల్లో కీలక సమావేశం

తమ సమస్యలపై ఈ నెల 23, 24వ తేదీల్లో విజయవాడలో కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశామని బొప్పరాజు చెప్పారు. ఈ లోపు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించకుంటే ఈ సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

ఉద్యోగులపై పీ4 రుద్దితే ఆందోళన

పీ4 కార్యక్రమంతో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బొప్పరాజు చెప్పారు. పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలంటూ ఉద్యోగులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారని, దీనిపై ఆందోళన చేస్తామన్నారు. భీమవరం మున్సిపల్ కమిషనర్ చార్జిమెమోలు జారీ చేస్తున్నారని, దీనిపై పోరాడి వాటిని రద్దు చేయించామన్నారు. ఈ సమావేశంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఒక్క స్కీమూ వర్తింపజేయలేదు

సీపీఎస్ రద్దు విషయం అతీగతీ లేదని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అధికారంలోకి రాగానే ప్రభుత్వ స్కీములు వర్తింప చేస్తామని మేనిఫెస్టోలో పెట్టి ఇప్పుడు ఏ ఒక్క స్కీమూ వర్తింపజేయలేదని బొప్పరాజు మండిపడ్డారు. పెన్షనర్లకు ఇస్తున్న పెన్షన్‌ను సైతం కట్ చేశారని, ఉద్యోగులకు హెల్త్ కార్డు ఎందుకూ పనికి రాకుండా పోతుందన్నారు. పిల్లల్ని కనాలని ముఖ్యమంత్రి ఒక వైపు చెబుతూ ఆరు నెలలే చైల్డ్ కేర్ సెలవులు ఇస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం రెండేళ్లు ఇస్తున్న విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు.

ఎన్‌జీ రంగా వర్సిటీలో అగ్రి ఇంజినీరింగ్‌లో పీజీ డిప్లొమా

బాపట్ల అగ్రి ఇంజినీరింగ్ కళాశాలలో కొత్తగా కోర్సు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ రాష్ట్రంలోనే ప్రప్రథమంగా బాపట్లలో పీజీ డిప్లొమా కోర్సును ప్రవేశపెడుతోంది. ఈ ఏడాది నుంచి బాపట్లలోని డాక్టర్ ఎన్‌టీఆర్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాలలో పీజీ డిప్లొమాను 30 సీట్లతో ప్రారంభించనున్నారు. కోర్సు కాలపరిమితి ఏడాది ఉంటుంది. ఆగస్టులో ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా సీట్లను భర్తీ చేయనున్నారు. సెప్టెంబర్ చివరి వారం నుంచి క్లాసులు ప్రారంభం కానున్నాయి. అభ్యర్థులకు కళాశాలలోనే హాస్టల్ వసతి ఉంటుంది. బీఎస్సీ అగ్రికల్చర్, బీఎస్సీ హార్టికల్చర్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ బయోకెమిస్ట్రీ, అగ్రికల్చర్ బీటెక్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, వెటర్నరీ, ఫిషరీస్ డిగ్రీలు పూర్తి చేసిన వారు పీజీ డిప్లొమాకు అర్హులు. వ్యవసాయ ఉత్పత్తుల్లో కోత అనంతరం వృథాను తగ్గించడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత రంగాలను ప్రోత్సహించడంపై అవగాహన కలిగించడం ఈ కోర్సు ముఖ్య ఉద్దేశమని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డీడీ.స్మిత్ సాక్షికి తెలిపారు. స్థానిక విద్యార్థులకు ఇది మంచి అవకాశమన్నారు.

పులివెందులలో కూటమి హింసను ప్రేరేపిస్తోంది

అరకు ఎంపీ తనూజరాణి

సాక్షి, న్యూఢిల్లీ: ప్రశాంతంగా ఉన్న పులివెందులలో కూటమి నేతలు హింసను ప్రేరేపిస్తున్నారని అరకు వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదు కానీ.. ఇటువంటి హింసలు చేయడంలో మాత్రం వారికి వారే సాటిగా నిలుస్తున్నారని నిప్పులు చెరిగారు. ఢిల్లీలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. జెడ్పీటీసీ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సైదాపురం సురేష్‌రెడ్డిపై దాడి చేయడం దారుణమని మండిపడ్డారు. నల్లగొండువారిపల్లిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌కు భద్రత కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏడాదిగా కూటమి చేస్తున్న హింసను కేంద్రం దృష్టికి తీసుకెళతానని హెచ్చరించారు.

మా నేతలపై టీడీపీ రౌడీల దాడి

- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నాయకులపై పట్టపగలు మారణాయుధాలతో దాడి
- కడప జిల్లాలో టీడీపీ గూండాల అరాచకంపై గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- పులివెందులలో నిష్పక్షపాతంగా జెడ్పీటీసీ ఉప ఎన్నిక నిర్వహణకు విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: "వైఎస్సార్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఉప ఎన్నికల సందర్భంగా టీడీపీ గూండాలు అరాచకం సృష్టిస్తున్నారు. శాంతిభద్రతలు నిర్వీర్యమయ్యాయి. పోలీస్ యంత్రాంగం అధికార పార్టీకి కొమ్ముకాస్తోంది'' అని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం ఫిర్యాదు చేసింది. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరింది. శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో గురువారం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు విజయవాడలో గవర్నర్‌ను కలిశారు. పులివెందులలో టీడీపీ గూండాలు పట్టపగలు మారణాయుధాలతో దాడులకు దిగడం, వాహనాలను ధ్వంసం చేయడం, వైఎస్సార్‌సీపీ నేతలను హతమార్చేందుకు ప్రయత్నించిన తీరు, అయినా పోలీసులు పట్టించుకోకుండా అధికార పార్టీకి ఎలా అండగా నిలుస్తున్నారో ఆధారాలతో సహా గవర్నర్‌కు వివరించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి చేసి, ఎలా గాయపరిచారో తెలియజేశారు. అనంతరం రాజ్‌భవన్ వెలుపల బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. "పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌తో పాటు పార్టీ నేతలు ప్రచారం ముగించుకుని వస్తుండగా టీడీపీ గూండాలు పది వాహనాల్లో వచ్చి విచక్షణారహితంగా దాడి చేశారు. రమేష్ యాదవ్, వేల్పుల రామలింగారెడ్డి (రాము), ఇతరులను హతమార్చేందుకు ప్రయత్నించారు. ఇదంతా చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అనే అనుమానం కలుగుతోంది. బీసీ నాయకుడు రమేష్ యాదవ్ ఎమ్మెల్సీ. ఆయనకు రక్షణ కల్పించాల్సిన కనీస బాధ్యత పోలీసులపై లేదా? ప్రభుత్వ ఆదేశాల మేరకే పోలీసులు మౌనంగా ఉన్నారు. కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ వ్యాఖ్యలు చూస్తే ఇది అర్థమవుతోంది. ఆయన మాటలు పోలీస్ వ్యవస్థకే సిగ్గుచేటు. అన్నిసార్లు ఒకే పార్టీ అధికారంలో ఉండదని గుర్తుంచుకోవాలి. వ్యవస్థలు చట్టప్రకారం పనిచేయాలే తప్ప రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారకూడదు. కోయ ప్రవీణ్ వ్యాఖ్యలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం'' అని బొత్స చెప్పారు.

గవర్నర్ గారూ... శాంతిభద్రతలపై దృష్టిసారించండి

'రాష్ట్రంలో శాంతిభద్రతలు నిర్వీర్యం అయ్యాయి. తక్షణం దీనిపై దృష్టిసారించాలని గవర్నర్‌ను కోరాం. ఎన్నికల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేశాం. కడప జిల్లాలో స్థానిక సంస్థల ఉప ఎన్నికలు నిష్పక్షపాతంగా, చట్టబద్ధంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరాం. కూటమి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను దెబ్బతీస్తున్న వైనాన్ని ఆధారాలతో సహా గవర్నర్ కు తెలియచేశాం' అని బొత్స పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, మాజీ మంత్రులు మేరుగు నాగార్జున, కారుమూరి నాగేశ్వరరావు, వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు రాజగొల్ల రమేష్ యాదవ్, లేళ్ళ అప్పిరెడ్డి, కల్పలతారెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నాయకులు నౌడు వెంకటరమణ ఉన్నారు.

ఐఏఎస్ శివశంకర్‌ను ఏపీకి పంపాల్సిందే

- కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించిన క్యాట్

సాక్షి, హైదరాబాద్: గత ఆదేశాల ప్రకారం ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను రెండు వారాల్లో ఏపీకి పంపకుంటే కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీవోపీటీ) కార్యదర్శి జీతం నిలిపివేతకు ఆదేశాలు ఇస్తామని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) హెచ్చరించింది. ఏపీ విభజన సమయంలో శివశంకర్‌ను తెలంగాణకు కేటాయించినా, క్యాట్ ఆదేశాలతో ఏపీలో విధులు నిర్వహిస్తున్నారు. 2024 అక్టోబర్‌లో ఎవరికి కేటాయించిన రాష్ట్రాలకు వారు వెళ్లాల్సిందేనని కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా శివశంకర్ తెలంగాణకు వచ్చారు. అయితే ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న క్యాట్ ధర్మాసనం.. ఫిబ్రవరి 28న తుది ఉత్తర్వులు వెలువరించింది. ఏపీ స్థానికత కలిగిన శివశంకర్‌ను తపాలా చిరునామా రంగారెడ్డి జిల్లాలో ఉండటం వల్ల దాని ఆధారంగా స్థానికత నిర్ధారించడం సరికాదని పేర్కొంది. శివశంకర్‌ను తిరిగి ఏపీకి కేటాయించాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. రెండు నెలలైనా ఏపీకి కేటాయించకపోవడంతో క్యాట్‌లో శివశంకర్ ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. క్యాట్ ధర్మాసనం ముందుకు గురువారం ఈ కేసు మరోసారి విచారణకు రాగా, కేంద్రం తీరుపై క్యాట్ ఘాటు వ్యాఖ్యలు చేసింది. చివరి అవకాశంగా 2 వారాలు గడువిస్తున్నామని.. శివశంకర్‌ను ఏపీకి పంపకుంటే డీవోపీటీపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

సాక్షి SAKSHI TV
వాయిస్ ఆఫ్ వాయిస్‌లెస్...
తెలుగువారి మనస్సాక్షి... సాక్షిటీవీ...
అన్యాయం... అక్రమాలపై పోరాడతాం...
నియంతృత్వాన్ని నిలదీస్తాం... అరాచకాలను ఎండగడతాం...
పేదవాడి పక్షాన నిలబడతాం... ప్రజాగొంతుకై నినదిస్తాం...
సాక్షిటీవీ ప్రసారాల కోసం
మీ స్థానిక కేబుల్ ఆపరేటర్‌కు వెంటనే సంప్రదించండి
ఎప్పుడైనా... ఎక్కడైనా... సాక్షి టీవీ వార్తల కోసం
www.sakshi.com
https://www.youtube.com/SakshiTV
- సాక్షి మొబైల్ యాప్ www.sakshi.com
- సాక్షి టీవీ లైవ్ www.youtube.com/SakshiTVLIVE
- సాక్షి టీవీ యూట్యూబ్ www.youtube.com/SakshiTV
వీటి ద్వారా కూడా సాక్షి టీవీని వీక్షించగలరు

హరిత హోటళ్లు ప్రైవేటుకే!

- 6 క్లస్టర్లలో 22 హోటళ్లను కట్టబెట్టేందుకు ప్రభుత్వ నిర్ణయం
- ఏజెన్సీల నుంచి బిడ్లను ఆహ్వానించేందుకు ఏపీటీడీసీకి అనుమతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కు చెందిన ప్రముఖ హోటళ్లను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేస్తోంది. ఇంత కాలం సమర్థవంతంగా నిర్వహించి రెవెన్యూ సాధనలో కీలకంగా మారిన హోటళ్లను నిర్వహణ కష్టంగా మారాయంటూ ప్రైవేటుకు కట్టబెడుతోంది. ఆరు క్లస్టర్లలో ఏకంగా 22 హోటళ్ల ను ఏపీటీడీసీ జాబితా నుంచి తప్పించటం ద్వారా ఆస్తులు లేని కార్పొరేషన్‌గా ఏపీటీడీసీ చరిత్రలో నిలిచిపోనుంది. ప్రముఖ పర్యాటక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాల్లో నిత్యం కిటకిటలాడే హోటళ్లను కూడా నిర్వహించలేమంటూ కూటమి సర్కార్ తన బాధ్యతకు నీళ్లొదిలేసింది. ప్రైవేటుపరం చేసేందుకు వీలుగా ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ కింద టెండర్లు పిలిచేందుకు అనుమతిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

లీజు పేరుతో..

ఏపీటీడీసీకి చెందిన 22 హోటళ్లను 33 ఏళ్ల పాటు లీజుకిచ్చేలా ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వానించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎంపికైన ఏజెన్సీ ఆ క్లస్టర్‌లోని హోటళ్ల నిర్వహణ చేస్తూ ఏటా ఏపీటీడీసీకి లీజు చెల్లించాల్సి ఉంటుంది. పర్యాటక విధానం 2024-29 లక్ష్యానికి అనుగుణంగా ప్రైవేటుపరం చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం ప్రకటించింది.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తున్న హోటళ్లు

క్లస్టర్	హరిత హోటల్/రిసార్ట్	గదులు
1	యాత్రీనివాస్-విశాఖ	41
	బీచ్ రిసార్ట్, కళింగపట్నం	4
2	ద్వారకా తిరుమల	18
	కోకోనట్ రిసార్ట్ దిండి	32
3	సూర్యలంక	39
	బెరంపార్క్	30
	భవానీ ఐలాండ్	45
	విజయపురి సౌత్	19
	ఎత్తిపోతల	8
	ధ్యానబుద్ధ	0
4	హరిత-నెల్లూరు	54
	శ్రీకాళహస్తి	25
5	గండికోట	10
	గండి	10
	కడప	51
	ఒంటిమిట్ట	4
6	కర్నూలు	28
	ఓర్వకల్లు	20
	మహానంది	28
	అహోబిలం	38
	లేపాక్షి	8
	శ్రీశైలం	100

నేటి నుంచి క్రికెట్ 'రన్'రంగం

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టీ-20 హంగామా

- పోరుకు విశాఖ వైఎస్సార్ స్టేడియం సిద్ధం
- బ్రాండ్ అంబాసిడర్‌గా సినీనటుడు వెంకటేష్
- విజేతకు రూ.35 లక్షలు, రన్నరప్‌కు రూ.20లక్షలు ప్రైజ్ మనీ


ఏపీఎల్ ట్రోఫీతో ఏడు జట్ల కెప్టెన్లు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) నాలుగో సీజన్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. నేటి నుంచి ప్రారంభం కానున్న టీ-20 లీగ్‌లో ఈసారి సరికొత్త ఏడు ఫ్రాంచైజీ జట్లు ట్రోఫీ కోసం పోటీపడనున్నాయి. నాలుగు ప్లేఆఫ్‌లతో పాటు మొత్తంగా 25 మ్యాచ్‌లు నిర్వహించనుండగా టైటిల్ పోరు ఈనెల 23న జరగనుంది. ఈ సందర్భంగా గురువారం వైఎస్సార్ స్టేడియంలో ఏపీఎల్ నిర్వాహక కమిటీ చైర్మన్ వీఎస్‌కే రంగారావు మాట్లాడుతూ ఆసక్తికల వారు తిలకించేందుకు ఉచితంగానే ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్టేడియంలోకి గేట్ నెం.15నుంచి రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. డీఆర్ఎస్ సిస్టంను అనుసరిస్తున్నామని వెల్లడించారు. సినీనటుడు వెంకటేష్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రారంభ వేడుకలో సినీనటి ప్రగ్యా జైస్వాల్, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్ పాల్గొని తమ ప్రతిభాపాటవాలు ప్రదర్శించనున్నారని వివరించారు. అనంతరం డ్రోన్, లేజర్‌షో అలరించనున్నాయని వెల్లడించారు. ప్రస్తుత సీజన్‌లో విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.35 లక్షలు అందిస్తామని, రన్నరప్‌కు రూ.20 లక్షలు అందిస్తామని పేర్కొన్నారు.

సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రారంభ వేడుకకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హాజరుకానున్నారు. ఈ మ్యాచ్‌ల్ని సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. సింహాద్రి వైజాగ్ లయన్స్‌కు రికీబుయ్, కాకినాడ కింగ్స్‌కు కేఎస్ భరత్, విజయవాడ సన్‌షైనర్స్‌కు అశ్విన్‌హెబ్బర్, అమరావతి రాయల్స్‌కు హనుమవిహారి, భీమవరం బుల్స్‌కు హేమంత్‌రెడ్డి, రాయలసీమ రాయల్స్‌కు ఎస్‌కే రషీద్, తుంగభద్ర వారియర్స్‌కు మహీప్‌కుమార్ నాయకత్వం వహిస్తున్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

ఏపీలో నాలుగు స్మార్ట్ సిటీలు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో నాలుగు స్మార్ట్ సిటీలు (అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నం)ఉన్నట్టు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి తోకాన్ సాహు తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. ఈ ఏడాది జూలై 31 నాటికి 'స్మార్ట్ సిటీస్ మిషన్' కింద 100 నగరాల్లో రూ.1,64,695 కోట్ల విలువైన పనులు జరిగినట్టు తెలిపారు.

8,209 మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు లబ్ధి



ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం కింద మూడేళ్లలో 8,209 మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు లబ్ధి పొందినట్టు కేంద్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభ కరాంద్లాజ్లే తెలిపారు. లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి ప్రశ్నకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. ఎస్సీలు 3,123, ఎస్టీలు 551, ఓబీసీలు 4,489, వికలాంగులు 46 కలిపి మొత్తం 8,209 మంది లబ్ధి పొందినట్టు వివరించారు.

హైవేలపై అండర్‌పాస్‌ల అభివృద్ధి



జాతీయ రహదారి-16పై సూళ్లూరుపేట షార్ సర్కిల్ వద్ద రోటరీ జంక్షన్, పాదచారుల కోసం అండర్‌పాస్‌లను అభివృద్ధి చేసినట్టు కేంద్ర రోడ్లు, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తిరుపతి పార్లమెంటరీ నియోజకవర్గంలోని రహదారి సమస్యలపై లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు కేంద్రమంత్రి మౌఖిక సమాధానమిచ్చారు. కరకంబాడి వద్ద చిన్నఒరంపాడు నుంచి రేణిగుంట జాతీయ రహదారి-716 నిర్మాణంలో భాగంగా రెండు ముఖ్యమైన అండర్ పాస్‌ల నిర్మాణం జరుగుతుందన్నారు. కరకంబాడి రైల్వే క్రాసింగ్ దగ్గర లైట్ వెహిక్యులర్ అండర్‌పాస్, కట్టపుట్టాలమ్మ ఆలయం సమీపంలో వెహిక్యులర్ అండర్‌పాస్ నిర్మించనున్నట్టు చెప్పారు.

రాజ్యసభ

పర్యాటకం ఆదాయం రూ.15.73 లక్షల కోట్లు



సాక్షి, న్యూఢిల్లీ: 'నేషనల్ అకౌంట్ స్టాటిస్టిక్స్-2025' తాత్కాలిక అంచనాల ప్రకారం 2023-24లో పర్యాటక రంగం ద్వారా దేశ జీడీపీకి రూ.15.73 లక్షల కోట్ల ఆదాయం వచ్చినట్టు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ.. ఈ ఆదాయం మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థలో 5.22 శాతం అన్నారు. ఏపీతో పాటు, ఢిల్లీ, గోవా, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాగా.. ఎంపీ సుబ్బారెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర వ్యక్తిగత, ప్రజాపంపిణీ వ్యవస్థ శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. దేశంలోని 19.6 లక్షల వాహనాలకు వాహన ట్రాకింగ్ అమర్చబడి ఉన్నట్టు పేర్కొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ఆర్థిక సాయం




వన్యప్రాణుల సంరక్షణ, నిర్వహణ, వాటి ఆవాసాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి క్రితి వర్ధన్‌సింగ్ తెలిపారు. ఎంపీ పరిమళ్‌నత్వానీ అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

విశాఖలో విషాదం

వెల్డింగ్ షాపులో పేలిన గ్యాస్ సిలిండర్

- ముగ్గురు మృతి.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు
- క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం
- తునాతునకలైన దుకాణం.. చెల్లాచెదురుగా ఇద్దరి శరీర భాగాలు


ప్రమాదస్థలం వద్ద సహాయచర్యలు చేపడుతున్న ఫైర్ సిబ్బంది

విశాఖ సిటీ: విశాఖ వన్‌టౌన్‌లో విషాదం చోటుచేసుకుంది. ఫిషింగ్ హార్బర్ రోడ్డులోని వెల్డింగ్ షాపులో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. విస్ఫోటనం ధాటికి షాపు తునాతునకలైంది. గురువారం సాయంత్రం 4.30 గంటలకు చోటుచేసుకున్న ఈ ఘటనతో విశాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే.. సున్నపువీధి ప్రాంతంలో నివాసముంటున్న చల్లా గణేష్ (44) 6 నెలల క్రితమే బుక్కావీధి ప్రాంతంలోని ఫిషింగ్ హార్బర్ రోడ్డులో వెల్డింగ్ దుకాణాన్ని ప్రారంభించాడు. వెల్డింగ్, గ్యాస్ కటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గణేష్‌తో పాటు హెల్పర్ శ్రీను, రోజువారీ వేతనం కింద ఎర్ర ఎల్లాజీ (45), డి.సన్యాసిరావు (46) పని చేస్తున్నారు. సాయంత్రం 4.30 సమయంలో గ్యాస్ సిలిండర్ ఒక్కసారిగా పేలింది. పేలుడు ధాటికి వెల్డింగ్ షాపు నామరూపాలు లేకుండాపోయింది. షాపు యజమాని చల్లా గణేష్, హెల్పర్ శ్రీను శరీరాలు ముక్కలై షాపు వెనుక ఉన్న 9 అడుగుల గోడ పైనుంచి ఎగిరి అవతలివైపు పడ్డాయి. వర్కర్లు ఎల్లాజీ, సన్యాసిరావుతో పాటు దాని పక్కనే ఉన్న స్క్రాప్ దుకాణం వద్ద పనిచేస్తున్న చింతకాయల ముత్యాలు (27), ఇప్పిలి రంగారావు(53)లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ పేలుడు శబ్దం రెండు కిలోమీటర్ల మేర వినిపించింది. దీంతో వన్‌టౌన్ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. క్షతగాత్రులను ఆటోలో ఎక్కించి కేజీహెచ్‌కు తరలించారు. చింతకాయల ముత్యాలు శరీరం 95 శాతం కాలిపోవడంతో చికిత్స పొందుతూ సాయంత్రం 7 గంటలకు మరణించాడు. ప్రస్తుతం 95 శాతం కాలిన గాయాలతో ఎల్లాజీ, 75 శాతం గాయాలతో ఇప్పిలి రంగారావు, 18 శాతం గాయాలతో డి.సన్యాసిరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. పేలుడు ఘటనపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ ద్వారా పేలుడుకు గల కారణాలపై ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ పేలుడుకు వెల్డింగ్ సిలిండర్ కారణమా? లేదా డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ వినియోగంతోనే ప్రమాదం జరిగిందా? అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.


హైదరాబాద్ పాతబస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారు

వేయి శుభముల వరము మీకు...

భక్తితో పూజిస్తే వరాలందించే తల్లి వరలక్ష్మీ దేవి. ఈ వ్రతాన్ని ఆచరించడానికి కఠినమైన నిష్ఠలు, నియమాలు, మడులకన్నా నిశ్చలమైన భక్తి, ఏకాగ్రచిత్తాలే ముఖ్యం. వరలక్ష్మీవ్రతం ఎంతో మంగళకరమైంది. ఈ వ్రతాచరణ వల్ల లక్ష్మీదేవి కృపాకటాక్షాలు కలిగి ఐశ్వర్యం సిద్ధిస్తుందని, సకల సంపదలూ కలుగుతాయని ప్రతీతి. సంపదలంటే కేవలం ధనం మాత్రమే కాదు. ధాన్య సంపద, పశు సంపద, గుణ సంపద, ఆరోగ్య సంపద, జ్ఞానసంపద మొదలైనవి ఎన్నో.

పూజను చక్కగా... భక్తి శ్రద్ధలతో చేసుకోవాలంటే ముందుగా పూజాద్రవ్యాలను సిద్ధం చేసుకోవాలి. అలా సిద్ధం చేసి పెట్టుకోవడం వల్ల మధ్య మధ్యలో లేవాల్సిన అవసరం ఉండదు.

పూజకు కావలసినవి: పసుపు, కుంకుమ, గంధం, విడిపూలు, పూలమాలలు, తమలపాకులు, వక్కలు, ఖర్జూరాలు, అగరొత్తులు, కర్పూరం, చిల్లరనాణేలు, తెల్లని వస్త్రం, రవికల గుడ్డ, మామిడాకులు, పండ్లు, అమ్మవారి పటం లేదా ప్రతిమ, కలశం, కొబ్బరి కాయలు, తెల్ల దారం లేదా పసుపు రాసిన కంకణం, ఇంటిలో శుచిగా తయారు చేసిన నైవేద్యాలు (శక్తి కొలదీ చేసుకోవచ్చు) బియ్యం, పంచామృతాలు, దీపపు కుందులు, ఒత్తులు, ఆవునెయ్యి.

శ్రావణమాసంలో పౌర్ణమి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలి. ఒకవేళ ఆ రోజున వీలు కాకపోతే తరువాత వచ్చే శుక్రవారాలలో కూడా ఈ వ్రతాన్ని చేసుకోవచ్చు.

వ్రత విధానం

వ్రతాన్ని ఆచరించే రోజు ఉదయాన్నే లేచి తలస్నానం చేసి, ఇంటిని శుభ్రం చేసుకోవాలి. పూజామందిరంలో మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఈ మండపం పైన ముగ్గువేసి, కలశం పెట్టాలి. అమ్మవారి ఫొటో లేదా రూపును అమర్చుకోవాలి. పూజాసామగ్రి, తోరాలు, అక్షతలు, పసుపు గణపతిని సిద్ధం చేసుకుని ఉంచాలి.

తోరం ఇలా తయారు చేసుకోవాలి

తెల్లటి దారాన్ని ఐదు లేక తొమ్మిది పోగులు తీసుకుని దానికి పసుపు రాయాలి. ఆ దారానికి ఐదు లేక తొమ్మిది పూలు కట్టి ముడులు వేయాలి. ఇలా తయారు చేసుకున్న తోరాలను పీఠం వద్ద ఉంచి పుష్పాలు, పసుపు, కుంకుమ, అక్షతలతో పూజించి పూజకు సిద్ధం కావాలి.

గణపతి పూజ

అదౌ నిర్విఘ్నేన వ్రత పరిసమాప్త్యర్థం గణపతి పూజాం కరిష్యే .. వక్రతుండ మహాకాయ కోటి సూర్య సమప్రభ నిర్విఘ్నం కురుమే దేవ సర్వ కార్యేషు సర్వదా! ఆగచ్ఛ వరసిద్ధ వినాయక, అంబికా ప్రియనందన పూజాగృహాణ సుముఖ, నమస్తే గణనాయక అని స్తుతిస్తూ గణపతిపై అక్షతలుంచాలి. యథాశక్తి షోడశోపచార పూజ చేయాలి. స్వామివారి ముందు పళ్ళు లేదా బెల్లాన్ని నివేదించి తాంబూలం సమర్పించాలి. అనంతరం నీరాజనం సమర్పించాలి. వినాయకునికి నమస్కరించి పూజ చేసిన అక్షతలు శిరస్సు మీద ఉంచుకోవాలి. తర్వాత వరలక్ష్మీ వ్రతాన్ని ప్రారంభించాలి.

కలశపూజ

కలశస్య ముఖే విష్ణు కంఠే రుద్రసమాశ్రితాః
మూలేతత్ర స్థితో బ్రహ్మ మధ్యే మాతృగణః స్థితాః
కుక్షౌతు సాగరస్సర్వే సప్తద్వీపా వసుంధరా
ఋగ్వేదోథ యజుర్వేదో స్సామవేదో అధర్వణః
అంగైశ్చ సహితా స్సర్వే కలశాంబు సమాశ్రితాః
ఆయాంతు గణపతి పూజార్థం దురితక్షయకారకాః
గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి నర్మదే సింధూ కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు అంటూ కలశంలోని నీటిని పుష్పంతో ముంచి భగవంతుడిపై, పూజాద్రవ్యాలపై చిలకరించాలి. పూజ చేస్తున్న వారు తమపైన చల్లుకోవాలి.

అనంతరం పువ్వులు లేదా అక్షతలతో కలశానికి పూజ చేయాలి. ఆ తరువాత పుష్పాలతో అమ్మవారిని అష్టోత్తర శతనామాలతో పూజించాలి. ఇంతకుముందు సిద్ధం చేసుకున్న తోరాన్ని అమ్మవారి వద్ద ఉంచి పూజించి కుడిచేతికి తోరం కట్టుకోవాలి.

వ్రత కథా ప్రారంభం

పూర్వం శౌనకాది మహర్షులను ఉద్దేశించి సూత మహర్షి ''మునులారా! స్త్రీలకు సౌభాగ్యాన్ని ప్రసాదించే ఒక వ్రతాన్ని పరమ శివుడు పార్వతికి చెప్పాడు. లోకోపకారం కోరి ఆ వ్రతాన్ని గురించి మీకు తెలియజేస్తాను. శ్రద్ధగా వినండి'' అన్నారు. అది వరలక్ష్మీవ్రతం. దానిని శ్రావణమాసం రెండో శుక్రవారం నాడు ఆచరించాలని చెబుతూ శివుడు పార్వతికి చెప్పిన ఆ వ్రత కథను ఇలా చెప్పసాగాడు.

పూర్వకాలంలో మగధ దేశంలో కుండినం అనే పట్టణం ఉండేది. ఆ పట్టణంలో చారుమతి అనే ఒక బ్రాహ్మణ స్త్రీ ఉండేది. ఆమె సుగుణవతి. వినయ విధేయతలు, భక్తిగౌరవాలు గల యోగ్యురాలు. రోజూ ప్రాతఃకాలాన నిద్రలేచి ప్రాతఃకాల గృహకృత్యాలను పూర్తిచేసుకుని భర్త, అత్తమామల సేవలో తరించేది.

వరలక్ష్మీ సాక్షాత్కారం

వరలక్ష్మీదేవి ఒకనాటి రాత్రి చారుమతికి కలలో కనిపించి 'ఓ చారుమతీ! ఈ శ్రావణ పౌర్ణమి నాటికి ముందు వచ్చే శుక్రవారం నాడు నన్ను పూజించు... నీవు కోరిన వరాలు, కానుకలను ఇస్తాను' అంటూ పూజా విధానాన్ని చెప్పి అంతర్ధానమైంది.



అంతలోనే మేల్కొన్న చారుమతి అదంతా కలగా గుర్తించి తన కలను భర్తకు, అత్తమామలకు తెలియజేసింది. వారు చాలా సంతోషించి చారుమతిని వరలక్ష్మీ వ్రతాన్ని చేసుకోమని చెప్పారు. పురంలోని మహిళలు చారుమతి కలను గురించి విని వారు కూడా పౌర్ణమి ముందు రాబోయే శ్రావణ శుక్రవారం కోసం ఎదురుచూడసాగారు.

శ్రావణ శుక్రవారం రోజున పట్టణంలోని స్త్రీలందరూ ఉదయాన్నే లేచి తలారా స్నానం చేసి పట్టువస్త్రాలు ధరించి చారుమతి గృహానికి చేరుకున్నారు. చారుమతి తన గృహంలో మండపం ఏర్పాటుచేసి ఆ మండపంపై బియ్యం పోసి పంచపల్లవాలైన రావి, జువ్వి, మర్రి, మామిడి, ఉత్తరేణి మొదలైన ఆకులతో కలశం ఏర్పాటు చేసి వరలక్ష్మీదేవిని సంకల్ప విధులతో సర్వమాంగళ మాంగళ్యే శివే సర్వార్థసాధికే శరణ్యే త్రయంబకే దేవీ నారాయణి నమోస్తుతే! అంటూ ఆహ్వానించి ప్రతిష్ఠించింది.

అనంతరం అమ్మవారిని షోడశోపచారాలతో పూజించి, భక్ష్య, భోజ్యాలను నివేదించారు. తొమ్మిది పోగుల తోరాన్ని చేతికి కట్టుకుని, ప్రదక్షిణ నమస్కారాలు చేశారు. మొదటి ప్రదక్షిణ చేయగానే కాలి అందియలు ఘల్లుఘల్లున మోగాయి. రెండో ప్రదక్షిణ చేయగానే హస్తాలకు నవరత్నఖచిత కంకణాలు ధగధగా మెరవసాగాయి. మూడో ప్రదక్షిణ చేయగానే అందరూ సర్వాభరణ భూషితులయ్యారు. వారు చేసిన వరలక్ష్మీ వ్రతం ఫలితంగా చారుమతి గృహంతో పాటు, ఆ పట్టణంలో ఇతర స్త్రీల ఇళ్లు కూడా ధన, కనక, వస్తు వాహనాలతో నిండిపోయాయి. వారి వారి ఇళ్ళ నుంచి రథ గజ తురగ వాహనాలతో వచ్చి ఇళ్లకు తీసుకెళ్లారు. వారంతా మార్గమధ్యంలో చారుమతిని వేనోళ్ళ పొగుడుతూ వారంతా ఏటా వరలక్ష్మీవ్రతం చేసి సకల సౌభాగ్యాలతో సిరిసంపదలు కలిగి, సుఖజీవనం గడిపి ముక్తిని పొందారు.

ఈ కథ విని అక్షతలు శిరసుపై ధరించాలి. ఆ తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇవ్వాలి. అందరికీ తీర్థప్రసాదాలు ఇచ్చి, పూజ చేసినవారు కూడా వాటిని తీసుకోవాలి. అమ్మవారికి పెట్టిన నైవేద్యాన్ని స్వీకరించాలి.

పూజ చేస్తున్నంతసేపూ ప్రశాంత చిత్తంతో ఉండాలి.

–డి.వి.ఆర్.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఆగస్టు 7న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,00,810	1,03,960	1,02,550	1,03,960	1,00,400	1,02,540
బంగారం (22 క్యారెట్లు)	93,240	94,000	94,000	96,820	92,370	94,000
వెండి	1,18,000	1,17,700	1,27,000	1,17,700	1,17,800	1,27,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాక్షి సినిమా

ఉండిపోవే నాతోనే...


అనుపమ, సాయి శ్రీనివాస్

''మంచి హారర్ మిస్టరీగా రూపొందిన చిత్రం 'కిష్కిందపురి'. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరికీ నచ్చుతుంది'' అని బెల్లంకొండ సాయి శ్రీనివాస్ చెప్పారు. కౌశిక్ పెగల్లపాటి రచన, దర్శకత్వంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమా పరమేశ్వరన్ జోడీగా నటించిన చిత్రం 'కిష్కిందపురి'. అర్చన సమర్పణలో సాహు గారపాటి నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'ఉండిపోవే నాతోనే...' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. చేతన్ భరద్వాజ్ స్వరపరిచిన ఈ పాటకి పూర్ణాచారి సాహిత్యం అందించగా, జావేద్ అలీ పాడారు. రాజు సుందరం కొరియోగ్రఫీ చేశారు. అనుపమ మాట్లాడుతూ– ''నాకు చాలా ప్రత్యేకమైన సినిమా ఇది'' అన్నారు. ''నేను చదువుకున్న కాలేజీలో నా సినిమా పాటను లాంచ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. తప్పకుండా అందరూ ఈ పాటను, సినిమాని ఎంజాయ్ చేస్తారు'' అన్నారు కౌశిక్ పెగల్లపాటి. ''చాలా మంచి కథ ఇది'' అన్నారు చేతన్ భరద్వాజ్.

సు ఫ్రమ్ సో అలరిస్తుంది - నవీన్ యెర్నేని

''సు ఫ్రమ్ సో' మూవీ కన్నడలో బిగ్ బ్లాక్ బస్టర్ అయింది. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ చిత్రాన్ని నెక్స్ట్ లెవల్‌కి తీసుకు వెళతారనే నమ్మకం ఉంది. చక్కని వినోదంతో రూపొందిన ఈ సినిమా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు. షనీల్ గౌతమ్, జేపీ తుమినాడ్, ప్రకాశ్ కె. తుమినాడ్, మైమ్ రాందాస్ ముఖ్య తారలుగా జేపీ తుమినాడ్ దర్శకత్వం వహించిన చిత్రం 'సు ఫ్రమ్ సో'. ఈ సినిమా జూలై 25న కన్నడలో విడుదలైంది. ఈ సినిమాని మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో నేడు రిలీజ్ చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజ్ బి. శెట్టి మాట్లాడుతూ– ''మంచి కంటెంట్‌తో తీస్తే మైత్రీ మూవీ మేకర్స్ లాంటి పెద్ద సంస్థ నిర్మాతలు సపోర్ట్ చేస్తారనే నమ్మకం కలిగింది. మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులు సపోర్ట్ చేస్తారని నమ్మకంతో విడుదల చేస్తున్నాం'' అని తెలిపారు. ''తెలుగులో కూడా మా సినిమా మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాం'' అన్నారు జేపీ తుమినాడ్. ''ఒకప్పుడు ఈవీవీ సత్యనారాయణగారి సినిమాల్లో పూర్తి వినోదం ఉండేది. ఆ తర్వాత ఆ వినోదాన్ని చాలా రోజులు మిస్ అయ్యాం. ఆ లోటును 'సు ఫ్రమ్ సో' భర్తీ చేస్తుంది'' అని మైత్రీ డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి చెప్పారు.


శశి, తుమినాడ్, నవీన్, రాజ్, షనీల్ గౌతమ్


రుక్మిణీ వసంత్


ధ్రువ్ విక్రమ్

మణిరత్నం దర్శకత్వంలో..?

అందమైన ప్రేమ కథలకి చక్కని భావోద్వేగాలు జోడించి తనదైన శైలిలో ఆవిష్కరిస్తుంటారు దర్శకుడు మణిరత్నం. ప్రస్తుతం ఆయన ఓ యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయట. ఈ చిత్రంలో హీరో విక్రమ్ తనయుడు ధ్రువ్ హీరోగా, రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించనున్నారనే వార్తలు కోలీవుడ్‌లో వినిపిస్తున్నాయి. ఈ కథకి ధ్రువ్, రుక్మిణి సరైన జోడీ అనే ఆలోచనతో వారిని ఎంపిక చేశారని టాక్. సెప్టెంబరులో ఈ సినిమా చిత్రీకరణకు శ్రీకారం చుట్టనున్నారట మణిరత్నం. ఇదిలా ఉంటే... నిఖిల్ హీరోగా నటించిన 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' (2024) సినిమాతో తెలుగుకి పరిచయమయ్యారు రుక్మిణీ వసంత్. ప్రస్తుతం ఆమె ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాలో నటిస్తున్నారు.

సలామే అనాలి!


ఎన్టీఆర్, హృతిక్ రోషన్

దునియా సలామే అనాలి అంటున్నారు హృతిక్ రోషన్, ఎన్టీఆర్. హృతిక్ రోషన్, కియారా అద్వానీ జంటగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ద్వారా ఎన్టీఆర్ హిందీ చిత్ర పరిశ్రమకు పరిచయమవుతున్నారు. ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా కోసం ఎన్టీఆర్, హృతిక్ కాంబినేషన్‌లో చిత్రీకరించిన 'సలామే అనాలి' (హిందీలో 'జనాబ్ ఈ అలీ') అంటూ సాగే పాటకు సంబంధించిన గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'రేయీ పగలు ఏదైనా గానీ... మనముంటే కాదా దీవాళి... దునియా సలామే సలామే సలాం అనాలి...' అంటూ ఈ పాట సాగుతుంది. ప్రీతమ్ చక్రవర్తి సంగీతం అందించిన ఈ పాటకి తెలుగులో కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, నకాశ్ అజీజ్, యాజీన్ నిజార్ ఆలపించారు. ఈ పాటకు బోస్కో లెస్లీ మార్టిస్ నృత్య రీతులు సమకూర్చారు.

కంబళ పందెంలో...


రాజ్ బి. శెట్టి

ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా, రాజ్ బి. శెట్టి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కరవాలి'. గురుదత్ గనిగ దర్శకత్వంలో వీకే ఫిల్మ్ అసోసియేషన్, గనిగా ఫిల్మ్స్‌పై రూపొందిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రంలో మవీర అనే పాత్రలో రాజ్ బి. శెట్టి కనిపించనున్నట్లు యూనిట్ ప్రకటించి, ఆయన లుక్ విడుదల చేసింది. ఈ చిత్రంలో కంబళ పందెంలో పాల్గొనే యువకుడిగా రాజ్ బి. శెట్టి కనిపిస్తారని లుక్ స్పష్టం చేస్తోంది. కంబళ అంటే కర్ణాటక తీర ప్రాంతంలో జరిగే సాంప్రదాయ ఎద్దుల పందెం. గురుదత్ గనిగ మాట్లాడుతూ– ''తీర ప్రాంత ఆచారాల నేపథ్యంలో ఈ సినిమాను రూపొందించాం. మవీర పాత్ర గొప్పదనాన్ని అర్థం చేసుకునే నటుడు కావాలనుకుని, రాజ్ బి. శెట్టిని కలిసి కథ వినిపించాను. 'మీరు చిత్రీకరించిన కొన్ని భాగాలను నేను చూడొచ్చా?' అని ఆయన అడిగారు. అందుకు అంగీకరించాను... మా ఫుటేజ్ చూసిన వెంటనే ఒప్పుకున్నారాయన. మవీర పాత్రకు రాజ్‌గారు ప్రాణం పోశారు'' అని తెలిపారు.

మేఘం వర్షించదా...


సిజా రోజ్, విజయ రామరాజు

విజయ రామరాజు టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సిజా రోజ్, హర్ష్ రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్ నటించారు. శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. విఘ్నేష్ భాస్కరన్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'మేఘం వర్షించదా...' అంటూ సాగే తొలి పాటని విడుదల చేశారు. ఈ పాటకి విక్రాంత్ రుద్ర సాహిత్యం అందించగా, కపిల్ కపిలన్, మీరా ప్రకాశ్, సుజిత్ శ్రీధర్ పాడారు. ''స్పోర్ట్స్ డ్రామాగా రూపొందిన చిత్రం 'అర్జున్ చక్రవర్తి'. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ కూడా ఉంది. మా సినిమాకి ఇప్పటికే 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ చీకటి.

ఫుల్ కామెడీ


శివానీ నగరం, మౌళి తనూజ్

మౌళి తనూజ్, శివానీ నగరం లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించారు. ఈ సినిమాని నిర్మాతలు బన్నీ వాసు, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న విడుదల చేస్తున్నారు. సింజిత్ యెర్రమల్లి సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'రాజా గాడికి...' అంటూ సాగే సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా బన్నీ వాసు మాట్లాడుతూ– ''లిటిల్ హార్ట్స్' చూస్తున్నంత సేపూ ఎంజాయ్ చేశాను. థియేటర్స్‌లో ప్రేక్షకులు సీట్ల మీద నుంచి కింద పడేలా బాగా నవ్వుకుంటారు. ఈ సినిమాను కాలేజ్ స్టూడెంట్స్ కోసం ఫ్రీ షోస్ వేయాలనుకుంటున్నాం'' అని తెలిపారు. ''లిటిల్ హార్ట్స్' కథను తొలుత మౌళి నమ్మాడు. మౌళి మీద నమ్మకంతో ఆదిత్య హాసన్‌గారు నమ్మారు. అలా ఈ ప్రాజెక్ట్‌కు దర్శకుడిగా మారాను'' అన్నారు సాయి మార్తాండ్. ''2 గంటలు ఫుల్ ఎంటర్‌టైన్ అవుతారు'' అని ఆదిత్య హాసన్ చెప్పారు. ''బన్నీ వాసుగారు తన బ్యానర్ నుంచి తీసుకొస్తున్న ఫస్ట్ మూవీ ఇది'' అన్నారు వంశీ నందిపాటి. ''అంబాజీపేట మ్యారేజీ బ్యాండు' మూవీ తర్వాత మంచి సబ్జెక్ట్ కోసం వేచి చూడగా 'లిటిల్ హార్ట్స్'లో మంచి పాత్ర దక్కింది'' అన్నారు శివానీ. ''పూర్తి వినోదాత్మక చిత్రమిది'' అని మౌళి తనూజ్ చెప్పారు.

అందరికీ పని దొరకాలి - తమ్మారెడ్డి భరద్వాజ

''చిత్ర పరిశ్రమలో వేతన పెంపు వివాదం ఇది తొలిసారి కాదు. నిర్మాతల నాలుగు ప్రపోజల్స్‌పై చర్చ జరిగింది. డైలీ వేజ్ తీసుకునే వారు నెలకు ఎన్ని రోజులు వర్క్ చేస్తారనేది ముఖ్యం. నిర్మాతలు, కార్మికులు పంతానికి పోకుండా సమస్యని పరిష్కరించుకోవాలి. వేతనాల పెంపు సమస్య పరిష్కారం అవుతుందని నమ్ముతున్నాను. అల్టిమేట్‌గా కార్మికులందరికీ పని దొరకాలి'' అని దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల వేతనాలు 30శాతం పెంచాలంటూ తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం నుంచి బంద్ చేపట్టిన సంగతి తెలిసిందే. వేతనాల పెంపు అంశంపై హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో చిన్న చిత్రాల నిర్మాతలతో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత సి. కల్యాణ్ మాట్లాడుతూ– ''చిన్న సినిమాలకు మార్కెటింగ్, థియేటర్లు లేక చిన్న నిర్మాతలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న సినిమాల వల్లే కార్మికుల మనుగడ ఉంది. ఇప్పటివరకు తీసుకున్న జీతం కంటే 25 శాతం వేతనాలు తక్కువ తీసుకోవాలని నిర్మాతలు డిమాండ్ చేశారు. చిన్న సినిమా నిర్మాతలు ఇప్పటినుంచి ఎవరితో అయినా సినిమాలు చేసుకోవచ్చు. ప్రొడ్యూసర్ కౌన్సిల్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు విడనాడాలి. రెండు రోజుల్లో సమ్మె ముగుస్తుందని భావిస్తున్నాం'' అని తెలిపారు.

కాగా తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులతో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, నిర్మాతలు కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ వీరశంకర్ ఆధ్వర్యంలో ఈ చర్చలు కొనసాగాయి. ఫ్లెక్సిబుల్ కాల్‌షీట్లు కావాలి, నాన్ మెంబర్స్‌తో కూడా వర్క్ చేయించుకుంటాం, ఎక్కడ షూటింగ్ చేసినా రేషియో అనేది ఉండకూడదు, సెకండ్ సండే, ఫెస్టివల్ డేస్‌లో వర్క్‌కు మాత్రమే డబుల్ కాల్షీట్. మిగిలిన సండేస్‌లో సింగిల్ కాల్షీట్... వంటి ప్రతిపాదనలను ఫెడరేషన్ ముందుంచారు నిర్మాతలు. ఈ నాలుగు ప్రతిపాదనలపై ఫెడరేషన్ నిర్ణయం చెబితేనే వేతన పెంపుపై మాట్లాడతామని నిర్మాతలు పేర్కొన్నారని తెలిసింది.

కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ వీరశంకర్ మాట్లాడుతూ– ''చర్చలు మంచి వాతావరణంలో జరిగాయి. మరో రెండు మూడు సమావేశాలతో సమస్యలకి పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం. నిర్మాతలకు, కార్మికులకు న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేస్తున్నాం'' అని తెలిపారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని మాట్లాడుతూ–''నిర్మాతల వైపు నుంచి వచ్చిన నాలుగు ప్రపోజల్స్‌లో రెండింటి ఓకే చెప్పాం. మరో రెండింటిపై యూనియన్స్‌లో చర్చ జరపాల్సి ఉంది. ప్రస్తుత సమస్యను ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రొడ్యూసర్స్ కౌన్సిల్‌లోనే పరిష్కరించుకుంటాం. నేడు సెలవు. శనివారం ఛాంబర్ మీటింగ్ ఉండొచ్చు. చిరంజీవి, బాలకృష్ణగార్లు అందరికీ న్యాయం చేస్తారు. 30 శాతం వేతన పెంపు ఇస్తున్న వారి షూటింగ్స్‌కి హాజరవుతున్నాం. చిన్న నిర్మాతల ప్రపోజల్స్ మీద ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుంది. చిన్న సినిమాలకు, నిర్మాతలకు మా సపోర్ట్ ఉంటుంది'' అని పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
8-8-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
79	22
80,623	24,596

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,159	▽	12
డోజోన్స్	43,862	▽	331
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,098	▽	66
డాక్స్	24,198	△	274
షాంఘై	3,638	△	5
నికాయ్	40,059	△	264

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.30	88.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.80	118.74
€	యూరో	ఎస్‌బీఐ	101.00	103.77
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.76	60.26
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.03	58.28
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.00	69.67
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.50	24.00
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.99	24.24
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.34	13.16



పసిడి హైజంప్

- సరికొత్త ఆల్‌టైం గరిష్టానికి బంగారం
- ఒకే రోజున రూ. 3,600 అప్..
- ఢిల్లీ మార్కెట్‌లో రూ. 1,02,620కి చేరిన ధర

న్యూఢిల్లీ: భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన నేపథ్యంలో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడి వైపు మళ్లడంతో దేశీయంగా బంగారం రేట్లు గురువారం భగ్గుమన్నాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల మేలిమి బంగారం ధర ఏకంగా రూ. 3,600 మేర ఎగిసింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి రేటు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిలో రూ. 1,02,620కి పెరిగింది. అటు 99.5% స్వచ్ఛత గల పసిడి కూడా రూ. 3,600 పెరిగి రూ. 1,02,200కు చేరింది. వాణిజ్య ఉద్రిక్తతలపై భయాలతో పసిడికి డిమాండ్ పెరిగిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. మరోవైపు, వెండి ధర కేజీకి రూ. 1,500 మేర పెరిగి రూ.1,14,000కు చేరింది. ఎంసీఎక్స్‌లో పసిడి అక్టోబర్ ఫ్యూచర్స్ కాంట్రాక్టు రూ. 893 పెరిగి రూ. 1,02,155 స్థాయిని తాకింది. డిసెంబర్ కాంట్రాక్టు రూ. 880 పెరిగి లైఫ్‌టైమ్ గరిష్టమైన రూ. 1,03,047 వద్ద ట్రేడయ్యింది. అంతర్జాతీయంగా న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజీలో ఔన్సు (31.1 గ్రాములు) బంగారం ధర 3,470 డాలర్ల స్థాయిని తాకింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 100% టారిఫ్‌లు విధిస్తానని బెదిరిస్తుండటం, వాణిజ్య ఉద్రిక్తతలు మొదలైన అంశాలు పసిడికి సానుకూలంగా మారాయని మిరే అసెట్ షేర్ ఖాన్ అసోసియేట్ వీపీ ప్రవీణ్ సింగ్ తెలిపారు.

ఎల్‌ఐసీ లాభం ప్లస్

క్యూ1లో రూ. 10,987 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్‌ఐసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 5 శాతం పుంజుకుని రూ. 10,987 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 10,461 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,10,910 కోట్ల నుంచి రూ. 2,22,864 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో తొలి ఏడాది ప్రీమియం రూ. 7,470 కోట్ల నుంచి రూ. 7,525 కోట్లకు బలపడింది. రెన్యువల్ ప్రీమియం ఆదాయం రూ. 56,429 కోట్ల నుంచి రూ. 59,885 కోట్లకు ఎగసింది. పెట్టుబడుల నుంచి నికర ఆదాయం రూ. 96,183 కోట్ల నుంచి రూ. 1,02,930 కోట్లకు బలపడింది. మొత్తం ప్రీమియం ఆదాయం 5 శాతం వృద్ధితో రూ. 1,19,200 కోట్లకు చేరింది. వ్యక్తిగత విభాగంలో 15 శాతం తక్కువగా 30,39,709 పాలసీలను విక్రయించింది. నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 6 శాతం మెరుగుపడి రూ. 57,05,341 కోట్లుగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్‌ఐసీ షేరు 0.8% బలహీనపడి రూ. 885 వద్ద ముగిసింది.

ఏయూ స్మాల్ ఫైనాన్స్‌కు 'బ్యాంకింగ్' లైసెన్స్

ఆర్‌బీఐ సూత్రప్రాయ ఆమోదం

ముంబై: యూనివర్సల్ బ్యాంకు (పూర్తి స్థాయి బ్యాంకు)గా కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నుంచి సూత్రప్రాయ ఆమోదం లభించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా 2024 సెప్టెంబర్ 3న ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ యూనివర్సల్ బ్యాంకింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంది. అర్హత ప్రమాణాలు పరిశీలించిన ఆర్‌బీఐ తాజాగా దీన్ని మంజూరు చేసింది. దీంతో ఆర్‌బీఐ నుంచి పూర్తి స్థాయి బ్యాంకింగ్ లైసెన్స్ పొందిన తొలి స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా అవతరించింది. బ్యాంకు ఎండీ సీఈవో సంజయ్ అగర్వాల్ మాట్లాడుతూ, 'యూనివర్సల్ బ్యాంక్‌గా కార్యకపాలు నిర్వహించుకునేందుకు ఆర్‌బీఐ నుంచి సూత్రప్రాయంగా ఆమోదం పొందడం ద్వారా చరిత్ర సృష్టించాం. వ్యాపార విస్తరణ సామర్థ్యాన్ని పెంచుకోవడమే కాకుండా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాము' అన్నారు. దాదాపు దశాబ్దకాలం తర్వాత మళ్లీ ఆర్‌బీఐ యూనివర్సల్ బ్యాంకింగ్ లైసెన్స్ ఇవ్వడం ఇదే తొలిసారి. అంతక్రితం 2014 ఏప్రిల్‌లో బంధన్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ బ్యాంక్ (ప్రస్తుతం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్)లకు ఆర్‌బీఐ బ్యాంకింగ్ లైసెన్స్ మంజూరు చేసింది.

నాల్కో డివిడెండ్ రూ. 2.5

న్యూఢిల్లీ: మెటల్ రంగ పీఎస్‌యూ దిగ్గజం నాల్కో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 78 శాతం జంప్‌చేసి రూ. 1,049 కోట్లను అధిగమించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 588 కోట్లు ఆర్జించింది. కంపెనీ బోర్డు షేరుకి రూ. 2.5 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం సైతం 35 శాతం ఎగసి రూ. 3,930 కోట్లను తాకింది.

నాల్కో షేరు 0.5% లాభంతో 190 వద్ద క్లోజైంది.

సిప్.. సిప్.. హుర్రే!

రికార్డు స్థాయిలో కొత్త సిప్ ఖాతాలు

- జూన్ త్రైమాసికంలో 1.67 కోట్లు
- 'గ్రో'లో అత్యధికంగా 42 లక్షలు జత..

న్యూఢిల్లీ: మార్కెట్ ఒడిదుడుకులకు లోనవుతున్నప్పటికీ సిప్‌ల (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) ద్వారా పెట్టుబడులు పెరగడం కొనసాగుతోంది. జూన్ త్రైమాసికంలో కొత్త సిప్ ఖాతాలు 1.67 కోట్ల మేర నమోదయ్యాయి. క్రితం క్వార్టర్‌లో నమోదైన 1.41 కోట్లతో పోలిస్తే ఇది అధికం. మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. వీటి ప్రకారం 41.9 లక్షల కొత్త సిప్‌లు, 25 శాతం మార్కెట్ వాటాతో గ్రో సంస్థ అగ్రగామిగా నిలిచింది. నెలవారీగా చూస్తే జూన్‌లో గ్రోలో కొత్త సిప్‌లు 15.7 లక్షలుగా రిజిస్టరయ్యాయి. విలువపరంగా చూస్తే కొత్త సిప్‌లు 32 శాతం పెరిగి రూ. 1,116 కోట్లకు చేరాయి. మరోవైపు, ఏంజెల్ వన్‌లో కొత్తగా 15 లక్షల సిప్‌లు, ఎన్‌జే ఇండియా ఇన్వెస్ట్‌లో 5.9 లక్షలు, హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్‌లో 3.8 లక్షలు, డిజిటల్ ప్లాట్‌ఫాం ఫోన్‌పేలో 5.9 లక్షల సిప్‌లు నమోదయ్యాయి. ఈక్విటీ మార్కెట్లలో ఒడిదుడుకులు కొనసాగుతున్నప్పటికీ మ్యూచువల్ ఫండ్స్‌పై రిటైల్ ఇన్వెస్టర్ల ఆసక్తి మెరుగ్గానే ఉంటోంది.

మరిన్ని వివరాలు..


■ మ్యూచువల్ ఫండ్స్‌లో జూన్‌లో రికార్డు స్థాయిలో రూ. 27,269 కోట్ల మేర సిప్ పెట్టుబడులు వచ్చాయి. సిప్‌ల ఏయూఎం (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం) గతేడాది జూన్ 30 నాటి గణాంకాలతో పోలిస్తే ఈసారి జూన్ 30 నాటికి రూ. 15.3 లక్షల కోట్లకు చేరింది.

■ 2025లో మ్యూచువల్ ఫండ్ విశిష్ట ఇన్వెస్టర్ల సంఖ్య 5.4 కోట్లకు చేరింది. 2023లో 3.8 కోట్లతో పోలిస్తే 42 శాతం, 2024లోని 4.5 కోట్లతో పోలిస్తే 20 శాతం పెరిగింది.

■ 2025 జూన్ ఆఖరు నాటికి పరిశ్రమ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రికార్డు స్థాయిలో 74.4 లక్షల కోట్లకు చేరింది. క్రితం క్యూ1లో నమోదైన రూ. 63.2 లక్షల కోట్లతో పోలిస్తే 18 శాతం పెరిగింది.

■ రిటైల్ ఇన్వెస్టర్లు సంప్రదాయ పొదుపు విధానాల నుంచి పెట్టుబడుల మైండ్‌సెట్ వైపు మళ్లుతున్నారు. మ్యుచువల్ ఫండ్స్‌ను దీర్ఘకాలిక సంపద సృష్టి సాధనాలుగా భావిస్తున్నారు.

■ సులభతరంగా ఇన్వెస్ట్ చేసే విధానాలను డిజిటల్–ఫస్ట్ ప్లాట్‌ఫాంలు మరింతగా అందుబాటులోకి తేవడంతో పెట్టుబడులు పెరుగుతున్నాయి. అలాగే యాంఫీ, అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు కూడా ఇన్వెస్టర్లలో అవగాహన పెంచేందుకు ఉపయోగపడుతున్నాయి. సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ విధానాన్ని ప్రోత్సహించడంలో, మ్యుచువల్ ఫండ్ వ్యవస్థపై నమ్మకాన్ని పెంచడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తున్నాయి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

'టారిఫ్' రంగాలకు కేంద్రం చేయూత!	టైటాన్ లాభం జూమ్.. రూ. 1,091 కోట్లు

మైనస్ 733 నుంచి ప్లస్ 79 పాయింట్లకు

సెన్సెక్స్ రోలర్‌కోస్టర్ రైడ్

- ట్రేడింగ్‌లో వెంటాడిన ట్రంప్ టారిఫ్ భయాలు
- ఆఖర్లో బ్యాంకులు, ఐటీ షేర్లకు డిమాండ్



ముంబై: ఆఖరి గంటలో ఐటీ, బ్యాంకులు షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో గురువారం స్టాక్ సూచీలు స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. ఇంట్రాడేలో 733 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ చివరికి 79 పాయింట్లు పెరిగి 80,623 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22 పాయింట్లు లాభపడి 24,596 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో 24,344 వద్ద కనిష్టాన్ని, 24,634 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. ట్రంప్ భారత్ దిగుమతులపై అదనపు సుంకాన్ని 50 శాతానికి పెంచడంతో ఒక దశలో సెన్సెక్స్ 733 పాయింట్లు పతనమై 79,811 వద్ద కనిష్టాన్ని తాకింది. అయితే నిఫ్టీ డెరివేటివ్స్ వీక్లీ ఎక్స్‌పైరీ సందర్భంగా ట్రేడింగ్ చివర్లో కీలక రంగాల్లో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు చోటు చేసుకున్నాయి. ఫలితంగా సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈ ఇండెక్సుల్లో రంగాల వారీగా ఐటీ, ఫార్మా, టెక్, ఆటో సూచీలు 0.50% పెరిగాయి. టెలీ కమ్యూనికేషన్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, విద్యుత్, ఇండస్ట్రియల్ ఇండెక్సులు 0.50% – 0.25 శాతం నష్టపోయాయి. మిడ్‌క్యాప్ ఇండెక్సు 0.18% పెరిగింది. స్మాల్ క్యాప్ సూచీ 0.18 శాతం పతనమైంది.
- కనిష్ట స్థాయిల నుంచి రూపాయి రికవరీ రెండో రోజూ కొనసాగింది. డాలర్ మారకంలో 14 పైసలు బలపడి 87.58 వద్ద స్థిరపడింది. ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 87.69 వద్ద ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో 87.45 – 87.77 శ్రేణిలో కదలాడింది. స్టాక్ మార్కెట్‌లో స్తబ్దత, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు దేశీయ కరెన్సీ లాభాలను పరిమితం చేశాయని ఫారెక్స్ నిపుణులు తెలిపారు.
- జూన్ క్వార్టర్‌లో రూ.455.50 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించడంతో భెల్ షేరు 5% నష్టపోయి రూ.228 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 7% పతనమైన రూ.222 వద్ద కనిష్టాన్ని తాకింది.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో శివమ్

బ్యాంకాక్‌లో జరుగుతున్న ఆసియా అండర్–19 బాక్సింగ్ టోర్నీలో ఐదుగురు భారత బాక్సర్లు శివమ్ (55 కేజీలు), మౌసమ్ (65 కేజీలు), రాహుల్ (75 కేజీలు), గౌరవ్ (85 కేజీలు), హేమంత్ సాంగ్వాన్ (90 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. ఇదే వేదికపై జరుగుతున్న ఆసియా అండర్–22 బాక్సింగ్ పోటీల్లో భారత బాక్సర్లు 13 పతకాలను ఖాయం చేసుకున్నారు.

భారత మహిళల 'ఎ' జట్టు ఓటమి

తొలి టి20లో నెగ్గిన ఆస్ట్రేలియా 'ఎ'

మెకే: ఆస్ట్రేలియా పర్యటనను భారత మహిళల 'ఎ' జట్టు ఓటమితో మొదలు పెట్టింది. గురువారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల 'ఎ' టీమ్ 13 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. ముందుగా ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. అనిక (50 నాటౌట్; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించగా, సీనియర్ ప్లేయర్ అలీసా హీలీ (27; 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించింది. భారత లెగ్‌స్పిన్నర్ ప్రేమ రావత్ 15 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా... సజన, సైమా చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో భారత మహిళల జట్టు 20 ఓవర్లలో 5 వికెట్లకు 124 పరుగులే చేయగలిగింది. రాఘ్వీ బిస్త్ (33; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఉమా ఛెత్రి (31; 4 ఫోర్లు), కెప్టెన్ రాధ యాదవ్ (26 నాటౌట్; 3 ఫోర్లు) రాణించినా జట్టును గెలిపించలేకపోయారు.

నోర్ముయ్... చెప్పింది చెయ్!

భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్‌తో బాక్సింగ్ సమాఖ్య ఈడీ దురుసు ప్రవర్తన

- క్రీడా మంత్రికి ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన 'సాయ్'



న్యూఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకంతో దేశప్రతిష్టను ఇనుమడింప చేసిన స్టార్ మహిళా బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్‌కు ఓ క్రీడా సమాఖ్య డైరెక్టర్ నుంచి వివక్ష ఎదురైంది. దీన్ని ఏమాత్రం సహించని ఆమె ఫిర్యాదు చేయడంతో భారత ఒలింపిక్ సంఘం, భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) విచారణ చేపట్టాయి. గత నెలలో జూమ్ మీటింగ్ (ఆన్‌లైన్) జరిగింది. ఇందులో బాక్సర్ల లవ్లీనాతో పాటు భారత బాక్సింగ్ సమాఖ్య ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కల్నల్ అరుణ్ మలిక్, పలువురు 'సాయ్', టాప్స్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ ఆన్‌లైన్ మీటింగ్‌లో లవ్లీనా తన వ్యక్తిగత కోచ్‌ను కూడా శిబిరాలకు తనతో పాటు అనుమతించాలని కోరింది. దీనిపై అరుణ్ మలిక్ వివక్షాపూరిత ధోరణితో వ్యవహరించాడని లవ్లీనా వాపోయింది. 'ఆయన చాలా కోపంగా మాట్లాడారు. నోర్ముయ్. తలదించుకొని మేం చెప్పింది చెయ్ అంతే అని తీవ్ర స్థాయిలో స్పందించడం నన్ను లింగ వివక్షకు గురిచేసింది. దీంతో ఒక్కసారిగా నిర్ఘాంతపోయాను. ఏం మాట్లాడాలో కూడా పాలుపోలేదు. కొన్ని క్షణాలపాటు షాక్‌లోనే కూరుకుపోయాను. ఆయన పురుషాధిక్య ధోరణితో మహిళనైనా నన్ను తక్కువ చేసి మాట్లాడారు. ఇది నన్ను అవమానించడం కాదు. మహిళా అథ్లెట్ల పట్టుదలని అవమానించడమే' అని లవ్లీనా... క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ఫిర్యాదు చేయడంతో ఐఓఏ, సాయ్ విచారణ చేపట్టాయి. 2 వారాల్లోనే దర్యాప్తు నివేదికను సమర్పించాల్సి ఉంది. మరోవైపు అరుణ్ లలిక్ మాట్లాడుతూ లవ్లీనా ఆరోపణలు అసత్యమని అన్నారు. భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) నిబంధనల ప్రకారమే వ్యవహరించానని చెప్పారు. జాతీయ శిబిరాల్లో వ్యక్తిగత కోచ్‌లకు అనుమతించడం కుదరదని సున్నితంగానే చెప్పానని ఆయన వివరణ ఇచ్చారు.

అర్జున్ శుభారంభం



చెన్నై: క్వాంట్‌బాక్స్ చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. గురువారం జరిగిన మాస్టర్స్ కేటగిరీ తొలి రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ 49 ఎత్తుల్లో అవండర్ లియాంగ్ (అమెరికా)పై గెలుపొందాడు. తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ తొలి ఎత్తు వేసి అర్జున్–లియాంగ్ గేమ్‌ను ప్రారంభించారు. ప్రణవ్ (భారత్)–కార్తికేయన్ మురళీ (భారత్) గేమ్ 44 ఎత్తుల్లో... అనీశ్ గిరి (నెదర్లాండ్స్)–రే రాబ్సన్ (అమెరికా) గేమ్ 59 ఎత్తుల్లో... విదిత్ గుజరాతి (భారత్)–జోర్డాన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్) గేమ్ 48 ఎత్తుల్లో 'డ్రా'గా ముగియగా... విన్సెంట్ కీమెర్ (జర్మనీ) 52 ఎత్తుల్లో నిహాల్ సరీన్ (భారత్)పై విజయం సాధించాడు. 'మాస్టర్స్' కేటగిరీలో పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య తొమ్మిది రౌండ్‌లు జరుగుతాయి.

హారిక పరాజయం

మరోవైపు ఇదే వేదికపై జరుగుతన్న చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చాలెంజర్స్ టోర్నీని హైదరాబాద్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక పరాజయంతో ప్రారంభించింది. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్ దీప్తాయన్ ఘోష్‌తో జరిగిన తొలి గేమ్‌లో హారిక 44 ఎత్తుల్లో ఓడిపోయింది. ఇతర గేముల్లో లియోన్ ల్యూక్ (భారత్) 47 ఎత్తుల్లో హర్షవర్ధన్ (భారత్)పై, ప్రాణేశ్ (భారత్) 26 ఎత్తుల్లో ఆర్యన్ చోప్రా (భారత్)పై నెగ్గారు. అభిమన్యు పురాణిక్ (భారత్)–ఆధిబన్ (భారత్) గేమ్ 46 ఎత్తుల్లో... వైశాలి (భారత్)–ఇనియన్ (భారత్) గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. చాలెంజర్స్ టోర్నీ విజేతకు వచ్చే ఏడాది 'మాస్టర్స్' టోర్నీలో పాల్గొనే అవకాశం ఇస్తారు.

నార్త్‌జోన్ కెప్టెన్‌గా శుబ్‌మన్ గిల్

సెంట్రల్ జోన్ సారథిగా జురేల్
ఈనెల 28 నుంచి దులీప్ ట్రోఫీ



న్యూఢిల్లీ: భారత టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నమెంట్ దులీప్ ట్రోఫీలో ఆడనున్నాడు. గిల్ సారథ్యంలోనే నార్త్‌జోన్ జట్టు టోర్నీ బరిలోకి దిగనుంది. ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌ను 'డ్రా'గా ముగించడంతో పాటు 754 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలిచిన గిల్... దేశవాళీ మ్యాచ్‌ను ఆడేందుకు సిద్ధం కావడం విశేషం. దులీప్ ట్రోఫీలో పాల్గొనే 15 మంది సభ్యుల నార్త్‌జోన్ జట్టును గురువారం ప్రకటించారు. గిల్‌తో పాటు పేసర్ అర్ష్‌దీప్ సింగ్, టెస్టు క్రికెటర్లు హర్షిత్ రాణా, అన్షుల్ కంబోజ్ కూడా ఇందులో ఉన్నారు. జమ్మూ కశ్మీర్ జట్టు నుంచి అత్యధికంగా ఐదుగురు ప్లేయర్లకు ఇందులో అవకాశం దక్కింది. అండర్–19 వరల్డ్ కప్ విజయ సారథి యశ్ ధుల్ కూడా టీమ్‌లోకి ఎంపికయ్యాడు. ఆగస్టు 28 నుంచి బెంగళూరులో జరిగే తమ తొలి మ్యాచ్‌లో ఈస్ట్ జోన్‌తో నార్త్‌జోన్ తలపడుతుంది.

నార్త్‌జోన్ జట్టు వివరాలు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), అంకిత్ కుమార్, శుభమ్ ఖజూరియా, ఆయుష్ బదోని, యశ్ ధుల్, అంకిత్ కల్సీ, నిశాంత్ సంధు, సాహిల్ లోత్రా, మయాంక్ డాగర్, యుధ్‌వీర్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా, అన్షుల్ కంబోజ్, ఆఖిబ్ నబీ, కన్హయ్య వధావన్.

బరిలో కుల్దీప్ యాదవ్...

దులీప్ ట్రోఫీలో పాల్గొనే సెంట్రల్ జోన్ జట్టును కూడా ప్రకటించారు. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో చివరి టెస్టు ఆడిన వికెట్ కీపర్ ధ్రువ్ జురేల్ ఈ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్ ఆడే అవకాశం రాని స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ టోర్నీ బరిలోకి దిగుతుండగా... భారత ఆటగాళ్లు రజత్ పాటీదార్, ఖలీల్ అహ్మద్, దీపక్ చహర్‌లకు కూడా ఇందులో చోటు దక్కింది. సెంట్రల్ జోన్ ఆగస్టు 28 నుంచి బెంగళూరులోనే జరిగే తమ తొలి పోరులో నార్త్ ఈస్ట్ టీమ్‌ను ఎదుర్కొంటుంది.

సెంట్రల్ జోన్ జట్టు వివరాలు: ధ్రువ్ జురేల్ (కెప్టెన్), రజత్ పాటీదార్, ఆర్యన్ జుయాల్, డానిష్ మాలేవర్, సంచిత్ దేశాయ్, కుల్దీప్ యాదవ్, ఆదిత్య థాకరే, దీపక్ చహర్, సారాంశ్ జైన్, ఆయుశ్ పాండే, శుభమ్ శర్మ, యశ్ రాథోడ్, హర్ష్ దూబే, మానవ్ సుతార్, ఖలీల్ అహ్మద్.

'నేను వెళ్లిపోతా... వదిలేయండి'

రాజస్తాన్ రాయల్స్ యాజమాన్యంతో సంజు సామ్సన్



జైపూర్: ఐపీఎల్ జట్టు రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజు సామ్సన్‌కు, టీమ్ యాజమాన్యానికి మధ్య విభేదాలు ఉన్నట్లు తాజా పరిణామంతో స్పష్టమైంది. రాజస్తాన్ టీమ్‌లో సుదీర్ఘ కాలంగా భాగమైన సంజు సామ్సన్ జట్టు నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యాడు. ఐపీఎల్–2026 సీజన్‌కు ముందు తనను విడుదల చేయాలని అతను ఫ్రాంచైజీని కోరినట్లు సమాచారం. నిజానికి ఈ ఏడాది లీగ్ ముగియగానే సామ్సన్ తన మనసులో మాటను మేనేజ్‌మెంట్‌కు వెల్లడించాడు. అయితే దీనిపై రాయల్స్ యాజమాన్యం ఇంకా స్పందించలేదు. 2025లో రూ.18 కోట్లతో సామ్సన్‌ను జట్టు అట్టి పెట్టుకుంది. అయితే గాయం కారణంగా సామ్సన్ 9 మ్యాచ్‌లే ఆడాడు. 14 మ్యాచ్‌లలో 4 మాత్రమే గెలిచిన రాయల్స్ 9వ స్థానంతో ముగించింది. తాను కోలుకున్నా రియాన్ పరాగ్‌కే కెప్టెన్సీ కొనసాగించడంతో పాటు సీజన్‌కు ముందు జోస్ బట్లర్‌ను టీమ్ వదిలేసుకోవడంపై కూడా యాజమాన్యంతో సామ్సన్‌కు విభేదాలు వచ్చాయి. 2013 నుంచి 2015 వరకు రాజస్తాన్ తరఫున ఆడిన సంజు ఆ తర్వాత రెండు సీజన్లు ఢిల్లీకి ఆడి 2018లో మళ్లీ రాయల్స్‌కే వచ్చాడు. 2021లో అతనికి కెప్టెన్సీ ఇవ్వగా తర్వాతి ఏడాదే జట్టు ఫైనల్‌కు కూడా చేరింది. మొత్తం జట్టు తరఫున 11 సీజన్లలో కలిపి అతను 149 మ్యాచ్‌లు ఆడి 4027 పరుగులు చేశాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



వెలుగులు విరజిమ్మిన వృక్షం

క్రీడల నిర్వహణలోనే కాదు... పోటీల ప్రారంభోత్సవంలో కూడా అంచనాలకు మించి అద్భుతాలను చూపించడంలో చైనా ఎప్పుడూ ముందుంటుంది. తాజాగా 12వ వరల్డ్ గేమ్స్ సందర్భంగా ఇది మరోసారి కనిపించింది. చైనాలోని చెంగ్డూలో గురువారం మొదలైన ఈ పోటీలు ఆగస్టు 17 వరకు జరుగనున్నాయి. ఈ ఈవెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా తమ చరిత్ర, సంస్కృతి తెలిపే వివిధ ఘట్టాలను చైనా ప్రేక్షకుల ముందు ఉంచింది. వీటిలో బాణాసంచాతో ప్రత్యేకంగా రూపొందించిన వెలుగులు విరజిమ్మే చెట్టు ఆకారాన్ని ప్రదర్శించడం హైలైట్‌గా నిలిచింది. శాంతి, స్నేహానికి ప్రతిరూపంగా చెంగ్డూలోని మ్యూజియంలో ఉన్న 'ట్రీ ఆఫ్ ఫ్రెండ్‌షిప్'ను స్ఫూర్తిగా తీసుకుంటూ ఈ చెట్టును ప్రదర్శించారు. ఈ 12వ వరల్డ్ గేమ్స్‌లో 116 దేశాలకు చెందిన 3,942 మంది అథ్లెట్లు 34 క్రీడాంశాల్లో పోటీ పడుతుండగా... ఆర్చరీలో భారత ఆటగాళ్లు బరిలోకి దిగారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



Cheil-27848/25



వర్షాకాలం అయినప్పటికీ ఎండలు మండుతున్నాయి. మరో వైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే అల్లూరి జిల్లా రాజవొమ్మంగి ప్రాంతంలో నాట్లు వేసిన పొలాలు బీటలు వారాయి. రేపో మాపో వర్షం పడకపోతే పూర్తిగా ఎండిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. గత పది రోజులుగా వరుణుడు కరుణించకపోవడంతో వ్యవసాయ పనులు సాగడం లేదు. రాజవొమ్మంగి మండలంలో జూన్ సాధారణ వర్షపాతం 202.4 ఎంఎంకు 112.8 ఎంఎం, జూలైలో 153.2ఎంఎకు 72.9 ఎంఎం మాత్రమే నమోదైంది. ఈ నెలలో ఇప్పటివరకు చినుకు జాడలేదు. ఇకనైనా వరుణుడు కటాక్షించాలని రైతులు వేడుకుంటున్నారు. - రాజవొమ్మంగి

మంచు.. మండే ఎండ.. వాన





మన్యంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి. బుధవారం ఉదయం పాడేరు ప్రాంతంలో పొగమంచు కురువగా సాయంత్రం వరకు భానుడు చుర్రుమనిపించాడు. ఆ తరువాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. కారుమబ్బులు కమ్ముకుని జల్లులు కురిశాయి. జిల్లా కేంద్రం పాడేరులో కనిష్టంగా 22.8 డిగ్రీలు, గరిష్టంగా 35.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.
-సాక్షి, పాడేరు



బంతికి డిమాండ్





పెళ్లిళ్ల సీజన్‌తో పాటు విశిష్ట పండుగలు కలసి వచ్చిన ఈ శ్రావణ మాసంలో బంతి పూలకు భారీగా డిమాండ్ నెలకొంది. గతంలో కిలో బంతి పూలు కేవలం రూ.30 నుంచి రూ.40 వరకూ అమ్ముడుపోగా తాజాగా రూ.వందకు చేరుకుంది. త్వరలో వినాయక చవితి, దేవీ శరన్నవరాత్రులు, రానుండడంతో పూల ధరలు నిలకడగా ఉంటాయని రైతులు ఆశిస్తున్నారు. సత్యసాయి జిల్లా వ్యాప్తంగా సుమారు 719 హెక్టార్లలో పూల తోటలు విస్తరించి ఉన్నాయి. ఇందులో 185 హెక్టార్లలో చామంతి, 30 హెక్టార్లలో రోజా, 35 హెక్టార్లలో జాస్మిన్, 200 హెక్టార్లలో బంతి, 153 హెక్టార్లలో కనకాంబరాల సాగును రైతులు చేపట్టారు. స్థానిక మార్కెట్లతో పాటు కర్ణాటకలోని బాగేపల్లి, చిక్కబళ్లాపూర్, బెంగళూరు మార్కెట్లకు పూల దిగుబడిని రైతులు తరలిస్తున్నారు. - పుట్టపర్తి అర్బన్

క్లుప్తంగా...

జీసీసీ సభ్యుల నియామకం

సాక్షి, అమరావతి: ఏపీ గిరిజన సహకార సంస్థ(జీసీసీ–విశాఖపట్నం)కు సభ్యులను నియమిస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జీసీసీ సభ్యులుగా నియమితులైన వారిలో నిమ్మల నిబ్రం (పాలకొండ), బొర్ర నాగరాజు (పాడేరు), కన్నపరాజు (పోలవరం), ముదవత్ జీవులనాయక్ (శ్రీశైలం), పంగి రాజారావు (అరకు) ఉన్నారు. ట్రైకార్ సభ్యులుగా వెంపురు గంగులయ్య (పాడేరు), భూక్యా క్రిష్ణ నాయక్ (పుంగనూరు)లను నియమించారు. నిరుద్యోగ గిరిజన యువతకు శిక్షణ ఇచ్చేందుకు మేపగుంటలో ఏపీ స్టడీ సర్కిల్‌ను, విజయవాడ, గుంటూరు, తిరుపతిలో ప్రాంతీయ స్టడీ సర్కిల్స్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రజా ఉద్యమాల వేదికగా సీపీఐ రాష్ట్ర మహాసభలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలను నిర్మించే వేదికగా సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. గురువారం విజయవాడలోని దాసరి భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఒంగోలులో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు పార్టీ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్

సాక్షి, అమరావతి:నాయీ బ్రాహ్మణులు నిర్వహించే హెయిర్ కట్ సెలూన్లకు నెలకు ప్రస్తుతం ఇస్తున్న 150 యూనిట్ల ఉచిత విద్యుత్ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లకు పెంచింది. ఈ మేరకు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి: ఏపీఎస్టీఏ

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ, ఉద్యోగుల కోసం 12వ పీఆర్సీని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 12వ పీఆర్సీ 2023 జూలై నుంచి అమలు కావాల్సి ఉన్నా నేటికీ కమిషన్‌ను నియమించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, ఉపాధ్యాయులకు యాప్‌ల భారాన్ని పెంచిందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.


స్టాండింగ్ కౌన్సిల్స్ నియామకం

సాక్షి, అమరావతి: ప్రభుత్వరంగ సంస్థలు, విశ్వవిద్యాలయాల తరఫున హైకోర్టులో వాదనలు వినిపించేందుకు స్టాండింగ్ కౌన్సిళ్లను నియమిస్తూ గురువారం న్యాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) స్టాండింగ్ కౌన్సిల్‌గా వజ్రాల శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. నెల్లూరు జిల్లా సహా రాయలసీమ ప్రాంత పురపాలక సంఘాల స్టాండింగ్ కౌన్సిల్‌గా బొర్రా శివ శంకరరావు, శ్రీకాకుళం, బొబ్బిలి పట్టణాభివృద్ధి సంస్థ స్టాండింగ్ కౌన్సిల్‌గా జంధ్యం సుబ్బారావు, కృష్ణా విశ్వవిద్యాలయం స్టాండింగ్ కౌన్సిల్‌గా బి.సుధాకర్‌కుమార్, కాపు సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా చేజర్ల వెంకటేశ్వర్లు, కాకినాడ జేఎన్‌టీయూ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీహెచ్ఎస్‌వీ సూరజ్, విజయనగరం జిల్లా గురజాడలోని జేఎన్‌టీయూ స్టాండింగ్ కౌన్సిల్‌గా బి.రామశంకరరావు, ఏపీ ఫిషరీస్ విశ్వవిద్యాలయం స్టాండింగ్ కౌన్సిల్‌గా గుడి శ్రీనివాస్ నియమితులయ్యారు. వీరంతా మూడేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగుతారు.

AI హోమ్ వర్క్ సిద్ధం! పరీక్షకు సన్నద్ధం!!

'స్టడీ మోడ్'ను పరిచయం చేసిన చాట్‌జీపీటీ | పోటీలోకి గూగుల్ జెమినై 'గైడెడ్ లెర్నింగ్' | విద్యార్థుల భాగస్వామ్యంతో 'చాట్‌బాట్స్'

సాక్షి, స్పెషల్ డెస్క్: హోమ్‌వర్క్‌లో సాయం చేసే ఓ స్నేహితుడు.. పరీక్షకు ఎలా సన్నద్ధం కావాలో మార్గదర్శనం చేసే టీచర్.. ఇదంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ గురించే. ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌జీపీటీ స్టడీ మోడ్‌ను, గూగుల్ జెమినై గైడెడ్ లెర్నింగ్ టూల్‌ను ప్రారంభించి చాట్‌బాట్‌ను వ్యక్తిగత ట్యూటర్‌గా మార్చేశాయి. ప్రతిష్టాత్మక కంపెనీల్లో ఉద్యోగాలు, అగ్రశ్రేణి ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు, ఇంజనీరింగ్, మెడికల్ ఎంట్రన్స్ వంటి భారత్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వి ద్యార్థులకు కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్స్ మంచి అధ్యయన సహాయకులుగా అవతరిస్తున్నాయి. దీంతో భారత్‌లోని ఎడ్‌టెక్ సంస్థలు, సంప్రదాయ కోచింగ్ కేంద్రాలు ఏఐ నుంచి తీవ్ర పోటీని ఎదుర్కోనున్నాయని నిపుణులు అంటున్నారు.



ఇంటర్నెట్ వచ్చాక సంప్రదాయ గైడ్స్‌కు కాలం చెల్లింది. సాంకేతికతను ఉపయోగించి ఎడ్‌టెక్ కంపెనీలు విద్యావ్యవస్థ స్వరూపాన్నే మార్చేశాయి. పాఠ్యాంశాలను అర్థం చేసుకోవడం, లోతుగా అధ్యయనం చేయడానికి అభ్యాస విధానంలో కొత్తదనం తీసుకొచ్చాయి. ఇప్పుడు ఏఐ రాకతో తరగతి గదికి మించి నేర్చుకోవడంలో గూగుల్ గైడెడ్ లెర్నింగ్, ఓపెన్ ఏఐ స్టడీ మోడ్ కొత్త రకం అనుభవం అందిస్తాయని టెక్ నిపుణులు చెబుతున్నారు.

'విద్యార్థులకు లాభదాయకమే'

నిజానికి ఏఐ చాట్‌బాట్‌లు విద్యార్థులకు నేరుగా ప్రత్యక్ష సమాధానాలను ఇచ్చేస్తాయని.. దానివల్ల వారి మెదడుకు పని ఉండదని, దాంతో అభ్యాస ప్రక్రియ దెబ్బతినే అవకాశం ఉందని చాలామంది విద్యావేత్తలు చెబుతున్నారు. కానీ, అది నిజం కాదంటున్నాయి గూగుల్, ఓపెన్ ఏఐ సంస్థలు. ఈ సంస్థలు స్టడీ మోడ్, గైడెడ్ లెర్నింగ్ పేరుతో వ్యక్తిగత ట్యూటర్లను ప్రవేశపెట్టాయి. ఈ సరికొత్త సాధనాలు చాట్‌బాట్‌లను సాధారణ సమాధాన వేదికలుగా కాకుండా.. అభ్యాస సాధనాలుగా మలచడం ద్వారా విద్యా విధానం కొత్త పుంతలు తొక్కడం ఖాయంగా కనపడుతోంది.

గైడెడ్ లెర్నింగ్ ఇలా..

అర్థవంతమైన అభ్యాసానికి కేవలం ప్రాంప్టింగ్‌ను (ఆదేశాలు) మెరుగుపరచడం సరిపోదని గూగుల్ అంటోంది. విద్యార్థుల ముందున్న సందేహాలు, సమస్యలను దశలవారీగా గైడెడ్ లెర్నింగ్ విభజిస్తుంది. యూజర్ల అవసరాలకు అనుగుణంగా వివరణలను మారుస్తుంది. చిత్రాలు, రేఖాచిత్రాలు, వీడియోలు, ఇంటరాక్టివ్ క్విజ్‌లను ఉపయోగించి స్పందిస్తుంది. సమాధానం ఇవ్వడం కంటే జ్ఞానాన్ని పెంచుకోవడానికి, పరీక్షించుకోవడానికి యూజర్లకు సహాయపడుతుంది. చురుకైన, నిర్మాణాత్మక ప్రక్రియ అనే ప్రధాన సూత్రంపై ఆధారపడి బోధనలో భాగస్వామిగా ఉండేలా విద్యావేత్తలతో కలిసి గైడెడ్ లెర్నింగ్‌ను రూపొందించినట్టు గూగుల్ తెలిపింది.

'హోమ్‌వర్క్ హెల్ప్' ద్వారా విద్యార్థుల హోమ్‌వర్క్‌లను.. స్టెప్ బై స్టెప్ మార్గదర్శనం ద్వారా చేసి పెడుతుంది. ఇందుకోసం చేయాల్సిందల్లా దానికి సంబంధించిన చిత్రాలు లేదా డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయడమే.

అలాగే పరీక్షలకు సిద్ధమయ్యేటప్పుడు కూడా ఎలా చదవాలా అని ఆలోచించాల్సిన పనిలేదు. మన దగ్గర ఉన్న నోట్స్, ఇతర డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే చాలు, వాటిని ఒక స్టడీ గైడ్‌గా, ఒక ప్రాక్టీస్ టెస్ట్‌గా, పాడ్‌కాస్ట్‌గా కూడా చేసి మన ముందు పెడుతుంది.

విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించే ప్రశ్నలతో విద్యార్థులకు మార్గనిర్దేశం చేయడం ద్వారా వారి సొంత ఆలోచనను అభివృద్ధి చేసుకోవడానికి, మెదడుకు పదును పెట్టడానికి ప్రోత్సహిస్తుందని గూగుల్ వివరించింది.

ఈ విధానాన్ని చేరువ చేయడానికి విద్యావేత్తలు నేరుగా గూగుల్ క్లాస్‌రూమ్‌లో పోస్ట్ చేయగల, విద్యార్థులతో పంచుకోగల ప్రత్యేక లింక్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొంది.

ఇదీ 'స్టడీ మోడ్'

దీన్ని కాలేజీ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని రూపొందించామని ఓపెన్ ఏఐ చెబుతోంది. ఇది కూడా హోమ్‌వర్క్, పరీక్షలకు సిద్ధమయ్యే విషయంలో విద్యార్థులకు సాయం చేస్తుంది. యూజర్లు అడిగే ప్రశ్నలకు స్టడీ మోడ్‌లో చాట్ జీపీటీ ప్రత్యక్ష సమాధానాలను అందించదు. విద్యార్థులు వారి లక్ష్యం, జ్ఞాన స్థాయిని బాట్‌కు వివరించాల్సి ఉంటుంది. విద్యార్థులు తమంత తాముగా, చురుకుగా నేర్చుకునేలా, పాఠ్యాంశాలపట్ల లోతైన అవగాహన కలిగేలా హింట్స్, క్విజ్ ద్వారా ప్రోత్సహించడం ఇందులోని ప్రత్యేకత. ఏదైనా టాపిక్ కొత్తదైతే లేదా ఇప్పటికే మెటీరియల్‌పై పట్టు ఉండి తాజా సమాచారం కోరితే.. చాట్‌బాట్ వ్యక్తిగతీకరించిన పాఠాన్ని అందిస్తుంది. – విద్యార్థుల కోసం స్టడీ మోడ్ సిద్ధం చేయడంలో భాగంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీల (ఐఐటీ) ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాలు, పాఠ్యాంశాలను కంపెనీ ఉపయోగించింది.

- ఐఐటీల వంటి ముఖ్య పరీక్షలతో పాటు భారత్‌లో జరుగుతున్న ఇతర పరీక్షల్లో కూడా పనితీరును అంచనా వేయడానికి స్టడీ మోడ్ పరీక్షించినట్టు ఓపెన్ ఏఐ తెలిపింది.
- వాయిస్, ఇమేజ్, టెక్స్ట్‌ను సపోర్ట్ చేస్తూ 11 భారతీయ భాషల్లో స్టడీ మోడ్ అందుబాటులో ఉంది.

కొన్ని సందేహాలు

తమ ఏఐ సేవలను పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలకు మరింత అందుబాటులో, చవకైన మార్గాల ద్వారా అందించడానికి కృషి చేస్తున్నామని గూగుల్, ఓపెన్ ఏఐ చెబుతున్నాయి. అయితే వీటిపై విద్యా, వైద్య రంగ నిపుణులు కొన్ని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

- విద్యార్థులు చాట్‌బాట్‌లపై ఎక్కువగా ఆధారపడినప్పుడు వారి విద్యా పరిశోధన నైపుణ్యాలు, పఠన గ్రహణ శక్తి, కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంలో విఫలమయ్యే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు, పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ఫోన్ లేదా కంప్యూటర్ స్క్రీన్‌ను గంటల తరబడి చూడటం.. కంటి ఆరోగ్యం మీద ప్రభావం చూపుతుంది. అలాగే చూసే విధానం వల్ల మెడ, వెన్ను వంటి వాటిపై కూడా ప్రభావం ఉండొచ్చు అని వైద్య నిపుణులు అంటున్నారు.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ బాధ్యతలు స్వీకరణ

సాక్షి, అమరావతి: పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా డాక్టర్ టి.దామోదరనాయుడు గురువారం మరోసారి బాధ్యతలు చేపట్టారు. గత నెల 31న రిటైర్ అయిన ఈయన్ని పునర్నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఏడాదిపాటు డైరెక్టర్‌గా ఆయన కొనసాగనున్నారు.

సేంద్రీయ ఎరువులతోనే సత్ఫలితాలు

వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు

సాక్షి, అమరావతి: రసాయనిక ఎరువులు మితిమీరి వినియోగించడం అనర్థదాయకమని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు స్పష్టం చేశారు. వీటికి ప్రత్యామ్నాయంగా పచ్చి రొట్ట, సేంద్రీయ ఎరువులతో పాటు నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శాస్త్రవేత్తల సిఫార్సులకు మించి రసాయనిక ఎరువులు వినియోగించడం వలన భూ సారం తగ్గిపోతుందని తెలిపారు. పండించే ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారే అవకాశం ఉందన్నారు. వీటి స్థానంలో సేంద్రీయ, పచ్చిరొట్ట, జీవన ఎరువులను, నూతన సాంకేతిక శ్రేణి నానో ఎరువులను వినియోగించాలని సూచించారు. ఎరువుల వినియోగంపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించేందుకు స్పెషల్ క్యాంపైన్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఎస్‌హెచ్‌జీలకు త్వరితగతిన రుణాలు అందజేయాలి

అధికారులకు మంత్రి కొండపల్లి ఆదేశం

సాక్షి, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బ్యాంకులు ఆమోదించిన సూక్ష్మ రుణప్రణాళికకు సంబంధించి రూ.14,369 కోట్లను త్వరితగతిన స్వయం సహాయక బృందం (ఎస్‌హెచ్‌జీ)లకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆ శాఖ పనితీరుపై అధికారులతో మంత్రి గురువారం సమీక్షించారు. 1,71,264 స్వయం సహాయక సంఘాలకు సూక్ష్మ రుణప్రణాళిక ద్వారా నిధులు ఇవ్వాలని లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, అందుకనుగుణంగా ఆయా రుణాలను త్వరితగతిన అందజేయాలని సూచించారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఏర్పాటై 25 ఏళ్లు అయిన సందర్భంగా, సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వాహణకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

సబ్ స్టేషన్లు, లైన్లు మీ పరిధిలోనే ఉండాలి

ఏపీ ట్రాన్స్‌కో, డిస్కంలకు స్పష్టం చేసిన ఏపీఈఆర్‌సీ

సాక్షి, అమరావతి: విద్యుత్ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్లు ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీట్రాన్స్‌కో), ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల పరిధిలోనే ఉంటాయని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) గురువారం స్పష్టం చేసింది. సొంత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉన్న పరిశ్రమలు(కాప్టివ్ జనరేషన్), ఉష్ణాన్ని, విద్యుత్‌ను ఒకేసారి ఉత్పత్తి చేసే కో–జనరేషన్ పవర్ ప్లాంట్స్, పునరుత్పాదక విద్యుత్ (రెన్యువబుల్ ఎనర్జీ) వంటి ఉత్పత్తి సంస్థల నుంచి విద్యుత్‌ను తీసుకోవడానికి వినియోగించే ప్రసార వ్యవస్థ యాజమాన్య హక్కులపై స్పష్టత ఇవ్వాలని విద్యుత్ సంస్థలు కోరడంతో ఏపీఈఆర్‌సీ ఈ మేరకు ఆదేశాలిచ్చింది. అవన్నీ ఏపీట్రాన్స్‌కో, డిస్కంల యాజమాన్యంలోగానీ, వాటి నిర్వహణలోగానీ ఉండాలని తేల్చి చెప్పింది.

బంగారు కుటుంబాల అవసరాలపై సర్వేచేయాలి

కలెక్టర్లకు సీఎస్ కె.విజయానంద్ ఆదేశం

సాక్షి, అమరావతి: బంగారు కుటుంబాలను మార్గదర్శులు స్వచ్ఛందంగా దత్తత తీసుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని, ఎవరినీ బలవంతం చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. బంగారు కుటుంబాల అవసరాలకు సంబంధించిన నీడ్ అసెస్మెంట్ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. స్వర్ణాంధ్ర పీ–4 ఫౌండేషన్, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళికలు, పీపీపీ విధానంలో ప్రాజెక్టుల ఏర్పాటు తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ పీ–4పై సందేహాలను నివృత్తి చేసేందుకు ప్రత్యేకంగా హ్యాండ్‌బుక్ రూపొందించి కలెక్టర్లకు పంపినట్లు తెలిపారు. జిల్లాల్లో పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్(పీపీపీ) ప్రాజెక్టులకు ప్రాధాన్యతా క్రమంలో భూములు గుర్తించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 2027–28 నాటికి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు, జిల్లా స్థాయి లాజిస్టిక్ ప్రణాళికల గురించి పరిశ్రమలశాఖ కార్యదర్శి డాక్టర్ ఎన్.యువరాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

కూటమి ప్రభుత్వంలో టీచర్లకు దగా

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ విమర్శ

సాక్షి, అమరావతి: టీడీపీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పట్టించుకోవడం లేదని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ విమర్శించింది. ఇప్పటి వరకూ జరిగిన ఏ కేబినెట్ సమావేశంలోనూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలపై చర్చించలేదని పేర్కొంది. తాజాగా జరిగిన మంత్రి మండలి సమావేశంలోనైనా బకాయిలు, డీఏలు, ఆర్థిక ప్రయోజనాలు, 12వ పీఆర్సీ, ఐఆర్ పైనా ప్రభుత్వం ప్రస్తావిస్తుందనుకున్నా నిరాశే మిగిలిందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అశోక్ కుమార్ రెడ్డి, గెడ్డం సుధీర్ విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ ప్రకటిస్తామని, బకాయిలన్నీ విడుదల చేస్తామని నమ్మించి, అధికారంలోకి వచ్చిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోవడం మానేసిందని అన్నారు. ఉపాధ్యాయ బదిలీలు జరిగి మూడు నెలలు కావొస్తున్నా, కొత్త పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులకు ఇంత వరకు జీతాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు సత్వరం పరిష్కరించకపోతే ఇతర ఉపాధ్యాయ సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.

'విద్యాశక్తి'ని వాయిదా వేయాలి

కాగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తున్న 'విద్యాశక్తి' కార్యక్రమాన్ని వాయిదా వేయాలని అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్ రెడ్డి మరో ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాల పనివేళలు పూర్తయిన తర్వాత సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలనడం అధికారుల అనాలోచిత నిర్ణయమని, ఇది ఉపాధ్యాయులపై పనిభారాన్ని పెంచడమేనని విమర్శించారు.

సమృద్ధిగా యూరియా, డీఏపీ నిల్వలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యూరియా, డీఏపీ ఎరువుల నిల్వలు అవసరం మేరకు ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. గురువారం సచివాలయం నుంచి ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగస్టు నెలకు 1.65 లక్షల టన్నుల యూరియా అవసరం కాగా.. ప్రస్తుతం 2.04 లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉందని, డీఏపీ 70 వేల టన్నులు అవసరం ఉండగా ప్రస్తుతం 88,248 టన్నుల నిల్వలు ఉన్నాయని చెప్పారు. రాయితీపై అందించే యూరియాను పారిశ్రామిక అవసరాలకు.. మరీముఖ్యంగా ప్లైవుడ్, పెయింట్స్, యాడ్ బ్లూ మాన్యుఫ్యాక్చరింగ్, పశు, కోళ్ల పరిశ్రమల యూనిట్లు, ఆక్వా రైతులు దాణా కోసం దారి మళ్లించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్‌కు సంబంధించి ఎన్‌సీపీఐ ఇన్ యాక్టివ్, ఈకేవైసీ మ్యాపింగ్ కాని రైతుల ఖాతాలను వేగవంతంగా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తిచేసి అర్హులైన రైతులందరికీ ఆ నిధులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు పాల్గొన్నారు.

నేతన్నకు ఉచిత విద్యుత్‌పై ఉత్తుత్తి లెక్కలు..!

సాక్షి, అమరావతి: నేతన్నలకు ఉచిత విద్యుత్ అమలుపై కూటమి సర్కారు ఏపాటి చిత్తశుద్ధితో ఉందో ప్రభుత్వ పెద్దల ప్రకటనలే అద్దం పడుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 1న మంత్రి సవిత విడుదల చేసిన ప్రకటనకు తాజాగా గురువారం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన లెక్కలకు పొంతన లేకపోవడం గమనార్హం. లబ్ధిదారుల సంఖ్యపై పరస్పర విరుద్ధంగా లెక్కలు చెప్పడంతో నేతన్నలు నివ్వెరపోతున్నారు.

ముఖ్యమంత్రి ఇలా అన్నారు..

మంగళగిరిలో నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ పథకం ద్వారా రాష్ట్రంలో చేనేత మగ్గాలున్న 93 వేల కుటుంబాలకు, పవర్ లూమ్స్ ఉన్న 50 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం ఏడాదికి రూ.190 కోట్లు ఖర్చు చేస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం తర్వాత అత్యధికులు ఆధారపడి జీవిస్తున్న చేనేత రంగంలో దాదాపు 1,22,644 కుటుంబాలు ఉన్నాయన్నారు. 2014–19లో 90,765 కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చామని చెప్పిన ముఖ్యమంత్రి మరి ఇప్పుడు మగ్గాలున్న 93 వేల కుటుంబాలకు 200 యూనిట్లు, మర మగ్గాలున్న 50 వేల కుటుంబాలకు 500 యూనిట్లు (ఈ లెక్కన మొత్తం 1.43 లక్షల కుటుంబాలు) ఉచిత విద్యుత్ అని ప్రకటించడం గమనార్హం.

ప్రభుత్వ ప్రకటనలో ఇలా..

రాష్ట్రంలో వ్యవసాయం తర్వాత అత్యధికులు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారని, 2.50 లక్షల మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారని బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొనడం గమనార్హం. మగ్గాలపై నేసే నేతన్నలకు ఏడాదికి రూ.14,956, మర మగ్గాలపై ఆధారపడిన వారికి రూ.32,604 మేర లబ్ధి కలగనుందని ప్రకటించింది. ఈ లెక్కన మొత్తం రూ.300 కోట్లుపైనే అవుతుంది.



మంత్రి ప్రకటన మరోలా..

రాష్ట్రంలో 65 వేల చేనేత కుటుంబాలకు ఉచిత విద్యుత్ రూపంలో రూ.125 కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఈ నెల 1న విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 50 వేల మగ్గాలు, 11,500 మర మగ్గాలపై ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు. ఈ లెక్కన చూస్తే 61,500 మంది మాత్రమే అవుతారు. లబ్ధిదారుల సంఖ్య, ప్రయోజనం మొత్తంపై ముఖ్యమంత్రి నుంచి మంత్రి వరకు గందరగోళంగా వ్యవహరిస్తుంటే పథకం ఏ మేరకు చిత్తశుద్ధితో అమలవుతుందో ప్రభుత్వానికే ఎరుక!!



నర్సింహులపేట గ్రామంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుల పేట

అక్కడ అందరి గురి టీచర్ వృత్తిపైనే...

ఇప్పటి వరకు 200 మందికిపైగా ప్రభుత్వ ఉపాధ్యాయులు
ప్రైవేట్ రంగంలో మరో వంద మంది
ప్రతీ డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలతో నర్సింహులపేట గుర్తింపు

సాక్షి, మహబూబాబాద్: ఆ ఊరు ఉపాధ్యాయులకు కేరాఫ్‌గా మారింది. ఎన్ని ఎకరాల భూములున్నా.. ఎంత పెద్ద కొలువు వచ్చే అవకాశం ఉన్నా.. ఈ ఊరి యువత మాత్రం బడి పంతులు ఉద్యోగానికే మొగ్గు చూపుతుంది. ఇప్పటి వరకు 200 మందికి పైగా ప్రభుత్వ ఉపాధ్యాయులున్నారు. అందుకే మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటను ఉపాధ్యాయుల ఊరుగా చెప్పుకుంటారు.

గ్రామ సర్పంచ్ చొరవతో..

స్వాతంత్ర్యానికి ముందు నుంచే నర్సింహులపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఉండేది. అప్పుడు ఉర్దూ మీడియంలో బోధన జరిగేది. ఆ రోజుల్లో ఖాజాం అలీ అనే ఉపాధ్యాయుడు పనిచేసేవారు. ఆ తర్వాత షేక్ హుస్సేన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చేరారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఊరి పాఠశాలలో తెలుగు మీడియం బోధించడం మొదలు పెట్టారు. అయితే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెండో సర్పంచ్‌గా ఎన్నికైన నాయిని మనోహర్ రెడ్డి.. బడిపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఎస్సెస్సీ తర్వాత హెచ్‌ఎస్‌సీ కోర్సును ప్రవేశపెట్టారు. అది చదివిన వారు ఇంటర్ చేయకుండానే ఎస్జీబీటీ శిక్షణకు అర్హులు. అలా ఆ ఊరిలో హెచ్‌ఎస్‌సీ చదివిన వారు.. సర్పంచ్ వద్దకు వెళ్లి చెప్పడంతో అప్పుడు సమితి అధ్యక్షులకు ఉత్తరం రాసి పంపితే చాలు మరుసటి రోజు నుంచే ఉపాధ్యాయ ఉద్యోగంలో చేరే వారు. ఇలా ఒక్కొక్కరుగా సమితిలో ఉద్యోగం చేరడం.. వారి తర్వాత తరం కూడా కాలానుగుణంగా ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకొని చదవడం, ఉద్యోగాలు పొందడం పరిపాటిగా మారింది. ఇలా గ్రామంలోని కుటుంబాలకు కుటుంబాలే ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. గ్రామంలో పుట్టి చదువుకున్నవారే కాకుండా గ్రామం, పరిసర ప్రాంతాల్లో పనిచేసిన ఉపాధ్యాయులు కూడా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఉండటం గమనార్హం.

ప్రతీ డీఎస్సీలో ఉద్యోగం..

స్వాతంత్ర్యానికి ముందు ఉర్దూ మీడియం, తర్వాత తెలుగు మీడియంలో సమితి పరిధిలో నియామకాల నుంచి ప్రస్తుతం ఉపాధ్యాయ ఉద్యోగం కోసం నిర్వహించే డీఎస్సీ వరకు ప్రతిసారి ఈ గ్రామానికి ఉపాధ్యాయ ఉద్యోగం తప్పకుండా వస్తుందనే నమ్మకం. 2024 డీఎస్సీలో కూడా నర్సింహులపేట గ్రామం నుంచి టీచర్లు, 15 మందికి గురుకుల టీచర్ ఉద్యోగం వచ్చింది. ఇప్పటికీ బీఈడీ, డీఈడీ, పీఈటీ, పండిట్, టైలరింగ్, డ్రాయింగ్, క్రాఫ్ట్ వంటి ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకొని డీఎస్సీ ఎప్పుడు పడుతుందా? అని ఎదురు చూసేవారు 50 మందికి పైగా ఉంటారు.



నర్సింహులపేట ప్రభుత్వ పాఠశాల

మా కుటుంబం నుంచి పది మంది టీచర్లు..



మాది ఉమ్మడి కుటుంబం. మేం ఐదుగురం అన్నదమ్ములం. ఇందులో నలుగురం, మా బావ, మా పిల్లలు, అల్లుళ్ల మొత్తం పది మందిమి ప్రభుత్వ ఉపాధ్యాయులమే. మా ఇంట్లో ఫంక్షన్లు వస్తే అందరం ఉపాధ్యాయులమే కనిపిస్తాం. ఉపాధ్యాయులుగా పనిచేయడం అదృష్టంగా భావిస్తాం.

– కొండ్రెడ్డి మల్లారెడ్డి, నర్సింహులపేట

దొరవారి దగ్గరికి పోతే ఉద్యోగమే..



మా రోజుల్లో పంతులు ఉద్యోగం అంటే జీతం తక్కువ. అందుకోసం పెద్దగా పోటీ ఉండేది కాదు. మా ఊరి దొరవారు (సర్పంచ్ మనోహర్ రెడ్డి) ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలని ప్రోత్సహించేవారు. చదువుకొని ఆయన దగ్గరికి పోతే పోస్టు పెట్టించే వారు. మా ఇంటి నుంచి ముగ్గురం అన్నదమ్ములం, మా అక్కకొడుకు, వాళ్ల పిల్లలు అందరూ ప్రభుత్వ ఉపాధ్యాయులమే.

– దాసరోజు దక్షిణామూర్తి, నర్సింహులపేట

టీచర్ ఉద్యోగం చేయాలన్న క్రేజీ



మా ఊరిలో ఎంత చదివాం అన్నది ముఖ్యం కాదు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నామా లేదా అన్నదే ముఖ్యం. అందుకోసమే నేను, మా తమ్ముడు, మరదలు, ఇద్దరు కొడుకులు, కోడలు అంతా ప్రభుత్వ ఉపాధ్యాయులమే. ఏ ఉద్యోగం చేసినా లేని తృప్తి ఉపాధ్యాయ వృత్తిలో ఉంది.

– గండి మురళీధర్, నర్సింహులపేట

పూర్వం నుంచి అదే పద్ధతి



గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటారు. వారిని చూసినప్పుడల్లా తాము కూడా అదే కావాలని కోరుకుంటూ చదువుతారు. అందుకోసమే ఇంటర్ పూర్తి కాగానే డీఈడీ, డిగ్రీ పూర్తి కాగానే బీఈడీ పూర్తి చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రతీ డీఎస్సీలో మా ఊరికి ఉద్యోగం తప్పకుండా వస్తుంది.

– జినుకల వెంకట్రాం నర్సయ్య, నర్సింహులపేట

తెలంగాణలో గిరిజన మార్కెట్ కేంద్రాలు

- ఆదాయవృద్ధికి కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కసరత్తు
- లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రఘురాం రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గిరిజన సంపదకు స్థిరమైన మార్కెట్ అందించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం, గిరిజన ఉత్పత్తులకు మార్కెట్ లింకేజ్ కల్పించి ఆదాయ వృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. గిరిజనులతో ఏర్పాటైన కేంద్రాలు.. వారికి ఆర్థికంగా లాభదాయకంగా మారేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ ఉయికే సమాధానమిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులు, నైపుణ్యంతో తయారుచేసే ఉత్పత్తుల తయారీదారులు తమ వస్తువులను నేరుగా మార్కెట్లోకి తీసుకెళ్లేందుకు, సరైన ధరలు పొందేందుకు గిరిజన మల్టీపర్పస్ మార్కెటింగ్ కేంద్రాలు ఉపయోగపడతాయని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా పంటల కోత తర్వాత నష్టాలు తగ్గించడం, వాల్యూ అడిషన్, నిల్వ, సరఫరా, మౌలిక వసతులు, ఉత్పత్తుల సమీకరణ, మార్కెట్ సమాచారం, కొనుగోలుదారులతో సంబంధాల ఏర్పాటు, సహకార మార్కెటింగ్‌కి వేదికగా మారడం, నిలకడైన ఆదాయ మార్గాలు కల్పించడంలో తోడ్పాటు వంటి ప్రయోజనాలను గిరిజనులు పొందనున్నారు. కాగా తెలంగాణ ప్రభుత్వం నుంచే కాక.. ఇతర రాష్ట్రాల నుంచి కూడా వచ్చిన ప్రతిపాదనలపై కేంద్రం చురుగ్గా స్పందిస్తోందని కేంద్రమంత్రి తెలిపారు. ఈ కేంద్రాలు దీర్ఘకాలికంగా, విజయవంతంగా నడవాలంటే.. అవి పనిచేసే విధానాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించడమే కాకుండా, అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

చేవెళ్లలో ఎంఎస్ఎంఈ, పీఎంఈజీపీ పథకాలతో యువతకు ఉపాధి

- యువ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం
- మూడేళ్లలో 658 యూనిట్లకు రూ.35.15 కోట్ల సబ్సిడీ
- బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ, ప్రధానమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం (పీఎంఈజీపీ) పథకాల అమలుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నూతన సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకంగా పీఎంఈజీపీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు గురువారం బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంగా కేంద్రమంత్రి తెలిపారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో.. మొత్తం 658 యూనిట్లకు రూ.35.15 కోట్ల మార్జిన్ మనీ సబ్సిడీ మంజూరయ్యిందని పేర్కొన్నారు. వీటి ద్వారా సుమారు 5,264 మందికి ఉపాధి లభించిందని వివరించారు. 2022–23లో 203 యూనిట్లకు రూ.10.74 కోట్ల సబ్సిడీతో 1,624 మందికి ఉపాధి కలిగిందని, 2023–24లో 222 యూనిట్లకు రూ.11.93 కోట్ల సబ్సిడీతో 1,776 మందికి, 2024–25లో 233 యూనిట్లకు రూ.12.47 కోట్ల సబ్సిడీతో 1,864 మందికి ఉపాధి కలిగినట్లు వివరించారు. చేవెళ్లలో క్లస్టర్ ప్రాతిపదికన ఎంఎస్ఎంఈ అభివృద్ధికి కేంద్రం మైక్రో – స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను అమలు చేస్తోందని చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 590 ప్రాజెక్టులను (229 కామన్ ఫెసిలిటీ సెంటర్లు, 361 ఇన్‌ఫ్రా అభివృద్ధి ప్రాజెక్టులు) ఆమోదించినట్లు కేంద్రమంత్రి వివరించారు.

తెలంగాణలో 1.5 కోట్లకు పైగా ఉపాధి అవకాశాలు

- వెనుకబడిన జిల్లాలకు పీఎమ్‌ఈజీపీతో ఊరట
- లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ రఘువీర్ ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) అభివృద్ధికి.. కేంద్రం అమలు చేస్తున్న విధానాల ఫలితంగా ఉపాధి అవకాశాలు వేగంగా పెరుగుతున్నాయని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. 'ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్' ప్రారంభమైన 2020 జూలై 1 నుంచి 2025 జూలై 31 వరకు.. తెలంగాణలో నమోదైన ఎంటర్‌ప్రైజెల ద్వారా 1.59 కోట్ల మందికి ఉపాధి లభించిందని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ వెల్లడించింది. గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ కుందూరు రఘువీర్ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానం ఇస్తూ.. ఈ ఐదేళ్ల కాలంలో నల్లగొండ జిల్లాలో 5.92 లక్షల మందికి, సూర్యాపేట జిల్లాలో 5.44 లక్షల మందికి ఉపాధి లభించిందన్నారు. వెనుకబడిన జిల్లాల్లో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పశుపోషణ, డెయిరీ, పౌల్ట్రీ, ఆక్వాకల్చర్, తేనె పరిశ్రమలు వంటి సంప్రదాయ రంగాలు కూడా పీఎంఈజీపీ పథకంలో భాగంగా అంగీకరించామని, అన్ని రాష్ట్రాల్లోనూ, వెనుకబడిన ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కేంద్రమంత్రి పేర్కొన్నారు.

రహదారి విస్తరణకు కేంద్రం ప్రణాళికలు

- తెలంగాణలో మూడు మాస్టర్‌ప్లాన్‌లు మంజూరు
- లింక్ రోడ్ల నిర్మాణం బాధ్యత రాష్ట్రాలదే
- లోక్‌సభలో స్పష్టం చేసిన కేంద్రమంత్రి తోఖన్ సాహు



సాక్షి, న్యూఢిల్లీ: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో వాహనాల రద్దీని తగ్గించేందుకు.. మాస్టర్ ప్లాన్ ఆధారంగా లింక్ రోడ్ల నిర్మాణం అవసరమవుతోందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. హైదరాబాద్ సహా పలు నగరాల్లో నివాసితులు.. మున్సిపల్ కార్పొరేషన్లను లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలంటూ కోరిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. అయితే పట్టణ ప్రణాళిక బాధ్యత రాష్ట్రాలకే ఉందని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు గురువారం లోక్‌సభలో బీజేపీ ఎంపీ డీకే అరుణ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో స్పష్టం చేశారు. రాష్ట్రాల సహాయార్థంగా కేంద్రం అమృత్ పథకం ద్వారా పలు పట్టణాల్లో ఏఐ ఆధారిత మాస్టర్ ప్లాన్ తయారీకి నిధులు మంజూరు చేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా మొత్తం 461 పట్టణాల్లో ఈ పనులు చేపట్టగా, తెలంగాణలో 12 నగరాల్లో ఏఐ డేటాబేస్ సిద్ధమవగా.. వాటిలో 10 మాస్టర్ ప్లాన్‌లు రూపుదిద్దుకున్నాయి. కాగా, ఇప్పటి వరకు కేవలం మూడు మాస్టర్ ప్లాన్‌లకే అధికారిక అనుమతి లభించిందని వెల్లడించారు. అమృత్ 2.0 లో రెండో స్థాయి పట్టణాలు (జనాభా 50,000 నుంచి 99,999 మధ్య) కూడా మాస్టర్ ప్లాన్‌ల పరిధిలోకి వచ్చాయి. అయితే, తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క పట్టణం కోసం కూడా మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరగలేదని కేంద్ర మంత్రి చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారంగా లింక్ రోడ్ల నిర్మాణం కీలకమవుతుందని, అందుకు ప్రణాళికల దశ నుంచే సమగ్రంగా ముందుకు సాగాలని సూచించారు. 'వికసిత భారత్ – 2047' లక్ష్యంతో పట్టణాలలో జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మౌలిక వసతుల అభివృద్ధిపై కేంద్రం దృష్టి సారించినట్టు మంత్రి స్పష్టం చేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలు భర్తీ చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీలను అర్హులైన ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడులు మొదలై రెండు నెలలు గడిచాయని, సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. భాషా పండితులు, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

వనమహోత్సవంలో హెచ్‌ఎండీఏ వెనకడుగు

అటవీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వపరంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా...నిర్దేశిత లక్ష్యాల సాధనలో హెచ్‌ఎండీఏ వెనకబడిందని, అందువల్ల సాధ్యమైనంత త్వరగా లక్ష్యాలను పూర్తిచేయాలని అటవీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్ ఆదేశించారు. అదేవిధంగా వివిధ శాఖల వారీగా లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. జిల్లాల వారీగా చూస్తే...జనగామలో 91.93 శాతం, కామారెడ్డి 80.82, జోగుళాంబ గద్వాల్ 78.70, రాజన్న సిరిసిల్ల 75.03, భద్రాద్రి కొత్తగూడెం 71.84 శాతం లక్ష్యాల సాధనతో టాప్–5 జిల్లాలుగా నిలిచాయి. గురువారం సచివాలయంలో రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ మరియు సమన్వయ కమిటీ సమావేశంలో వనమహోత్సవం కింద నిర్వహిస్తున్న మొక్కలునాటే కార్యక్రమాన్ని సమీక్షించారు. అత్యధికంగా 81 శాతం మేర లక్ష్యాలను నెరవేర్చడం పట్ల పంచాయతీరాజ్ శాఖ అధికారులు అనుసరిస్తున్న విధానాన్ని గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎండీఏ మినహాయించి మిగతా శాఖలన్నీ ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ 30లోగా వంద శాతం లక్ష్యాలు పూర్తి చేయాలని పీసీసీఎఫ్ డా.సువర్ణ ఆదేశించారు. ప్లాంటేషన్ పూర్తైన చోట మొక్కలకు జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు.

సాంకేతికత సాయంతో పెండింగ్ కేసులు తగ్గించండి: సీఎస్

సాక్షి, హైదరాబాద్: ఆధునిక సాంకేతికతను ఉపయోగించి రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులను తగ్గించేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉన్నతాధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ, కోర్టుల్లో పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు డిజిటల్ రికార్డుల నిర్వహణ, సీసీఎంఎస్ ద్వారా కోర్టు కేసుల పురోగతి నిరంతర మానిటరింగ్, సమాచార వ్యవస్థలో పారదర్శకతను పాటించడం, కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవడంతో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆస్కారముంటుందన్నారు. సుప్రీంకోర్టుతో పాటు బిహార్, తమిళనాడు, ఒడిశా, పంజాబ్ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న మానిటరింగ్ వ్యవస్థను అధ్యయనం చేసి తెలంగాణలో కూడా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సుపరిపాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. రైజింగ్ తెలంగాణ–2047 లక్ష్య సాధనకు ఈ సాంకేతిక వ్యవస్థ ఉపకరిస్తుందన్నారు. ముఖ్యంగా న్యాయశాఖ, రెవెన్యూశాఖ, హోంశాఖ విభాగాల అధికారులు ఎన్‌ఐసీని సంప్రదించి కార్యాచరణను వారం రోజుల్లోగా రూపొందించాలని సీఎస్ ఆదేశించారు.

నేతన్నలకు కేటీఆర్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: మగ్గాలతో అద్భుతాలు సృష్టించే సత్తా మన నేతన్నల సొంతమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. నరాలను పోగులుగా, రక్తాన్ని రంగులుగా, గుండెలను కండెలుగా మార్చి, చెమట చుక్కలను చీరలుగా మలిచిన నేతన్నలకు ఎక్స్ వేదికగా ఆయన గురువారం జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అగ్గిపెట్టెలో కూడా పట్టు చీరలు నేసే నైపుణ్యం నేత కార్మికుల ప్రత్యేకతని కేటీఆర్ ప్రశంసించారు.

రాష్ట్రపతి అపాయింట్‌మెంట్‌కు బీజేపీ నేతల ఆటంకం

రవాణా శాఖ మంత్రి 'పొన్నం'



సాక్షి, న్యూఢిల్లీ: బీసీ రిజర్వేషన్ల అంశంలో రాష్ట్రపతిని కలిసేందుకు ప్రయత్నించిన ముఖ్యమంత్రికి.. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా బీజేపీ నేతలు అడ్డుపడ్డారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ విషయంలో బీజేపీ నేతలు వ్యవహరించిన తీరు అహంకార రాజకీయానికి ఉదాహరణగా నిలుస్తుందని మండిపడ్డారు. బీజేపీ నేతలు మతపరమైన ప్రేరేపణలు చేస్తూ బిల్లు ఆమోదానికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ముస్లింల పేరుతో బిల్లు అడ్డుకునే ప్రయత్నాలు అన్యాయమన్నారు.

వర్ష బాధితుల్ని ఆదుకోవాలి

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో.. జంట నగరాల్లో భారీ వర్షాల వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజల్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం వల్ల.. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది ఏర్పడిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న పేదలను ఆదుకోవడానికి.. బీజేపీ కార్యకర్తలు నాయకులు, కార్పొరేటర్లు తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ కమీషన్ల పాలన

బీజేపీ నేత ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ కమీషన్ల పాలన సాగుతోందని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీ ఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చాలన్నా, ఇందిరమ్మ ఇల్లు రావాలన్నా, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలన్నా.. కమీషన్లు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. కమీషన్ల పాలనకు తగ్గట్టుగానే.. రోజూ ఏదో శాఖ అధికారులు ఏసీబీకి పట్టుబడుతున్నారని ఎద్దేవా చేశారు.

రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ డ్రామాలు

మేకలు, గొర్రెల కార్పొరేషన్ మాజీ చైర్మన్ 'దూదిమెట్ల'



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల పేరుతో డ్రామాలు చేయడం తప్ప.. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని మేకలు, గొర్రెల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ఆరోపించారు. ఢిల్లీలో నిర్వహించిన ధర్నాతో రిజర్వేషన్లపై ఆ పార్టీ శ్రద్ధ ఎలాంటిదో తేలిపోయిందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

దేశంలో 19,882 గ్రామాలకు మొబైల్ నెట్‌వర్క్ లేదు

రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ యాదవ్ ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికీ 19,882 గ్రామాలకు మొబైల్ నెట్‌వర్క్ సేవలు అందడం లేదని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రాజ్యసభలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 6,44,131 గ్రామాలు ఉండగా.. ఇప్పటివరకు 6,29,027 గ్రామాలకు మొబైల్ సేవలు అందుతున్నాయని కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్రమంత్రి తెలిపారు. టెక్నో-కమర్షియల్ ఫీజిబిలిటీ ఆధారంగా టెలికం సంస్థలు మొబైల్ టవర్స్‌ను ఏర్పాటు చేస్తాయని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయాలి: మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం 2014 ముందు నాటి పరిస్థితులను గుర్తుచేసేలా శ్రీరాం సాగర్ ప్రాజెక్టు మొదటి దశ కింద ఏడు లక్షల ఎకరాలను ఎండబెడుతోందని శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎస్సారెస్పీ రెండో దశకు సాగునీరు అందించే ఊసే ఎత్తడం లేదన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎస్సారెస్పీ తొలి దశ కింద తొమ్మిది లక్షల ఎకరాలకుగాను కేవలం రెండు లక్షల ఎకరాలకు మాత్రమే నీళ్లు ఇస్తోందని, లక్షలాది ఎకరాల్లో రైతులు వరి నాట్లు వేసిన తర్వాత సాగునీరు ఇవ్వలేమని ప్రభుత్వం చెప్తోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును వినియోగంలోకి తెచ్చి సాగునీటిని ఎత్తిపోయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని పూర్తి ఆయకట్టుకు సాగు నీరు ఇవ్వలేమంటూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసగిస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో బీఆర్‌ఎస్ పార్టీ త్వరలో కార్యాచరణ ప్రకటిస్తుందని ఆయన వెల్లడించారు.

పండుగల్లో కూడా వేతనాలివ్వరా?

టీజీ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య విధాన పరిషత్‌లో పండుగల సమయంలో కూడా వేతనాలు అందడం లేదని.. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదనాయక్, వైద్య విధాన పరిషత్ విభాగం కార్యదర్శి బైరపాక శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో గురువారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 156 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న 10,500 మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని వాపోయారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటు సమానంగా పని చేస్తున్నప్పటికీ జీతం తక్కువ ఇవ్వడమే కాకుండా.. మూడు, నాలుగు నెలలు ఎదురు చూడాల్సి వస్తోందని వాపోయారు. నర్సింగ్, పారా మెడికల్ విభాగాల్లో నాలుగో తరగతి ఉద్యోగులు, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, పారిశుధ్య సిబ్బందికి.. ఆరు నెలలకోసారి వేతనాలు ఇవ్వడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు.

‘టారిఫ్’ రంగాలకు చేయూత!

ఆదుకోవడంపై కేంద్రం ఫోకస్
- ఎగుమతిదార్లతో వాణిజ్య శాఖ సంప్రదింపులు
- రసాయనాలు, టెక్స్‌టైల్స్ తదితర పరిశ్రమలకు ప్రాధాన్యత



న్యూఢిల్లీ: అమెరికా టారిఫ్‌ల ప్రభావం తీవ్రంగా ఉండే పరిశ్రమలకు ఊరటనివ్వడంపై కేంద్రం దృష్టి పెడుతోంది. ఎగుమతుల ప్రోత్సాహక మిషన్ కింద రసాయనాలు, టెక్స్‌టైల్స్‌లాంటి రంగాలకు చేయూతనిచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ రెండు రంగాల ఎగుమతిదార్లతో భేటీ అయిన సందర్భంగా టారిఫ్‌ల ప్రభావాలు, సహాయక చర్యలకు అవకాశాలు తదితర అంశాల గురించి వాణిజ్య శాఖ చర్చించినట్లు వివరించాయి. కేంద్ర బడ్జెట్‌లో రూ. 2,250 కోట్లతో ప్రతిపాదించిన ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ మిషన్ కింద టారిఫ్ ప్రభావిత రంగాలకు తోడ్పాటు అందించే విషయాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నాయి. ఈ మిషన్ కింద చిన్న-మధ్య తరహా సంస్థలు, ఈ-కామర్స్ ఎగుమతిదార్లకు సులభ రుణ పథకాలు, విదేశాల్లో వేర్‌హౌసింగ్ సదుపాయాల కల్పన, ఎగుమతి అవకాశాలను దక్కించుకునేందుకు గ్లోబల్ బ్రాండింగ్‌కి సహాయం అందించడం మొదలైనవి ఉంటాయని అంచనా. అమెరికాకు టెక్స్‌టైల్స్ ఎగుమతులు 11 బిలియన్ డాలర్లుగా, రసాయనాల ఎగుమతులు సుమారు 6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. వస్త్రాలు, రత్నాభరణాలు, రొయ్యలు, లెదర్.. ఫుట్‌వేర్, రసాయనాలు, ఎలక్ట్రికల్ పరికరాలు, మెకానికల్ పరికరాలు మొదలైన రంగాలపై 50% టారిఫ్‌ల ప్రభావం గణనీయంగా ఉండనుంది.

సంస్కరణలకు జీజేఈపీసీ విజ్ఞప్తి..

సుంకాల భారం తగ్గేలా తక్షణం పాలసీపరమైన సంస్కరణలు చేపట్టాలని కేంద్రాన్ని రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి జీజేఈపీసీ కోరింది. డ్యూటీ డ్రాబ్యాక్ స్కీము, మార్కెట్ డైవర్సిఫికేషన్ కోసం ఆర్థిక సహాయం అందించడం లాంటి చర్యలు పరిశీలించాలని విజ్ఞప్తి చేసింది. కట్, పాలిష్డ్ డైమండ్లలో సగం ఉత్పత్తులు అమెరికాకే ఎగుమతవుతున్నాయని, భారీ టారిఫ్‌ల వల్ల మొత్తం పరిశ్రమ స్తంభించిపోయే ముప్పు ఏర్పడిందని జీజేఈపీసీ చైర్మన్ కిరీట్ భన్సాలీ తెలిపారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు కూడా దెబ్బతింటాయని వివరించారు. తక్కువ టారిఫ్‌లు ఉండే టర్కీ, వియత్నాంలాంటి దేశాలతో అమెరికా మార్కెట్లో భారత్ పోటీపడటం కష్టతరమవుతుందని భన్సాలీ చెప్పారు. దీన్ని పరిష్కరించకపోతే, అమెరికాకు కీలక సరఫరాదారుగా భారత్‌కి ఉన్న హోదా పోతుందని వివరించారు. అయితే, టారిఫ్‌ల ఎఫెక్ట్‌ను పక్కన పెడితే దేశీయంగా ప్రస్తుతం 85 బిలియన్ డాలర్లుగా ఉన్న మార్కెట్, వచ్చే రెండేళ్లలో 130 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందుతుందనే అంచనాలు పరిశ్రమకు కాస్త ఊరటనిచ్చే విషయమని భన్సాలీ చెప్పారు. అమెరికాకు భారత్ నుంచి రత్నాభరణాల ఎగుమతులు దాదాపు 10 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉన్నాయి.

ఈ నెల 11న బ్లూస్టోన్ జ్యుయలరీ ఐపీవో

ధర శ్రేణి రూ. 492–517



న్యూఢిల్లీ: బ్లూస్టోన్ జ్యుయలరీ అండ్ లైఫ్‌స్టయిల్ సంస్థ పబ్లిక్ ఇష్యూ ఆగస్టు 11న ప్రారంభమై 13న ముగియనుంది. ఒక్కో షేరు ధర శ్రేణిని రూ. 492–517గా నిర్ణయించినట్లు సంస్థ తెలిపింది. ఐపీవో కింద తాజాగా రూ. 820 కోట్ల విలువ చేసే షేర్లను జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద రూ. 720.65 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనున్నారు. కలారి క్యాపిటల్ పార్ట్‌నర్స్ టూ, సామా క్యాపిటల్ టూ, సునీల్ కాంత్ ముంజాల్ తదితరులు వాటాలు విక్రయించనున్నారు. దీనితో మొత్తం ఇష్యూ పరిమాణం రూ. 1,540.65 కోట్లుగా ఉంటుంది.

ఎటర్నల్‌లో యాంట్ వాటా విక్రయం

1.46% వాటా విలువ రూ. 4,097 కోట్లు

న్యూఢిల్లీ: చైనీస్ దిగ్గజం అలీబాబా గ్రూప్ సంస్థ యాంట్ ఫైనాన్షియల్ తాజాగా ఎటర్నల్‌లో 1.46 శాతం వాటా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా షేరుకి రూ. 289.91 సగటు ధరలో మొత్తం 14.13 కోట్ల షేర్లను అమ్మివేసింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం తద్వారా రూ. 4,097 కోట్లు అందుకుంది. దీంతో ఎటర్నల్‌లో యాంట్ ఫిన్ వాటా 1.95 శాతం నుంచి 0.49 శాతానికి తగ్గింది. కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు. కాగా.. ఇటీవల పేటీఎమ్ దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్‌లోనూ 5.84 శాతం వాటాను రూ. 3,980 కోట్లకు విక్రయించిన విషయం విదితమే.

బ్లాక్‌డీల్ నేపథ్యంలో ఎటర్నల్ షేరు ఎన్ఎస్ఈలో 1.5 శాతం బలపడి రూ. 303 వద్ద ముగిసింది.

జూలై వాహన విక్రయాలు 4% డౌన్

- పీవీలు, టూవీలర్స్‌కు డిమాండ్ క్షీణత ప్రభావం
- ఆటో మొబైల్ సమాఖ్య ఫాడా గణాంకాలు వెల్లడి



న్యూఢిల్లీ: రిటైల్ వాహన విక్రయాలు జూలైలో తగ్గుముఖం పట్టాయి. గతేడాది ఇదే నెలలో 20,52,759 వాహనాలు అమ్ముడయ్యాయి. ఈసారి 4% తగ్గి 19,64,213 యూనిట్లుకు దిగివచ్చాయి. ప్రయాణికుల వాహనాలు(పీవీలు), టూ-వీలర్స్‌కు డిమాండ్ తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని ఆటో మొబైల్ డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది.

- ప్యాసింజర్ విక్రయాలు గతేడాది జూలైలో పోలిస్తే 3,31,280 యూనిట్లు నుంచి స్వల్పంగా 0.81% తగ్గి 3,28,613 కు పరిమితమయ్యాయి. పట్టణ ప్రాంతాల్లో నుంచి ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు లేకపోవడం ప్రతికూల ప్రభావాన్ని చూపింది.
- ద్విచక్రవాహనాల రిజిస్ట్రేషన్ 6.48% క్షీణత చవిచూసింది. ఈ జూలైలో మొత్తం 13,55,504 అమ్మకాలు జరిగాయి. గతడాది ఇదే నెలలో విక్రయాలు 14,49,487 యూనిట్లుగా ఉన్నాయి. వ్యవసాయ కార్యక్రమాలు మొదలవడం, అధిక వర్షాలు కొనసాగడం గ్రామీణ ప్రాంత డిమాండ్‌ను దెబ్బతీసింది. పండుగ సీజన్ ప్రారంభం నేపథ్యంలో వాహన కొనుగోలు నిర్ణయం ఆగస్టుకు వాయిదా పడిందని పరిశ్రమ నిపుణులు తెలిపారు.
- వాణిజ్య వాహన రిటైల్ విక్రయాలు జూలైలో 76,261 యూనిట్ల నుంచి స్వల్పంగా 0.23% పెరిగి 76,439 యూనిట్లకు చేరుకున్నాయి. కొత్త మోడళ్ల ఆవిష్కరణలు, తగ్గిన మోతాదులు నిల్వలు పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య వాహనాలకు డిమాండ్ లభించింది. అయితే అధిక వర్షపాతాలు, రవాణా సమస్యలు, రుణ పంపిణీ మందగమన అంశాలు గ్రామీణ ప్రాంతాల డిమాండ్‌ను తగ్గించాయి.
- ట్రాక్టర్ల రిటైల్ అమ్మకాలు 11% పెరిగి 79,961 యూనిట్ల నుంచి 88,722 యూనిట్లకు పెరిగాయి. అధిక వర్షపాత అంచనాలు, వ్యవసాయ సబ్సిడీలు పెరగడం ట్రాక్టర్ల విక్రయాలు పెరిగేందుకు కారణమయ్యాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ‘రెమిట్ ఫస్ట్ టు ఇండియా’



హైదరాబాద్: ప్రవాస భారతీయులు విదేశాల నుంచి భారత్‌కు సులభంగా డబ్బులు పంపుకునేందుకు వీలుగా ‘రెమిట్ ఫస్ట్ టు ఇండియా’ ప్లాట్‌ఫామ్‌ను ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రవేశపెట్టింది. ఎలాంటి ఖర్చు లేకుండా, ట్రాన్స్‌ఫర్ ఫీజు లేకుండా డబ్బులు పంపుకోవచ్చని ప్రకటించింది. సింగపూర్‌కు చెందిన ప్రముఖ రిమిటెన్స్ సేవల సంస్థ సింగ్ ఎక్స్ భాగస్వామ్యంతో ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించడం గమనార్హం. ప్రస్తుతం సింగపూర్, హాంకాంగ్ నుంచి డబ్బులు పంపుకునే (రెమిటెన్స్) సేవలు అందుబాటులో ఉండగా, త్వరలో మరిన్ని దేశాలకు విస్తరించనున్నట్లు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ తెలిపింది.

మహీంద్రా నుంచి అప్‌గ్రేడెడ్ నిర్మాణ రంగ యంత్రాలు



ముంబై: మహీంద్రా కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ డివిజన్ కొత్తగా సీఈవీ-5 ప్రమాణాలకు అప్‌గ్రేడ్ చేసిన నిర్మాణ రంగ యంత్రాల శ్రేణిని ప్రవేశపెట్టింది. ఎర్త్‌మాస్టర్ ఎస్ఎక్స్ బ్యాక్‌హో లోడర్, రోడ్‌మాస్టర్ జీ100 మోటర్ గ్రేడర్ వీటిలో ఉన్నాయి. ఉత్పాదకతను పెంచే విధంగా లోడర్ మరింత విశాలంగా, సౌకర్యవంతంగా ఉంటుందని కంపెనీ తెలిపింది. అలాగే, 22 శాతం మార్కెట్ వాటాతో అగ్రగామిగా ఉన్న మోటర్ గ్రేడర్‌ను మరింత శక్తివంతంగా తీర్చిదిద్దినట్లు వివరించింది. లోడర్‌లను 48 గంటల అప్‌టైమ్ సర్వీస్ గ్యారంటీతో అందిస్తున్నట్లు కంపెనీ తెలిపింది.

గ్లోబల్‌ఫౌండ్రీస్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ జట్టు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సెమీకండక్టర్ల దిగ్గజం గ్లోబల్‌ఫౌండ్రీస్‌తో (జీఎఫ్) వ్యూహాత్మక చానల్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు సైయెంట్ సెమీకండక్టర్స్ వెల్లడించింది. దీని ప్రకారం జీఎఫ్‌కి చెందిన సెమీకండక్టర్ తయారీ సేవలు, టెక్నాలజీలకు సైయెంట్ సెమీకండక్టర్స్ అధీకృత రీసెల్లర్‌గా వ్యవహరిస్తుంది. ఫ్యాబ్రికేషన్ యాక్సెస్, సాంకేతిక సలహాలు, అసెంబ్లీ, టెస్టింగ్ తదితర సర్వీసులను కంపెనీలకు అందిస్తుంది.

ఈస్సికోతో టాటా ఆటోకాంప్ జత


- భాగస్వామ్య కంపెనీ ఏర్పాటుకు సై
- వేలియో లైటింగ్ బిజినెస్ కొనుగోలు



న్యూఢిల్లీ: టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ తాజాగా జపనీస్ సంస్థ ఈస్సికో ఇండస్ట్రీస్‌తో చేతులు కలిపింది. తద్వారా భాగస్వామ్య కంపెనీ(జేవీ)కి తెరతీయనుంది. సమాన వాటా(50:50)తో ఏర్పాటుచేయనున్న జేవీ ద్వారా దేశీయంగా వేలియో లైటింగ్ బిజినెస్‌ను కొనుగోలు చేయనున్నట్లు టాటా ఆటోకాంప్ పేర్కొంది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. ఈస్సికో ఇండస్ట్రీస్‌లో వేలియో గ్రూప్‌నకు 61.2 శాతం వాటా ఉంది. వెరసి ఈస్సికో, వేలియో గ్రూప్‌లతో భాగస్వామ్యానికి ఆహ్వానం పలుకుతున్నట్లు టాటా ఆటోకాంప్ వైస్‌చైర్మన్ అరవింద్ గోయెల్ పేర్కొన్నారు. తద్వారా ఆటోమోటివ్ లైటింగ్ బిజినెస్‌లో వీటికున్న నైపుణ్యంతో తమ కస్టమర్లకు విభిన్నమైన, అత్యుత్తమమైన లైటింగ్ సొల్యూషన్లను అందించనున్నట్లు తెలియజేశారు.

ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 47% అప్

క్యూ1లో 12.4 బిలియన్ డాలర్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 12.4 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో నమోదైన 8.43 బిలియన్ డాలర్లతో పోలిస్తే 47 శాతం పెరిగాయి. ఇండియా సెల్యులార్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం మొబైల్ ఫోన్స్ ఎగుమతులు 55 శాతం పెరిగి 4.9 బిలియన్ డాలర్ల నుంచి 55 శాతం వృద్ధితో 7.6 బిలియన్ డాలర్లకు ఎగిశాయి. మొబైల్‌యేతర ఎలక్ట్రానిక్స్ సెగ్మెంట్ 3.53 బిలియన్ డాలర్ల నుంచి 37 శాతం పెరిగి 4.8 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ విభాగంలో సోలార్ మాడ్యూల్స్, స్విచ్చింగ్.. రూటింగ్ పరికరాలు, చార్జర్ అడాప్టర్లు, ఇతర విడిభాగాలు మొదలైనవి ఉన్నాయి. వీటితో పాటు ఐటీ హార్డ్‌వేర్, వేరబుల్స్, హియరబుల్స్, కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ ఎగుమతులను కూడా పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్రూ చెప్పారు. విడిభాగాలు, సబ్-అసెంబ్లీస్ నుంచి తుది ఉత్పత్తుల వరకు వేల్యూ చెయిన్‌వ్యాప్తంగా అంతర్జాతీయంగా పోటీపడగలిగేలా భారతీయ బ్రాండ్లు మరింతగా ఎదగాల్సి ఉంటుందని మహీంద్రూ చెప్పారు. దశాబ్దకాలంలో దేశీయంగా మొత్తం ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి 31 బిలియన్ డాలర్ల నుంచి 133 బిలియన్ డాలర్లకు ఎగిసింది.

50 బిలియన్ డాలర్ల అంచనాలు..

క్యూ1 తరహాలోనే జోరు కొనసాగితే 2026 పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 46–50 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉండొచ్చని ఐసీఈఏ అంచనా వేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇవి 29.1 బిలియన్ డాలర్ల నుంచి 38.6 బిలియన్ డాలర్లకు పెరిగాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

8-8-2025

విశాఖ	500–00
చిత్తూరు	513–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	490–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	445–00
వరంగల్	447–00
రిటైల్ ధర	5.05

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HEROMOTOCO	4,666.10	4.27
TECHM	1,488.10	1.99
JSWSTEEL	1,073.00	1.94
ETERNAL	303.2	1.46
WIPRO	242.8	1.18

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIENT	2,245.90	-2.36
ADANIPORTS	1,347.50	-1.43
GRASIM	2,741.90	-0.86
HINDUNILVR	2,516.00	-0.77
TRENT	5,316.00	-0.76

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	11,918
ఎన్ఎస్ఈ	98,041
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,78,838
ఎఫ్ఐఐ	- 4,997
డీఐఐ	+ 10,864

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.84	$ 64.35
బ్రెంట్	66.39	$ 66.89

క్యూ1 ఫలితాలు

హెచ్‌పీసీఎల్ లాభం హైజంప్

క్యూ1లో రూ. 4,111 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ పీఎస్‌యూ దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్(హెచ్‌పీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 6 రెట్లు ఎగసి రూ. 4,111 కోట్లను తాకింది. ఇది కొత్త రికార్డ్‌కాగా.. చమురు నిల్వల లాభాలు, ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ రిటైల్ ఇంధన ధరలను తగ్గించకపోవడంతో పుంజుకున్న మార్జిన్లు ఇందుకు ప్రధానంగా సహకరించాయి. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 634 కోట్లు ఆర్జించింది. వెరసి గతేడాది(2024-25) ఆర్జించిన రూ. 6,736 కోట్ల లాభంతో సగానికిపైగా ఈ ఏడాది క్యూ1లోనే అందుకోవడం విశేషం! కాగా.. మొత్తం ఆదాయం దాదాపు యథాతథంగా రూ. 1.2 లక్షల కోట్లుగా నమోదైంది. గత క్యూ1లో రూ. 1.21 లక్షల కోట్ల టర్నోవర్ ప్రకటించింది. ఒక్కో బ్యారల్ చమురుపై స్థూల రిఫైనింగ్ మార్జిన్లు 3.08 డాలర్లకు పరిమితమయ్యాయి. గత క్యూ1లో 5.03 డాలర్లు చొప్పున ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు 0.3 శాతం బలపడి రూ. 403 వద్ద ముగిసింది.

టైటాన్ లాభం జూమ్

రూ. 1,091 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ టాటా గ్రూప్ దిగ్గజం టైటన్ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 53 శాతం జంప్‌చేసి రూ. 1,091 కోట్లను తాకింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో కేవలం రూ. 715 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 12,223 కోట్ల నుంచి రూ. 14,814 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు 22 శాతం పెరిగి రూ. 15,145 కోట్లకు చేరాయి. కాగా.. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 24 శాతం జంప్‌చేసి రూ. 16,628 కోట్లకు చేరింది. ఆదాయంలో జ్యువెలరీ విభాగం 24 శాతం ఎగసి రూ. 14,467 కోట్లకు చేరగా.. వాచీలు తదితరాల నుంచి 24 శాతం అధికంగా రూ. 1,273 కోట్లు లభించింది. ఐకేర్ విభాగం 13 శాతం పుంజుకుని రూ. 238 కోట్లను తాకింది. తనేరియా తదితర బిజినెస్ 50 శాతం జంప్‌చేసి రూ. 415 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో టైటాన్ షేరు బీఎస్ఈలో నామమాత్ర నష్టంతో రూ. 3,415 వద్ద ముగిసింది.

కల్యాణ్ జ్యువెలర్స్ లాభం అప్

రూ. 264 కోట్లు



న్యూఢిల్లీ: బంగారు ఆభరణ తయారీ కంపెనీ కల్యాణ్ జ్యువెలర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 49 శాతం జంప్‌చేసి రూ. 264 కోట్లను అధిగమించింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 178 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 31 శాతం ఎగసి రూ. 7,268 కోట్లను తాకింది. గత క్యూ1లో రూ. 5,528 కోట్ల టర్నోవర్ నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు 0.3 శాతం బలపడి రూ. 591 వద్ద ముగిసింది.

గోద్రెజ్ కన్సూమర్ డివిడెండ్ రూ. 5

లాభం రూ. 452 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం గోద్రెజ్ కన్సూమర్ ప్రొడక్ట్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం దాదాపు నామమాత్ర వృద్ధితో రూ. 452 కోట్లను అధిగమించిది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 451 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 5 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా రూ. 3,332 కోట్ల నుంచి రూ. 3,662 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు 1.6 శాతం బలపడి రూ. 1,221 వద్ద ముగిసింది.

క్రాంప్టన్ గ్రీవ్స్ లాభం క్షీణత

రూ. 124 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం క్రాంప్టన్ గ్రీవ్స్ కన్సూమర్ ఎలక్ట్రికల్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 19 శాతం క్షీణించి రూ. 124 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 152 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,138 కోట్ల నుంచి రూ. 1,998 కోట్లకు బలహీనపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు యథాతథంగా రూ. 319 వద్ద ముగిసింది.

పీవీఆర్ ఐనాక్స్ నష్టాలు తగ్గాయ్

రూ. 55 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో మల్టీప్లెక్స్‌ల దిగ్గజం పీవీఆర్ ఐనాక్స్ ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర నష్టం భారీగా తగ్గి రూ. 55 కోట్లకు పరిమితమైంది. మంచి కంటెంట్‌గల మూవీల కారణంగా ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 179 కోట్ల నష్టం ప్రకటించింది. అయితే మొత్తం ఆదాయం మాత్రం రూ. 1,191 కోట్ల నుంచి రూ. 1,469 కోట్లకు ఎగసింది. దీనిలో ఆహారం, పానీయాల విభాగం ఆదాయం 10 శాతం పుంజుకుని రూ. 148 కోట్లను తాకింది. ఇది కంపెనీ చరిత్రలోనే అత్యధికంకాగా.. మొత్తం వ్యయాలు సైతం రూ. 1,458 కోట్ల నుంచి రూ. 1,572 కోట్లకు పెరిగాయి. ఈ కాలంలో 12% అధికంగా 3.4 కోట్లమంది తమ సినిమాలను సందర్శించినట్లు కంపెనీ వెల్లడించింది. కొత్తగా 20 తెరలను జతచేసుకోవడంతో 2025 జూన్‌కల్లా 353 సినిమాలతో 1,745 తెరలను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

ఎవరెడీ ఇండస్ట్రీస్ లాభం ఓకే

రూ. 30 కోట్లు



న్యూఢిల్లీ: డ్రై సెల్ బ్యాటరీలు, ఫ్లాష్ లైట్ల తయారీ కంపెనీ ఎవరెడీ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 3 శాతం వృద్ధితో రూ. 30 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2024-25) ఇదే కాలంలో రూ. 29 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 349 కోట్ల నుంచి రూ. 374 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 6 శాతం పెరిగి రూ. 333 కోట్లను దాటాయి. మొత్తం ఆదాయంలో రూ. 238 కోట్లతో బ్యాటరీల బిజినెస్ 62 శాతం వాటాను ఆక్రమిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో ఎవరెడీ ఇండస్ట్రీస్ షేరు 0.4 శాతం తగ్గి రూ. 414 వద్ద ముగిసింది.

జిందాల్ స్టెయిన్‌లెస్ లాభం 11 శాతం అప్

క్యూ1లో రూ. 715 కోట్లు



న్యూఢిల్లీ: జిందాల్ స్టెయిన్‌లెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ. 715 కోట్ల లాభం ప్రకటించింది. గత క్యూ1లో నమోదైన రూ. 646 కోట్లతో పోలిస్తే 11 శాతం పెరిగింది. అటు ఆదాయం రూ. 9,480 కోట్ల నుంచి రూ. 10,276 కోట్లకు చేరింది. వ్యయాలు రూ. 8,593 కోట్ల నుంచి రూ. 9,293 కోట్లకు పెరిగాయి. కొత్త ఆవిష్కరణలు, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకోవడం తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి పెడుతుండటంతో మెరుగైన ఫలితాలు సాధించగలుగుతున్నట్లు జిందాల్ స్టెయిన్‌లెస్ ఎండీ అభ్యుదయ్ జిందాల్ తెలిపారు. రైల్వేస్, ఆటోమోటివ్, ఇన్‌ఫ్రా తదితర విభాగాల్లో స్థానాన్ని పటిష్టం చేసుకుంటూనే, ఇతర విభాగాల్లో అవకాశాలను అందిపుచ్చుకుంటున్నట్లు వివరించారు.



'పంత్‌కు సారీ చెప్పాను'

ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్

లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో క్రిస్ వోక్స్ వేసిన బంతిని రివర్స్ స్వీప్ చేసే క్రమంలో బంతి కాలికి తగలడంతో భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ గాయపడ్డాడు. నొప్పితో వెంటనే మైదానం వీడిన అతను ఆ తర్వాత కుంటుతూనే మళ్లీ బ్యాటింగ్‌కు వచ్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయాల్సిన అవసరం రాకపోగా, చివరి టెస్టుకు మాత్రం పూర్తిగా దూరమయ్యాడు. అయితే ఆ తర్వాత ఓవల్ టెస్టులో భుజానికి గాయంతో ఆటకు దూరమైన వోక్స్ కూడా చివర్లో జట్టును గెలిపించే ప్రయత్నంలో చేతికి కట్టుతోనే ఆడేందుకు సిద్ధపడి మైదానంలో దిగాడు. ఈ సిరీస్‌లో ఈ తరహాలో వీరిద్దరు చూపిన పోరాటతత్వం అందరి ప్రశంసలు చూరగొంది. తన బంతికి దెబ్బ తగిలిన పంత్‌కు ఈ విషయంలో క్షమాపణ కోరినట్లు వోక్స్ వెల్లడించాడు. 'ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్యూట్ ఈమోజీతో నా ఫోటోను జత చేసి పంత్ పోస్ట్ చేశాడు. నేను థాంక్స్ చెబుతూనే అతని కాలి గాయం తగ్గిందా అని అడిగాను. సహజంగానే సారీ కూడా చెప్పాను. ఆ తర్వాత అంతా బాగుందని వాయిస్ మెసేజ్ పెట్టిన పంత్ త్వరలో కలుద్దామని కూడా చెప్పాడు. నా ధైర్యాన్ని మెచ్చుకున్న శుబ్‌మన్ గిల్‌కు కూడా జట్టు ప్రదర్శనపై అభినందనలు తెలియజేశాను' అని వోక్స్ చెప్పాడు. భుజం గాయం తీవ్రంగా ఉన్నా... జట్టుకు అవసరమైతే ఎట్టి పరిస్థితుల్లోనైనా బరిలోకి దిగాలని ముందే గట్టిగా నిర్ణయం తీసుకున్నట్లు ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ అన్నాడు.



ఫిట్‌నెస్ ఉంటేనే ఏదైనా సాధ్యం

శరీరాకృతిపై మరింత శ్రద్ధ పెట్టిన మన్‌ప్రీత్ సింగ్

- ఏడు కేజీల బరువు తగ్గిన భారత హాకీ స్టార్
- కెరీర్‌ను పొడిగించుకునేందుకే ఈ కసరత్తులు
- వచ్చే ఆసియా క్రీడల్లో పతకమే లక్ష్యంగా ముందుకు

న్యూఢిల్లీ: ఆటలో కొత్తగా వస్తున్న మార్పులను ఆహ్వానిస్తూ... ఫిట్‌నెస్ కాపాడుకోవడం ద్వారానే ఇంకా జాతీయ హాకీ జట్టుకు ప్రాతినిధ్యం వహించగలుగుతున్నానని మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు. భారత్ తరఫున అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన జాబితాలో మన్‌ప్రీత్ 402 మ్యాచ్‌లతో రెండో స్థానంలో ఉండగా... మాజీ కెప్టెన్, ప్రస్తుత హాకీ ఇండియా (హెచ్‌ఐ) అధ్యక్షుడు దిలీప్ టిర్కీ 412 మ్యాచ్‌లాడి అగ్రస్థానంలో ఉన్నాడు. త్వరలోనే టిర్కీని దాటేయనున్న మన్‌ప్రీత్... ప్రస్తుతానికి వచ్చే ఏడాది జరగనున్న ఆసియా క్రీడలపై దృష్టి సారించాడు. కఠినమైన సాధనతో పాటు కఠోరమైన ఆహార నియమాలతో ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటున్నట్లు వెల్లడించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్ కాంస్యం గెలిచిన భారత జట్టుకు సారథిగా వ్యవహరించిన మన్‌ప్రీత్... 2024 పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. 14 ఏళ్లుగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న 32 ఏళ్ల మన్‌ప్రీత్ పంచుకున్న విశేషాలు అతడి మాటల్లోనే...

ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి...

2024 పారిస్ ఒలింపిక్స్ తర్వాత కెరీర్‌ను పొడిగించాలంటే ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలని నిర్ణయించుకున్నా. జట్టులోకి ఎప్పటికప్పుడు యువ ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. వారితో పోటీపడి రేసులో నిలవాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరి. అనుభవం మంచిదే కానీ, కేవలం అనుభవంతో జాతీయ జట్టులో కొనసాగే పరిస్థితి లేదు. టాలెంట్‌తో పాటు వేగం కూడా అవసరం. శరీరాకృతిని కాపాడుకునేందుకు కఠిన ఆహార నియమాలు పాటిస్తున్నా. తీపి పదార్థాలు తినడం పూర్తిగా మానేయడంతో పాటు జంక్‌ఫుడ్‌కు స్వస్తి చెప్పా. 'లో–కార్బ్' డైట్ ఫాలో అవుతున్నా. వారంలో ఒక్కసారి చాలా తక్కువ మోతాదులో మాత్రమే స్వీట్స్ తీసుకుంటున్నా. కసరత్తులు కూడా క్రమపద్ధతిలో చేస్తున్నా. దీని వల్ల ఏడు కిలోల బరువు తగ్గా. ఆ మార్పు మైదానంలో స్పష్టంగా కనిపిస్తుంది. బరువు తగ్గిన తర్వాత వేగం పెరిగింది. యోయో పరీక్షల్లోనూ ఎంతో మెరుగయ్యా. అందుకే ఇక ముందు కూడా దీన్నే కొనసాగించాలనుకుంటున్నా.

క్రిస్టియానో రొనాల్డో నాకు స్ఫూర్తి...

19 ఏళ్ల వయసులో 2011లో తొలిసారి జాతీయ జట్టుకు ఆడే అవకాశం దక్కింది. అప్పటి నుంచి అంతే ఉత్సాహంతో ఆడుతున్నా. గత రెండు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించిన భారత జట్టులో భాగమైనందుకు ఆనందంగా ఉంది. ముఖ్యంగా 2020 టోక్యో ఒలింపిక్స్‌లో నా కెప్టెన్సీలో భారత జట్టు 41 ఏళ్ల తర్వాత పతకం గెలవడం ఎప్పటికీ మరచిపోలేనిది. 2028 లాస్‌ఏంజెలిస్ ఒలింపిక్స్ గురించి ఇప్పటినుంచి ఆలోచించడం లేదు. ప్రస్తుతానికి వచ్చే ఏడాది జరగనున్న ఆసియా క్రీడలపై దృష్టి సారించా. ఇదే ఫిట్‌నెస్ కొనసాగిస్తే అది పెద్ద కష్టం కాదు. నేను ఫిట్‌గా లేనని అనుకుంటే తక్షణమే తప్పుకొని మరో ఆటగాడికి జట్టులో అవకాశమిస్తా. పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను అభిమానిస్తా. అతడు నలభై ఏళ్ల వయసులోనూ చాలా ఫిట్‌గా ఉంటాడు. అతడే నాకు స్ఫూర్తి. 14 ఏళ్లుగా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నా... దీన్ని మరింత పొడిగించేందుకు నిరంతరం ప్రత్యేక కసరత్తులు చేస్తున్నా.

ప్రతి మ్యాచ్ ఆడాలనుకుంటా...

ప్రస్తుత భారత జట్టు నైపుణ్యం, ఫిట్‌నెస్, తీవ్రత విషయంలో అగ్రజట్లకు ఏమాత్రం తీసిపోదు. టోక్యో ఒలింపిక్స్ ముందు నుంచే ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, జర్మనీ వంటి జట్లపై నిలకడగా విజయాలు సాధిస్తున్నాం. అయితే వ్యూహాలను అమలు చేసే విషయంలో ఇంకాస్త మెరుగు పడాల్సిన అవసరముంది. మేం దానిపై దృష్టి సారించాం. జాతీయ జట్టు, భారత్ 'ఎ', భారత్ అండర్–19 ఇలా ఎందరో ప్లేయర్లు అందుబాటులో ఉన్నారు. యువ ఆటగాళ్లకు కూడా అవకాశాలు లభిస్తాయి. వర్క్‌లోడ్ నిర్వహణను జాగ్రత్తగా చూసుకుంటారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ప్రతిఒక్కరికీ రాదు. అలాంటి దాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ వదులుకోను. నా వరకైతే జాతీయ జట్టు ఆడే ప్రతి మ్యాచ్‌లో నేను ఉండాలనుకుంటా. దేశానికి ప్రాతినిధ్యం వహించడం కంటే గొప్ప గౌరవం ఏముంటుంది. టోర్నమెంట్ అనంతరం తిరిగి ఎలా కోలుకోవాలో తెలుసు. దానిపై దృష్టి పెట్టి కొత్త ఉత్సాహాన్ని నింపుకుంటా అంతేకాని మ్యాచ్‌లకు దూరంగా ఉండాలని అనుకోను.

హాకీ వరల్డ్‌కప్‌లో సత్తా చాటుతాం...

వచ్చే ఏడాది జరగనున్న హాకీ ప్రపంచకప్‌నకు భారత జట్టు అర్హత సాధించడం ఖాయమే. 1975లో జరిగిన టోర్నీలో టీమిండియా చాంపియన్‌గా నిలిచింది. 2023లో భువనేశ్వర్ వేదికగా జరిగిన మెగా టోర్నీలో ఆతిథ్య భారత జట్టు తొమ్మిదో స్థానంతో సరిపెట్టుకుంది. టోక్యో ఒలింపిక్స్‌కు ముందు 41 ఏళ్లుగా విశ్వక్రీడల్లో మన ప్రదర్శన నామమాత్రమే. అలాంటి ఒక సందర్భం వస్తుంది. ఈసారి ప్రపంచకప్‌లో మెరుగైన ఆటతీరు కనబరుస్తాం. గత వరల్డ్‌కప్‌లో జరిగిన తప్పిదాలను పునరావృతం కాకుండా చూసుకుంటూ సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆధునిక హాకీలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఇప్పుడు ఫేవరెట్ అంటూ ఎవరూ లేరు. ఎవరు ఎవరినైనా ఓడించవచ్చు. ఒలింపిక్స్‌లో జర్మనీపై దక్షిణాఫ్రికా గెలుపొందింది. అనూహ్య ఫలితాలు అంటూ ఏమీ ఉండవు. మా వరకైతే ప్రత్యర్థుల గురించి పట్టించుకోము... మా బలాలను పెంచుకొని మెరుగైన ఫలితాలు సాధిస్తాం. ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ యూరప్ అంచె పోటీల్లో వరస పరాజయాలు ఎదురైన మాట వాస్తవమే. అయితే ఓడిన మ్యాచ్‌ల్లో సైతం మేం ఎంతో పోరాడాం. చివరి నిమిషంలో ప్రత్యర్థికి ఆధిక్యం సమర్పించుకునే అలవాటును దూరం చేసుకోవాల్సి ఉంది. డిఫెన్స్‌లో మరింత రాటుదేలుతాం. ఆస్ట్రేలియాతో నాలుగు మ్యాచ్‌ల సిరీస్ యువ ఆటగాళ్ల సత్తాకు పరీక్ష కానుంది.


కివీస్ పేసర్ల ప్రతాపం

హెన్రీకి 5, ఫాల్‌కెస్‌కు 4 వికెట్లు

- జింబాబ్వే తొలి ఇన్నింగ్స్ 125 ఆలౌట్
- న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 174/1
- కాన్వే, యంగ్ అర్ధశతకాలు



హెన్రీ



ఫాల్‌కెస్

బులవాయో: జింబాబ్వేతో రెండో టెస్టులో న్యూజిలాండ్ బౌలర్లు విజృంభించారు. మ్యాట్ హెన్రీ (5/40), జాకారీ ఫాల్‌కెస్ (4/38) దెబ్బకు జింబాబ్వే బ్యాటర్లు క్రీజులో నిలువలేకపోయారు. గురువారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే... తొలి ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 125 పరుగులకే ఆలౌటైంది. బ్రెండన్ టేలర్ (107 బంతుల్లో 44; 6 ఫోర్లు), వికెట్ కీపర్ తఫద్జ్వా ట్సిగా (54 బంతుల్లో 33 నాటౌట్; 4 ఫోర్లు) కాస్త పోరాడారు. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (7), బ్రియాన్ బెనెట్ (0), నిక్ వెల్చ్ (11), సీన్ విలియమ్స్ (11), సికందర్ రజా (5) విఫలమయ్యారు. ఐసీసీ అవినీతి నిరోధక నిబంధనలను ఉల్లంఘించినందుకుగానూ విధించిన మూడున్నరేళ్ల నిషేధం ముగిసిన అనంతరం బరిలోకి దిగిన తొలి మ్యాచ్‌లోనే టేలర్ తన పోరాటంతో ఆకట్టుకోగా... అతడికి సహచరుల నుంచి తోడ్పాటు దక్కలేదు. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి టెస్టులోనూ జింబాబ్వే పరాజయం పాలైన విషయం తెలిసిందే. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్... మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 174 పరుగులు చేసింది. ఓపెనర్లు డెవాన్ కాన్వే (120 బంతుల్లో 79 బ్యాటింగ్; 9 ఫోర్లు), విల్ యంగ్ (101 బంతుల్లో 74; 11 ఫోర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. జింబాబ్వే బ్యాటర్లు పరుగులు చేసేందుకు తీవ్రంగా ఇబ్బంది పడ్డ చోట... న్యూజిలాండ్ ఓపెనర్లు స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఎలాంటి తొందరపాటుకు పోకుండా ఓపెనర్లే ప్రత్యర్థి స్కోరును దాటేశారు. ఆట ఆఖర్లో విల్ యంగ్ అవుట్ కాగా... కాన్వేతో పాటు జాకబ్ డఫీ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. జింబాబ్వే బౌలర్లలో ట్రేవర్ ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో 9 వికెట్లు ఉన్న న్యూజిలాండ్... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ప్రస్తుతం 49 పరుగుల ఆధిక్యంలో ఉంది. కివీస్ బ్యాటర్లు ఇదే జోరు కొనసాగిస్తే... ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌కు మరోసారి బ్యాటింగ్ చేయాల్సిన అవసరం రాకపోవచ్చు. ఈ మ్యాచ్ ద్వారా టెస్టు ఫార్మాట్‌లో న్యూజిలాండ్ తరఫున జాకబ్ డఫీ, మాథ్యూ ఫిషర్, జాకారీ ఫాల్‌కెస్ అరంగేట్రం చేశారు.

గ్రూప్ 'డి'లో భారత్

అండర్–17 ఆసియా కప్ క్వాలిఫయర్స్

న్యూఢిల్లీ: ఆసియా కప్‌కు అర్హత సాధించేందుకు భారత యువకుల ఫుట్‌బాల్ జట్టు గట్టి పోరాటమే చేయాల్సి ఉంటుంది. అండర్–17 ఆసియా కప్ క్వాలిఫయర్స్ కోసం తీసిన 'డ్రా'లో భారత జట్టు గ్రూప్ 'డి'లో మేటి జట్టు ఇరాన్, చైనీస్ తైపీ, పాలస్తీనాలతో తలపడనుంది. కౌలాలంపూర్‌లో గురువారం 'డ్రా' వేడుక జరిగింది. క్వాలిఫయర్స్ బరిలో ఉన్న 38 జట్లను ఎ, బి, సి, డి, ఇ, ఎఫ్, జి... 7 గ్రూపులుగా విభజించారు. ఒక్కో గ్రూపు పోటీలు ఒక్కో దేశంలో జరుగుతాయి. భారత్ ఆతిథ్యమిచ్చే గ్రూప్ 'డి' పోటీలు అహ్మదాబాద్‌లో నిర్వహిస్తారు. మొత్తం ఏడు గ్రూపుల్లో అగ్రస్థానంలో నిలిచిన ఏడు జట్లు నేరుగా ఆసియా కప్‌కు అర్హత పొందుతాయి. ఇదివరకే 9 జట్లకు డైరెక్ట్ ఎంట్రీ లభించింది. ఈ ఏడాది ఖతర్‌లో జరిగిన అండర్–17 ఫిఫా ప్రపంచకప్‌కు అర్హత సాధించి పోటీ పడటం ద్వారా ఆతిథ్య ఖతర్ సహా, ఉజ్బెకిస్తాన్, సౌదీ అరేబియా, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, జపాన్, తజికిస్తాన్, యూఏఈ, ఇండోనేసియా జట్లకు ఈ అవకాశం లభించింది. కాగా వచ్చే ఏడాది సౌదీ అరేబియాలో ఏఎఫ్‌సీ ఆసియా కప్ టోర్నీ జరుగుతుంది. భారత జట్టు తమ మ్యాచ్‌లను వరుసగా పాలస్తీనా (నవంబర్ 22న), చైనీస్ తైపీ (నవంబర్ 26న), లెబనాన్ (నవంబర్ 28న), ఇరాన్ (నవంబర్ 30న) జట్లతో ఆడుతుంది.

11 మంది రెజ్లర్లపై వేటు

నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలపై డబ్ల్యూఎఫ్‌ఐ కన్నెర్ర

న్యూఢిల్లీ: నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన రెజ్లర్లపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) కన్నెర్ర చేసింది. 11 మంది రెజ్లర్లపై సస్పెన్షన్ వేటు వేసింది. కొందరు రెజ్లర్లు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) జారీ చేసినట్లుగా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలతో వయో విభాగాల టోర్నీలో పాల్గొనేందుకు చూస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టగా కొందరు కావాలని పుట్టిన ఏడాదిలోపు కాకుండా చాలా ఆలస్యంగా ఎంసీడీలో జనన నమోదు చేస్తున్నారు. తద్వారా తక్కువ వయస్సు విభాగంలో లబ్ధి పొందాలని చూస్తున్నారు. విచారణలో జనన నమోదు చేసుకున్న వారిలో కొందరు ఉద్దేశ పూర్వకంగానే ఆలస్యంగా దరఖాస్తు చేసుకున్నారని తేలడంతో డబ్ల్యూఎఫ్‌ఐ 11 మందిపై సస్పెన్షన్ వేటు వేసింది. సక్ష్యం, మనుజ్, కవిత, అన్షు, అరుశ్ రాణా, శుభమ్, గౌతమ్, జగ్‌రూప్ ధన్‌కర్, నకుల్, దుష్యంత్, సిద్ధార్థ్ బలియాన్‌లపై నిషేధం విధించారు. ప్రత్యేకించి రెజ్లింగ్‌లో రెండు రకాల నకిలీ పత్రాలు సమాఖ్యకు తలనొప్పిగా మారాయి. ఇందులో మొదటిది తప్పుడు వయో ధ్రువీకరణ కాగా... రెండోది ఒక ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ పత్రాలతో స్థానికత నిబంధనకు విరుద్ధంగా పోటీపడటం. హరియాణాలో రెజ్లింగ్‌కు విపరీతమైన పోటీ ఉంటుంది. కుప్పలుతెప్పలుగా ఉన్న అఖాడాల నుంచి వందల సంఖ్యలో రెజ్లర్లు తయారవుతారు. కానీ వీరంతా జాతీయ పోటీల్లో పాల్గొనాలంటే రాష్ట్రం తరఫున గట్టి పోటీ ఉంటుంది. చాలామందికి అవకాశాలు రావు. దీంతో హరియాణా రెజ్లర్లు పక్క రాష్ట్రాలకు చెందిన రెజ్లర్లుగా నకిలీ పత్రాలు సృష్టించి పోటీల్లో పాల్గొంటారు. ప్రతి క్రీడలోనూ వయో విభాగాలు, జూనియర్ టోర్నీల్లో నకిలీ సర్టిఫికెట్ల బెడద వేధిస్తోంది. దీనివల్ల అర్హులైన పిన్న వయస్కులు నష్టపోతున్నారు.



క్రీడా శాఖకు రెజ్లర్ తండ్రి ఫిర్యాదు

హరియాణాకు చెందిన ఇషిక రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఢిల్లీ తరఫున పోటీపడింది. దీనిపై ఢిల్లీ రెజ్లర్ రితిక తండ్రి నీరజ్ కుమార్ కేంద్ర క్రీడా శాఖకు ఫిర్యాదు చేస్తూ లేఖ రాశారు. స్థానికత నిబంధనలకు విరుద్ధంగా ఇషికను 53 కేజీల కేటగిరీలో ఢిల్లీ తరఫున పోటీపడేందుకు అనుమతించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇషిక నివాస ధ్రువీకరణ పత్రాలను ఆ ఫిర్యాదుకు జతచేసినట్లు ఆయన చెప్పారు. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని నీరజ్ కుమార్ డిమాండ్ చేశారు.

చైనా చేతిలో భారత్ పరాజయం



జిద్దా (సౌదీ అరేబియా): ఆసియా కప్ పురుషుల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. గురువారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో భారత్ 69–100 పాయింట్ల తేడాతో చైనా జట్టు చేతిలో ఓటమి చవిచూసింది. తొలి క్వార్టర్‌లో భారత్ 14 పాయింట్లు, చైనా 29 పాయింట్లు... రెండో క్వార్టర్‌లో భారత్ 17 పాయింట్లు, చైనా 24 పాయింట్లు... మూడో క్వార్టర్‌లో భారత్ 17 పాయింట్లు, చైనా 22 పాయింట్లు... చివరిదైన నాలుగో క్వార్టర్‌లో భారత్ 21 పాయింట్లు, చైనా 25 పాయింట్లు స్కోరు చేశాయి. భారత్ తరఫున అరవింద్ ముత్తు కృష్ణన్ 16 పాయింట్లు, సహజ్ సెఖోన్ 14 పాయింట్లు, ప్రణవ్ ప్రిన్స్ 14 పాయింట్లు సాధించారు. చైనా తరఫున మింగ్‌జువాన్ జు, జియాజి జావో 17 పాయింట్ల చొప్పున... షుయెపెంగ్ చెంగ్, జున్‌జీ వాంగ్ 13 పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. నాలుగు జట్లను గ్రూప్ 'సి'లో రెండు మ్యాచ్‌ల్లో ఓడిన టీమిండియా నాకౌట్ దశకు చేరుకునే అవకాశాలకు దాదాపుగా తెరపడింది. భారత్ తమ చివరి లీగ్ మ్యాచ్‌ను శనివారం ఆతిథ్య సౌదీ అరేబియాతో ఆడుతుంది.



ఏడు స్థానాలు ఎగబాకి...

63వ ర్యాంక్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు

న్యూఢిల్లీ: సుదీర్ఘ విరామం తర్వాత ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించిన భారత మహిళల జట్టు ప్రపంచ ర్యాంకింగ్స్‌లోనూ పురోగతి సాధించింది. గురువారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఏడు స్థానాలు ఎగబాకి 63వ ర్యాంక్‌లో నిలిచింది. గత రెండేళ్లలో భారత జట్టుకిదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. 2023 ఆగస్టులో టీమిండియా 61వ స్థానంలో నిలిచింది. 2013లో భారత జట్టు తమ అత్యుత్తమ ర్యాంక్ (49)ను అందుకుంది. థాయ్‌లాండ్‌లో ఇటీవల జరిగిన ఆసియా కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్ అజేయంగా నిలిచింది. భారత్... మంగోలియాపై 13–0తో... 4–0తో తిమోర్ లెస్టెపై, 5–0తో ఇరాక్‌పై, చివరి మ్యాచ్‌లో 2–1తో థాయ్‌లాండ్‌పై గెలిచింది.

'టాప్' ర్యాంక్‌లో స్పెయిన్

మరోవైపు యూరోపియన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన స్పెయిన్ జట్టు వరల్డ్ నంబర్‌వన్‌గా అవతరించింది. 'టాప్' ర్యాంక్‌లో ఉన్న అమెరికాను స్పెయిన్ రెండో స్థానానికి నెట్టేసింది. స్వీడన్ మూడు స్థానాలు మెరుగుపర్చుకొని మూడో ర్యాంక్‌కు చేరుకోగా... యూరోపియన్ టైటిల్ నిలబెట్టుకున్న ఇంగ్లండ్ ఒక స్థానం పురోగతి సాధించి నాలుగో ర్యాంక్‌లో నిలిచింది.



అచ్చు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ లాగే కనిపిస్తున్నది వాస్తవానికి హ్యూమనాయిడ్ రోబో. ప్రపంచంలోనే మొట్టమొదటి ఇంటెలిజెంట్ రోబో 4ఎస్ స్టోర్‌గా భావిస్తున్న చైనా రాజధాని బీజింగ్‌లోని రోబో మాల్‌లో తీసిందీ ఫొటో.



బిహార్ రాజధాని పట్నాలో గంగా నదిలో వరద ఉధృతి పెరగడంతో గురువారం మూటాముల్లె సర్దుకుని తన పిల్లలను తీసుకుని సురక్షిత ప్రాంతానికెళ్తున్న ఓ మహిళ



రక్షా బంధన్ పండగను పురస్కరించుకుని గురువారం గుజరాత్‌లోని సూరత్‌లో ఉన్న స్వామినారాయణ్ గురుకుల్ వద్ద రాఖీ ఆకారంలో నిలబడ్డ విద్యార్థులు

ఉపరాష్ట్రపతి ఎన్నిక
నోటిఫికేషన్ విడుదల

మొదలైన నామినేషన్ దాఖలు ప్రక్రియ

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 9వ తేదీన జరగాల్సిన తదుపరి ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ గురువారం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయడంతో మొదలైంది. నామినేషన్ల దాఖలుకు ఆఖరి తేదీ ఈ నెల 21 కాగా, నామినేషన్ల పరిశీలన ఈ నెల 22న ఈసీ చేపడుతుంది. నామినేషన్ల ఉప సంహరణకు ఆఖరు తేదీ ఈ నెల 25. పార్లమెంట్ సమావేశాల మొదటి రోజైన జూలై 21న అనారోగ్య కారణాలు చూపుతూ ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మికంగా రాజీనామా చేయడం తెల్సిందే. భారత పౌరుడై, 35 ఏళ్లు నిండిన రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యేందుకు అన్ని అర్హతలు కలిగిన వ్యక్తి ఉపరాష్ట్రపతి పదవికి అర్హుడు. ప్రభుత్వ పదవిలో ఉండరాదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో లాభదాయకమైన పదవిలో ఉండరాదు. అధికార ఎన్‌డీఏకి ఉభయ సభల్లో స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో, అధికార పక్షం బలపరిచే అభ్యర్థే ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. ఉభయ సభల్లోని ఎన్నికైన, నామినేట్ సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీ రహస్య బ్యాలెట్ ద్వారా ఉపరాష్ట్రపతిని ఎన్నుకుంటుంది. లోక్‌సభలోని 543 సీట్లకు గాను ఒక సీటు ఖాళీగా ఉంది. అదేవిధంగా, రాజ్యసభలోని 245 మందికి గాను ఆరు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఉభయ సభల ప్రస్తుత బలం 781 కాగా, అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకున్న పక్షంలో అభ్యర్థులు గెలుపు కోసం 391 ఓట్లు సాధించాల్సి ఉంటుంది. లోక్‌సభలో 542 మందికి గాను బీజేపీ సారథ్యంలోని అధికార ఎన్‌డీఏకి 293 మంది సభ్యుల బలముంది. అదే విధంగా, రాజ్యసభలో 240 మందికిగాను ఎన్‌డీఏ పక్షాన 129 మంది సభ్యులున్నారు. అధికార పక్షానికి మొత్తం 422 మంది సభ్యులున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 66 (1) ప్రకారం ఉపరాష్ట్రపతి ఎన్నిక దామాషా విధానంలో జరుగుతుంది. మూడు నామినేషన్లు తిరస్కరణ మొదటి రోజైన గురువారం అందిన మూడు నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ చెప్పారు.

వచ్చే వారంలో ట్రంప్‌తో భేటీ

రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆశాభావం

- యూఏఈ వేదికగా ఉంటుందని వెల్లడి

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వచ్చే వారం సమావేశమవ్వాలని భావిస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తెలిపారు. బహుశా యూఏఈలో శిఖరాగ్రం జరిగే అవకాశముందన్నారు. మూడేళ్లుగా కొనసాగిస్తున్న యుద్ధానికి ముగింపు పలకాలంటూ అమెరికా అధ్యక్షుడు పుతిన్ తీవ్రంగా ఒత్తిళ్లు తెస్తున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. యూఏఈ అధ్యక్షుడు జాయెద్ అల్ నహ్యాన్‌తో క్రెమ్లిన్‌లో జరిగిన భేటీ అనంతరం పుతిన్ ఈ ప్రకటన చేశారు. ప్రతిపాదన తమదే అయినా, ఇరు దేశాలు ఈ భేటీపై ఆసక్తితో ఉన్నాయన్నారు. చర్చల్లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పాల్గొంటారా అన్న ప్రశ్నకు పుతిన్..ఇందుకు తాను వ్యతిరేకం కాదని గతంలోనూ అనేక పర్యాయాలు చెప్పానన్నారు. అయితే, ఇందుకు కొన్ని పరిస్థితులు అనుకూలించాల్సి ఉందన్నారు. అంతకుముందు, రష్యా విదేశాంగ శాఖ సలహాదారు యూరి ఉషకోవ్ మాట్లాడుతూ.. శిఖరాగ్రం వచ్చే వారం జరిగే అవకాశాలున్నాయని తెలిపారు. ఇందుకు వేదికపై సూత్రప్రాయ అంగీకారం కుదిరినట్లు వెల్లడించారు. తేదీలింకా ఖరారు కాలేదన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా ఈ భేటీలో పాల్గొనే ఛాన్సుందన్న వార్తలను ఉషకోవ్ కొట్టిపారేశారు. పుతిన్, ట్రంప్ భేటీ విజయవంతం, ఫలవంతం కావాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. యుద్ధానికి ముగింపు పలికేందుకు గతంలో జెలెన్‌స్కీ భేటీ ప్రతిపాదన తెచ్చినా పుతిన్ పట్టించుకోలేదు. తాజాగా, పుతిన్ వ్యాఖ్యలపై అమెరికా అధ్యక్ష భవనం స్పందించలేదు. యుద్ధం ఆపకుంటే ఆర్థికపరమైన కఠిన ఆంక్షలను విధిస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికల గడువు శుక్రవారంతో ముగియనుంది. ట్రంప్–పుతిన్ శిఖరాగ్రం తమ వైఖరిని స్పష్టంగా తెలియజేసేందుకు ఒక అవకాశమని రష్యా బుధవారం వ్యాఖ్యానించింది. అరుదైన ఖనిజాల వెలికితీత వంటి అంశాల్లో ఉమ్మడి పెట్టుబడులకు ఆర్థిక అవకాశాలపైనా చర్చలు జరపవచ్చని తెలిపింది.

యుద్ధానికి వ్యతిరేకంగా ఉక్రేనియన్లు

2022తో పోలిస్తే రష్యాతో జరిగే యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ముగించాలని ఎక్కువమంది ఉక్రెయిన్ ప్రజలు కోరుకుంటున్నారు. యుద్ధం మొదలైన కొత్తలో చేపట్టిన ఓ సర్వేలో విజయం సాధించేదాకా పోరాడాల్సిందేనంటూ మూడొంతుల మంది గట్టిగా కోరుకున్నారు. తాజాగా ఇటీవల చేపట్టిన సర్వేలో మాత్రం ఇందుకు విరుద్ధమైన ఫలితాలు వచ్చాయి. యుద్ధానికి కొనసాగించాలనుకునే వారి సంఖ్యలో గణనీయంగా తగ్గుదల కనిపించింది. త్వరగా యుద్ధానికి ముగింపు పలికి, రష్యాతో ఒప్పందానికి రావాలని మూడొంతుల మంది కోరుకుంటున్నారని వెల్లడైంది. రష్యా ఆధీనంలోని భాగాలు మినహా మిగతా ప్రాంతాల్లోని 15 ఏళ్లు పైబడిన వెయ్యి మంది నుంచి అభిప్రాయాలను తెలుసుకున్నామని సర్వే నిర్వాహకులు తెలిపారు.

మనమూ 50% టారిఫ్‌లు వెయ్యాల్సిందే..!

అమెరికా టారిఫ్ బెదిరింపులపై కాంగ్రెస్ నేత శశి థరూర్

న్యూఢిల్లీ: అమెరికా తాజాగా అదనంగా విధించిన 25 శాతం టారిఫ్‌లకు దీటుగా భారత్ కూడా స్పందించాలని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అమెరికా నుంచి వచ్చే వస్తువులపై టారిఫ్‌లను 17 శాతంతో ఆపకుండా మనం కూడా 50 శాతం టారిఫ్‌లతో సమాధానం చెప్పాల్సిందేనని పేర్కొన్నారు. అమెరికా బెదిరింపులకు లొంగరాదన్నారు. అమెరికా సహా మరే ఇతర దేశం కూడా భారత్‌ను బెదిరింపులకు గురి చేసే పరిస్థితి రాకూడదని పేర్కొన్నారు. 'అమెరికా టారిఫ్‌ల ప్రభావం మన ఎగుమతులపై తప్పకుండా పడుతుంది. మన వస్తువుల ఖరీదు సగానికి సగం పెరిగితే అక్కడి వాళ్లు కొనుగోలు చేసేందుకు వెనుకాడుతారు? అందుకే, మనం కూడా అమెరికా ఉత్పత్తులపై 50 శాతం టారిఫ్‌లను వేయాలి. 17శాతంతోనే ఆగకూడదు. అప్పుడే మరే దేశమూ ఇలా మనల్ని బెదిరించే పరిస్థితి రాదు. మనతో వాళ్లకు అవసరం లేకుంటే, వాళ్ల అవసరం కూడా మనకుండదు'అని ఆయన తెలిపారు. 'అంతర్జాతీయ నిబంధనలు, ధరల పరిమితికి లోబడి బహిరంగ మార్కెట్‌లో మన దేశం చమురును కొనుగోలు చేస్తోంది. రష్యా నుంచి ఆయిల్, గ్యాస్ కొంటున్నామనే సాకుతో అమెరికా మనపై టారిఫ్‌లు వేయడం ఏవిధంగా చూసినా అన్యాయం, అక్రమం'అని ఆయన అన్నారు. అమెరికాకు బదులుగా ఇతర దేశాలతో సంబంధాలను విస్తృతం చేసుకోవడం ద్వారావనరులు, మార్కెట్లు మనకూ ఉన్నాయని రుజువు చేయాలని సూచించారు.

సూడాన్‌లో దాడి.. 40 మంది మృతి

కైరో: సూడాన్‌లోని దర్ఫుర్ ఎయిర్‌పోర్టుపై జరిగిన వైమానిక దాడిలో కనీసం 40 మంది మృత్యువాతపడ్డారు. పారామిలటరీ గ్రూప్ ఆధీనంలో ఉన్న ఈ ప్రాంతంపై జరిగిన దాడిలో యూఏఈ మిలటరీ విమానం ధ్వంసమైంది. అందులో ఉన్న కొలంబియాకు చెందిన దాదాపు 40 మంది అనుమానిత కిరాయి ముఠా సభ్యులు చనిపోయినట్లు ప్రభుత్వ వర్గాలు గురువారం తెలిపాయి. ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్(ఆర్ఎస్ఎఫ్)కు సాయంగా ఆ విమానంలో యూఏఈ పంపించిన ఆయుధాలు, సామగ్రి సైతం నాశనమయ్యాయి. దర్ఫూర్‌లోని న్యారా ఎయిర్‌పోర్టులో యూఏఈ విమానం ల్యాండవ్వగానే మిలటరీ యుద్ధ విమానం బాంబులతో దాడి చేసినట్లు సమాచారం. ఘటనపై ఆర్ఎస్ఎఫ్ స్పందించలేదు. సూడాన్‌లో ఉన్న తమ దేశస్తులను వెంటనే తిరిగి రావాల్సిందిగా కొలంబియా విదేశాంగ మంత్రిత్వ శాఖ కోరింది. కాగా, 2023 ఏప్రిల్ నుంచి సూడాన్ సైన్యం, ఆర్ఎస్ఎఫ్‌ల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుండటం తెల్సిందే. అంతర్యుద్ధం కారణంగా వేలాది మంది చనిపోగా 1.40లక్షల మంది నిరాశ్రయులుగా మారారు. దేశంలోని పలుప్రాంతాల్లో కరువు పరిస్థితులు తాండవిస్తున్నాయి.

కపిల్ శర్మ కెఫెపై మళ్లీ దాడి

25 రౌండ్ల వరకు దుండగుల కాల్పులు

- బాధ్యత ప్రకటించుకున్న బిష్ణోయ్ గ్యాంగ్

ఒట్టావా: కెనడాలోని సర్రెలో ఉన్న స్టార్ కమెడియన్ కపిల్ శర్మకు చెందిన కెఫెపై మరోసారి దాడి జరిగింది. గురువారం ఈ కెఫెపై 25 రౌండ్ల వరకు కాల్పులు జరిగాయి. నెల రోజుల వ్యవధిలో ఇది రెండో ఘటన. దీనికి తమదే బాధ్యతంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ గుర్‌ప్రీత్ సింగ్ అలియాస్ గోల్డీ ధిల్లాన్ ప్రకటించుకున్నాడు. 'కపిల్ శర్మకు మేం ఫోన్ చేశాం. అతడు సమాధానమివ్వలేదు. అందుకే కెఫెపై కాల్పులు జరిపాం. ఇప్పటికీ అతడు స్పందించకుంటే మా తదుపరి స్పందన ఇక ముంబైలోనే చూపించాల్సి ఉంటుంది'అంటూ ఆన్‌లైన్‌లో గోల్డీ ధిల్లాన్ ప్రకటించాడు. కెఫెపై కాల్పులకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కేఫ్ సమీపంలో కదులుతున్న వాహనంపై ఉన్న వ్యక్తి కాల్పులు జరుపుతున్నట్లుగా అందులో ఉంది. ఈ ఘటనపై తాము దర్యాప్తు చేపట్టామని సర్రే పోలీస్ విభాగం తెలిపింది. ఆగస్ట్ 7వ తేదీ వేకువజామున 4.40 గంటలకు 8400 బ్లాక్, 120 స్ట్రీట్‌లోని ఓ వ్యాపార సంస్థపై కాల్పులు జరిగినట్లు సమాచారం అందిందని పేర్కొంది. ఇదే సంస్థపై జూలై 9వ తేదీ రాత్రి కూడా కాల్పులు జరిగాయని గుర్తు చేసింది. కాల్పుల కారణంగా దెబ్బతిన్న కిటికీలు, భవనానికి వాటిల్లిన నష్టాన్ని పోలీసు అధికారులు పరిశీలించారు. కనీసం 25 రౌండ్ల వరకు కాల్పులు జరగ్గా, కెఫెకున్న ఒక కిటికీకి 10 చోట్ల రంధ్రాలు పడగా, మరో కిటికీ ధ్వంసమైంది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి హాని వాటిల్లలేదని సర్రే పోలీస్ విభాగం పేర్కొంది. భద్రత ఉందని చాటేందుకు, సంఘీభావం తెలిపేందుకు సర్రే మేయర్ బ్రెండా లాక్, పోలీస్ అధికారులతో కెఫెలో సామూహిక విందు ఇచ్చిన కొన్ని రోజులకే మళ్లీ కాల్పులు చోటుచేసుకోవడం గమనార్హం. ఈ విందు కార్యక్రమం ఫొటోలను కపిల్ శర్మ ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ అధికారులకు కృతజ్ఞత తెలిపారు. కాగా, జూలై 9వ తేదీన జరిగిన కాల్పులకు ఖలిస్తానీ ఉగ్రవాది హర్జీత్ సింగ్ బాధ్యత ప్రకటించుకున్నాడు. బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌కు చెందిన ఇతడిని జాతీయ దర్యాప్తు విభాగం(ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్ జాబితాలో చేర్చింది.



కెఫెపై తుపాకీతో కాల్పులు జరుపుతున్న దృశ్యం (వీడియో ఫుటేజీ)

వేటాడి..వెంటాడి..
రెండు రోజుల్లో 25 శునకాలు హతం

జైపూర్: రాజస్తాన్‌లోని ఝున్‌ఝును జిల్లాకు చెందిన ఓ వ్యక్తి కేవలం రెండు రోజుల వ్యవధిలో 25కు పైగా శునకాల ఉసురు తీశాడు. ఈ నెల 2, 3వ తేదీల్లో చోటుచేసుకున్న ఈ దారుణంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. డుమ్రాలోని కుమావస్ గ్రామానికి చెందిన షియోచంద్ బవారియా రైఫిల్ పట్టుకుని బైక్‌పై వీధుల్లో తిరుగుతూ శునకాలు కనిపించడమే తడవుగా వెంటాడి కాల్పులు జరుపుతున్నట్లుగా ఉన్న వీడియో వైరలవుతోంది. రక్తమోడుతూ, అచేతన స్థితిలో వీధి కుక్కలు గ్రామంలోని వీధులు, పొలాల్లో పడి కనిపిస్తున్నాయి. అతడిని చూసి కొన్ని కుక్కలు ప్రాణాలు దక్కించుకునేందుకు పరుగులు తీస్తున్నాయి. ఈ దృశ్యాలను చూసి గ్రామస్తులు కలవరం చెందుతున్నారు. నిందితులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జంతుప్రేమికులు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బైక్‌పై బవారియాతోపాటు మరో వ్యక్తి కూడా ఉన్నట్లు చెబుతున్నారు. మూడో వ్యక్తి మరో బైక్‌పై వారిని వెన్నంటే వీడియో రికార్డింగ్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. వీడియో వెలుగులోకి రావడంతో ఈ దారుణంపై బవారియాపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ఈ నెల 4వ తేదీన కేసు నమోదు చేసి విచారణ చేపట్టామని ఎస్పీ బ్రిజేష్ జ్యోతి ఉపాధ్యాయ తెలిపారు. బవారియా రెండు రోజుల్లోనే 25కు పైగా వీధి కుక్కల ఉసురుతీశాడన్నారు. పరారీలో ఉన్న బవారియా కోసం గాలింపు చేపట్టామన్నారు. అతడి వెన్నంటే ఉన్న వారిపైనా ఆరా తీస్తున్నామన్నారు.



అదుపుతప్పి పడిపోయిన
ఆర్మీ వాహనం

ముగ్గురు సీఆర్‌పీఎఫ్ జవాన్ల దుర్మరణం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్ జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న బండరాళ్లతో నిండిన కాలువలో పడిపోయింది. ఉధమ్‌పూర్ జిల్లాలోని కద్వా ప్రాంతంలో గురువారం ఈ దుర్ఘటన జరిగింది. బసంత్‌గఢ్ ప్రాంతంలో కూంబింగ్ పూర్తిచేసుకుని 187బెటాలియన్‌కు చెందిన 23 మంది జవాన్లతో తిరిగొస్తున్న ఆర్మీ వాహనం రోడ్డుపై జారి పక్కనే ఉన్న లోతైన కాలువలో పడిపోయింది. బండరాళ్లపై అత్యంత ఎత్తు నుంచి పడటంతో అందులోని ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే చనిపోయా రు. 16 మందికి గాయాలయ్యాయి.

పిడుగుపాట్లు, పాముకాట్లు..

మూడు నెలల్లో 430 మంది మృతి

రాంచీ: జార్ఖండ్‌లో గత మూడు నెలల వ్యవధిలో పిడుగుపాట్లు, పాము కాట్లు, నీట మునక వంటి వివిధ ప్రకృతి వైపరీత్యాలతో కనీసం 431 మంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు. మే 1 నుంచి జూలై 31 మధ్య కాలంలో పిడుగులు పడిన ఘటనల్లో 180 మంది, నీళ్లలో మునిగి 161 మంది చనిపోయారన్నారు. పాముకాటుకు గురై 80 మంది ప్రాణాలు పోగొట్టుకోగా, 9 మంది భారీ వర్షాలతో, ఒకరు వరదల్లో చనిపోయారని వివరించారు. జూన్ 17వ తేదీ నుంచి భారీ వర్షాల కారణంగా 467 ఇళ్లు ధ్వంసం కాగా, 8,187 నివాసాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు.

ఎస్ఐఆర్‌పై ఆగని ఆందోళన

- వెంటనే చర్చించాలని పార్లమెంట్‌లో విపక్షాల డిమాండ్
- అంగీకరించని ప్రభుత్వం.. ఉభయ సభలు పలుమార్లు వాయిదా

న్యూఢిల్లీ: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై పార్లమెంట్‌లో రగడ ఆగడం లేదు. ఈ అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ప్రభుత్వం అందుకు అంగీకరించకపోవడంతో ప్రతిష్టంభన కొనసాగుతోంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. గురువారం సైతం పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. నిరసనలు, నినాదాలతో సభా కార్యకలాపాలను అడ్డుకున్నాయి. ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. లోక్‌సభ ఉదయం ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు ఆందోళనకు ఆందోళనకు దిగారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో స్పీకర్ రెండు సార్లు సభను వాయిదా వేశారు. మణిపూర్‌కు నిధులు కేటాయించేందుకు ఉద్దేశించిన మణిపూర్ అప్రాప్రియేషన్ బిల్లు–2025లో లోక్‌సభలో ఎలాంటి చర్చ జరగకుండానే మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. అనంతరం సభ శుక్రవారానికి వాయిదా పడింది.

దేశ ప్రయోజనాల కోసమే మా పోరాటం: ఖర్గే

రాజ్యసభలోనూ విపక్షాలు ఆందోళనలు కొనసాగాయి. సభ తొలుత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా విపక్షాలు నినాదాలు ఆపలేదు. ఒకవైపు గందరగోళం కొనసాగుతుండానే మరోవైపు కోస్టల్ షిప్పింగ్ బిల్లు–2025ను ప్రవేశపెట్టి ఆమోదించారు. కొందరు విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి ప్లకార్డులు ప్రదర్శించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మమతా ఠాకూర్‌పై సభాపతి స్థానంలో ఉన్న ఘనశ్యామ్ తివారీ ఆగ్రహం వ్యక్తంచేశారు. విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కొద్దిసేపు మాట్లాడారు. ఎస్ఐఆర్‌పై చర్చకు అనుమతించాలని కోరారు. దేశ ప్రయోజనాల కోసమే తాము పోరాడుతున్నామని చెప్పారు. తర్వాత సభను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్లు ఘనశ్యామ్ తివారీ ప్రకటించారు.

పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన

ఎస్ఐఆర్‌పై ప్రతిపక్ష నేతలు గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తంచేశారు. పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, సమాజ్‌వాదీ పార్టీ సభ్యుడు ధర్మేంద్ర యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్ తదితరులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నినాదాలతో హోరెత్తించారు. ఎస్ఐఆర్ అంటే కంటికి కనిపించని రహస్య రిగ్గింగ్ అని ఆరోపించారు.

'బ్లూబర్డ్' ప్రయోగానికి
ఇస్రో సన్నద్ధం

సూళ్లూరుపేట: బాహుబలి రాకెట్‌గా పేరు గాంచిన ఇస్రో వారి ఎల్‌వీఎం3 మార్క్–5 రాకెట్ ద్వారా 6,500 కేజీల అత్యంత బరువైన బ్లూ బర్డ్ వాణిజ్య ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు ఇస్రో ఏర్పాట్లను ముమ్మరం చేసింది.అమెరికాలోని టెక్సాస్‌కు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థ ఈ ఉపగ్రహాన్ని రూపొందించింది. షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్ అనుసంధానం పనులు జరుగుతున్నాయి. బ్లూబర్డ్ త్వరలోనే అమెరికా నుంచి భారత్‌కు చేరుకోనుంది. షార్ చరిత్రలో ఇది భారీ ప్రయోగమనే చెప్పాలి.

బ్లూబర్డ్ ప్రత్యేకతలివీ..

ఇది అమెరికన్ కమ్యూనికేషన్ ఉపగ్రహం. ఇద్దరు వ్యక్తులు అంతరిక్షం నుంచి స్మార్ట్ ఫోన్ల ద్వారా కాల్స్ చేసుకోవడానికి ఉపయోగపడేలా రూపొందించారు. భూమికి తక్కువ దూరంలోని లియో ఆర్బిట్ నుంచి పని చేసే ఈ ఉపగ్రహానికి 64 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన వినూత్నమైన యాంటెన్నా ఉంటుంది. ఉపగ్రహం నుంచి స్మార్ట్ ఫోన్‌కు ఇది ప్రత్యక్ష కనెక్టివిటీని సులభతరం చేస్తుంది. మొబైల్ ఫోన్ వినియోగదారులు భూమిపైని టవర్లపై ఆధారపడకుండా అంతరిక్షం నుంచి కాల్స్ చేయడానికి, బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేయడానికి ఈ ఉపగ్రహం దోహదపడుతుంది. బ్లూబర్డ్ ఉపగ్రహం కిరణాలు 40 ఎంహెచ్‌జడ్ వరకు సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇది 120 ఎంబీపీఎస్ వరకు గరిష్ట ట్రాన్స్‌మిషన్ వేగాన్ని అందిస్తుంది. బ్లూబర్డ్ ఉపగ్రహాల సిరీస్‌ను ప్రపంచవ్యాప్తంగా ఎంపిక చేసిన మార్కెట్లలో నిరంతరాయంగా సెల్యూలార్ బ్రాండ్‌బ్యాండ్ సేవలు అందించే లక్ష్యంతో రూపకల్పన చేశారు.

పంజాబ్ ల్యాండ్ పూలింగ్ విధానంపై స్టే

చండీగఢ్: పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వానికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ పూలింగ్ విధానం అమలుపై పంజాబ్ హరియాణా హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ప్రభుత్వ విధానాన్ని సవాల్ చేస్తూ గుర్‌దీప్ సింగ్ గిల్ అనే వ్యక్తి జూన్ 24వ తేదీన వేసిన పిటిషన్‌పై గురువారం కోర్టు విచారణ చేపట్టింది. ఈ విధానం ఫలితంగా కలిగే సామాజిక, పర్యావరణ ప్రభావంపై ఎటువంటి అంచనాలు లేకుండానే ప్రభుత్వం హడావుడిగా అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరఫు లాయర్ వాదించారు. గత చట్టాలకు, ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నందున ఈ చట్టాన్ని కొట్టివేయాలని కోరారు. ల్యాండ్ పూలింగ్ వల్ల ఉపాధి కోల్పోయే భూమిలేని కార్మికులకు పునరావాసం కల్పించేందుకు తీసుకున్న చర్యలుంటే వివరించాల్సిందిగా ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఉత్తరకాశీ వరదల్లో 50 మంది గల్లంతు

70 మందిని కాపాడామన్న సైన్యం

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తరకాశీలో ఆకస్మిక వరదలు సంభవించిన ప్రాంతాల్లో గురువారం మూడో రోజు సహాయక చర్యలు కొనసాగాయి. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయిన 70 మందిని కాపాడామని, మరో 50 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని ఆర్మీ తెలిపింది. ఆచూకీ తెలియకుండా పోయిన వారిలో ఒక జూనియర్ కమిషన్డ్ అధికారి, 8 మంది జవాన్లు ఉన్నారంది. వివిధ ప్రాంతాల్లో చిక్కుబడి పోయిన 65 మందిని హెలికాప్టర్ల ద్వారా మాట్లి పట్టణానికి తరలించామని వివరించింది. తీవ్రంగా ప్రభావితమైన ధరాలి గ్రామంలో బురద మట్టి, రాళ్ల కింద ఇరుక్కుపోయిన వారిని గుర్తించేందుకు అత్యాధునిక సాధన సంపత్తిని విమానం ద్వారా తరలించినట్లు తెలిపింది. సహాయక చర్యల్లో ఇంజనీర్లు, వైద్య బృందాలు, నిపుణులతో కూడిన 225 బలగాలతోపాటు రెస్క్యూడాగ్స్ పాల్గొంటున్నాయన్నారు. వాతావరణం మెరుగుపడినట్లయితే పౌరులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అత్యాధునిక చినూక్, ఎంఐ–17 హెలికాప్టర్లను డెహ్రాడూన్‌లో సిద్ధంగా ఉంచామని అధికారులు వెల్లడించారు.

రూ.23వేల కోట్ల హవాలా సొమ్మును బాధితులకు ఈడీ అందజేసింది

సుప్రీంకోర్టుకు తెలిపిన సొలిసిటర్ జనరల్

న్యూఢిల్లీ: అక్రమంగా సంపాదించిన రూ.23 వేల కోట్ల డబ్బును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) స్వాధీనం చేసుకుని ఆయా నేరాల బాధితులకు అందజేసిందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గురువారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం భూషణ్ పవర్ అండ్ స్టీల్ లిమిటెడ్(బీపీఎస్ఎల్) ఆస్తుల విక్రయానికి అనుమతిస్తూ మేలో జారీ చేసిన ఉత్తర్వులను సమీక్షించాలంటూ దాఖలైన పిటిషన్లపై గురువారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఓ న్యాయవాది బీపీఎస్ఎల్‌పై ఈడీ కేసు గురించి ప్రస్తావించగా సీజేఐ గవాయ్..ఇక్కడ కూడా ఈడీ ఉందా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దీనికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ..'ఇక్కడో వాస్తవ చెప్పాలి. ఇప్పటి వరకు ఈడీ మనీలాండరింగ్ కేసుల దర్యాప్తులో భాగంగా రూ.23 వేల కోట్లను స్వాధీనం చేసుకుంది. దీని ఆర్థిక నేరాల బాధితులకు చెల్లించింది'అని అన్నారు.

హెలికాప్టర్ కూలి.. ఘనా రక్షణ మంత్రి మృతి

అక్రా: ఘనాలో సైనిక హెలికాప్టర్ కుప్పకూలిన ఘటనలో ఆ దేశ రక్షణ మంత్రి ఎడ్వర్డ్ ఒమనె బొమాహ్ సహా 8మంది ప్రాణాలు కోల్పోయారు. మంత్రి ఎడ్వర్డ్‌తోపాటు ఘటనలో పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి ఇబ్రహీం ముర్తాలా మహ్మద్ కూడా చనిపోయారని ప్రభుత్వం వెల్లడించింది. మిగతా వారిలో ఇద్దరు ఉన్నతాధికారులు కాగా ముగ్గురు సిబ్బంది అని పేర్కొంది. బుధవారం హెలికాప్టర్ టేకాఫ్ తీసుకున్న కొద్దిసేపటికే రాడార్‌తో సంబంధాలు తెగిపోయినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ప్రమాదానికి కారణాలు వెల్లడించలేదు. ఘనాలో ఇటీవలి కాలంలో ఇస్లామిక్ ఉగ్రవాదుల బెడద పెరిగిపోయిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.

పాక్‌లో పేలుడు..ముగ్గురు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని కల్లోల ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్‌లో చోటుచేసుకున్న బాంబు పేలుడు ఘటనలో ముగ్గురు చనిపోగా 13 మంది గాయపడ్డారు. దక్షిణ వజీరిస్తాన్ జిల్లా వానా ప్రాంతంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం వద్ద గురువారం పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం దుండగులు కాల్పులకు దిగారన్నారు. తెహ్రీక్- ఇ-తాలిబన్ పాకిస్తాన్ ప్రభుత్వంతో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలిగాక ఖైబర్, బలూచిస్తాన్ ప్రావిన్స్‌లలో ఇటీవల హింసాత్మక ఘటనలు పెరిగిపోయాయి.

అభిజ్ఞాన శాకుంతలం రాసిందెవరు?

మధ్య ఆసియాకు చెందిన శకులు, కుషాణులు భారత్‌పై దండెత్తారు. శకుల్లో ప్రసిద్ధి చెందిన వాడు మొదటి రుద్రదాముడు. శాతవాహనులను ఓడించి మౌర్యుల నాటి సుదర్శన తటాకానికి మరమ్మతులు చేయించాడు. శ్రీగుప్తుడు గుప్తవంశ మూలపురుషుడు. 'అలహాబాదు ప్రశస్తి' శాసనం సముద్రగుప్తుడి విజయాలను వివరిస్తుంది. హర్షవర్ధనుడు స్థానేశ్వర సింహాసనాన్ని అధిష్ఠించి ఉత్తర భారతదేశాన్ని పాలించిన ఆఖరి హిందూ చక్రవర్తి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

మౌర్యుల అనంతర యుగం (క్రీపూ. 71 నుంచి)

మధ్య ఆసియాకు చెందిన శకులు, కుషాణుల వంటి తెగలకు నిస్సారమైన భూములున్న ప్రాంతంలో జీవనం కష్టతరమైంది. క్రీ.పూ. 220లో షిహువాంగ్ టీ చైనా గోడను నిర్మించటంతో ఈ తెగలు ఆ దేశంపై దాడి చేయలేకపోయాయి. ఇండియాపై దండెత్తాయి. శుంగ, కణ్వ వంశ రాజులు ఈ దాడులను ఎదుర్కోలేకపోయారు. 'యవనులు'గా, 'ఇండోగ్రీకులు'గా బాక్ట్రియా పాలకులైన గ్రీకులు డిమెట్రియస్ నాయకత్వంలో దండెత్తి ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో కొన్నింటిని ఆక్రమించారు. ఈ వంశంలో మీనాండర్ ముఖ్యుడు. అతడు బౌద్ధమతాన్ని స్వీకరించాడు. బౌద్ధాచార్యుడు నాగసేనుడు, మీనాండర్ మధ్య జరిగిన మత చర్చలను 'మిళింద పన్హా' గ్రంథంలో వివరించారు. మౌర్య సామ్రాజ్య పతనానంతరం ఇండియాపై దాడిచేసిన మొదటి విదేశీ తెగ ఇండో గ్రీకులు. భారత్‌లో తమ రాజుల పేరు మీద బంగారు నాణేలు విడుదల చేశారు. ఉత్తర భారత వాయవ్య ప్రాంతంలో గ్రీకు శిల్పకళ ప్రభావంతో గాంధార శిల్పరీతి అభివృద్ధి చెందింది. మన దేశంలో మొదట బంగారు నాణేలు విడుదల చేసింది ఇండోగ్రీకులే. మౌర్యుల అనంతరం విదేశీరాజులు, తెగలు ఇండియాకు వచ్చి స్థిరపడ్డారు. ముస్లింలు రాజ్యాలు స్థాపించారు. స్వదేశీ రాజ్యాల్ని కూలదోశారేగానీ దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో మౌలికమైన మార్పులు చేయలేదు. రైతులు, వృత్తికారులు, వ్యాపారులు ఎప్పటిలాగే జీవనం సాగించారు. స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చెక్కు చెదరకుండా కొనసాగింది. పాలకుల మార్పు అంటే రైతుల మిగులును దోచుకునే ప్రభువుల సిబ్బంది మార్పుగానే ప్రజలు భావించేవారు. కానీ బ్రిటిష్ వాళ్లు అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించారు. భారత ఆర్థిక, సంప్రదాయ వ్యవస్థను పూర్తిగా కొల్లగొట్టారు. వాళ్లెప్పుడూ భారతీయ జీవన విధానంలో అంతర్భాగం కాలేదు. దేశంలో పరాయి పాలకులుగానే మిగిలిపోయారు. దేశ వనరులు, సంపదను దోచుకెళ్లారు.

ప్రాచీన ఓడరేవులు

అరికమేడు: ఇది పుదుచ్చేరి సమీపంలో ఉంది. క్రీ.శ. రెండో శతాబ్దంలో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి నుంచి రోమ్ సామ్రాజ్యానికి వాణిజ్య లావాదేవీలు జరిగేవి.

బ్రోచ్ (భరుకచ్ఛ): ఇది గుజరాత్‌లో ఉంది.

చాల్: మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఉంది. టాలమీ రచనల్లో దీని గురించి పేర్కొన్నాడు.

కావేరీపట్నం (ప్రహార్): ఇది కావేరీ నదీతీరంలో ఉండేది. దీన్ని కరికాల చోళుడు నిర్మించాడు.

మౌజిరిస్: పెరిప్లస్, టాలమీ దీని గురించి ప్రస్తావించారు. రెండో శతాబ్దంలో మలబార్ తీరంలో ఇది ప్రసిద్ధి గాంచింది.

సొపారా: ఇది మహారాష్ట్రలో ఉంది.

తామ్రలిపి: పశ్చిమ బెంగాల్‌లో ఉంది.

క్రీ.పూ. 4వ శతాబ్దం నుంచి 12వ శతాబ్దం వరకు ప్రసిద్ధి చెందింది.

శకులు (క్రీపూ. 90)

వీరిని సిథియన్లు అనికూడా అంటారు. వీరు 'యూచి' జాతివారు. శకుల్లో ప్రసిద్ధి చెందిన వాడు మొదటి రుద్రదాముడు. అతడు క్రీ.శ.130 – 150 మధ్య పాలించాడు. శాతవాహనులను ఓడించి, ప్రజా సంక్షేమం కోసం మౌర్యుల నాటి సుదర్శన తటాకానికి మరమ్మతులు చేయించాడు. మొదటి సంస్కృత శాసనాన్ని వేయించాడు.

జునాగఢ్ శాసనాన్ని రుద్రదాముడు వేయించాడు. గుప్త చక్రవర్తి విక్రమాదిత్యుడు ఈ వంశానికి చెందిన రుద్రసింహుని జయించి శకరాజ్యాన్ని ఆక్రమించి 'శకారి' బిరుదు పొందాడు. తర్వాత 'పార్థియన్' వంశస్తులు రాజ్యానికి వచ్చారు.

కుషాణులు (క్రీశ. 78 - 101)

కుషాణులు 'యూచి' తెగకు చెందిన వారు. వీరిలో మొదటి రాజు కాడ్‌ఫైసెస్. అతడి కుమారుడు విమా కాడ్‌ఫైసెస్. ఇతడు ప్రవేశపెట్టిన బంగారు, రాగి నాణేలపై 'మహేశ్వర' పదం ఉంది. దీంతో వీరు శైవ మతస్తులని తెలుస్తోంది. కనిష్కుడు కుషాణ రాజుల్లో గొప్పవాడు. ఇతడికి 'దేవపుత్ర', 'సీజర్' బిరుదులున్నాయి. బౌద్ధమతం స్వీకరించి మహాయాన బౌద్ధాన్ని ప్రచారం చేశాడు. మత వ్యాప్తి కోసం గాంధార శిల్పాన్ని వినియోగించాడు. కనిష్కుడి తర్వాత రాజ్యానికి వచ్చిన వసిష్కుడు, హవిష్కుడు, రెండో కనిష్కుడు, వాసుదేవుడు సమర్థులు కారు. గ్రీకు, రోమన్ శిల్పశైలితో బుద్ధుని విగ్రహాల నిర్మాణం చేపట్టారు. అనంతరం ఇది గాంధార శిల్పకళగా పరిణతి చెందింది. శకులు, కుషాణులు, గ్రీకులు, పార్థియన్లు తమ పొడవాటి కోట్లు, ట్రౌజర్లు, తలపాగాలను భారతీయులకు పరిచయం చేశారు. క్రీ.శ. 78లో కనిష్కుడు 'శక' యుగాన్ని ప్రారంభించారు.

గుప్త సామ్రాజ్యం (క్రీ.శ. 320 - 540)

శ్రీ గుప్తుడు గుప్తవంశ మూలపురుషుడు. తర్వాత అతడి కుమారుడు ఘటోత్కచగుప్తుడు రాజ్యాన్ని పాలించాడు.

మొదటి చంద్రగుప్తుడు (క్రీశ. 320 - 335)

ఘటోత్కచుని కుమారుడు మొదటి చంద్రగుప్తుడు. ఇతడ్ని గుప్తరాజ్య స్థాపకుడిగా పేర్కొంటారు. ఇతనితో 'గుప్తశకం' ప్రారంభమైంది. 'దేవీ చంద్రగుప్త' అనే నాణేలను ముద్రించాడు. ఇతడికి 'మహారాజాధిరాజ' అనే బిరుదు ఉంది. లిచ్ఛవీ రాకుమారి కుమారదేవిని వివాహం చేసుకున్నాడు. దీంతో చంద్రగుప్తుడికి లిచ్ఛవీ రాజ్యంలో చాలా భాగం సంక్రమించింది.

సముద్రగుప్తుడు (క్రీ.శ. 335 - 376)

'అలహాబాదు ప్రశస్తి' శాసనం సముద్రగుప్తుడి విజయాలు, విశిష్ట లక్షణాలు, బహుముఖ ప్రతిభను వివరిస్తుంది. ఇతడు అశ్వమేధయాగం చేశాడు. విద్యాపోషకుడు, పండితుడు, సంగీత విద్వాంసుడు. సముద్రగుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్'గా స్మిత్ అభివర్ణించాడు. 'విక్రమాంక', 'కవిరాజు' బిరుదులున్నాయి. సముద్రగుప్తుడు వీణ వాయిస్తున్న చిత్రాలతో నాణేలు ముద్రించాడు.

సముద్రగుప్తుడు జయించిన దక్షిణాపథరాజులు- రాజ్యాలు		
1.	మహేంద్రుడు	కోసల
2.	వ్యాఘ్రరాజు	మహాకాంతార
3.	మంథరాజు	కురాల
4.	దమనుడు	ఎరండపల్లి
5.	స్వామిదత్తుడు	కొట్టూర
6.	కుబేరుడు	దేవరాష్ట్రం
7.	మహేంద్రుడు	పిష్టపురం
8.	హస్తివర్మన్	వేంగి
9.	నీలరాజు	అవముక్త
10.	ఉగ్రసేనుడు	పాలక
11.	విష్ణుగోపుడు	కంచి
12.	ధనంజయుడు	కేశస్థలపురం



రెండో చంద్రగుప్తుడు (క్రీశ. 376 - 415)

శకరాజు రుద్రసింహుడిపై విజయం సాధించి 'దేవగుప్తుడు', 'దేవరాజు', 'దేవశ్రీ', 'పరమభాగవత', 'విక్రమాదిత్య', 'శకారి', 'సాహసాంక' బిరుదులు పొందాడు. 'నవరత్నాలు' అనే కవులను పోషించాడు. అతడి కాలంలో చైనా యాత్రికుడు ఫాహియాన్ భారత్‌ను సందర్శించాడు. ధ్రువాదేవి, కుబేరనాగ అతడి రాణులు. రాజధానిని ఉజ్జయినీకి మార్చాడు. కుమార్తె ప్రభావతిని వాకాటక రుద్రసేనుడికి ఇచ్చి వివాహం చేశాడు. బంగారంతో పాటు వెండి, రాగి నాణేలు ముద్రించాడు. బంగారు నాణేలపై వ్యాఘ్రానికి బదులు సింహం బొమ్మ ముద్రించాడు. సింహవిక్రమ అనే శాసనం వేయించాడు.

మొదటి కుమార గుప్తుడు (క్రీశ. 415 - 454)

మొదటి కుమారగుప్తుడికి 'మహేంద్రాదిత్య' బిరుదు ఉంది. చంద్రగుప్త, ధ్రువాదేవిల పుత్రుడు. ఇతడు ముద్రించిన బంగారు నాణేలపై ఒకవైపు నెమలి వాహనంపై ఉన్న కార్తికేయుడు, మరోవైపు నెమలికి మేత వేస్తున్న రాజు చిత్రాలు ఉంటాయి. వెండి నాణేల్లో గరుడ పక్షి స్థానంలో మయూరం కనిపిస్తుంది.

స్కందగుప్తుడు (క్రీశ. 454 - 467)

స్కందగుప్తుడి కాలంలో 'హూణులు' భారతదేశంపై దండెత్తారు. వారిని ఓడించి సామ్రాజ్యాన్ని రక్షించాడు. 'విక్రమాదిత్య' బిరుదు పొందాడు. ఇతడి కాలంలో రాష్ట్ర పాలకుడు వర్ణదత్తుడు గిర్నార్ కొండల్లో ఉన్న సుదర్శన తటాకానికి మరమ్మతులు చేయించాడు. సుమారు 300 ఏళ్ల క్రితం ఇదే తటాకానికి క్షాత్ర రుద్రదాముడు మరమ్మతులు చేయించాడు. క్రీ.శ. 495లో రెండోసారి హూణులు భారతదేశంపై దండెత్తారు.

కడపటి గుప్తరాజులు (క్రీశ. 467 - 540)

స్కందగుప్తుడి తర్వాత క్షీణదశ ప్రారంభమైంది. హూణుల దాడులు,వారసత్వ పోరాటాలతో స్వతంత్ర రాజ్యాలు ఏర్పడి గుప్తుల పాలన అంతమైంది.

గుప్తుల కాలంనాటి సమాజం

కులవ్యవస్థ పాతుకుపోయింది. శూద్రులు, ఛండాలురను హీనంగా చూసేవారు. సమాజంలో స్త్రీలకు విద్యా, ఆస్తిహక్కులు లేవు. బాల్య వివాహాలను సమర్థించారు. సతీసహగమనం ఉండేది. వారసత్వం విషయంలో గుప్తుల యుగాన్ని ఉజ్వల శకంగా పరిగణించవచ్చు. సంస్కృతం రాజభాష. అలహాబాద్ ప్రశస్తి శాసనాన్ని రాసింది హరిసేనుడు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, శూద్రకుడు మృచ్ఛకటికం రాశారు. ఆర్యభట్టు ఆర్యభట్టీయం, వరాహమిహురుడు పంచసిద్ధాంతం, బ్రహ్మగుప్తుడు గణిత, ఖగోళ శాస్త్రాలు, శుశ్రుతుడు వైద్య శాస్త్రాలు రాశారు. గుప్త చక్రవర్తులు హిందూ మతాభిమానులు. వైష్ణవం వైపు మొగ్గు చూపారు.

కళలు

ఝాన్సీ సమీపంలోని దేవగఢ్‌లోని దశావతార ఆలయం, భూమ్రా ఆలయం, సాంచీ, సారనాథ్‌లోని బౌద్ధ దేవాలయాలు గుప్తుల వాస్తుకళకు చిహ్నాలు. అజంతా గుహల్లోని కొన్ని కుడ్య చిత్రాలు గుప్తుల కాలంనాటి కళా నైపుణ్యానికి నిదర్శనం. భారవి కిరాతార్జునీయం, దండి కావ్యాదర్శం, దశకుమార చరితం, విష్ణుశర్మ 'పంచతంత్రం' గ్రంథాలు ఈ కాలం నాటివే. ఢిల్లీ సమీపంలోని మెహ్రౌలీలో ఇనుపస్తంభం అప్పటి లోహ సాంకేతిక నైపుణ్యానికి నిదర్శనం.

అలహాబాద్ శాసన స్తంభం

రెండు భాషల్లో రాసిన రెండు శాసనాలు ఇందులో ఉన్నాయి. అశోకుడి శాసనం ప్రాకృతంలో ఉంటుంది. దమ్మ, అహింస గురించి వివరిస్తుంది. రెండో శాసనాన్ని సముద్రగుప్తుని ఆస్థాన కవి హరిసేనుడు సంస్కృతంలో రాశాడు. ఇది సముద్రగుప్తుని దండయాత్రల గురించి తెలుపుతుంది.

హర్షవర్ధనుడు (క్రీశ. 606 - 647)

హర్షవర్ధనుడు పుష్యభూతి వంశానికి చెందిన వాడు. స్థానేశ్వర సింహాసనాన్ని అధిష్ఠించి హిందూస్థానాన్ని పాలించిన ఆఖరి హిందూ చక్రవర్తి. ఇతడి రాజ్యాన్ని చైనా యాత్రికుడు హ్యుయాన్ త్సాంగ్ సందర్శించాడు. హర్షుడు అయిదేళ్లకోసారి ప్రయాగలో 'మహాపరిషత్' ఏర్పాటు చేసి దానాలు చేసేవాడు. పండిన పంటలో 1/6వ వంతుని శిస్తుగా వసూలు చేసేవాడు. ప్రభుత్వాధికారులకు జీతాలకు బదులు భూములు ఇచ్చేవాడు. దీన్ని ఫ్యూడలిజం అంటారు. బానిసలతో బలవంతంగా పని చేయించేవాడు. హర్షుడు స్వయానా కవి. సంస్కృతంలో 'నాగానందం', 'ప్రియదర్శిక', 'రత్నావళి' నాటకాలు రచించాడు. ఇతడి ఆస్థానకవి బాణభట్టుడు 'కాదంబరి', 'హర్షచరిత్ర' వచన కావ్యాలు రాశాడు. మయూరుడు సూర్యశతకాన్ని, భర్తృహరి శృంగార, వైరాగ్య శతకాలను రచించాడు. నలంద, వల్లభి విశ్వవిద్యాలయాలు ఇతడి కాలంలో వర్ధిల్లాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్‌ఏఎల్‌లో అసిస్టెంట్/ఆపరేటర్ పోస్టులు

హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) లక్నో యూనిట్‌లో ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు అసిస్టెంట్/ఆపరేటర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్(ఎలక్ట్రానిక్స్/మెకానికల్)-02, ఆపరేటర్ (ఫిట్టర్/గ్రైండర్/వెల్డర్)-06.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, ఐటీఐలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 04.07.2025 నాటికి జనరల్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 33 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 31 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు అసిస్టెంట్ పోస్టులకు రూ.23,000 నుంచి రూ.95,000, ఆపరేటర్‌కు రూ.22,000 నుంచి రూ.90,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.08.2025.
- » **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఐఐఐటీడీఎం కాంచీపురంలో 27 నాన్ ఫ్యాకల్టీ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ఐఐఐటీడీఎం), కాంచీపురం.. వివిధ విభాగాల్లో నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 27.
- » **పోస్టుల వివరాలు:** జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్-03, జూనియర్ టెక్నీషియన్-13, జూనియర్ అసిస్టెంట్-11.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ లేదా ఎంఎస్సీ, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ(కంప్యూటర్ సైన్స్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** జూనియర్ టెక్నికల్ సూపరింటెండెంట్ పోస్టుకు 32 ఏళ్లు, జూనియర్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్‌కు 27 ఏళ్లు.
- » **ఎంపికవిధానం:** స్క్రీనింగ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.08.2025
- » **వెబ్‌సైట్:** https://iiitdm.ac.in

జనాభాపరంగా దేశంలో అతిచిన్న రాష్ట్రం ఏది?

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కలను సేకరించడం తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అంటారు. దేశంలో తొలిసారిగా 1872లో జనాభా లెక్కల సేకరణ మొదలైంది. 1881 నుంచి ప్రతి పదేళ్లకు ఒకసారి జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.

జనాభా

భారతదేశ జనాభాలో విభిన్న శారీరక లక్షణాలు కనిపిస్తాయి. ప్రాచీన కాలం నుంచి వివిధ దేశాలకు చెందినవారు భారతదేశంలోకి ప్రవేశించి సాంఘికంగా, సాంస్కృతికంగా ఇక్కడి సమాజంలో కలిసిపోయారు. వీరు స్థానికులతో వివాహ సంబంధాలు ఏర్పర్చుకున్నారు. ఫలితంగా విభిన్న శారీరక లక్షణాలున్న సంతతి ఉద్భవించిందని ఆంత్రోపాలజిస్టుల అభిప్రాయం.

'రిస్లే' అనే ఆంత్రోపాలజిస్టు శారీరక లక్షణాల ఆధారంగా ప్రపంచ జనాభాను ఆరు జాతులుగా విభజించారు. ఏ దేశ జనాభాలోనైనా ఒక జాతి లేదా రెండు జాతుల లక్షణాలు ఉంటాయి. కానీ భారతదేశంలో మాత్రమే ప్రపంచంలోని ఆరు జాతుల లక్షణాలు కనిపిస్తాయి. అవి...

ఎ) నీగ్రిటోలు

దేశంలోకి మొదటిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించే షోంపైన్స్, జార్వాస్, ఓంజెస్ లాంటి తెగలలో, కేరళలోని పులియాన్స్ తెగలలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.

బి) ప్రాటో ఆస్ట్రలాయిడ్స్

మధ్య భారతదేశంలో నివసించే గోండులు, ముండాలు, భిల్లులు, ఒరేన్‌లు, సంతాలులు, చెంచులు, కురుంబాలు లాంటి గిరిజన తెగలలో ఈ లక్షణాలు కనిపిస్తాయి.

సి) మెడిటరేనియన్

వీరినే ద్రవిడులు అని కూడా పిలుస్తారు. దక్షిణ భారతదేశంలో నివసించే ప్రజలను ఈ జాతి సంతతిగా పేర్కొంటారు. వీరినే సింధూ నాగరికత ప్రజల సంతతిగా పేర్కొనవచ్చు. ద్రవిడ ప్రజల జీవన విధానంలో సింధూ నాగరికత ప్రజల సాంస్కృతిక లక్షణాలు ఇప్పటికీ కనిపిస్తాయి.

డి) మంగోలాయిడ్స్

ఈశాన్య భారతదేశంలోని అసోం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల ప్రజల్లో, అండమాన్‌లోని 'సెంటినీలీస్' అనే తెగలో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి. ఈ జాతి ప్రజల శరీరంలో 'ఎపికాంతిక్ ఐలిడ్' అనే ప్రత్యేక లక్షణం కనిపిస్తుంది.

ఇ) బ్రాకీ సెఫాలస్

వీరినే కాకసాయిడ్ జాతి ప్రజలుగా పేర్కొంటారు. ఈ జాతి వారిలో తల వెడల్పుగా ఉంటుంది. గుజరాత్,మహారాష్ట్రలోని మార్వాడీలు, పశ్చిమ బెంగాల్‌లోని నయనార్ క్షత్రియులు, నంబూద్రీ బ్రాహ్మణుల్లో ఈ జాతి లక్షణాలు కనిపిస్తాయి.



ఎఫ్) నార్డిక్స్

వీరినే ఆర్యన్లు అని పిలుస్తారు. భారతదేశంలోకి చివరిసారిగా వలస వచ్చిన జాతిగా వీరిని పేర్కొనవచ్చు. ఈ జాతి లక్షణాలున్న సంతతి ప్రస్తుతం పంజాబ్, హర్యానా, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లోని రాజపుత్రులు, జాట్‌లలో కనిపిస్తుంది.

జనాభా లెక్కల సేకరణ (2011)

ఒక నిర్దిష్ట ప్రాంతంలో తమలో తాము అంతః ప్రజననం జరుపుకునే, నిర్దిష్ట ఆవాసంలో నివసించే ప్రజా సమూహమే జనాభా. ఇంటింటి సర్వే ద్వారా శాస్త్రీయ పద్ధతిలో జనాభా, దాని అనుబంధ అంశాలను సేకరించే పద్ధతినే జనాభా లెక్కల సేకరణ అంటారు.

భారతదేశం సంక్షేమ రాజ్యం. ఈ భావనను దృష్టిలో ఉంచుకొని అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ఇవి సక్రమంగా అమలయ్యేందుకు, వనరుల సమర్థ వినియోగానికి జనాభా లెక్కల సేకరణ తప్పనిసరి. జనాభా లెక్కల సేకరణకు సంబంధించిన అంశాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని 'డెమోగ్రఫీ' అని అంటారు.

- ప్రపంచంలో మొదటిసారిగా 1841లో ఆధునిక జనాభా లెక్కల సేకరణ ఇంగ్లండ్‌లో ప్రారంభమైంది. 1872లో భారతదేశంలో జన గణన మొదలైంది. 1881 నుంచి పదేళ్లకు ఒకసారి క్రమం తప్పకుండా మన దేశంలో జనాభా లెక్కలను సేకరిస్తున్నారు.
- 2011 జనాభా లెక్కల సేకరణ 15వది, స్వాతంత్ర్యం వచ్చాక ఏడోది. ఈ జనాభా లెక్కల సేకరణ 2010 ఏప్రిల్ 1న ప్రారంభమై 2011 మార్చిలో ముగిసింది. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 17.5 శాతం. అత్యధిక జనాభా ఉన్న దేశాల జాబితాలో భారతదేశం తొలి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరసగా అమెరికా, ఇండోనేసియా, బ్రెజిల్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ ఉన్నాయి.
- 2011 మార్చి 1 నాటికి దేశ జనాభా 1.21 బిలియన్లు దాటింది. 2001 నాటికి దేశ జనాభా 1.02 బిలియన్లు ఉండేది. అంటే పదేళ్లలో దేశ జనాభా 18.196 కోట్లు పెరిగింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వృద్ధిరేటు 21.54 శాతం. కాగా, 2001-11 మధ్యకాలంలో అది 17.7 శాతానికి తగ్గింది.
- 1991-2001 దశాబ్దంలో జనాభా వార్షిక వృద్ధిరేటు 1.9 శాతం కాగా 2001-11లో 1.64 శాతానికి తగ్గింది.
- జనసాంద్రత 2001లో చ.కి.మీ.కు 325 ఉంటే, అది 2011లో 382కు పెరిగింది.
- అక్షరాస్యత 2001 మార్చి 1 నాటికి 64.38 శాతం కాగా, 2011 మార్చి నాటికి 74.04 శాతానికి పెరిగింది.
- లింగనిష్పత్తి 2001 మార్చి 1 నాటికి 933 ఉంటే, 2011 మార్చి 1 నాటికి 943కి పెరిగింది. ప్రతి వెయ్యి మంది పురుషులకు ఉన్న స్త్రీల సంఖ్యను లింగనిష్పత్తి అంటారు. దేశంలోకెల్లా అత్యుత్తమంగా కేరళలో లింగనిష్పత్తి 1084:1000గా ఉంది.
- దేశంలో అత్యధిక జనాభా ఉన్న మొదటి ఐదు రాష్ట్రాలు... ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్).
- దేశంలో తక్కువ జనాభా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... సిక్కిం, మిజోరాం, అరుణాచల్‌ప్రదేశ్, గోవా.
- అత్యధిక జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... బిహార్, పశ్చిమ బెంగాల్, కేరళ, ఉత్తరప్రదేశ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... అరుణాచల్‌ప్రదేశ్, మిజోరాం, సిక్కిం, నాగాలాండ్.
- అత్యధిక జనసాంద్రత ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు.. ఢిల్లీ, చండీగఢ్.
- అత్యల్ప జనసాంద్రత ఉన్న తొలి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు... అండమాన్ నికోబార్ దీవులు, దాద్రా నగర్ హవేలి.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు ఎక్కువగా ఉన్న మొదటి నాలుగు రాష్ట్రాలు... మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, బిహార్, జమ్మూ-కశ్మీర్.
- జనాభా దశాబ్దపు వృద్ధిరేటు తక్కువగా ఉన్న తొలి నాలుగు రాష్ట్రాలు... నాగాలాండ్, కేరళ, గోవా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... కేరళ, మిజోరాం.
- దేశంలో తక్కువ అక్షరాస్యత ఉన్న మొదటి రెండు రాష్ట్రాలు... బిహార్, అరుణాచల్‌ప్రదేశ్.
- దేశంలో అత్యధిక అక్షరాస్యత ఉన్న మొదటి రెండు జిల్లాలు మిజోరాంలో ఉన్నాయి. అవి.. సెర్‌చ్ఛిప్, ఐజ్వాల్.
- దేశంలో అక్షరాస్యత తక్కువ ఉన్న మొదటి రెండు జిల్లాలు... మధ్యప్రదేశ్‌లోని అలిరాజ్‌పూర్, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో 10.43 కోట్ల(8.6 శాతం) మంది షెడ్యూల్డ్ తెగలకు చెందినవారు.
- ఎస్టీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం మధ్యప్రదేశ్, తక్కువగా ఉన్న రాష్ట్రం సిక్కిం.
- ఎస్టీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం మిజోరాం, తక్కువగా ఉన్న రాష్ట్రం గోవా.
- ఎస్టీ జనాభా లేని రాష్ట్రాలు... పంజాబ్, హర్యానా.
- 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల(ఎస్సీ) జనాభా శాతం 16.6. సంఖ్యాపరంగా 20.14 కోట్లు.
- ఎస్సీ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్. తక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.
- ఎస్సీ జనాభా శాతం అధికంగా ఉన్న రాష్ట్రం పంజాబ్, తక్కువగా ఉన్నది మిజోరాం.
- ఎస్సీ జనాభా లేని రాష్ట్రం నాగాలాండ్

గతంలో అడిగిన ప్రశ్నలు

1. సంతాల్ జనాభా ఉన్న రాష్ట్రాలు ఏవి? (2011, A.S.O)
   ఎ) మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్
   బి) కర్ణాటక, పశ్చిమబెంగాల్
   సి) ఉత్తరప్రదేశ్, జార్ఖండ్
   డి) జార్ఖండ్, పశ్చిమ బెంగాల్
2. మేఘాలయ ప్రత్యేకంగా గిరిజన రాష్ట్రం. ఆ రాష్ట్రంలో నివసించే గిరిజన తెగలేవి? (2001, J.L.)
   ఎ) ఖాసీలు, ఉషరీలు, లభీర్లు
   బి) ఖాసీలు, జయంతియాలు, గారోలు
   సి) జయంతియాలు, గారోలు, కుర్కిలు
   డి) గారోలు, ఫాంగులు, హామ్‌రో
3. జనాభాపరంగా దేశంలో అతిచిన్న రాష్ట్రం ఏది? (2011, D.L.)
   ఎ) నాగాలాండ్ బి) అసోం
   సి) సిక్కిం డి) కేరళ
4. ఇండియాలో అత్యధిక అక్షరాస్యత ఉన్న జిల్లా ఏది? (2011, D.L.)
   ఎ) సెర్‌చ్ఛిప్ బి) గుంటూరు
   సి) మిడ్నాపూర్ డి) గాజామ్
5. 'తోడా' అనే తెగలు ఏ రాష్ట్రంలో నివసిస్తున్నాయి? (2002, AEEs)
   ఎ) రాజస్థాన్ బి) మధ్యప్రదేశ్
   సి) అసోం డి) తమిళనాడు
6. భారతదేశంలోని గిరిజనుల్లో సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నవారు? (2011, Gr-II)
   ఎ) సంతాలులు బి) భిల్లులు
   సి) ముండాలు డి) నాగాలు

సమాధానాలు

1) డి; 2) బి; 3) సి; 4) ఎ; 5) డి; 6) బి.

మాదిరి ప్రశ్నలు

1. 'మీనా' జాతికి చెందిన తెగల వారు ఏ రాష్ట్రంలో అధికంగా నివసిస్తున్నారు?
   ఎ) గుజరాత్ బి) అసోం
   సి) రాజస్థాన్ డి) మధ్యప్రదేశ్
2. 2011లో జరిగిన జన గణన స్వాతంత్ర్యానంతరం ఎన్నోది?
   ఎ) 15 బి) 7 సి) 8 డి) 9
3. కింది వాటిలో అధిక జనాభా ఉన్న రాష్ట్రాల అవరోహణ క్రమాన్ని గుర్తించండి?
   ఎ) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమ బెంగాల్
   బి) మధ్యప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
   సి) రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
   డి) ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్
4. 2011 జనాభా లెక్కల ప్రకారం జనాభావృద్ధి రేటు అధికంగా ఉన్న రాష్ట్రం?
   ఎ) అరుణాచల్ ప్రదేశ్
   బి) మేఘాలయ సి) బిహార్
   డి) జమ్మూ-కశ్మీర్
5. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో జనసాంద్రత ఎంత?
   ఎ) 325 బి) 267
   సి) 382 డి) 176
6. 2011 జనాభా లెక్కల ప్రకారం అత్యధిక జనసాంద్రత ఉన్న జిల్లా ఏది?
   ఎ) దిబాంగ్ వ్యాలీ బి) యానాం
   సి) అంజాన్ డి) నార్త్ ఈస్ట్ ఢిల్లీ
7. కిందివాటిలో అండమాన్ నికోబార్ దీవుల్లో నివసించని తెగ ఏది?
   ఎ) షోంపైన్స్ బి) జార్వాస్
   సి) సెంటినీలీస్ డి) మోప్లాలు
8. జనాభా లెక్కల సేకరణకు సంబంధించి ఏ సంవత్సరాన్ని 'గొప్ప విభాజక సంవత్సరం'గా పేర్కొంటారు?
   ఎ) 1911 బి) 1901
   సి) 1921 డి) 1931
9. మానవ జనాభా 'గుణమధ్యమం'(జియోమెట్రిక్) రేటులో పెరుగుతుండగా, వనరులు మాత్రం 'అంకమధ్యమం' (అర్థమెటిక్) రేటులో పెరుగుతున్నాయని తెలిపిన శాస్త్రవేత్త ఎవరు?
   ఎ) మాల్థస్ బి) కీన్స్
   సి) రికార్డో డి) రొనాల్డ్ రాస్

సమాధానాలు

1) సి; 2) బి; 3) ఎ; 4) బి; 5) సి; 6) డి; 7) డి; 8) సి; 9) ఎ.

సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టింది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

అసఫ్‌జాహీలు

క్రీ.శ. 1707లో ఔరంగజేబు మరణానంతరం మొగల్ సామ్రాజ్యం క్రమంగా క్షీణించింది. మొగల్ రాష్ట్ర సుబేదారులు (గవర్నర్‌లు) స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు. మొగలు చక్రవర్తి ఔరంగజేబుతో పాటు అతడి వారసుల ఆస్థానంలో విశిష్ట సేవలందించిన మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌ను చక్రవర్తి ఫరూఖ్ సియర్ 7000 మందితో కూడిన సేనకు మున్సబుదారుగా చేశాడు. ఇతడిని దక్కన్‌లోని ఖాందేష్, బీరార్, తెలంగాణ, దౌలతాబాద్, అహ్మద్‌నగర్, ఆర్కాట్ ప్రాంతాలకు సుబేదారుగా నియమించాడు. ఇతడికి 'ఫతేజంగ్', 'నిజాం-ఉల్-ముల్క్' బిరుదులు ఇచ్చారు.

దక్కన్ సుబేదారుగా మీర్ ఖమ్రుద్దీన్ ఈ ప్రాంతంలో రెండేళ్లలోపే శాంతిని నెలకొల్పాడు. ఈ సమయంలో నిజాం-ఉల్-ముల్క్‌ను వెనక్కి రప్పించి, సయ్యద్ హుస్సేన్ అలీఖాన్‌ను దక్కన్ సుబేదారుగా నియమించారు. 1720లో నిజాం-ఉల్-ముల్క్‌ను మాల్వాకు సుబేదారుగా నియమించారు. 1720 ఏప్రిల్‌లో నిజాం-ఉల్-ముల్క్ మాల్వాను వదిలి దక్కన్ ప్రాంతం వైపు నడిచాడు. ఈ క్రమంలో ఆసిర్‌ఘర్, బుర్హాన్‌పూర్ ప్రాంతాలను ఆక్రమించాడు.

దక్కన్ సుబేదారైన సయ్యద్ హుస్సేన్ అలీఖాన్ హత్యకు గురయ్యాడు. మొగల్ చక్రవర్తి మహమ్మద్ షా రంగీలా 'నిజాం-ఉల్-ముల్క్'ను వజీర్ (ప్రధానమంత్రి)గా నియమించాడు. ఇతడు మూడేళ్లలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టాడు. మొగల్ రాజ్యంలో నిజాం-ఉల్-ముల్క్ ఇజారా పద్ధతిని రద్దు చేసి దేశ ఆదాయాన్ని పెంచాడు. ఆ తర్వాత నిజాం-ఉల్-ముల్క్ రాజధానిలో జరిగే కుట్రలను భరించలేక ఢిల్లీని వదిలేసి దక్కన్ చేరుకున్నాడు. 1724 అక్టోబర్ 11న దక్కన్ సుబేదారైన ముబారిజ్ ఖాన్‌ను షక్కర్‌ఖేడ్ యుద్ధంలో హతమార్చి దక్కన్‌ను ఆక్రమించాడు. నిజాం ఉల్ ముల్క్ గొప్పతనాన్ని గుర్తించి మొగలు చక్రవర్తి మహమ్మద్‌షా అతడిని దక్కన్ ప్రాంతానికి శాశ్వత సుబేదారుగా నియమించాడు. 'అసఫ్ జా' అనే బిరుదును ఇచ్చాడు. నిజాం-ఉల్-ముల్క్ 'అసఫ్ జా' బిరుదుతో పాలించడం వల్ల 'అసఫ్ జాహి' వంశం అనే పేరొచ్చింది. 1724 నుంచి నిజాం-ఉల్-ముల్క్ దక్కన్ ప్రాంతాన్ని స్వతంత్రంగా పరిపాలించాడు.

నిజాం-ఉల్-ముల్క్ (1724-48)

ఔరంగాబాద్‌ను రాజధానిగా చేసుకొని నిజాం-ఉల్-ముల్క్ దక్కన్ ప్రాంతాన్ని పాలించాడు. మహారాష్ట్రులతో జరిగిన మూడు యుద్ధాల్లో ఓటమిపాలై 'చౌత్' పన్ను చెల్లించడానికి అంగీకరించాడు. దక్కన్‌లో వచ్చిన తిరుగుబాట్లను అణచివేసి సర్కారు, కర్నూలు, ఆర్కాటు సుబాలను అదుపులోకి తెచ్చుకున్నాడు.

1739లో నాదిర్‌షా ఢిల్లీ పైకి దండెత్తి మహమ్మద్‌షాను ఓడించాడు. దక్కన్ నుంచి నిజాం-ఉల్-ముల్క్ ఢిల్లీకి వచ్చి నాదిర్‌షాకు నెమలి సింహాసనం, కొహినూర్ వజ్రాన్ని ఇచ్చి మహమ్మద్‌షాతో సంధి కుదిర్చాడు. నాదిర్‌షాను భారత్ నుంచి పంపించేశాడు. నిజాం-ఉల్-ముల్క్ 1748లో మరణించాడు. నిజాం మరణించే నాటికి ఉత్తరాన తపతి నది నుంచి దక్షిణాన తిరుచునాపల్లి వరకు, పశ్చిమాన ఔరంగాబాద్ నుంచి తూర్పున బంగాళాఖాతం వరకు రాజ్యం విస్తరించి ఉండేది.

వారసత్వ సమస్య: నిజాం మరణానంతరం అతడి కుమారుడు నాసర్‌జంగ్, మనవడు ముజఫర్ జంగ్ (ఖైరున్నిసా కుమారుడు) మధ్య వారసత్వ పోరాటం ప్రారంభమైంది. ముజఫర్ ఫ్రెంచివారి సహాయంతో దక్కన్ సుబేదారు కావాలని ఆశించాడు. కానీ నాసర్‌జంగ్ ఆంగ్లేయుల సాయంతో అతణ్ని ఓడించాడు. ఫ్రెంచి వారి కుట్ర ఫలితంగా నాసర్‌జంగ్‌ను హిమ్మత్‌ఖాన్ హతమార్చాడు. ఆ తర్వాత ముజఫర్‌జంగ్ సింహాసనాన్ని అధిష్టించాడు. ఇతడు కృష్ణానది దక్షిణ ప్రాంతాన్ని ఫ్రెంచివారికి ఇచ్చాడు. చివరకు హిమ్మత్‌ఖాన్ కుట్ర వల్ల ముజఫర్ జంగ్ లక్కిరెడ్డిపల్లి వద్ద హత్యకు గురయ్యాడు. దీంతో ఫ్రెంచ్ సైనిక నాయకుడైన బుస్సీ పరిస్థితులను తన అదుపులోకి తెచ్చుకొని నాసర్‌జంగ్ సోదరుడైన సలాబత్ జంగ్‌ను రాజుగా చేశాడు.

సలాబత్ జంగ్ ఫ్రెంచివారికి కొండవీడు, నిజాంపట్నం, నరసాపురం మండలాలను ఇచ్చాడు. 1751-58 మధ్య కాలంలో బుస్సీ హైదరాబాద్‌కు మకాం మార్చి సలాబత్ జంగ్‌కు పదవిని సుస్థిరం చేసుకోవడంలో సాయపడ్డాడు. మహారాష్ట్రుల దాడుల నుంచి కాపాడినందుకుగాను ఫ్రెంచివారికి ఉత్తర సర్కార్లను, బుస్సీకి గుంటూరును సలాబత్ స్వాధీనం చేశాడు. మూడో కర్ణాటక యుద్ధంలో ఫ్రెంచివారిని ఆంగ్లేయులు ఓడించడంతో సలాబత్ ఆంగ్లేయులతో సంధి చేసుకొని వారికి ఉత్తర సర్కార్లను ఇచ్చాడు.

నిజాం అలీఖాన్ (1761-1803)

నిజాం ఉల్ ముల్క్ నాలుగో కుమారుడు నిజాం అలీఖాన్. ఇతడు తన సోదరుడైన సలాబత్ జంగ్‌ను బంధించి రెండో అసఫ్‌జా బిరుదుతో దక్కన్‌కు రాజయ్యాడు. నిజాం అలీ ఔరంగాబాద్ నుంచి రాజధానిని హైదరాబాద్‌కు తరలించాడు. 1765లో రాబర్ట్ క్లైవ్ మొగల్ చక్రవర్తి షా ఆలం నుంచి ఉత్తర సర్కారులను బ్రిటిషర్లకు ఇచ్చినట్లుగా ఫర్మానా పొందాడు. కానీ నిజాం అలీఖాన్ ఈ ఫర్మానాను అంగీకరించలేదు. దుబాసీ అయిన కాండ్రేగుల జోగి పంతులు సహాయంతో బ్రిటిషర్లు ఉత్తర సర్కారులను రూ. 15 లక్షలకు గుత్తకు తీసుకున్నారు. చివరకు 1766లో కుదిరిన ఒప్పందం ప్రకారం నిజాం అలీఖాన్ గుంటూరు మినహా సర్కారు జిల్లాలన్నింటినీ ఈస్టిండియాకు ఇచ్చేశాడు. గుంటూరు ప్రాంతం నిజాం అలీఖాన్ సోదరుడైన బసాలత్ జంగ్ ఆధీనంలో ఉండేది. బసాలత్ మరణించే వరకు ఈ ప్రాంతం ఆయన ఆధీనంలో ఉండే విధంగా అంగీకారం కుదిరింది.

నిజాం అలీ ఫ్రెంచి సేనాని రేమండ్ సహాయంతో తుపాకుల కర్మాగారాన్ని నిర్మించాడు. 1790లో మూడో మైసూర్ యుద్ధం ప్రారంభమైంది. టిప్పు సుల్తాన్‌కు వ్యతిరేకంగా నిజాం అలీ, మరాఠాలతో ఈస్టిండియా కంపెనీ ఒప్పందం చేసుకుంది. ఈ కూటమి టిప్పు సుల్తాన్‌ను ఓడించి ఆయన నుంచి సగం రాజ్యాన్ని, మూడు కోట్ల రూపాయలను నష్ట పరిహారంగా పొందింది. ఇందులో నిజాం అలీ తన వాటాగా దత్త మండలాలు (కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాలు), కోటి రూపాయల నగదును పొందాడు.

1795లో మరాఠాలు నిజాం అలీని 'ఖార్దా' వద్ద ఓడించి మూడు కోట్ల రూపాయల చౌత్‌ను, రూ. 2 కోట్ల నష్ట పరిహారాన్ని పొందారు. మరాఠాలు నిజాం అలీని ఓడించిన కొద్ది కాలానికే అతడి కుమారుడు 'అలీజా' తిరుగుబాటు చేశాడు. ఈ తిరుగుబాటుకు మెతుకు (మెదక్) జమీందారైన సదాశివరెడ్డి మద్దతు ఇచ్చాడు. ఫ్రెంచి సేనాని రేమండ్ సహాయంతో నిజాం సైన్యం ఈ తిరుగుబాటును అణచివేసింది. అలీజాను బంధించారు. ఆ తర్వాత అతడు ఆత్మహత్య చేసుకున్నాడు.

1799లో గవర్నర్ జనరల్ వెల్లస్లీ భారతదేశంలో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి అంగీకరించి, సంతకం చేసిన మొదటి భారతీయ రాజు నిజాం అలీఖాన్ (1798). సైన్య సహకార సంధి ప్రకారం నిజాం అలీఖాన్‌కు బ్రిటిష్ సైనికదళం సహాయంగా వచ్చింది. వీరు హైదరాబాద్‌లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సైన్యం నిర్వహణ కోసం నిజాం అలీఖాన్ మూడో మైసూర్ యుద్ధం ఫలితంగా పొందిన దత్త మండలాలను బ్రిటిషర్లకు ఇచ్చేశాడు.



సికిందర్ జా (1803-1829)

నిజాం అలీఖాన్ మరణం (1803) తర్వాత హైదరాబాద్ రాజ్యానికి సికిందర్ జా రాజయ్యాడు. మూడో అసఫ్ జా బిరుదుతో ఇతడు రాజ్యానికి వచ్చాడు. ఇతడి కాలంలో గవర్నర్ జనరల్ 'సైన్య సహకార సంధి'పై నైజాంతో మరోసారి సంతకం చేయించుకున్నాడు. సికిందర్ జా కాలంలో మీర్ ఆలం దివాన్‌గా, రాజా చందులాల్ పేష్కార్‌గా నియమితులయ్యారు.

- మీర్ ఆలం హైదరాబాద్ - మద్రాస్, బొంబాయి రహదారులు మరమ్మతు చేయించాడు. 1808లో తన పేరు మీద మీర్ ఆలం చెరువును నిర్మించాడు.
- 1814లో విలియం పామర్ హైదరాబాద్‌లో పామర్ అండ్ కో బ్యాంకు ప్రారంభించాడు.

1811లో హైదరాబాద్‌లో బ్రిటిష్ ప్రతినిధిగా హెన్రీ రస్సెల్ నియమితుడయ్యాడు. 1816లో హైదరాబాద్ రాజ్యంలో కల్లోల పరిస్థితులను చక్కదిద్దడానికి హెన్రీ రస్సెల్ ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేశాడు. ఈ సైన్యం సహాయంతో పిండారీలు, భిల్లులు, స్థానిక జమీందారుల తిరుగుబాటులను అణచివేసి హైదరాబాద్ రాజ్యంలో శాంతి నెలకొల్పారు. తర్వాతి కాలంలో రస్సెల్‌కు సైన్యం నిర్వహణ భారంగా మారింది. ఆర్థిక సంక్షోభం వల్ల జీతాలు చెల్లించలేని పరిస్థితులు నెలకొనడంతో అతడు పామర్ కంపెనీ నుంచి అప్పు తీసుకున్నాడు. 1820లో హైదరాబాద్‌లో బ్రిటిష్ ప్రతినిధిగా మెట్కాఫ్ వచ్చాడు. ఇతడు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి పామర్ కంపెనీకి కట్టాల్సిన అప్పును నిజాం తీర్చేలా కృషి చేశాడు.

- చార్లెస్ మెట్కాఫ్ కాలంలోనే కోఠిలోని రెసిడెంట్ (ప్రస్తుత మహిళా కళాశాల) భవనాన్ని నిర్మించారు.

నసీరుద్దౌలా (1829-57)

నాలుగో అసఫ్ జా బిరుదుతో నసీరుద్దౌలా అధికారంలోకి వచ్చాడు. ఇతడి కాలంలో హైదరాబాద్ రాజ్య ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. రాజా చందూలాల్ బ్రిటిషర్లకు రాజ్య ఖజానాను దోచిపెట్టాడు. 1848లో గవర్నర్ జనరల్‌గా వచ్చిన లార్డ్ డల్హౌసీ దేశంలోని స్వదేశీ సంస్థానాలను ఆక్రమించుకున్నాడు. హైదరాబాద్ రాజ్యం 1850 నాటికి ఈస్టిండియా కంపెనీకి రూ. 64 లక్షలు బాకీ పడింది. ఈ బాకీని 1850 డిసెంబర్ 31 లోగా తీర్చాలని డల్హౌసీ కోరాడు.

నసీరుద్దౌలా కాలంలో దేశంలో రెండు ముఖ్యమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. మొదటిది వహాబీ ఉద్యమం. రెండో అంశం.. పంజాబ్ నుంచి సిక్కులను, దేశం నుంచి బ్రిటిషర్లను పంపించాలనే లక్ష్యానికి సంబంధించింది. హైదరాబాద్‌లో వహాబీ ఉద్యమానికి నసిరుద్దౌలా సోదరుడు ముబారిజ్ ఉద్దౌలా నాయకత్వం వహించాడు. కర్నూలు నవాబ్ గులాంఖాన్ వహాబీ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 1838లో ముబారిజ్‌ను అరెస్ట్ చేసి గోల్కొండ జైల్లో పెట్టారు. అతడు 1854 జూన్ 25న జైల్లోనే మరణించాడు.

బ్రిటిషర్లకు చెల్లించాల్సిన అప్పును నిజాం 1853 వరకు కూడా తీర్చలేకపోయాడు. దీంతో డల్హౌసీ ఒత్తిడి మేరకు బీరారుతో పాటు, ఉస్మానాబాద్, రాయ్‌చూర్ జిల్లాలను ఈస్టిండియా కంపెనీకి ఇచ్చేశాడు. 1853 మే 21న బీరారు ఒడంబడికపై సంతకం చేసిన దివాన్ సిరాజ్ - ఉల్ - ముల్క్ అవమానంతో మరణించాడు. అతడి అల్లుడు మీర్ తురాబ్ అలీఖాన్ సాలార్‌జంగ్ బిరుదుతో దివాన్ పదవిని అలంకరించాడు.

- చాదర్‌ఘాట్ బ్రిడ్జిని నసీరుద్దౌలా కాలంలోనే నిర్మించారు. 1854లో కింగ్ ఎడ్వర్డ్ మెమోరియల్ ఆస్పత్రి (గాంధీ ఆస్పత్రి) నిర్మించారు.

అఫ్జలుద్దౌలా (1857-1869)

నసీరుద్దౌలా మరణించిన తర్వాత అతడి పెద్ద కుమారుడు అఫ్జల్ - ఉద్ - దౌలా (అఫ్జలుద్దౌలా) అయిదో అసఫ్ జా బిరుదుతో రాజ్యాధికారానికి వచ్చాడు. 1857 తిరుగుబాటు ప్రభావం హైదరాబాద్‌పై కూడా పడింది. 1857 జూలై 17న సైన్యంలో జమేదారైన తుర్రేబాజ్ ఖాన్ 5000 మందిని పోగు చేసి హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంట్ కార్యాలయంపై దాడి చేశాడు. సాలార్‌జంగ్ సహాయంతో బ్రిటిష్ ప్రతినిధి కల్నల్ డేవిడ్‌సన్ ఈ తిరుగుబాటును అణచివేశాడు. తుర్రేబాజ్ ఖాన్‌ను కాల్చి చంపి సుల్తాన్ బజార్‌లో శవాన్ని వేలాడదీశారు. తుర్రేబాజ్ ఖాన్‌కు సహాయం చేసిన మౌల్వీ అల్లావుద్దీన్‌ను అరెస్ట్ చేసి అండమాన్ జైలుకు పంపించారు.

కౌలస జాగీర్దారు రాజా దీప్‌సింగ్ కొంత మంది జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారీలను కూడగట్టి కౌలస కోటను గెరిల్లా శిక్షణ కేంద్రంగా చేసి బ్రిటిష్ వ్యతిరేక తిరుగుబాటు ప్రారంభించాడు. దీంతో రాజు కౌలస జాగీర్దార్‌ను రద్దు చేసి అతడికి మూడేళ్ల జైలు శిక్ష విధించాడు. కౌలస పట్వారీ రంగారావును అండమాన్‌కు పంపడంతో 1859 నాటికి ఈ తిరుగుబాటు పూర్తిగా సద్దుమణిగింది. 1857 తిరుగుబాటు సమయంలో బ్రిటిషర్లకు తోడ్పడినందుకుగాను అఫ్జలుద్దౌలాకు 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదును ఇచ్చారు. రూ. 50 లక్షల అప్పు రద్దు చేసి ధారాశీవ్, ఉస్మానాబాద్ జిల్లాలను వెనక్కి ఇచ్చారు.

మహబూబ్ అలీఖాన్ (1869-1911)

ఇతడు మూడేళ్ల వయసులో రాజ్యానికి వచ్చాడు. ఇతడి ప్రతినిధిగా మొదటి సాలార్‌జంగ్ పరిపాలనా బాధ్యతలు చేపట్టారు. మహబూబ్ అలీఖాన్ కాలంలోనే సాలార్‌జంగ్ సంస్కరణలు తీసుకువచ్చాడు. 1884 ఫిబ్రవరి 5న మహబూబ్ అలీఖాన్ మేజర్ కావడంతో బ్రిటిష్ గవర్నర్ జనరల్ లార్డ్ రిప్పన్ స్వయంగా వచ్చి అధికారాన్ని అందజేశాడు. ఇతడి కాలంలో పర్షియన్ స్థానంలో ఉర్దూను రాజభాషగా చేశారు.

That exactly represents the relationship..

BANK EXAMS

REASONING



Syllogism means inference or deduction. Questions on syllogisms generally consist of two or three statements from which the conclusions are to be derived. The statements and conclusions given may vary from the commonly known facts. Hence, we should not look into the facts or reality of the statements given while deriving conclusions. We have to consider the given statements as true, though they may be abstract, and analyze them carefully in order to check whether the given conclusions can be logically derived from the statements.

SYLLOGISMS

The questions on syllogisms are generally solved by using two methods:

1) Rules based method

2) Venn Diagram method

It is easy and preferable solving any kind of question by using Venn Diagram method.

Firstly, let us discuss how many types of statements are there.

1) All A's are B's

2) Some A' are B's

3) No A is B

4) Some A's are not B's

As you might have noticed above, there are four master statements of which two are affirmative statements and two are negative statements. Sometimes, the given statements may look different. We have to observe the given statements for each question and find out under which of the above master statements they have to be treated.

Examples:

'Apple is Ball' is treated as 'All Apples are Balls'

'Many bats are cats' is considered as 'Some bats are cats'

'Cat is not Dog' is equivalent to 'No Cat is Dog'

'All Ears are not Fans' is understood as 'Some Ears are not Fans'

Venn Diagrams:

There are two kinds of diagrams..

1) Basic Diagram

2) Alternate Diagram

Basic Diagram: This diagram represents minimum relationship between the terms of the statement. Hence, the least possible relationship should be shown by minimum overlapping.

Alternate Diagrams: The Alternate Diagram/ Diagrams represent other possible ways of the extent of overlapping.

The master statements are represented in the form of venn diagrams as follows:

Statements	Basic Diagram	Alternate Diagram1	Alternate Diagram2	Alternate Diagram3
All A's are B's	B A	B A		
Some B's are C's	B C	C B	B C	B C
No C is D	C D			
Some E's are not F's	E F	E F	E F	

Checking the validity of conclusions:

There are two types of conclusions. Definite conclusions and Possible conclusions.

Let us discuss how to draw definite conclusions.

Based on the above diagrams we can draw the following definite conclusions for each statement.

Statement	Valid Definite conclusions	Conclusions which are definitely false
All A's are B's	Some B's are A's Some A's are B's ('some' is a part of 'all')	No A is B No B is A Some A's are Not B's
Some B's are C's	Some C's are B's	No C is B No B is C
No C is D	No D is C Some C's are Not D's Some D's are Not C's	All C's are D's All D's are C's Some C's are D's Some D's are C's
Some E's are Not F's	No definite conclusion	All E's are F's

As there are positive statements and negative statements even we have positive conclusions and negative conclusions.

Let us discuss how to draw the conclusions based on the given statements for each question.

The following points can be followed for easy understanding.

- Read the statements and try to find out whether any connecting terms are there between the statements.
- Draw the 'basic diagram' in a combined format that exactly represents the relationship of all the terms in the statements given.

NOW VERIFY THE VALIDITY OF THE GIVEN CONCLUSIONS

1. If Positive definite conclusion follows in the basic diagram, then, it is a VALID conclusion.
2. If Positive definite conclusion does not follow in the basic diagram, Then, it is NOT A VALID conclusion
3. If Negative definite conclusion does not follow in the basic diagram

Then, it is NOT A VALID conclusion. But, verify whether COMPLEMENTARY PAIR is there.

4. We know that there are two Negative conclusions.

i) If negative definite conclusion **'No C is D'** follows in the basic diagram, then see whether **'Some C's are D's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion.

ii) If negative definite conclusion **'Some E's are Not F's'** follows in the basic diagram, then see whether **'All E's are F's'** diagram can be drawn. If we are able to draw then it is NOT A VALID conclusion. If we are unable to draw then it is a VALID conclusion


Note: We need not draw alternate diagrams to check the validity of Positive definite conclusions because when they follow in the minimum overlapping then they definitely follows in the maximum overlapping diagram (alternate diagrams).

Model Questions

1. Statements:

1) All Pens are cars

2) All cars are dogs




Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:

1) All Pens are dogs
2) Some dogs are Pens
3) Some cars are Pens
4) Some dogs are cars

2. Statements:

All chairs are Red

No Red is Spoon



Now, based on this 'Basic Diagram' we can draw the following Conclusions:

1) Some Red are chairs
2) Some chairs are Red
3) No Spoon is Red
4) No chair is Red

Note: 'No Spoon is Red' is valid as we cannot draw alternate diagram' some spoons are Red'. Same is the case with 'No chair is Red'

COMPLEMENTARY PAIR

Sometimes certain pair of conclusions is given which are contradictory to each other.

For Instance, 'Some A's are B's 'contradicts 'No A is B'.

If 'Some A's are B's is true then 'No A is B' cannot be true at the same time and vice versa.

Similarly, 'All A's are B's' contradicts 'Some A's are NOT B's'

If 'All A's are B's' is true then 'Some A's are NOT B's' cannot be true at the same time and vice versa.

3. Statements:

1) Some cans are bottles

2) Some bottles are lids

Diagram-1





Diagram-2



Conclusions:

1) No can is lid
2) Some cans are lids

Explanation: In Diagram-1, 'No can is lid' is TRUE whereas 'Some cans are lids' is NOT TRUE. In Diagram-2, 'NO can is lid' is NOT TRUE whereas 'Some cans are lids' is TRUE. Hence, we can conclude that 'Either 1 OR 2 follows'..